


గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక
నా ప్రేయసిని
పట్టిస్తే కోటి
PART - 1
సూర్యదేవర రామ్మోహనరావు


కొత్తసీరియల్ ప్రారంభం
నాప్రేయసిని పట్టిస్తే కోటి
మాస్టర్ రైటర్ సూర్యదేవర రామ్మోహన్ రావు
101వ నవల



………

అతనిపేరుపీతాంబరం,

మధ్య వయస్కుడు, పేరుకు తగ్గట్టే తెల్లటి ఫాంటుషర్టులో కాస్త గంభీరంగాను, కాస్త హడా వుడిగాను కన్పిస్తున్నాడు. జనాభా లెక్కల సేక రణలో భాగంగా గేటు తీసుకొని ఓ డాబా ఇంటి ముందుకెళ్ళాడు.చెన్నై ఎయిర్పోర్టు కు కాస్త దూరంలో సువిశాలమైన కాలనీ ఒకటివుంది. ఆ కాలనీ పేరు గోస్వామికాలనీ, మూడే మూడు వీధుల కాలనీ అది. ఆ కాలనీలో అన్నీ ఒకేలా ఫారెన్ స్టయిల్లో నిర్మించిన విల్లాలున్నాయి.

మూడు వరుసల్లో మొత్తం నూట ఎనభైగృహాలు, ఒక్కో వరుసలోను అరవైయిళ్ళు. యిళ్ళ ముందు రోడ్డు. మొత్తం మూడురోడ్లు. ఆ కాలనీని చుట్టి కాంపౌండ్ వాల్ వుంది. దానికి దక్షిణభాగాన ఒకే ఎంట్రన్స్. ఇళ్ళన్నీ తూర్పు ఫేసు. గేటు దాటగానే ఎవరికి వాళ్ళు అవతలికి వెళ్ళిపోవచ్చు. చాలా ఖరీదైన ఏరియా. గోస్వామి కాలనీ అంటే ఆ ప్రాంతం లో తెలీని వాళ్ళుండరు. గోస్వామిరియల్ ఎస్టేట్ అండ్ కన్స్ట్రక్షన్స్ వాళ్ళు కట్టి అమ్మిన కాలనీ యిళ్ళవి.

అటువంటి కాలనీలోని... ఏరియాకు వచ్చిన పీతాంబరం 'ఎ' వరుసలోని మొదటి రెండు ఇళ్ళు చూసుకొని మూడో ఇంటి కొచ్చాడు. తలుపు దగ్గరగా మూసి ఉంది.

"ఎవరండీ ఇంట్లో?" బయట చిన్న అరుగు మీద చతికిలబడుతూ పిలిచాడు. ఎవరూ పలకలేదు.

"ఎవరండీ లోపల? మాట్లాడరా?" ఈ సారి కాస్త విసుగు ధ్వనించింది పీతాంబరం గొంతులో. అప్పుడు లోపల్నుంచి `

"మీరెవరండీ?" అంటూ ఒక యువతి గొంతు మృదువుగా విన్పించింది.

"అమ్మా నా పేరు పీతాంబరం...."

"ఏతాంబరం?"

"తాంబరం కాదు తల్లీ, పీతాంబరం, జనాభా లెక్కలు సేకరించే డ్యూటీలో వచ్చాను. మీ యింట్లో ఎంతమంది

వుంటున్నారు? పురుషు లెందరు , స్త్రీలెందరు, పిల్లలెందరు. మీపేర్లు, వయస్సు టకటక చెబితే రాసుకు నెళ్ళిపోతాను.'' అంటూ పుస్తకం తెరిచాడు.

''అయ్యో... మావారు ఇంట్లో లేరండీ మీరు మళ్ళీ రండీ'' లోపల్నించి అదే గొంతు.

పీతాంబరం విసుగ్గా డోర్ వంక చూసాడు.

''అదేమిటమ్మా నేనేమన్న అడుక్కునే వాడ్నా మళ్ళీమళ్ళీ రావటానికి. అయినా పేర్లు చెప్పటానికి మీ ఆయనే రావాలా? మళ్ళీ రావడం కుదరదు.     ఈ కాలనీ పూర్తిచేయడానికే ఈ రోజంతా పట్టేలా వుంది. ఓ సారిలా బయటకు రామ్మా'' అన్నాడు.

''అయ్యయ్యో. తప్పుతప్పు. పరపురుషుడి ముందుకు మేము రామండీ''.

''గొప్ప చిక్కే వచ్చిందే... పోనీ లోపల్నించే చెప్పమ్మా. విని రాసుకుని వెళ్ళిపోతాను''.

''అలాగయితే రాసుకోండి.

''చెప్పమ్మా''

''నా పేరు తాటకి... మా వారి పేరు కుంభకర్ణ,     మామామగారి పేరు త్రిపురాసుర. ఇన్సియల్ టి అని రాసుకోండి.

పీతాంబరానికి ఒక్కసారిగా ` మెదడు జారి మోకాళ్ళలోకి దిగినంత పనయింది. చేతిలో పెన్ను జారిపోయింది. గబుక్కున పట్టుకుని ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ గుడ్లప్పగించి డోర్ వంక చూస్తుండిపోయాడు.

''రాసుకున్నారా?'' లోపలి యువతి అడిగింది.

‘‘ఏం రాసుకోను తల్లి? ఇక్కడ అరచేతులు చెమటలు పడుతున్నాయి. ఏంటది... మీ మామగారు త్రిపురాసురుడా... మీ ఆయన కుంభకర్ణుడా... నీ పేరు తాటకా... తమాషా చేయటం లేదు గదా... ఎవరన్నా రాక్షసుల పేర్లు పెట్టుకుంటారా? ఇవి అధికారిక లెక్కలు. తప్పులు దొర్లకూడదు.’’ అన్నాడు కాస్త కోపంగా.

‘‘అయ్యో మీరలా అనుకుంటున్నారా? నిజంగా మా పేర్లు అవేనండి. రాక్షస వంశంగదా. అలాగే వుంటాయి. దీనికే ఆశ్చర్యపోతున్నారు. మా పిల్లల పేర్లు వింటే మరీ ఆశ్చర్యపోతారు.’’

‘‘అలాగా... వాళ్ళపేర్లేమిటో?’’

‘‘శుంభానిశుంభులు’’

‘‘వామ్మో ఇవి రాక్షసపేర్లే’’ అంటూ అదిరిపడి లేచి నిలబడ్డాడు పీతాంబరం.

‘‘అవునండి.... మాది రాక్షస కుటుంబమేగదా. వాళ్ళింకా ట్యూషన్ నుండి రాలేదు. వస్తే చాలా ప్రమాదం. త్వరగా రాసుకువెళ్ళిపోండి.’’ అంటూ హెచ్చరించింది లోపల్నుంచి ఆడగొంతు.

‘‘రాసుకోవాలా. ఎందుకు? నీ పిల్లలొస్తే నన్ను చీల్చుకుతినడానికా. ఇందేం కొంపరా దేవుడా!’’ అంటూ గబగబా పుస్తకం మూసి`

భయం భయంలో కంగారుగాగేటువైపుఅడుగులేశాడు. సరిగ్గా అప్పుడే ఒక బైకు గేటులోకి వచ్చింది. ఖరీదైన ఆ బైకు మీద వచ్చింది ఆరడుగుల అందమైన యువకుడు. సిక్స్ప్యాక్లాంటిబాడీ, సుందరముఖారవిందుడు, పసిమిఛాయమేనితోమిసమిసలాడేవయసు. టక్చేసి టై కట్టుకొని చాలా అఫీషియల్ గా ఉన్నాడు. పరుగులాంటినడకతోవస్తున్నపీతాంబరాన్ని చూసిబైక్ ఆపి ‘‘ఎవరండీమీరు? అలా కంగారుగా వెళ్ళిపోతున్నారేమిటీ? ’’ అనడిగాడు.

‘‘తెలిక ఈ రాక్షసకొంప కొచ్చాను.’’

వచ్చిన యువకుడికి అర్థంకాక తెల్లబోయి చూసాడు.

‘‘రాక్షసకొంపా... ఏమంటున్నారు మీరు?’’ అనడిగాడు.

‘‘అర్థంకాలేదా. ఈ ఇంట్లో ఒక రాక్షస కుటుంబం ఉంటోంది. ఆవిడ పేరు తాటకి అట, మామగారి పేరు త్రిపురాసురుడట, మొగుడి పేరు కుంభకర్ణుడట, వాళ్ళ పిల్లల పేర్లు శుంభానిశుంభులట. బ్రతికుంటే బలుసాకు తినొచ్చు నాయనా. అరటిపండులా ముద్దొస్తున్నావ్. ఏం పనిమీద వచ్చావో ఏమిలో, వెళ్ళకు బాబూ. తిరిగి వెళ్ళిపో!’’ హెచ్చరించాడు పీతాంబరం. ఆ మాటలు విని వస్తున్న నవ్వుని బలవంతంగా ఆపుకుంటూ`

‘‘ఆగండాగండి!’’ అన్నాడాయువకుడు.

‘‘మీకీ సమాచారం ఎవరిచ్చారు?’’ అనడిగాడు.

‘‘ఇంకెవరు?’’ ఇంటిఇల్లాలే.

‘‘ఆవిడ్ని మీరు చూసారా?’’

‘‘అబ్బో... చూడ్డం కూడానా. రాక్షస స్త్రీ అయినా పరపురుషుడి ముందుకి రాదట. ఇంతకీ నువ్వెవరయ్యా. ఏం పనిమీద వచ్చావో.’’

‘‘పని మీద రావటం ఏందండీ. ఈ ఇల్లు నాదే....’’

‘‘వామ్మో అంటే ఆమె భర్త కుంభకర్ణుడు నువ్వేనా...’’ అంటూ పీతాంబరం చలిజ్వరం వచ్చిన వాడిలా వణుకుతూ

పారిపోబోయాడు. చటుక్కున అతని చేయిపట్టి ఆపాడు విరాట్. ‘‘భయపడకండి. మీరనుకుంటున్నట్టు ఇక్కడ రాక్షసులెవరూ లేరు. నా పేరు విరాట్. ఎగ్మోర్ లోఒక సాఫ్ట్ వేర్ కంపెనీలో ఇంజనీర్ గా పనిచేస్తున్నాను. ఈ ఇంట్లో నేను నా ఫ్రెండ్ చందు ఉంటాం. అంటూ ధైర్యం చెప్పాడు.

ఆ మాటలు విన్నాక కాస్త ధైర్యం తెచ్చుకుని` తేలిగ్గా వూపిరి తీసుకున్నాడు పీతాంబరం.‘‘ఇప్పుడర్థమైందిలే నాయనా. అనవసరంగా నన్ను భయపెట్టారు. ఇంతకీ మీ పేర్లు రాసుకోవచ్చా?’’ అనడిగాడు.

‘‘వద్దండి.’ అన్నాడు వెంటనే విరాట్

‘‘అదేమిటి? మీరు దేశ జనాభాలో లేరా?’’

‘‘ఉన్నాం. మీ పేరేమిటి?’’

‘‘పీతాంబరం’’

‘‘చూడండి పీతాంబరం గారు. నాది కోయంబత్తురు. చందు అక్కడికి సమీపంలోని ఉసిలంపట్టి గ్రామానికి చెందినవాడు. మా పేర్లు మావూళ్ళో నమోదయ్యాయి. మీరు మళ్ళీ ఇక్కడ నమోదు చేయక్కర్లేదు. ఇంతకీ అర్థమైందన్నారు. ఏమర్థమైందో చెప్పలేదు.’’

‘‘అదే... బ్రహ్మచారిశత మర్కట్మ అన్నారు. ఏ చిలకనో తెచ్చి లోన పెట్టుకున్నావ్. అది కారుకూతలు కూసి నన్ను భయపెట్టింది.’’

నుదురు కొట్టుకున్నాడు విరాట్.

బైక్ దిగిస్టాండ్ వేస్తూ ‘‘నాతో రండి. మీ డౌట్ క్లియర్ చేస్తాను.’’ అన్నాడు. ఇద్దరూ డోర్ ముందుకెళ్ళారు. విరాట్ తలుపుతట్టి ‘‘అరేయ్ చందూ!’’ అంటూ పిలిచాడు. మరుక్షణం ‘‘ఆః... వస్తున్నా!’’ అంటూ లోపల్నుంచి మగ గొంతు విన్పించిది. క్షణం

తర్వాత డోర్ తెరుచుకుని డోర్లో ఒక యువకుడు ప్రత్యక్షమయ్యాడు. ఛామనఛాయరంగులో పొడవుగా హుషారుగా ఉన్నాడు. అతను విరాట్ పక్క నుండి కళ్ళప్పగించి చూస్తున్న పీతాంబరాన్ని చూసి` ''హలో పీతాంబరంగారూ. మీరింకా వెళ్ళలేదా?'' అంటూ అమ్మాయిలా మెలితిరుగుతూ గొంతు మార్చి అడిగాడు. ఇంతకు ముందు తను విన్న అదే గొంతు.

పీతాంబరాని కి కళ్ళు గిర్రున తిరిగి కిందపడబోయి నిలదొక్కుకున్నాడు. విరాట్ నవ్వుతూ` ''చూసారా. లోన అమ్మాయిలెవరూ లేరు. మా వాడు మిమిక్రి ఆర్టిస్టు. రకరకాలుగా గొంతుమార్చిజనాన్ని భయపెడుతుంటాడు. సారీ. ఏమీ అనుకోకండి.'' అన్నాడు జరిగినదానికి నొచ్చు కుంటూ .''నొచ్చుకోడానికి ఏముంది నాయనా. పోయిన ప్రాణం లేచి వచ్చినట్టయింది. నీ ఫ్రెండు గొప్ప మిమిక్రీ ఆర్టిస్టే గావచ్చు. ఇలాంటి జిమ్మిక్కు స్టేజిషోలకు బాగుంటాయిగాని ప్రాక్టికల్ జోక్ కిబాగోవు.'' అంటూ వెను తిరిగి వీధిలోకెళ్ళిపోయాడు.

విరాట్ కోపంతో చందూ కోసం చూసాడు. అతనింకా అక్కడెందుకుంటాడు. అంతకు ముందే లోనకు పారిపోయాడు.

'ఒరేయ్ విరాట్! కాస్త నెమ్మదిరా బాబూ. చెన్నై మారథాన్ పోటీలో పాల్గొన్నట్టు ఆ నడకేమిట్రా. నా వల్ల కావటం లేదు.'' విరాట్ వెనకే పడుతూ లేస్తూ అనుసరిస్తూ అరిచాడు చందు.

అది సాయంకాలం సమయం. ఎగ్మోర్ సమీపంలోఉన్నారు.ఆ ప్రాంతమంతా ఒకే జన సందోహంగావుంది. సమీపంలోనే ఎగ్మోర్ రైల్వే స్టేషనుంది. ఆఫీసులు వదిలే టైం కాబట్టి సిటీ రైళ్ళ కోసం ఉరుకులు పరుగులు తీస్తున్నారు జనం.

చందూ మాటలు విన్నా పట్టించుకోలేదు విరాట్. నడక వేగం తగ్గించలేదు. ''నిన్నేరా. వినబడులోందా? కాస్త స్లోగా నడు.'' మళ్ళీ హెచ్చరించాడు చందు.

''నంథింగ్ డూయింగ్. నడవాల్సిందే. ఏం? మీ వూరి పొలంగట్ల మీద పరుగెత్తి నోడివి సిటీలో నడవ లేవా?'' నడుస్తూనే ఎద్దేవా చేసాడు విరాట్.

''ఈ జనారణ్యం కన్నా పొలంగట్లే ఎంతో నయం. నీకేం తెలుసు ఉళ్ళో చిరుతపులిలా తిరిగినోడ్ని. పిల్లిని చేసి తెచ్చి ఈ కాంక్రీట్ జంగిల్లో పడేసావ్. ఇది జనమా చీమల పుట్టా. తప్పించుకు నడవలేక ఛస్తున్నాను.''

"అవున్లే. ఫ్రెండువని తెచ్చి మా ఆఫీసులోనే ఉద్యోగం వేయించి నిన్ను నాతో ఉంచుకున్నాను చూడు నాదే తప్పు".

"ఊరకే వుంచావా. వంట వాడ్ని చేసి మరీ ఉంచుకున్నావ్గా"

"అంత కష్టమైతే ఊరెళ్ళిపో!"

"ఇలా నడిపిస్తే అలానే చేస్తాను. బంగారం లాంటి ఫారెన్ బైక్కి ఏ రోగం వచ్చిందో ఏమిటో ఉదయం ఆఫీసు కొస్తుండగా పుటుక్కున ఆగి పోయింది. దాన్ని మెకానిక్ షెడ్డు వరకుతోయించావ్. మెకానిక్ చూస్తే రిపేరుకు వారం పడుతుందన్నాడు. ఇపుడు ఆటోలో కొంప చేరుకోవచ్చనుకుంటే పిసినారి పుల్లారావు..."

"వాడెవడు?"

"ఉన్నాడులే నీలాంటి వాడే. ఆటో డబ్బులు కలిసొస్తాయని సిటీ రైలుకి పరుగులు తీయిస్తున్నావు. నువ్వుబాగుపడవు"

చందు మాటలకి ఆగి తిరిగి చూసాడు విరాట్. నాలుగు అడుగుల వెనకే వస్తున్న చందూ కూడా ఆగాడు.

"ఏరా ఎగ్మోర్ ఏర్ పోర్ట్ పక్కనే ఉందనుకున్నావా? చెరో ఆర్రూపాయలతో వెళ్ళిపోయేదానికి మూడొందల రూపాయలు ఆటోకిచ్చుకోవాలా పద త్వరగా." అన్నాడు.

"అంతేగాని నువ్వు స్లోగా నడవనంటావ్" అన్నాడు సీరియస్ గాచందు. తిరిగి అదే వేగంతో నడవనారంభించాడు విరాట్. అతడి నడక వేగానికి బ్రేక్ వేయాలనిపించింది చందూకి. చాలా క్లోజ్ గా అతడి వెనకే వస్తూ ఎదురుగాచూసాడు.

జన సమర్ధంలో ఎదురుగా, పాతికేళ్ళ పరువాల బొమ్మ ఒకటి టైట్ ప్యాంటు టి షర్టులో రంగులరాట్నంలా తిప్పుకొంటూ

వచ్చేస్తోంది. దగ్గరకు రాగానే ఆమె తమ పక్కన్నుంచి పోతుండగా చేయి చాపి పాంటుకి షర్టుకి మధ్య ఇసకతిన్నె లావున్న వంపు మీద చేయివేసి అదిమి, ఎంత వేగంగా అది మాడో అంతే వేగంగా పక్కకు తప్పుకున్నాడు. ఆమె కూడా అంతకన్నా వేగంతో రియాక్టవుతూ చేయి పట్టుకుని వెనుతిరిగింది. కాని ఆమె పట్టుకుంది విరాట్ చేతిని. చందూ స్ప్రింగ్లా తన చేతిని వెనక్కి తీపుకోగానే విరాట్ని దాటి ముందు కెళ్ళిపోయాడు.మెత్తని చేయి ఒకటి తన చేతిని పట్టుకోగానే ఉలికిపడుతూ ఆగి తిరిగి చూసాడు విరాట్. కోపంతో నిప్పు లాగుప్పుమన్న ఆమె ముఖారవిందం విరాట్ ముఖాన్ని చూడగానే చప్పున చల్లారిపోయింది. అందంగా నవ్వుతో 'హాయ్ హేండ్సమ్' అంటూ పలకరించింది ముఖం నిండా నవ్వు పులుము కుంటూ.

విరాట్ కే మీఅర్థంగాక

ఆశ్చర్యంతో చూసాడు.

''అయాం విశాల'' తనే చెప్పింది తిరిగి.

''అయాం విరాట్'' సోవాట్?'' నొసలువిరిచాడు....



జరిగిన కథ :      విరాట్, చందూ ఇద్దరూ స్నేహితులు. రైల్వేస్టేషన్ ముందు      ఒక అమ్మాయి నడుం మీద గిల్లి దూరంగా తప్పుకుంటాడు చందూ. గిల్లినది విరాట్ యే కాబోలు అనుకుని ఆ అమ్మాయి విరాట్ చేయి పట్టుకుంటుంది, తన పేరు విశాలా అని చెప్పి పరిచయం చేసుకుంటుం ది.... ......................................ఆ తరువాత

“చిలిపి. నా నడుం టచ్చేసి సోవాట్ అంటావేమిటి?” అంది కాస్త      సిగ్గుపడుతూ. చేయి మాత్రం వదల్లేదు.

“నడుం టచ్ చేసానా.... నేనా...?”

“నువ్వే... ఇక్కడ టచ్ చేసావ్” అంటూ అతడి చేతిని మరోసారి తన నడుం వంపు మీద ఉంచింది.

అదిరిపడి చేయి వెనక్కి తీసుకున్నాడు విరాట్. అనుమానం వచ్చి చందూ కోసం చూసాడు. అప్పటికే దూరంగా వెళ్ళిపోయి ఫుట్ పాత్ పక్కన రెయిలింగ్ మీద నుంచొని ఇటే చూస్తూ నవ్వుతున్నాడు. అక్కడికి ఎగ్మోర్ రైల్వేస్టేషన్ ఎంట్రన్స్ స్పష్టంగా కన్పిస్తోంది. విరాట్ కి చందూ కావాలనే తనని ఇరికించి వేడుక చూస్తున్నాడని అర్థమైంది. ఈ కొంటెపని చేసింది వాడే సందేహం లేదు. ఆ అమ్మాయి విశాల వంక చూసాడు.

“ఏమిటి దిక్కులు చూస్తున్నావ్? నువ్వు కాదని మాత్రం అనక. నా చేతికి చిక్కావ్ గదా!“ అంది చిలిపిగా.

“చూడు నిజంగా నాకేం తెలిదు. నీ నడుం టచ్ చేసిన వాడెవడో జనంలో కలిసి పోయుంటాడు. వెళ్ళి వెతుక్కో. నన్నొదిలేయ్” అన్నాడు.

“నో నో.. వాడ్ని వదులుకున్నా నిన్ను వదులుకోలేను. నీలాంటి తగిన జోడీ కోసమే ఇంతకాలం ఎదురుచూస్తు వచ్చాను. చూడు నువ్వు ఉద్యోగస్తుడివైనా, నిరుద్యోగివైనా ఐడోంట్ కేర్. దిస్ ఈజ్ మైప్రపోజల్ ఏమంటావ్? అంది ఆశగా.

ఆమె వదలదని అర్థమైపోయింది.

చందూ మీద పీకదాక ముంచుకొచ్చింది కోపం.

“నీ ప్రపోజల్ గుర్తుంచుకుని ఈ సారి కలిసినపుడు నా అభిప్రాయం చెప్తాను. ప్రస్తుతం ట్రైన్ కి టైమవుతుంది. సారీ!” అంటూ ఆమె సమాధానం కోసం ఎదురు చూడకుండానే విరాట్ జనంలోకలిసిపోయాడు. పాపం విశాల పెద్దగా నిట్టూరుస్తూ వెనుతిరిగింది.

“నిన్ను చితగ్గొట్టినా పాపం లేదురా. దుష్టుడా. అనవసరంగా నన్ను అమ్మాయి దగ్గర ఇరికించేసి వస్తావా. రేపు ఎక్కడన్న కనబడినా ఎప్పుడు పెళ్ళిచేసుకుందామని వెంటపడేలా ఉంది” అంటూ కోప్పడ్డాడు విరాట్.

ప్లాట్ ఫారం మీదికొచ్చే వరకు విరాట్ చేతికి చిక్కలేదు చందూ. అప్పటికి అతడి కోపం చాలా వరకు పోయింది. స్టేషన్ బయట

చిక్కుంటే నిజంగా చితగ్గొట్టే వాడే.

"లేకపోతే ఏమిట్రా? కాస్తాస్లోగా నడవరా అంటే నాచేత పరుగులెత్తిస్తావా? అందుకే నిన్ను స్పీడ్ బ్రేకర్ ఎక్కించేలా చేసాను. అయినా ఇది నా తప్పు కాదు" అన్నాడు చందు నవ్వుతూ.

"చేసిన వెధవ పనికి సమర్ధింపు వేరేనా?"

"అదేం కాదురా బాబు. ఇవాళ దినపత్రికలో మన వారఫలాలు చూసాను. నీ జాతకం ప్రకారం ఇవాళ వూహించని సంఘటనలు చాలా జరుగుతాయని రాసుంది...."

"నోర్ మూయ్. వెధవజాతకాల పిచ్చి నువ్వునూ. కాస్త కూచోడానికి సీటు దొరుకుతుందేమో చూడు." అన్నాడు విరాట్.

ట్రైనొచ్చిఆగింది.

దిగేవాళ్ళు దిగుతున్నారు, ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు. అంతకుముందే వెళ్ళిన రైల్లో చాలా మంది క్రిక్కిరిసి వెళ్ళిపోడంతో ఈ ట్రైన్ కి అంతగా రష్లేదు. లోనకు వెళ్ళగానే లక్కీగా యిద్దరికీ సీటు దొరికింది. అప్పటికే ఎదురు సీటు ఖాళీ కాగా ఇద్దరు యువతులు వచ్చి కూచునున్నారు. రైలు కదిలింది.

యధాలాపంగా అటూ చూసాడు విరాట్.

సాధారణంగా`

యధాలాప సంఘటనలే కొన్ని ఒక్కోసారి మనిషి జీవితాన్ని వూహించని మలుపులు తిప్పుతాయి. ప్రశాంతంగా వున్న కొలనులో రాయిపడి తే చెదిరే అలల్లా ఆ చిన్న సంఘటన తర్వాత అనేక సంఘటనలకు దారితీసి మనశ్శాంతికి దూరం చేస్తాయి. ఇపుడా రైలు ప్రయాణంలో అలాంటి సంఘటనే చోటు చేసుకోనుందని ఆ క్షణంలో విరాట్ కు తెలిదు.

యధాలాపంగా చూసిన విరాట్ కు ఎదురు సీట్లో అమ్మాయిలు స్పష్టంగా కన్పించారు. మొదట అమ్మాయి గుండ్రాటి ముఖం. యావరేజ్ డ్రెస్ తో అందరమ్మాయిల్లాగే సాధారణంగా కన్పించింది. కిటికి పక్కగా కూచునుంది రెండో అమ్మాయి. ఆమె ముస్లిం యువతి కావచ్చు. ఇద్దరూ చుడిదార్ ధరించి వున్నారు. రెండో అమ్మాయి చున్నీని కళ్ళు మాత్రం కన్పించేలా ముఖానికి చుట్టుకుని ఉంది. ఆమె కిటికి పక్కనున్న విరాట్ కు ఎదురుగా ఉంది.

ముందుగా చూసినప్పుడు మామూలుగా చూసి చూడనట్టు చూసి ముఖం తిప్పుకున్నాడు విరాట్. కాని ఎందుకో ఎదురుగా ఉన్న అమ్మాయిని మళ్ళీ చూడాలనిపించింది. ఈ సారి పరిశీలనగా చూసాడు.

అమ్మాయిలిద్దరూ చిన్నగా మాట్లాడుకుంటూ తమ ద్యాసలో వాళ్ళున్నారు.

ఆమె వయసు ఇరవై రెండు లేదా ఇరవై మూడేళ్ళు ఉండొచ్చనిపించింది. రెండోసారి చూడగానే ఆమెను అసాధారణ యువతిగా గుర్తించాడు విరాట్. ఖచ్చితంగా అయిదున్నరడుగుల ఎత్తు ఉంటుంది. అద్భుతమైన ఫిజిక్... చెక్కిన పాలరాతి శిల్పంలాంటి వంపు సొంపుల అంగ సౌష్టవం... లేత గులాబి రంగులో మెరిసే చర్మసౌందర్యం... వాలుజడ ముందుకేసుకోవడంతో ఆమె జుత్తు కరినాగులా బారుగా ఒడిలో పడినది . సన్నటి నడుం పైన ఎద భారాల పొంగుల హొయలు... శంఖం లాంటి మెడ... సింహం లాంటి నడుము... మతి పోగొడు తున్నాయి. నిజంగా చాలా చాలా అందగత్తె అయి ఉండొచ్చనిపించింది. ఆమెనే చూస్తున్నాడు.పక్కన కూచొని ఏదో వాగుతున్న చందూ విరాట్ తన మాటలు వినటం లేదని ఎదురుగా ముసుగు సుందరిని చూస్తున్నాడని గ్రహించి మాటలు ఆపి అలా చూస్తుండిపోయాడు. ఇంతకాలం తమ స్నేహంలో ఎప్పుడూ విరాట్ ఒక అమ్మాయినలా ఆసక్తిగా గమనించటం చూళ్ళేదు. ఏదో విశేషం ఉందనిపించింది.

లో లోపల ఆమెను చూస్తూ ` ఆ వెలుగేమిట్రాబాబూ... మనిషే ఇంత బాగుంది... ముఖం ఎంత బాగుంటుందో... ఒక్కసారి ఆ ముసుగు తీసి ముఖం చూపించొచ్చు గదా అనుకున్నాడు మనసులో విరాట్.

విచిత్రంగా అతని మనసులో మాట తనకు వినిపించినట్టుగా ఆ యువతి అంతవరకు ముఖం తెలికుండా చుట్టుకున్న చున్నీని తీసి మెడలో వేసుకుంది. సందేహం తీరిపోయింది. నిజంగానే అద్భుత లావణ్యవతి ఆమె. బ్రీత్ టేకింగ్ బ్యూటీ... ఈజిప్ట్ రోమన్ సుందరి క్లియోపాట్రా... హెలెన్ ఆఫ్ ట్రాయ్.. రాజస్థాన్ రాజమాత గాయత్రీదేవి.... అందాలన్నీ ఈమెలోనే ప్రోదిచేసుకున్నాయా..?!! స్టనింగ్ బ్యూటీ అనటంలో ఏ మాత్రం సందేహం లేదు... అంతేకాదు...

ఆమె ముస్లిం యువతి కాదు.

ముఖాన బొట్టు వుంది. హిందువు యువతి. మెడలో మంగళ సూత్రాలుగాని కాలివేళ్ళకు మెట్టెలుగాని లేవు. అంటే అవివాహిత. కోలముఖం యువతులు అందంగా వుంటారని తెలుసు. కాని మరీ యింత అందగత్తెలుంటారన వూహించలేదు.

నుదురు విశాలంగా వున్న వారికి ఆలోచనాశక్తి ఎక్కువ. చిన్న విషయాలనైనా ఎక్కువ ఆలోచించిగాని నిర్ణయాలు తీసుకోరు. న్యాయం కోసం పోరాడే స్వభావం... నిశ్చిత పరిశీలన గుణం... సమయానుకూలంగా స్పందించి త్వరిత పరిష్కారమార్గాన్ని అనుసరిస్తారు. ఓ పట్టున ఎవరి ని నమ్మరు. ఎవరికీ తలవంచరు. నమ్మిన వారి కోసం ప్రాణమిస్తారు. ఆమె నుదురు విశాలంగా వుంది. మరీ కోల ముఖం కాదు. అలా గని గుండ్రని ముఖము కాదు. కుంకుమ అద్దినట్టు ఎర్రని బుగ్గలు... మెరిసే చెక్కుటద్దాలు ... సంపంగి మొగ్గలాంటి ముక్కు... అలాంటి చక్కని నిటారు ముక్కు గల వారికి ముక్కు మీదే ఉంటుంది కోపం. అది కాసేపే. కుదురుగా ఉండలేరు. ఏదో అన్వేషించి అనవసర గొడవల్లో పడతారు . సమరంలో వీరు అదృష్టవంతులై ఉంటారు. అటువంటి ముక్కు కలిగిన అకలికి ముక్కున ఒంటి రాయి బేసరి. అందులో పొదిగిన వజ్రం ఆమె అందాన్ని ఇనుమడిరప చేస్తోంది.

ఆమె పెదవులు చక్కగా కొనల్లో వంపు తిరిగి లేత గులాబి రంగులో తడిలో మెరుస్తూ మళ్ళీమళ్ళీ చూడాలనిపిస్తున్నాయి. శంఖం లా పొడవాటి మెడలో సన్నటి బంగారు గొలుసు... చెవులకు పచ్చల జువకాలు ఉన్నాయి. యవ్వనపు పొంగులో ఉంది అమ్మాయి.

వాళ్ళని చూస్తుంటే ఇద్దరూ ఏదో కంపెనీలో ఎంప్లాయిస్ అని, తమ లాగే వాళ్ళిద్దరు కూడకలిసే తిరుగుతుంటారని అన్పించింది. ఇంతకీ ఎక్కడ పని చేస్తున్నట్టు...? ఎగ్మోర్లో అయితే ఈ అమ్మాయి ఇంతకాలం తన కంట పడకుండా ఎలా ఉంది...? తీవ్రంగా ఆలోచిస్తున్నాడు విరాట్.

రైలు పరుగెడుతూనే ఉంది.

అప్పటికే కొన్ని స్టేషన్లు దాటి పోయాయి. ఆ అమ్మాయి తనను రెండు మూడు సార్లు క్రీగంట గమనించటం విరాట్ కనిపెట్టాడు. ఒకసారి ఆమెను పలకరించాలనిపించింది. కాని ఎలా? ఏమని పలకరించాలి...? పలకరిస్తే తన గురించి ఏమనుకుంటుందో ఏమో... ఆలోచించే లోపు మరో అయిదు నిముషాలు గడిచి రైెలు కోడంబాకం స్టేషన్ లో ఆగింది. సిటీ రైలు ముప్పై సెకన్లు మాత్రమే ఆగుతుంది. ఆ కాస్త టైమ్ లోనే ఎక్కేవాళ్ళు ఎక్కాలి దిగేవాళ్ళు దిగాలి. రైలు కదిలింది. కాస్సేపటికి ఎలాగో ధైర్యం తెచ్చుకొని 'హలోమిస్' అంటూ ఆమెను పిలిచాడు విరాట్.

ఆమె తలెత్తిచూసింది...

విశాల నేత్రాలు, నిశితమైన చెవులు...

ఆ కాటుక కళ్ళలో ఎన్నో అనుమానాలు...

"టైమ్ ప్లీజ్ " అడిగాడు.

"మీ దగ్గర వాచి లేదా?" ఎదురు ప్రశ్నించింది. వీణ మీటినట్టు మృధువైన గొంతు.

"లేదు" అన్నాడు పొడిగా

"టెన్ టు నైన్" చెప్పింది.

"మీ హేండ్ బ్యాగ్ చాలా బాగుంది. వెరీనైస్" మాటలు పొడగించాలని నోటికొచ్చింది వాగేసాడు.

"బాగుంది కాబట్టే .......... కొన్నాను." కర్ర విరిచినట్టు బదులిచ్చిందామె. వీరి సంభాషణ వింటూ అటు ఆమె స్నేహితురాలు ఇటుచందూ చిన్నగా నవ్వుకుంటున్నారు.

'ఎక్కడకొన్నారు?' ఆడుగుదామని నోటి చివరివరకు వచ్చిన ప్రశ్నను అలాగే మింగేసాడు విరాట్. ఎందుకంటే స్లో అయి రైలు టి నగర్ స్టేషన్లో ఆగబోతోంది. దిగిపోవడానికి యువతులిద్దరూ ఎంట్రన్స్ వైపు కదిలారు. వెళ్తున్న ఆ యువతినే చూస్తూండిపోయాడు విరాట్. ఆమె వెళ్ళిపో తున్నందుకు బాధనిపించింది. రైల్లోని వెలుగునంతా ఆమె తన వెంటబెట్టుకు పోతున్నట్టు అనిపించింది. ఏమిటీ ఫీలింగ్ ...? అసలేమైంది తనకు...? లవ్ ఎట్ ఫస్ట్ సైట్ యిదేనా...?

కనీసం ఆమె వూరు తెలిదు. పేరు తెలిదు. అడ్రస్ తెలిదు. కాని పట్టి వెనక్కి లాగినా తన మనసు ఆమె వెనకే పరుగెత్తటం ఏమిటి...? నిజంగానే చాలా అందమైన యువతి. ఆమె నడక చూస్తే హంసలు సిగ్గుపడాలి. అంత పొందికైన నడక... తను కోరుకునేల క్షణాలన్నీ ఆమెలో నిండుగా ఉన్నాయి.

వాళ్ళిద్దరూ రైలు దిగిపోయారు.

విరాట్ కి కనీసం ఆమె పేరయినా అడిగి తెలుసుకోవాల్సింది అన్పించింది. అంతే... చటుక్కున లేచాడు. రైలు కదలబోతోంది. మెరుపు వేగంలో డోర్ ని చేరుకొని దిగిపోయాడు.'' అరే విరాట్... ఎక్కడికిరా... టి నగర్లో దిగిపోతావేమిటి...? ఆగరా...'' అనరస్తూ వెనకే లేచి వచ్చిన చందూ కదిలిన రైలోంచి దూకేసి తూలి పడబోయి నిలదొక్కుకున్నాడు.

అప్పటికే విరాట్ ఆ యువతులిద్దరి కోసం ప్లాట్ ఫారం వెంట గాలిస్తున్నాడు. పిచ్చోడిలా తిరిగి చూస్తున్నాడు. రైలుదిగిన వాళ్ళు కొందరు ప్లాట్ ఫారం చివరిదారి వైపు నడచిపోతున్నారు. మరికొందరు మెట్లెక్కి వంతెన పై నుండి అటు ఉస్మాన్ రోడ్ వైపుగల రంగనాథగేట్ వైపు, ఇంకొందరు ఇటు స్టేషన్ రెండో వైపు, ఓల్డ్ మాంబళం పక్క తొందరగా చెలిపోయి వెళ్ళిపోతున్నారు. ఇంతలోనే వాళ్ళిద్దరూ ఎటువెళ్ళిపోయారో గాని తిరిగి విరాట్ కంటపడలేదు వాళ్ళు. ''ఎటోవెళ్ళిపోయింది మనసు... ఎటెళ్ళిందో అది నీకు తెలుసూ...'' పక్కన ఎవరో పాట పాడుతున్నారు . ఇంకెవరు... తీరిగ్గా తిన్నె మీద కూర్చుని తననే చూస్తూ పాటతో వెక్కిరిస్తున్నాడు చందూ.సాధారణంగా తనను ఎవరన్నా వెక్కిరించినా పరిహసించినా విరాట్ కి సర్రున కోపం ముంచుకొస్తుంది. కాని ఇప్పుడు కోపం రావటం లేదు. చిన్నగా నవ్వుతూ పక్కన కూర్చున్నాడు.

''ఏమిట్రా? అమ్మాయి అంత నచ్చిందా?'' అడిగాడు చందూ. అవుననట్టు తలూపాడు విరాట్.

''లవ్ ఎట్ ఫస్ట్ సైటా?''

''ఏమో.......... ఇప్పుడేచెప్పలేను''.

''నువ్వు చెప్పక్కర్లేదు అర్థమైపోతోంది. లేకపోతే రైలుదిగి ప్లాట్ ఫారం మీద ఎందుకుంటాం...? ఏమైనా దినఫలాలు కరెక్టని ఇప్పుడైనా ఒప్పుకుంటావా? నన్నా క్షేపించావ్ చూడు ఇప్పుడేమైందో. ఆవిడెవరో విశాలనీ చేయిపట్టుకొని వెళ్ళి చేసుకోమంది. నువ్వే మో రైల్లో ముక్కు మొఖం తెలిని అమ్మాయి కోసం రైలు దూకేసావ్...''

''దూకలేదు. దిగాను''

‘‘అదే లేవోయ్. నువ్వు గాకపోతే నేను దూకలేదా? ఇవన్నీ వూహించని సంఘటనలేగదా! వెధవ జీవితాలు ఏమిటో గాని నచ్చని వాళ్ళ వెంట పడతారు. నచ్చిన వాళ్ళు కనిపించకుండా పోతారు. మర్చి పో రా ఈ మహానగరంలో ఆ పిల్ల తిరిగి కనబడొచ్చు, కనబడకపోవచ్చు, అదో రైలు వస్తుంది పదపోవాలి’’ అంటూ లేచాడు చందూ.

విరాట్ కళ్ళ ముందింకా...

ఆ అమ్మాయి రూపమే కదులాడులోంది...

ఆ సుందర ముఖారవిందం తన హృదయ ఫలకం మీద ముద్రపడిపోయింది. చందూ మాటలు నిజమే అన్పించింది. ఆమె తిరిగి కనబడకపోవచ్చు. అయినా మన ప్రయత్నం మనం చేయాలి గదా... కనీసం పేరైనా తెలుసుకోవాల్సింది. తీపి బాధతో మనసు వేదనకు గురైంది.

ఇంతలో రైలు ఆగటంతో ఆలోచనలు కట్టిపెట్టి చందూ వెంట రైలెక్కాడు విరాట్.

సాధారణంగా ఒక సంఘటన జరిగినప్పుడు.. అది మంచి గాని చెడు గానీ...ఆ క్షణాల్లో... లేదా ఆ గంటలో... మరీ అయితే ఆ రోజంతా... ఆ ఫీలింగ్స్ బలంగా ఉంటాయి. తర్వాత రోజులు గడిచేకొద్దీ క్రమంగా ఆ ఫీలింగ్స్ బలహీనపడి జరిగింది మర్చిపోతారు . ఇది మానవసహజం. కానీ విరాట్ విషయంలో ఇది పూర్తిగా భిన్నమై పోయింది.

ఆ రోజు ఇంటికి రాగానే తనూ ఇలాగే అనుకున్నాడు. ఎంత నచ్చితే మాత్రం ఇవాళ రేపు తర్వాత ఆమె గుర్తుండదు అని. ఆమె గుర్తుండడమే కాదు గుండెల్లో తీపి గాయం చేసి సలపటం ఆరంభించింది. మర్చిపోదామని ఎంత ప్రయత్నించి నా తలపుల్లో తిష్టవేసి కూచొని మనసుకు నెమ్మది లేకుండా చేయనారంభించింది.

ఈ విషయం మరునాడు ఉదయానికే గ్రహించాడు విరాట్. రాత్రంతా సరిగా నిద్రలేదు. కన్ను మూసినా తెరిచినా ఆ అపరిచిత రూపమే కన్పిస్తోంది... కవ్విస్తోంది... ఎంత ప్రయత్నించినా తన ఆలోచనల్లోంచి ఆమెను చెరిపేయటం సాధ్యమయ్యేలా కనబడలేదు.అసలు ఎందుకింతగా ఈ అమ్మాయి తనను కలిచివేస్తోంది? అందమా... ఆకర్షణా... మోహమా.... అదే కారణమైతే

ఈ చెన్నై మహానగరంలో అందమైన అమ్మాయిలకు కొదువా? తమ ఆఫీసులోనే పెళ్ళికాని అమ్మాయిలు చాలా మంది ఉన్నారు. తనంటే పడిచచ్చే వాళ్ళు చాలామంది ఉన్నారు. అంతదేనికి సాయంకాలం తన చేయిపట్టి ఆ పి పెళ్ళాడాలన్న విశాల కూడ చాలా అందంగా ఉంది. తను చెన్నై వచ్చిన ఇన్ని రోజుల్లోనూ ఏ అమ్మాయిని చూసినా స్పందించని తన మనసు ఈ అమ్మాయిని చూడగానే ఇంతగా స్పందించిందంటే దీనికి ఆమె అందం ఒక్కటే కారణం కాదు. కానే కాదు.

అంతకు మించి ఏదో బలమైన బంధం తమ మధ్య ఉంది. ఏమిటది? గత జన్మ బంధమా?... జీవితమనే తెర మీదకు ఎందరో వస్తుంటారు పోతుంటారు... వారిలో కొందర్ని అకారణంగా ద్వేషిస్తూ, కొందర్ని అభిమానిస్తూ ఇష్టపడతాం... ఇంకొందరితో స్నేహం చేస్తాం... ఇవన్నీ గతజన్మ రుణానుబంధాలంటారు.''ఋణానుబంధరూపేణాంపశుపత్నిసుతాలయా'' ఆఖరికి భార్యాపిల్లలు కూడ గతజన్మ ఋణానుబంధమేనట. ఈ అమ్మాయికి తనకు అలాంటి గత జన్మ బంధమేదో ఉండే ఉంటుంది. లేకపోతే ఇంతగా తనను కదిలించేది కాదు.



జరిగిన కథ : రైల్వేస్టేషన్ ముందు విరాట్ చేయి పట్టుకున్న విశాలను విడిపించుకుని ట్రైన్ లో ఎక్కిన విరాట్ కి ఎదురు సీట్లో కూర్చున్న ఇద్దరమ్మాయిల్లో ఒకామె బాగా ఆకర్షిస్తుంది. ఆమెతో మాటలు కలపడానికి ప్రయత్నిస్తాడు....

........ఇక చదవండి.

ఉదయం లేచిన వాడు లేచినట్టే కూచొని ఆలోచిస్తున్నాడు. ఓపక్క తన కార్యక్రమాలు చూసుకుంటూనే విరాట్ ని గమనిస్తూనే ఉన్నాడు చందూ. ప్రేమలో పడ్డ వాడికే ప్రేమికుల బాధలు కష్టాలు ఏమిటో అర్ధమవుతుంటాయంటారు. సందేహంలేదు వీడు ప్రేమలో పడిపోయాడు.

పాతాళభైరవి సినిమాలో తోటరామునికి మాంత్రికుడు రాజకుమారి నెక్కడ ఉంచాడో తెలిసింది గాబట్టి వెళ్ళి రక్షించి తెచ్చుకున్నాడు. కాని ఈ విరాట్ కి శత్రువులెవరూ లేరు. ఈ మహానగరంలో తన ప్రేయసి ఏమైందో తెలిదు. అసలు ఈ వూరో కాదో... పని మీద వచ్చి వెళ్ళిపోతుందేమో తెలిదు. సొంతవూరు ఏదో తెలిదు. ఇన్ని తెలిదులు పెట్టుకొని ఆమె ఆచూకి తెలుసుకోవటం ఎలా...?

ఒక వేళ తెలుసుకున్న ఆమె వీడ్ని ప్రేమిస్తుందో లేదో తెలిదు. ఆల్ రెడీ ఆమెకు బోయ్ ఫ్రెండ్ ఉన్నడేమో తెలిదు. ఒక వేళ ఎంగేజ్ మెంట్ అయిపోయి ఎవడితోనో పెళ్ళి జరగనుందేమోతెలిదు. ఇన్ని తెలియలుండగా ఆ అమ్మాయి మీద పోయిపోయి మనసు పారేసుకున్నాడే ఏమిటి వీడి పరిస్థితి అనుకున్నాడు చందూ.

ప్రస్తుతం ఆ అపరిచిత ధ్యాసలోనే ఉన్నాడు కాబట్టి తనేం చెప్పినా అర్ధంకాదనే ఉద్దేశంతో తనేది కామెంట్ చేయలేదు. ''టిఫిన్ రెడీ, ఆఫీసు టైం అవుతోంది త్వరగా రెడీ కా... ఈ లోపల లంచ్ బాక్స్ లు రెడీ చేస్తాను'' అంటూ తొందరచేసి విరాట్ ను బాత్రూం లోకి తరిమాడు.

ఇక్కడ నిజానికి...

విరాట్ ఆలోచనలు వేరుగా ఉన్నాయి.

అప్పటికే ఎలాగయినా ఆమెను వెదికి పట్టుకోవాలనే కృత నిశ్చయానికి వచ్చేసాడు. ఎందుకో గాని ఆమె తనకు కన్పిస్తుందని ఆమె తనదే అనే దృఢమైన ఫీలింగ్ మనసులో స్థిర పడిపోయింది. ఖచ్చితంగా ఆ అమ్మాలిద్దరూ ఎగ్మోర్ లోనే ఏదో ఆఫీసులో పని చేస్తుండాలి. తను ఎగ్మోర్ స్టేషన్ లో కాపు వేస్తే తప్పకుండా కనపడాలి.

మిత్రులిద్దరూ రెడీ అయి రైల్లో ఎగ్మోరు స్టేషన్ లో దిగేసరికి ఉదయం తొమ్మిదిన్నర టైము. అక్కడికి పావుగంట నడక దూరం లోనే ఉంది విరాట్, చందూ పని చేసే ఆఫీసు. రైలు దిగి బయటకు రాగానే ఆగాడు విరాట్. ఏమిటన్నట్టు చూసాడు చందూ.

''చిన్న పనుంది. గంట లేటుగా వస్తున్నానని ఆఫీసులో చెప్పి మేనేజ్ చేయి. నువ్వు పద'' అన్నాడు విరాట్.

ఆ చిన్న పనేమిటో...

వూహించాడు చందూ.

"అంత చిన్న పనా?" సిరియస్ గా అడిగాడు.

విరాట్ సమాధానమివ్వలేదు.

"అంత చిన్న పనికి గంట సమయం ఎందుకు..? అయిదు నిమిషాలు చాలు. వెయిట్ చేస్తాను. వెళ్ళి పని చూసుకురా."

"చందూ..." అన్నాడు విరాట్ విసుగ్గా.

"ఒకె, ఒక్కోసారి చిన్న పనికి కూడ చాలా సమయం పడుతుంది గదూ... పని చూసుకొనేరా. నేను ఆఫీస్ లో మేనేజ్ చేస్తాలే" అంటూ చిన్నగా నవ్వుకొంటూ వెళ్ళిపోయాడు చందూ.

విరాట్ స్టేషన్ ఎంట్రన్స్ లోని పోర్టికో దగ్గరే ఉండి రైలు దిగి వచ్చే వాళ్ళని జాగ్రత్తగా గమనించనారంభించాడు. పుట్ట లోంచి చీమలు బయటకు వచ్చినట్టు జనం వస్తున్నారు. ఆఫీసులకు పరుగులెత్తే వాళ్ళు, స్కూళ్ళు, కాలేజి స్టూటెండ్స్ లో ఉదయం సాయంత్రాల్లో సిటీ రైళ్ళు చాల రష్ గా పరుగులు తీస్తుంటాయి.

ఆ జన సందోహంలో...

రెప్ప వేస్తే ఆమె ఎక్కడ మిస్సయిపోతోందోనన్న డౌటుతో ఆమె కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నాడు విరాట్. క్షణాలు.. . నిమిషాలు... గంట అన్నది రెండు గంటలు వెయిట్ చేసినా ఆమె గాని ఆమె ఫ్రెండ్ ఆచూకీ గాని దొరకలేదు. సందేహం లేదు. వాళ్ళు ఎగ్మోరికి రాలేదు. మరీ లేట్ చేయటం బాగుండదని ఆ పూటకి ఆశ వదులుకొని ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అయినా కూడా అతడ్ని సందేహం వెన్నంటుతూనే ఉంది.

ఏమో… ఆ జనంలో వాళ్ళు మిస్సయ్యారేమో. అదే జరిగితే సాయంకాలం వాళ్ళు తిరిగి రైలుకి రావాలి గదా. ఆ డౌటు కూడా తీర్చుకొందామనుకున్నాడు. సాయంత్రం పర్మిషన్ తీసుకొని ఆఫీస్ టైమ్ కిముందే బయటికొచ్చేసాడు. తిరిగి స్టేషన్ ముందు కాపు గాసాడు. ప్రయోజనం లేకపోయింది. ఆమె స్టేషన్ కి రాలేదు. అయినా నిరాశ చెందలేదు విరాట్.

ఇవాళ రాకపోతే రేపు ఆమె కన్పిస్తుందనే ఆశ…

చందూ వచ్చి కలవగానే ఇద్దరూ రైలెక్కారు. అయితే టినగర్ స్టేషన్ రాగానే రైలు దిగిపోయాడు విరాట్.

''నువ్వింటికెళ్ళిపోరా. నేను కాస్త లేటుగా వస్తాను'' అన్నాడు చందూతో.

''లోకంలో ఎక్కడా ఈక లేని కోడి, తోక లేని కుక్క ఉండదు. అలాగే చందూ లేకుండా విరాట్ కూడ ఉండడు. పదా నేనొస్తా'' అంటూ తనూ రైలు దిగి పోయాడు చందూ.

ఇద్దరూ సుమారు గంట సేపు టినగర్ స్టేషన్ లో ఆ అజ్ఞాత సుందరి కోసం గాలించారు. ఎగ్మోర్ లో మిస్సయినా ఇక్కడైనా కన్పిస్తుందని విరాట్ ఆశ. కాని ఆ ఆశ కూడ నిరాశయింది. స్టేషన్ కి సమీపం లోనే ఆమె నివాసమైతే సాయంకాలం షాపింగ్ కి బయటకురావచ్చని మరో ఐడియా తట్టింది. అంతే…

చందూతో స్టేషన్ బయటకొచ్చి రంగనాథ స్ట్రీట్ లోని షాపుల వెంట గాలించాడు. తర్వాత ఉస్మాన్ రోడ్డులో గాలిస్తూ ఎగువన పానగల్ పార్క్ వరకు వెళ్ళాడు. అక్కడి నుంచి జి.ఎన్. చెట్టి రోడ్డులో కొంతదూరం వెళ్ళి చూసుకొంటూ అడ్డ రోడ్డు లోంచి అవతల పాండీబజార్ చేరుకున్నాడు.

పాండీ బజార్లో కూడా ఆమె జాడ తెలిలేదు. గాని అక్కడే చీకట్లు ముసురుతున్నాయి. ''కాళ్ళు పట్టేశాయినాయనా. స్టేషన్ కు నడిచి రైలెక్కే ఓపిక లేదు!'' అంటూ చందూ హఠం చేయటంతో తప్పదని ఆటోలో ఇంటికి బయలుదేరారిద్దరు.

డేటు మారింది గాని....

సేమ్ ప్లేస్....

సేమ్ లొకేషన్....

ఎగ్మోర్ రైల్వే స్టేషన్...

మూడో రోజు...

ఉదయం వరకు ఆమె జాడ లేదు. సాయంకాలమైనా కన్పిస్తుదన్న ఆశ. స్టేషన్ ముందు వెయిట్ చేస్తున్నాడు. చందు ఇంకా ఆఫీస్ నుండి రాలేదు. ఓపిగ్గా ఎదురుతెన్నులు చూస్తున్నాడు విరాట్. ఆమె జాడయితే తెలీలేదుగాని ఇంతలో మృదువైన మెత్తని చేయి ఒకటి తన చేతిని పట్టుకోడంతో ఉలిక్కిపడి తిరిగి చూసాడు.

ఎదురుగా విశాల....

ఇవాళ చక్కగా చీర జాకెట్లో` షోకేస్ లో బొమ్మలా ఉంది.

ఆమెను చూడగానే విరాట్ కి ఎక్కడలేని నీరసం ముంచు కొచ్చింది. రెండోసారి బుక్కయి పోయానేమిట్రా బాబు త్వరగా వదిలించుకోవాలి అనుకుంటూ ఆమెను చూసి ఓ పిచ్చి నవ్వు నవ్వాడు.

“ఏయ్ విరాట్ నా కోసమేనా వెయిటింగ్..?” అంది విశాల నవ్వుతూ.

“ఓర్ నాయనో, నా పేరు కూడా శిలాక్షరాలతో రాసి మరీ గుర్తుపెట్టుకున్నట్టుంది.” అనుకుంటూ “లేదు మిస్... మా చందూ కోసం

వెయిటింగ్'' అన్నాడు. చేయి వదిలించు కోవాలనుకున్నాడు.

వదల్లేదామె.

''చందూ ఎవరు?'' అడిగింది.

''నా ఫ్రెండ్. నిజం చెప్పనా? ఆ రోజు నన్ను ఇరికించాలని నీ నడుంతడిమి పారిపోయిన వెధవవాడే'' అని నవ్వాడు.

తనో నవ్వు నవ్వింది విశాల.

''అయితేనేం నీ ఫ్రెండు మంచి పనే చేసాడు. నీ పరిచయం దొరికింది నాకు, ఇంతకీ నా ప్రపోజల్ గురించి ఏమాలోచించావ్?'' అడిగింది.ఇది

వూహించిన ప్రశ్న.

ఖచ్చితంగా అడుగుతుందని తెలుసు.

కాని ముందే అడిగింది.

ఏం చెప్పాలో అర్థంగాక మరోసారి పిచ్చి నవ్వు నవ్వాడు. చందూ వచ్చేస్తే బాగుండు. లేదంటే ఈవిడ తనని కొంచెం కొంచెం కొరుక్కుతినేసేలా ఉంది.

''ఇంతకీమీ విషయాలేమీ చెప్పలేదు. రైలు కొచ్చి వెళ్తున్నారంటే ఎంప్లాయ్ అయిఉండాలి. ఎక్కడ జాబ్ చేస్తున్నారు..?'' ఆమె ప్రశ్నకు సమాధానం దాటవేస్తు టాపిక్ మార్చాడు.

“రైల్లో వచ్చినంత మాత్రాన జాబ్ చేస్తున్నానని అర్థమా?” తమాషాగా ఎదురు ప్రశ్నించింది.

“మరీ?” కుతూహలంగా చూసాడు.

“ మా కంపెనీలో మూడు వందల మంది జాబ్ చేస్తున్నారు”

“ఓ మైగాడ్ కంపెనీ ఓనరా...?”

“యస్... నేను ఫ్యాషన్ డిజైనర్ని, మా డాడీ హయాంలో రెడీమేడ్ గార్మెంట్ కంపెనీని పదిమంది టైలర్స్ తో ఆరంభించి క్రమంగా విస్తరించారు. ఆయన పోయాక కంపెనీ నా హయాం లోకి వచ్చింది. ప్రస్తుతం మూడు వందల మంది లేడీస్ ఎంప్లాయిస్ తో చెన్నైలోనే అతి పెద్ద కంపెనీ మాది. మా గార్మెంట్స్ ఫారెన్ కీ ఎక్స్ పోర్టవుతుంటాయి. సంవత్సరానికి ఏభైకోట్ల టర్నోవర్” ఆమె తన గురించి వివరిస్తుంటే నిజంగానే ఆశ్చర్యానికి గురయ్యాడు. ఏంటీ అంత పెద్ద కంపెనీ అధికారిణి అయి ఉండి యిలా రైలు దిగి సాధారణ అమ్మాయిలా నడిచిపోవటం వింతగా ఉంది.

“హలో ఏమిటి ఆశ్చర్యపోతున్నారు? రైల్లో వస్తున్నందుకా?” అంది.

“వూ” అన్నాడు.

“నేను ఉండేది వెస్ట్ మాంబళం. మా కంపెనీ ఆఫీసు, గార్మెంట్స్ తయారీ ఫాక్టరీ, గోడౌన్ అన్నీ ఇక్కడ ఎగ్మోర్ లో ఉన్నాయి. నా కారు సర్వీస్ కెళ్ళింది. అప్పుడప్పుడు యిలా రైల్లో వచ్చి ఆటోలో అక్కడకెళ్ళటం సరదా. మా కంపెనీలో అంతా లేడీసే వర్క్ చేస్తారు. మానేజర్, ఆఫీసు స్టాఫ్ తో సహా” అంటూ ఆమె టకటకా చెప్తుంటే కళ్ళుగిర్రున తిరిగినంత పనయింది విరాట్ కి.

అందుక్కారణం ఆమె చెప్పిన ఏభైకోట్ల టర్నోవర్లో లేక ఆఫీసు విషయాల గురించో కాదు. అంత వుండి సాధారణ ఎంప్లాయీలా రైల్లో వచ్చిపోతున్నందుకు. మాటల సందర్భంలో చిన్నగా తన చేయి విడిపించుకున్నాడు. అపరిచిత కోసం తనిక్కడ పడిగాపులు కాయటం ఏమిటి? ఈ విశాల రెండోసారి తన ముందుకు రావటం ఏమిటి...?

“ఏమిటాలోచిస్తున్నావు? మా ఫ్యామిలీ గురించి చెప్పలేదనా? మా ఇంట్లో అమ్మ ఉంటుంది. తనతో బాటు నా కుక్కపిల్లలు రెండు. అదే మా ఫ్యామిలీ...!” గడగడా మాట్లాడేస్తోంది విశాల.

ఓపిగ్గా ఆమె గురించి అంతా విన్నాడు విరాట్.

చందూ కోసం ఎదురుచూస్తున్నాయి అతడి కళ్ళు. వాడు వస్తే విశాలకు బై చెప్పి వెళ్ళిపోవచ్చు. తను వూహించినట్టు విశాల సాధారణ యువతి కాదు.

“సో... విశాల... రెండో సారి మనం కలుసుకోవటం సంతోషంగా ఉంది...”

“అయాం ఆల్సో వెరీ హేపీ.. బట్ నా ప్రపోజల్ గురించి ఏం ఆలోచించావ్?” తన ప్రశ్నను రిపీట్ చేసింది.

“నీ ప్రపోజల్ కాస్సేపు పక్కనుంచు. నేనో విషయం అడుగుతాను. ఏమీ అనుకోవుగదా?” అన్నాడు.

“నువ్వడిగే విషయం ఏమిటో నాకు తెలుసు” అంది.

“చెప్పు చూద్దాం!”

“నీలాంటి అమ్మాయి కోరితే కోట్ల మంది క్యూ కడతారు. నన్నే ఎందుకిష్టపడుతున్నావ్ అవునా?”

విరాట్ నిజంగానే షాకయ్యాడు.

చాలా తెలివైన యువతి. అందం చదువు డబ్బు హోదా సొంత కంపెనీ అన్నీ ఉన్న చురుకైన అమ్మాయి. కాని... ఎదుటవాళ్ళ మనసును చదవటమంటే.. ఆలోచిస్తున్నాడు. "మరీ ఆశ్చర్యపోవద్దు. ఎదురుగా వున్నది ఫ్యాషన్ డిజైనర్ మాత్రమే కాదు. హ్యూమన్ సైకాలజీలో గోల్డ్ మెడలిస్ట్. అయినా మనమిలా పబ్లిక్ లో నిలబడి మాట్లాడటం బాగాలేదు. కమాన్. కేఫ్ లో కూచుని కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం...

'"నోనో..."'"నేను పిలిచింది బార్ కి కాదు. కాఫీకే..." నవ్వింది."విశాల ప్లీజ్. ఇప్పుడు కాదు. నా ఫ్రెండు చందూ వస్తే వెదుక్కొంటాడు. ఇంతకీ నీ మనసులో మాట చెప్పావు. దానికి ఆన్సర్ చెప్పలేదు" గుర్తు చేసాడు.

ఆమె నిజంగానే హ్యూమన్ సైకాలజీ చదివిన అమ్మాయి. ఇలాంటి వాళ్ళతో అబద్ధం చెప్పి తప్పించుకోవటం కష్టమే అన్పించింది."ఆన్సర్ వూహించలేదా?" అంది గడగడా విశాల.

లేదన్నట్లుగా సంజ్ఞ చేసాడు....

"నాకు నచ్చని వాటి గురించి ఆలోచించను. నచ్చితే వదులుకోను. నాకు నువ్వునచ్చావ్. ఐలవ్ యూ.. దట్సాల్. వెరీసింపుల్ బట్. నా ప్రశ్నకు బదులు చెప్పాలి. నా ప్రపోజల్ ఓకె నా కాదా?" చాలా సూటిగా క్లియర్ గా వుందామే ప్రశ్న.

విరాట్ కి గొంతులో ఏదో అడ్డం పడినట్టుంది. ఏం చెప్పాలి? ఓరే చందూ ఎక్కడ చచ్చావ్ రా. త్వరగా రారా బాబూ మనసు లోనే ఉడుక్కున్నాడు.

"ఓకే. ఇవాళ గాక పోతే రేపు చెప్పు నిన్ను ఇబ్బంది పెట్టను" అంది అతడి మౌనం చూసి.

"విశాలా... సారీ.. నీకో నిజం చెప్పాలి" అంటూ సీరియస్ గా చూసాడు.

" చెప్పు చెప్పు ఏమిటా నిజం?"

“నువ్వు చీరకడితే చాలా అందంగా ఉన్నావ్.”

ఫక్కున నవ్వింది విశాల.

“ఏయ్ విరాట్     నువ్వు చెప్పలనుకున్న విషయం ఇది కాదు. సంకోచం అక్కర్లేదు. చెప్పు” అంది నవ్వాపుకుంటూ.“ఓకే.. నిజం చెప్తానన్నాను గదూ. ఆ నిజం ఏమంటే నాకు పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. సో... నీకు నేను కరక్టుకాదు. మర్చిపో. నీకు నా కన్నా మంచి మొగుడు వస్తాడు. తగిన వాడ్ని చూసుకుని పెళ్ళి చేసుకో. ఆల్ ది బెస్ట్.” ఎంతో బాధపడిపోతున్నట్టు ముఖం దించుకొని చెప్పాడు.

ఆ మాటలకు ఆమె నిరాశ చెంది బాధపడి కన్నీళ్ళు పెట్టుకుంటుందనుకున్నాడు . అలాంటిదేమీ జరగలేదు సరికదా ఉబికి వస్తున్న నవ్వుని ఆపుకొంటూ కొంటెగా చూసింది.

“ఏమిటి?     నా మాటల మీద నమ్మకం లేదా?” అడిగాడు.

“నువ్వు చెప్పింది నిజం కాదు. ఎలా నమ్మమంటావ్?” అంటూ ఫక్కున నవ్వేసింది.



జరిగిన కథ : తనను అమితంగా ఆకర్షించిన అపరిచిత అమ్మాయి కోసం ఆతృతగా వెతుకుతున్న విరాట్ కి విశాల మళ్ళీ ఎదురు పడుతుంది.. చీరకట్టులో అందంగా కంపించిన విశాల ఐలవ్యూ చెబుతుంది. ఆమెను తప్పించుకోవడానికి తనకు పెళ్ళయిందని చెప్పినా ఆమె నమ్మదు.........................

........................ఇక చదవండి...

. మరోసారి షాకయ్యాడు విరాట్.

ఎదుటివారి మాటల్ని జల్లెడ పట్టి నిజాల్ని పక్కకు తీయటం అసాధారణ విద్య. బిజినెస్ వుమెన్ కదా ఈమెను నమ్మించటం అంత ఈజీ పని కాదు. ఓరి దేవుడా ఈ అమ్మాయిలకింత తెలితేటల్ని ఎందుకిచ్చావయ్యా బాబు. మగాళ్ళమే బ్రతకనక్కర్లేదా? మనసు లోనే ఉడుక్కున్నాడు.

"న్నే నిజమే చెప్పాను" అంటూ బొంకాడు.

"అది నిజం కాదని నాకు తెలుసు. అందుకని అబద్ధం చెప్పాల్సిన అవసరం లేదు. నువ్వు ఎవరయినా గానీ... ఈ విశాలని ది దట్సాల్. ముచ్చటగా మనం మూడోసారి కలుసు కు న్నప్పుడు మంచి వార్త చెప్తావని ఆశిస్తాను, వస్తాను" అంటూ మరోసారి ప్రేమగా విరాట్ చేయి అదిమి స్టేషన్లోకి వెళ్ళిపోయింది విశాల.

సరిగ్గా ఆమె వెళ్ళిన పదకొండో సెకన్లో హడావిడిగా వచ్చి కలుసుకున్నాడు చందూ. ఇపుడు ప్లాట్ఫాం మీదకెళ్తే రైల్లో కూడా విశాల బుర్ర తింటుదనిపించి పది నిమిషాలు వెయిట్ చేసి అప్పుడు తర్వాత చందూతో స్టేషన్లోకి అడుగుపెట్టాడు విరాట్.

వారం గిర్రున తిరిగిపోయింది.

కాని విరాట్ కోరుకున్న అజ్ఞాత సుందరి జాడ మాత్రం తెలిలేదు. అయినా నిరాశ చెందటం లేదు విరాట్. ఆమె మీద ఆశ వదులుకోలేదు. నమ్మకం వదులు కోలేదు. ఆలస్యమయ్యే కొద్ది అతనిలో పట్టుదల పెరుగుతోందే గాని తగ్గలేదు. ఈ లోపల సర్వీసుకిచ్చిన అతడి బైక్కూడా చేతికొచ్చింది. దాంతో ఆఫీసు టైమ్లో కూడా ఏదో వంకతో బయటికెళ్ళి ఆ అమ్మాయి కోసం గాలించి వస్తున్నాడు.

ఈ వారం రోజులూ ఎలాగో ఓపిక పట్టాడు చందూ. కాని ఉండేకొద్ది విరాట్ ఆమె కోసం పడుతున్న ఆరాటం ధ్యాస అతనికి నచ్చటం లేదు. సోమవారం సాయంత్రం ఇంటికి రాగానే ఇక ఉండబట్టలేక అడిగేసాడు.

" ఒరే విరాట్... ఇదేం బాగలేదురా. నాకస్సలు నచ్చటం లేదు" అన్నాడు విసుగ్గా.

"ఏం నచ్చలేదు నీకు? " కాజువల్గా అడిగాడు విరాట్.

“అదే కనిపించని ఆ పిల్లకోసం నువ్విలా పిచ్చిగా అదే పనిగా వెదుకులాడ్డం నచ్చలేదంటున్నాను. అదే మెరుపులా మెరిసి మాయమైన ఆ పిల్ల ఎక్కడుందో గాని తను మామూలుగానే ఉండి ఉంటుంది. కాని నువ్వేమిట్రా ఇలా తయారయ్యావ్. ఆఫీసు పని కూడా ఎగ్గొట్టి వూరు మీదపడి వెదుకులాడ్డాం, వదిలేయరా ” నచ్చజెప్పబోయాడు.

“వదులుకోలేను! ” విరాట్ గొంతులో పట్టుదల ధ్వనించింది.

“అంటే... ఆమె కనబడకపోయినా జీవితాంతం యిలా వెదుకులాడుతూనే ఉంటావా?” అన్నాడు కోపంగా.

“అక్కర్లేదు. ఆమె కన్పిస్తుంది. నాకా నమ్మకముంది”

“ఇదేం నమ్మకంరా బాబు గుడ్డి నమ్మకం. నామాట వినరా మర్చిపోరా. నిజంగా మీ ఇద్దరికి రాసిపెట్టి వుంటే ఏదో రోజు తానే నీ ముందుకొస్తుంది. అంతేగాని తన కోసం వెదకటం అంటే పిచ్చిపని”

“ఓకే... నా పిచ్చి నాకానందం లీవిట్”

“అంతేగాని వెదకటం ఆపనంటావ్. ఎలా? వారం రోజులు వెదికినా దొరకలేదు. ఎలా పట్టుకుంటావ్...? నీ ఫోన్నంబరిచ్చి రైల్వే స్టేషన్లో బ్యానర్లు వేలాడదీయాలి లేదా పోస్టర్లు అతికించాలి. ఖర్మరాబాబు. “ టెన్ టు నైన్” అన్నావ్. మనిషికి ఈ దిక్కుమాలిన ప్రేమలెందుకిచ్చాడో గాని దేవుడు దీని వల్ల సమయం వృధా. సొమ్ములు వృధా. ఆలోచనలు వృధా. ఇన్ని వృధాలతో బాటు మనశ్శాంతి లేకుండా పోతుంది. ఛ ఇక నీకు సాయం చేయలేను. నీ తంటాలు నువ్వుపడు” అంటూవిసుగ్గాకిచెన్లోకి వెళ్ళిపోయాడు చందూ.

చందూ కోప్పడితే పడ్డాడు గాని` అతడి మాటలు విరాట్ని ఆలోచింపచేసాయి. ఏదో పరిష్కారం గోచరించింది. అవును రైల్వేస్టేషన్లో బేనర్ కట్టినా పోస్టర్లు అతికించినా ఖచ్చితంగా ప్రయోజనం ఉంటుంది. ఏదో టైమ్లో స్టేషన్కొచ్చినప్పుడు ఆమె చూస్తుంది. చూసి ఫోన్ చేస్తుంది. ఈ ఆలోచనరాగానే క్షణం కూడా ఆలస్యం చేయలేదు విరాట్. మంచి ఐడియా ఇచ్చినందుకు థ్యాంక్స్ రా చందూ. అనుకుంటూ చందూకి

చెప్పకుండానే బయటకొచ్చి బైక్స్ టా  చేసుకొని వెళ్ళిపోయాడు.

కాస్సేపటికి బయటకొచ్చిన చందూకి విరాట్ కన్పించలేదు... అతడి బైక్ కన్పించలేదు.

అంతక్రితమే కాలనీలో వీధిలైట్లు వెలిగాయి. తూర్పు నుండి చెన్నై మీదకు చీకట్లు ముసురుకుంటున్నాయి.  ఈదురుగాలి జివ్వున వీస్తోంది. చందూకి ఏమీ అర్థంకాక జుత్తు పీక్కున్నాడు. ఈ టైమ్లో వీడు ఒంటరిగా ఎక్కడికెళ్ళినట్టు ఎందుకెళ్ళినట్టు అనుకుంటూ.

తెల్లవారే సరికి ఎగ్మోర్  రైల్వేస్టేషన్లో`

గోడలకు స్తంభాలకు అతికించిన అనేక పోష్టర్లు దర్శనమిచ్చాయి. స్టేషన్లో అడుగుపెట్టిన వాళ్ళు ఆ పోస్టర్స్ చూసి టక్కున ఆగిపోయి అందులో మేటర్ని ఆసక్తిగా చదువుతున్నారు. ఎవరోఆజ్ఞాత ప్రేమికుడిలా ఉన్నాడు అని చెప్పుకొని నవ్వుకోసాగారు.

బేనర్ మీద ఎలాంటి బొమ్మలూ లేవు.

ఇట్టే ఆకర్షించి శుభాన్నిచ్చే లేత పసుపు రంగుపేపర్  మీద కేవలం అక్షరాలు మాత్రమే ఉన్నాయి. అందులో...

హాయ్ బ్యూటీ....

నువ్వెవరో ఎక్కడుంటావో  వివరాలు తెలీదు.  అనుకోకుండా గతవారం మనిద్దరం ఎగ్మోర్  రైల్వేస్టేషన్నుండిటినగర్ స్టేషన్ వరకు రైల్లో కిటికీ పక్కన ఎదురు బొదురుగా కూచొని ప్రయాణం చేసాం. నిన్ను చూడగానే ఏదో తెలిని ఆకర్షణ.  నీ గురించి తెలుసుకోవాలనుకునే లోపలే నువ్వు టి నగర్ స్టేషన్లో దిగిపోయావ్. తిరిగి కన్పించలేదు. ఈ వారం రోజులుగా నీ కోసం గాలిస్తూనే వున్నాను.  ఇంకా నేను గర్తుకురాలేదా? ఒక్కసారి మన మధ్యన సాగిన సంభాషణ గమనించు గుర్తొస్తాను.

''హాయ్  మిస్.... అని పిలిచాను''

నువ్వు తలెత్తి చూసావ్

"టైం ప్లీజ్!" అడిగాను.

"మీ దగ్గర వాచీ లేదా?" అన్నావ్.

"లేదు" అన్నాను.

"మీ హేండ్ బేగ్ చాలా చాలా బాగుంది వెరీ నైస్" అన్నాను.

"బాగుంది గాబట్టే కొన్నాను" అన్నావ్.

పరిచయం పెంచుకోవాలని ఎక్కడకొన్నారు? అని అడిగే లోపే నువ్వు రైలు దిగి వెళ్ళిపోయావ్. సో నా మనసులో తీపి గాయం లేపి నీ దారిన నీవు వెళ్ళిపోటం బాగాలేదు. ఒక్కసారి ఫోన్ చేసి మాట్లాడవా? ప్లీజ్....

నా సెల్ నెంబరు....

పై విధంగా మేటర్ ప్రింటయి కిందసెల్ నంబర్ ఇవ్వబడిరది. అంతకు మించి వివరాలేవీ యివ్వలేదు.

ఈ విధంగా ఒక్క ఎగ్మోర్ స్టేషన్తో వదల్లేదు. టి నగర్ స్టేషన్లలో కూడా పోస్టర్లు తెల్లవారే సరికి సంచలనం సృష్టించాయి.

గత సాయంత్రం చందూతో చెప్పకుండా బైక్మీద వెళ్ళిన విరాట్ అర్ధరాత్రి దాటాక ఎప్పుడో ఇంటికి చేరుకున్నాడు. మధ్యలో

చందూ ఫోన్ చేసినా అందకుండా ఫోన్ స్విచ్చాఫ్లో ఉంచాడు. రాత్రికి రాత్రి పోస్టర్లు రెడీ చేయించి ఎవరెవరినో మేనేజ్ చేసి ఆయా స్టేషన్లలో అతికించే ఏర్పాట్లుచేసి తిరిగి వచ్చేసరికి ఆ టైమైంది. ఇందు కోసం చాలా ఖర్చు చేసాడు. కాని చందూకి తెలియదు. అతను అడిగితే ఏదో సర్దిచెప్పాడు. ఉదయంబైక్ మీద ఆఫీసుకు రావటం వలన రైల్వేస్టేషన్లలో పోస్టర్స్ గురించి చందూకి తెలీదు. పోస్టర్స్ మీద ఇచ్చింది తన పాత పర్సనల్ నంబర్ గాబట్టి అది తనదని ఎవరికీ తెలిసే అవకాశం లేదు.

ఏదో స్టేషన్లో తన సఖి ఆ బ్యానర్ చూస్తుందని విరాట్ నమ్మకం. చూసి తప్పకుండా ఫోన్ చేస్తుందని ఆశ. ఆఫీస్లో రోటీన్గా వర్క్ చేస్తున్నాడు గాని ధ్యాసంతా ఫోన్ మీదే వుంచాడు. అతడి అంచనా నిజం చేస్తూ సరిగ్గా ఉదయం పదకొండు గంటలకు ఫోన్ మోగింది.

విరాట్ మనసు ఆనందంలో గంతు లేసింది.

తన ప్లాన్ వర్కవుటయినందుకు మహదానందం చెందుతూ ఫోన్ లిఫ్ట్ చేసాడు.'హలో ! ఎవరండీ?'' అవతల నుంచి ఒక మృదు మధురమైన గొంతు పలకరించింది.

''మీరెవరండీ?'' అడిగాడు విరాట్.

''అయాం సంజనా . స్టేషన్లో పోస్టర్స్ అతికించింది మీరేనా?''

''యస్''

''ఆ రోజు రైల్లో మీ ఎదురుగా కూచుంది నేనే''

ఆ గొంతు వింటుంటే`

ఎందుకో ఈ అమ్మాయి కాదు అన్పించింది.

కిటికి పక్కన రైల్లో కూచున్నావా లెట్లో కూచున్నావా? అనగానే ఆమె రాంగ్ చెప్పింది. నువ్వుకాదు అని లైన్ కట్చేసాడు విరాట్.రాంగ్ కాల్స్ వస్తాయని విరాట్ వూహించ లేదు. ఆ అమ్మాయి మాత్రమే ఫోన్ చేస్తుందనుకున్నాడు. కాని అందుకు భిన్నంగా ఎవరెవరో అమ్మాయిలు నేనంటేనేనని పోటీపడడంతో లంచ్ టైమ్ లోపల కనీసం ఇరవైమంది ఫోన్ చేసుంటారు.

సాయంత్రం మూడుగంటలకి సడెన్గా చందూ విరాట్ చాంబర్లోకి ఎంటరయ్యాడు. ‘‘ఏరా. నే విన్నది నిజమేనా?’’ అనడిగాడు వస్తూనే.‘‘ఏంవిన్నావ్?’’ ఏమీ తెలినట్టు అడిగాడు విరాట్.

‘‘అదే.. రైల్వేస్టేషన్లో స్టర్ల సంగతి. లంచ్ టైమ్లో మన వాళ్ళు చెప్పుకొంటుంటే విన్నాను’’.

‘‘అలాగా... నాకేం తెలిదే’’.

‘‘ఒరే నాకొస్తున్న కోపానికి ఏం చేస్తానో నాకే తెలిదు. నాతో ఎందుకురా అబద్ధం చెప్తావ్? రాత్రి ఏదో వేళాకోళంగా అన్నానో లేదో... తెల్లారేసరికి చేసి చూపించేసావ్. అర్ధరాత్రి ఇంటికొచ్చినప్పుడే ఏదో ఘనకార్యం చేసుంటావని సందేహించాను. ఇదన్న మాట. ఇంకా బుకాయించక. నేను స్టేషన్కెళ్ళి వాటిని చూసొచ్చాను. అది నీ పనే’’

‘‘ఇదే ఇలా ఆవేశపడతావనే నీతో చెప్పను. రాత్రి మంచి ఐడియా ఇచ్చావ్కదా. ఫాలో అయిపోయాను. చూద్దాం రిజల్ట్ ఎలా వుంటుందో’’ అంటూ నవ్వాడు విరాట్.

‘‘ఇంతకీ... తను ఫోన్ చేసిందా?’’ అడిగాడు చందు.

‘‘తను తప్ప చాలామంది చేస్తున్నారు. వాళ్ళని చూస్తుంటే డబ్బున్న అబ్బాయిల కోసం అమ్మాయిలింతగా బరితెగిస్తున్నారేమిట్రా బాబూ అన్పిస్తుంది.’’

‘‘నీకలా అన్పించొచ్చు. కాని లోకం తీరే అది. ఇక ఆ అమ్మాయి కన్పించదు.’’

''అప్పుడే నిరాశ పడక్కర్లేదు. ఇవాళగాకపోతేరేపు తప్పకుండా తను ఫోన్ చేస్తుంది.''

''నీలా నమ్మకాలతో బతికేయటం నావల్ల కాదురాబాబూ. ఉన్నట్టుండి నీకేదో ప్రేమదయ్యం పట్టుకుంది. అందుకే యిలా వున్నావ్'' అని విసుక్కొంటూ తన సీట్లోకి వెళ్ళిపోయాడు చందు.

ఆ రోజు చాలా మంది యువతులు విరాట్ సెల్కి ఫోన్ చేసి నేనంటేనేనని పోటీపడ్డారు. కాని వాళ్ళల్లో అతడు కోరుకున్న అమ్మాయి మాత్రం లేదు. ఆ రోజు గడిచిపోయింది. ఆ ఆజ్ఞాతసుందరి సిటీలో ఎక్కడ ఉందో, పోస్టర్స్ చూసిందొ లేదో తెలిదుగాని ఆమె నుంచి మాత్రం అతను ఆశించనట్టు ఫోన్ కాల్ రాలేదు. మరునాడు కూడా షరామామూలే. పరిస్థితిలోమార్పులేదు. ఆరోజు సాయంత్రం...

అఫీసు వదలగానే విరాట్ చందూలు ఎప్పటిలాగే తమ బైక్మీద ఇంటికి బయలుదేరారు. తనది ఫారెన్ బైక్ గావటంతో సాధారణంగా తనే జాగ్రత్తగా నడుపుతాడు విరాట్. చందూ వెనకాల కూచుంటాడు. ఎప్పుడోగా నిబండినడిపే అవకాశం చందూకి ఇవ్వడు.

దారిలో హోటల్ బుహారిలో కాఫీ తాగి ఆ పక్కనే మార్కెట్లో ఇంటికి అవసరమైన కూరగాయలు అవి తీసుకొని బయలుదేరేప్పటికి చీకటి పడి వీధిలైట్లు వెలిగాయి. క్రమంగా విరాట్ బైక్ తమ గోస్వామి కాలనీని సమీపించింది. కాలనీ గేటు కనబడుతోంది. ఇంతలో...వీరి వెనకే స్కూటీ ఒకటి నిశ్శబ్దంగా విరాట్ బైక్ను ఓవర్ టేక్ చేసింది. అది ఎలక్ట్రానిక్ బైక్. ఆ బైక్మీ ద హెల్మెట్ ధరించిన యువతులిద్దరున్నారు. వాళ్ళు తమని ఓవర్టేక్ చేయటం చూసి నుదురు కొట్టుకున్నాడు చందూ.

''ఖర్మరాబాబు. అమ్మాయిలు కూడా మనల్ని ఓవర్టేక్ చేసి వెళ్ళిపోతున్నారు. అదీ బేటరీ స్కూటీ మీద. ఇది నీ ఫారెన్ బైక్కే అవమానం. వాళ్ళకన్నా ముందే మనం గేటుదాటి కాలనీలోకి వెళ్ళిపోవాలి. పోనీ'' అనరిచాడు.

అతనిమాటలకివిరాట్ ఏమీరెచ్చిపోలేదు. ఆవేశపడలేదు. బైక్ వేగంలో మార్పులేదు. చందు మరోసారి ఉడుక్కున్నాడు.

''ఈ మాత్రం స్పీడ్కి ఫారెన్ బైక్ కావాలా..?'' అనడిగాడు.

“చేతిలో ఫారెన్  బైక్  ఉందని ఇష్టానికి నడపటం అవసరమంటావా?  వాళ్ళకేదో అర్జంటు పనుండి వేగంగా వెళ్తున్నారు. ఏ పని లేకుండానే మనం ఎందుకు వేగంగా వెళ్ళాలి? ఎప్పుడు ఎంత అవసరమో అంతవే గాన్నే ఉపయోగించాలి. ఇంటిదగ్గర కాచ్చాక కూడా అనవసరంగా కుప్పి గంతులేయక.  కూచో” అంటూ బదులిచ్చాడు.

విరాట్ బైక్ వేగంపెంచి ఆ స్కూటీని ఓవర్ టేక్ చేస్తే పరిస్థితి ఎలా ఉండేదో తెలీదుగాని గేటు ఇంకో రెండువందల గజాల దూరంలో ఉందనగానే అమ్మాయిల స్కూటీగేటు దాటి కుడిపక్కకు తిరిగి మూడో వీధిలోకి దూసుకుపోయింది.

ఆ వెనకే విరాట్  బైక్  గేటుదాటి ఎడం పక్కకు తిరిగి మొదటివీధిలో ప్రవేశించి మూడోయింటి ముందాగింది.  చందు బైక్ దిగి వెళ్ళి తాళం తీసి గేటు తెరవగానే బైక్ లోనకు పోనిచ్చాడు విరాట్.ఒక్కోసారి విధిచేసే విచిత్రాలు భలే తమాషాగాను అంతుబట్టకుండాను ఉంటాయి.  మతిమరుపు వల్ల కూడా ఇలాంటి తమాషాలు అరుదుగా జరుగుతుంటాయి. పెన్ను జేబులోనే ఉంటుంది. కాని పెన్ను కోసం గదంతా గాలిస్తాం.  కళ్ళజోడు ముందరే ఉంటుంది.  కాని కళ్ళజోడు ఎక్కడ పెట్టామని వెదుకులాడతాం.  ఆఫీసు ఫైలు ఎదురుగా టేబుల్ మీదే వుంటుంది.  కాని ఫైలు ఏమైందాని గదంతా తిరగబెట్టేస్తాం. ఇలాంటివన్నీ మతిమరుపు వల్ల జరిగే తమాషాలు.

మనక్కావలసిన మనిషి కోసం దేశమంతా వెదుకుతుంటాం.  తీరాచూస్తే వాడు మన ఇంటి సమీపంలోనే ఉంటాడు.  ఒక్కోసారి పోయిన వస్తువు ఇక దొరకదులే అనుకుంటాం. విచిత్రంగా అది దొరుకుతుంది. ఇక్కడ విరాట్  విషయంలో కూడా అలాంటి అనూహ్య సంఘటనే చోటుచేసుకుంది.

నిజానికి ఆ పూట అతడి బైక్ను ఓవర్  టేక్  చేసి స్కూటీ మీద కాలనీలోకి దూసుకెళ్ళిన యువతులిద్దరూ ఎవరో కాదు. ఎవరి కోసమైతే మొన్న రాత్రికి రాత్రి రైల్వేస్టేషన్లలో తన ఆజ్ఞాతసుందరి కోసం బ్యానర్లు పోస్టర్లు ఏర్పాటుచేసాడో ఆ ఆజ్ఞాతసుందరి ఆమె స్నేహితురాలు ప్రయాణిస్తున్న బ్యాటరీ స్కూటీ గోస్వామికాలనీలో ని మూడో వీధిలో చిట్టచివరదైన నూట అరవైయ్యో నంబరు విల్లా గేటు ముందు ఆగింది.



జరిగిన కథ :

ప్రేయసి కోసం విరాట్ పడే ఆరాటం చూసి కోప్పడతాడు చందూ..అతడు క్యాజువల్ గా అన్న మాటని సీరియస్ గా తీసుకుని వెంటనే తమ మధ్య సంభాషణ గుర్తు చేస్తూ రైల్వే స్టేషన్ అంతా పోస్టర్స్ అతికింప జేస్తాడు. ఇద్దరమ్మాయిలు తమ బైక్ ని దాటి వెళ్ళిపోతారు. వాళ్ళిద్దరిలో ఒకామె తాను వెతుకుతున్న అమ్మాయేనని పోల్చుకోలేక పోతాడు విరాట్..... ఆ తర్వాత......................................

పాపం విరాట్...    తను కోరుకుంటున్న యువతి...    తమ కాలనీలోనే ఉందన్న నిజం తెలిస్తే...    ఏమైపోతాడో...?

‘‘అబ్బ తలమీద ఈ కుండల్ని ఎవడు కనిపెట్టాడో గాని పెట్టుకోలేక చచ్చిపోతున్నామే బాబూ. తలంతా ఉక్కపోత జుత్తుకూడా రాలిపోతోంది.

కనిపెట్టిన వాడి నెత్తిమీద వందకుండలు పగలగొట్టి సత్కరించాలి’’ విసుగుతో.

స్కూటీ దిగుతూ కామెంట్ చేసింది... ఆమె కామెంట్ చేసింది హెల్మెట్ల గురించి.

‘‘అనవసరంగా తిట్టకే దీక్ష. మన సేఫ్టీకోసమే గదా హెల్మెట్లను కనిపెట్టింది. ముందువెళ్ళి గేటు తియ్యి’’ అంది స్కూటీ నడిపిన యువతి.

దీక్ష అనే ఆ రెండో యువతి తలమీద హెల్మెట్ తీసి తలపై నుంచి పెద్ద బరువు దిగిపోయినట్టు ఫీలవుతూ వెళ్ళి గేటు తీసింది. మొదటి యువతి స్కూటీని లోనకుపోనిచ్చి పోర్టికోలో లాక్చేసి తనూ హెల్మెట్ తీసేసింది. ఈ లోపల దీక్ష గేటుకు తాళం వేసి వచ్చింది.

‘‘నువ్వేన్నయినాచెప్పవే సహస్రా. ప్రపంచంలో అత్యంత చిరాకు కలిగించే విషయం హెల్మెట్ పెట్టుకోవడమే’’ అంటూ ఇంటి తాళం తీసింది దీక్ష.

‘‘నీ చిరాకులు పరాకులు చట్టాన్ని మార్చలేవమ్మా మన కోసమే చట్టాలు చేయబడుతున్నాయి గాబట్టి వాటిని మనం గౌరవించాలి. అనుసరించాలి’’ అంటూ లోనకు దారి తీసింది సహస్ర. ఇంట్లో లైట్లన్ని చకచకా ఆనయ్యాయి.

అప్పటికి బయట ఆకాశం మేఘావృతమైంది, వర్షం వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి. పావుగంటలోనే యువతులిద్దరూ బాత్రూం నుంచి ప్రెషప్పయి నైటీల్లోకి మారిపోయివచ్చారు. టీ.వి ఆన్ చేసింది సహస్ర.

రాగానే ముందు కుక్కర్లో రైస్ పడేసింది దీక్ష. అన్నం రేడీ కాగానే వార్తలు చూస్తూ ఉదయం కూరలు చారుతో భోంచేసేసారు.

ఇంతలో బయట ఉరుములు మెరుపులు  ఏమీ లేకుండానే వర్షం మొదలైంది.

"ఏయ్ సహస్రా నీకో విషయం చెప్పటం మర్చిపోయానే" అంటూ టి.వి వార్తలు చూస్తున్న సహస్ర పక్కకొచ్చి నుంచుంది దీక్ష.

"ఏ విషయం?  ఈ పూట వానొస్తుందనా?"  అంది నవ్వుతూ సహస్ర.

"కాదు వరుడు నీ కోసం వెదుకులాడుతున్న విషయం" అని ఫక్కున నవ్వింది దీక్ష. ఆమె నవ్వు బయట వాన శబ్దంలో కలిసిపోయింది. సహస్ర ముఖంలో ఒక్కసారిగా అనేక ప్రశ్నలు తొంగిచూసాయి.

"ఆర్ యు జోకింగ్?" అంది సీరియస్ గా.

"జోకింగ్ కాదు తల్లీ,  విషయం తెలిస్తే నువ్వే షాకవుతావ్.  ఈ రోజు ఉదయం పని మీదటి.  నగర్  వెళ్ళాను గదా, అక్కడ రైల్వేస్టేషన్ లో ఒక ఆజ్ఞాతప్రేమికుడి అభ్యర్థనతో కూడిన పోస్టర్లు చూసాను. అవి చూసాక సందేహించి ఎగ్మోర్ వరకు వెళ్ళి గమనించాను. ఎగ్మోర్ నుండి టినగర్ వరకు అయిదు స్టేషన్లలోను అదే పబ్లిసిటీ పాపం చాలా ఖర్చుపెట్టి ఉంటాడు."

"కావచ్చు. దానికి నాకూ ఏమిటి సంబధం?"

"సంబధం ఉంది. సెల్ ఫోన్ తో ఫోటోలు తీసి తెచ్చాను.  అవి చూస్తే నీకే అర్ధమవుతుంది.  ఇప్పుడే వస్తానుండు"  అంటూ దీక్ష ఫోన్ తీసుకొని తన బెడ్రూమ్ లోకి వెళ్ళింది. ఫోన్ లో ఫోటోల్ని ప్రింటవుట్లు తీసి తెచ్చి సహస్ర ముందు పడేసింది.

"ఒక్కసారి అవేమిటో చూడగానే నీకే అర్ధమవుతుంది" అంది.

యధాలాపంగా ఆ ఫోటోని వాటి లోని పోస్టర్ల మీది మేటర్ని చదివింది. మొదట ఏమీ అర్ధం కాలేదు."ఏమిటే..  ఇదంతా నాకోసం చేసాడనా నీ ఉద్దేశం?  నాకేమీ అర్ధంగావటం లేదు" అంది.

“అర్థంగావటం లేదా..? ఓసే మొద్దు. ప్రొఫెషనల్ జర్నలిస్టువి. నీకు అర్థంగాక పోవటం ఏమిటి? ఓ సారి గుర్తు తెచ్చుకో”

“నాకేం గుర్తు రావటం లేదు గాని వాడెవడో ఇదంతా నా కోసమే చేసాడనెందు కనుకోవాలి. నీ కోసం అనుకోవచ్చుగా?” అందినవ్వి.“ఎలా అనుకోమంటావే తల్లీ. ఆ సంభాషణ సాగింది మీమధ్య గాని మామధ్య కాదు గదా. వారం క్రితం మనం ఎగ్మోర్ నుంచి టినగర్ వరకూ ట్రైన్ లో వచ్చాం గదా?”

“అవును. అయినా నా సమస్యలు నాకున్నాయి. ఇవన్నీ గుర్తుంచుకునే తీరికెక్కడిది? కాస్త వివరంగా చెప్పు”

“జర్నలిస్టువై ఉండి ఇంత మతిమరు పేమిటే? వారం క్రితం నీ జాబ్ కన్ఫర్మ్ చేయించుకోడానికి మనం మా షాపింగ్ మాల్ ఓనర్ గార్ని కలవడానికిఎగ్మోర్లోవాళ్ళింటికెళ్ళిజాయినింగ్ లెటర్ మీదసంతకంచేయించి తెచ్చుకున్నాం. గుర్తుందా..? తిరిగి వచ్చేప్పుడు ఎగ్మోర్ స్టేషన్లో కిటికీ పక్కన కూచుంటే మనకి ఎదురుగా కిటికి పక్కన ఒక అందమైన యువకుడు, అతని ఫ్రెండు కూచున్నారు. నీతో మాటాడుతూనే నువ్వు అలనాడు గవాక్షం చెంతనుండి సీతాదేవి నీలమేఘశ్యాముడు ఆ రామచంద్రుని ఓరకంట చూసినట్టు అప్పుడప్పుడు అతడ్ని చూస్తూనే వున్నావు, అతనూనిన్నుచూసాడు. నీతోమాటకలపాలనిటైంఅడిగాడు. నీహేండ్ బ్యాగ్ బాగుందన్నాడు. ఇంతలో మనం టి.నగర్ స్టేషన్లో దిగిపోయాం. పార్కింగ్ లోంచి స్కూటీ తీసుకొని పాండీబజార్లో సరుకులు కొనుక్కొని ఇంటికొచ్చాం....!”

“ఆగాగు...” అంది ఉన్నట్టుండి సహస్ర.

ఇప్పుడామెకు అంతా గుర్తొచ్చింది.

“అవును కదూ... నిజమే సుమా.. అలాగని నన్ను సీతాదేవితో వాడ్ని రాముడితోనూ పోల్చక. వయసులో ఉన్నాం. కుర్రాడు బాగున్నాడని చూసిన మాట నిజమే. అంతమాత్రం చేత యిలాంటి పిచ్చి పనిచేయటమేమిటి? ఏకంగా పోస్టర్లే వేయిస్తాడా..? స్టుపిడ్ ఇప్పుడే వాడిపని చెప్తాను” అంటూ ఫోన్ అందుకోబోయింది కోపంతో సహస్ర.

వెంటనే ఫోన్ లాక్కుంది దీక్ష.

‘‘వాడు చేసింది పిచ్చి పని కాదు. ఇప్పుడు నువ్వు చేయబోయేది పిచ్చిపని. ఇప్పుడు నీ ఫోన్లోంచి చేసినా నా ఫోన్లోంచి ఫోన్ చేసినా నంబరు అతని ఫోన్లో పడవుతుంది. తర్వాత తెగ ఫోన్లు చేసి విసిగిస్తాడు.’’ అంటూ హెచ్చరించింది.

దీక్ష మాటల్లో వాస్తవముంది.

ముక్కు ముఖం తెలిని వ్యక్తికి ఫోన్ చేసి తర్వాత ఇబ్బంది పడే కన్నా అస్సలు చేయకుండా ఉండటమే మంచిదనిపించింది సహస్రకి.బయట వర్షం పెరిగిందే గాని తగ్గలేదు. రాత్రంతా ఇలాగే ఉండేలా వుంది. చలి చలి వాతావరణం హాయిగా ఉంది. గాలి లేదు ఉరుముల్లేవు మెరుపుల్లేవు. కుండపోతగా వాన... ఒక్కోసారింతే.. నిశ్శబ్ధంగా అలుముకున్న మబ్బులు తెల్లార్లు కురిసిపోతాయి. తన లైఫ్లో కష్టాల్లాగే.. కోరితెచ్చుకున్న కష్టాలు.. అజ్ఞాతవాసం... ఆలోచిస్తోంది సహస్ర. ఆమె మౌనాన్ని మరోల అర్థం చేసుకుంది దీక్ష.

‘‘ఏమిటి అలా ఆలోచిస్తున్నావ్? నీకు నచ్చ లేదంటే వదిలేయ్. అతని సంగతి నేను చూసుకుంటాను. నాకు మాత్రం తెగ నచ్చాడు’’ అంది కొంటెగా.

‘‘అంతగా నచ్చితే ఎవరు కాదన్నారు. చూసుకో’’ అంది సహస్ర.

‘‘వాడి ఫోటో చూస్తే చాలా ఆశ్చర్యపోతావ్ తెలుసా?’’ హీ మేన్ లా ఉన్నాడు’’ అంటూ లేచి వెళ్ళి వాన జల్లులు లోనకు రాకుండా కిటికీ రెక్కలు మూసి వచ్చింది దీక్ష.

సహస్ర ఆసక్తిగా చూసింది.

‘‘ఏమిటే తెగ జోకులేస్తున్నావ్ అతని ఫోటో నీ దగ్గర ఎందుకుంది?’’ అంది.

‘‘ఎందుకేమిటే ఫోటో తీస్తే ఉంటుంది. చూపులు కలిసిన శుభవేళాని నువ్వలా క్రీగంట చూస్తుంటే ముచ్చటేసి ఎవరూ చూడకుండానా

ఫోన్ తో రెండు క్లిక్లు కొట్టాను. చూస్తావా?''

వచ్చి కూచుని తన ఫోన్ అందుకుంది దీక్ష.

ఇరవైసెకన్ల తర్వాత ఫోన్లో ఫోటోని చూపించింది. ఒక ఫోటోలో అతడి ముఖం సైడ్ యాంగిల్లో ఉంది. రెండో ఫోటోలో స్ట్రెయిట్ గా చాలా బాగా వచ్చింది. నిజంగా అతను చూడ్డానికి చాలా చాలా బాగున్నాడు.

సహస్ర కళ్ళ ముందు ఆ రోజు రైలు ప్రయాణంలో జరిగిన సంఘటన ఇప్పుడంతా గుర్తుకొచ్చింది.

తను అంతగా నచ్చిందా?

ఎవరితను? ఎక్కడుంటాడు?

పూరేది పేరేమిటి?

అతడి ఫోటో చూస్తూ ఆలోచిస్తోంది.

''ఏయ్ దీక్ష! రాను రాను నువ్వు మరీ కంత్రీవై పోతున్నావేమిటి? ఎవరికీ చెప్పకుండా అతడి ఫోటో తీసింది గాక ఇన్ని రోజులూ దాచిపెట్టుంచావంటే... నిన్నేం చేయాలే?'' అంది నవ్వుతూ.

''ఏం చేయక్కర్లేదు గాని ఫోటో అయితే చూసావ్ మరి పేరు అడగవా? పాపం నీకోసం పరితపిస్తూ బ్యానర్లు కట్టాడుగా'' అంది దీక్ష. ఆ మాటలకు సహస్ర ఆశ్చర్యం మరో మెట్టు పైకిపోయింది.

''పేరు?... ఇతని పేరు కూడా నీకు తెలుసా?'' అంది నమ్మలేనట్టు.

‘‘తెలిదుకాని వాడి ఫ్రెండు వాడ్ని అలాగే పిలిచాడు కాబట్టి గుర్తుపెట్టుకున్నాను. నీ పేరు లాగే అతడిదీ వెరైటీ పేరు. ఏమిటో తెలుసా?... వి... రా.. ట్...’’ అంటూ సాగదీసి పకపక నవ్వింది దీక్ష. సహస్ర కూడా నవ్వకుండా ఉండలేక పోయింది. నిజంగానే అతడి పేరు వెరైటీగా అర్థవంతంగా చాలా బాగుంది.

సహస్ర దీక్ష ఇద్దరిదీ స్వస్థలం తమిళనాడు లోని మధురై. మధురైని తెలుగు నాయక రాజులు పాలించిన కాలం నుంచి మధురై, తంజావురు కోయంబత్తూరు లలో పూర్వం ఎప్పుడో సెటిల్ అయిన అనేక ఆంధ్రా కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో తమిళంతో బాటు తెలుగుకీ అంతటి ప్రాధాన్యత ఉంది. తంజావురు లోని సరస్వతీ గ్రంథాలయంలో అపూర్వమైన అనేక పురాతన తాళపత్ర గ్రంథాలు ఉన్నాయి. అమూల్యమైన ఆ తెలుగు తాళపత్ర గ్రంథాలను ఆంధ్రాకు తేవాలని అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి యన్.టి. రామారావు గారు ఎంతో ప్రయత్నించారు. ఆయన కృషి ఒక కొలిక్కి వచ్చేలోన ఆయన పదవి నుంచి దిగిపోవటంతో తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులెవరూ ఇక వాటి గురించి పట్టించుకోవటం మానేసారు

. తమిళనాడులోని ఆయా ప్రాంతాల్లో కోటీశ్వరులయిన ఆంధ్రా కుటుంబాలు అనేకం ఉన్నాయి. లేదంటే ప్రాంతీయంగా వారి భాష కొద్దిగా యాసతో కూడి కాస్త భిన్నంగా విన్పిస్తుంది. అది స్థానికుల వరకే. బయటి ప్రాంతాలకు వచ్చిపోయేవాళ్ళు మాత్రం మనలాగే తెలుగు చక్కగా చదువుతారు. మాట్లాడుతారు.

అటువంటి మధురై పట్టణంలో మహాదేవ నాయకర్ అనే బిజినెస్ మేన్ ఉన్నాడు. మధురైలో సగం లిక్కర్ షాపులు ఆయనవే. మధురై పరిసర ప్రాంతాల్లోను ఆయనకు ఇతరత్రా చాలా వ్యాపారాలున్నాయి. కోటీశ్వరుడు. ఆయన భార్య పేరు మూగాంబికై.

మహాదేవనాయకర్ మూగాంబికైదంపతులకుఏకైకసంతానంసహస్ర. ఈ అమ్మాయి పుట్టాక బాగా కలసి వచ్చిందని చిన్నప్పట్నుంచి సహస్రను ఎంతో గారాబంగా పెంచారు. సహస్ర స్థానిక కాలేజ లోనే డిగ్రీ చేసింది. ఇంగ్లీషు లిటరేచర్ లో ఫస్ట్ క్లాస్ లో పాసయింది. తర్వాత తండ్రి కోరిక మీద అమెరికా వెళ్ళి బిజినెస్ మేనేజ్ మెంట్ కోర్స్ చేసి వచ్చింది. తర్వాత తన ఇంట్రస్టు కొద్ది ఢిల్లీ యూనివర్శిటీ నుంచి జర్నలిజంలో గోల్డ్ మెడల్ సాధించింది.

నిజానికి సహస్రకి బిజినెస్ కన్నా జర్నలిజం మీదే మక్కువ ఎక్కువ. స్థానిక రిపోర్టర్ గా పత్రికలకు వార్తలు వార్తా కథనాలు చక్కటి వ్యాసాలు విశ్లేషణలు పంపించేది. ఆ విధంగా ‘సహస్ర’గా పాఠకులకు చిరపరిచితురాలే. తెలుగు తమిళం హిందీ ఇంగ్లీషు భాషల్లో ప్రవీణురాలు సహస్ర.దీక్ష విషయం చూస్తే ఆమోదో విచిత్రమైన గాధ. ఆమె కూడా మధురై లోనే ఒక ఉన్నత కుటుంబానికి చెందిన యువతి. అయిదుగురు అన్నల తర్వాత ఆఖరున పుట్టిన ముద్దులచెల్లెలు. సహస్రదీక్షలు ఒకే కాలేజిలో చదువుకున్నారు. వారి స్నేహం బలపడిరది. కాలేజ వదిలి నా కూడా ఎప్పుడూ ఫోన్లో టచ్ లోనే ఉండేవారు. దీక్ష కూడా బిజినెస్ మేనేజ్ మెంట్

కోర్సు చదువుతుండగా వూహించని పరిస్థితుల్లో మధ్యలోనే చదువు ఆపేయాల్సి వచ్చింది.

తల్లిదండ్రులు పోవటంతో, అన్నలు అయిదుగురూ పిత్రార్జితం ముప్పై కోట్ల ఆస్థిని తామే కాజేసి దీక్షకు పాతిక లక్షలు కట్నం ఇచ్చి పెళ్ళి చేసి పంపించేయాలని ప్లాన్   చేసారు. అన్నల ద్రోహబుద్ధి తెలిగానే దీక్ష కోర్టుకెళ్ళి సంవత్సరం పాటు పోరాడి గెలిచి అన్నలతో బాటు సమంగా తన వాటా కింద అయిదుకోట్లు పొందింది. తర్వాత ఇక అక్కడ ఉండటం ఇష్టం లేక చెన్నై వచ్చేసి ఇప్పుడుంటున్న నూట అరవయ్యో నంబరు ఇంట్లో అద్దెకుఉంటూ కాలక్షేపానికి ఒక పేద్ద షాపింగ్ మాల్లో సేల్స్ గర్ల్ గా చేరింది.

మొట్టమొదట గోస్వామి బిల్డర్స్ అండ్ కన్స్ ట్రక్షన్స్ వారినుంచి ఆయిల్లు కొన్న వ్యక్తి స్టేట్ బ్యాంక్ మేనేజర్. అతనికి నాగపూర్ ట్రాన్స్ ఫరవటంతో ఇల్లు దీక్షకు అద్దెకిచ్చి ఫామిలీతో నాగపూర్ వెళ్ళిపోయాడు. తర్వాత ఏదో కారణాల వల్ల ఆ యింటిని అమ్మకానికి పెట్టడంతో దీక్ష సందేహించకుండా తొంభైలక్షలకు ఆ యింటిని కొనుక్కొంది.   తను మధురై వదిలాక తన అన్నలకు కూడా చెప్పలేదు. కాని సహస్రకు అంతా తెలుసు.   ప్రతి రోజూ రాత్రి పడుకునే ముందు కాల్ చేసి ఒకరి కష్టసుఖాలు ఒకరికి చెప్పుకోవటం అలవాటు.

"ఇల్లు కొనుక్కున్నావ్ సరే దీక్ష, మరి ఇల్లాలివెప్పుడవుతావే" అంటూ సహస్ర వేళాకోళం చేస్తే నవ్వేస్తూ " దాని దేముందే నువ్వు నా దగ్గరకొచ్చేయవే... ఆటోమెటిక్ గా ఇల్లాలినైపోతాను" అనేది.

"ఓసినీ.. నువ్వు నాకు మొగుడి పోస్టిచ్చినా నిన్ను భరించే శక్తి నాకు లేదులేవే కంత్రీ"   అని సహస్ర కొంటరివ్వగానే ఇద్దరూ తెగ నవ్వుకునేవారు.

ఇలా ఉండగా ఆరువారాల క్రితం`

ఏం జరిగిందో ఏమిటో తెలీదు.

సడెన్ గా రెండు సూట్ కేస్ లతో రాత్రి పది గంటలకి ఆటోలో ఇల్లువెదుక్కుంటూ దీక్ష వద్ద కొచ్చేసింది సహస్ర.   ఎందుకొచ్చావని దీక్ష అడగలేదు. తను చెన్నై వచ్చిన ఇంత కాలం తర్వాత తన వద్ద కొచ్చిన మొట్టమొదటి మనిషి సహస్ర. ఆమెను చూడగానే అందర్నీ చూసినంత ఆనందం. తన ఒంటరి జీవితంలోకి ఆమె రాక బలాన్ని ధైర్యాన్ని ఇచ్చింది.

దీక్ష అడక్కపోయినా సహస్ర క్లుప్తంగా తన రాకకి రెండు కారణాలు చెప్పింది. ఒకటి ఇంటి పరిస్థితి బాగాలేదు. ఇష్టం లేని పెళ్ళి చేయాలని చూస్తున్నారు. రెండో కారణం వృత్తి రీత్యా సమస్యలున్నాయి. కొంత కాలం నేనిక్కడని వద్ద ఉన్న సంగంతి ఎవరికీ తెలియకూడదు. ఇంతే. ఇంతకు మించి ఆమె చెప్పనూలేదు దీక్ష అడగనూలేదు.

ఎలాగో తను బిజినెస్ మేనేజ్ మెంట్ చేసింది గనక ఖాళీగా ఉండటం ఇష్టం లేక దీక్షతో బాటు ఆమె పనిచేస్తున్న షాపింగ్ మాల్లో జాయినయింది. నెల తిరిగే సరికి షాపింగ్ మాల్ సూపర్ వైజర్ సహస్ర టాలెంటు గుర్తించి ఆమె ఏం చదివిందో తెలుసుకుని తమ ఓనర్ని రెకమెండ్ చేయటంతో వూహించని విధంగా సేల్స్, ఎగ్సిక్యూటివ్ గా సహస్రకు ప్రమోషన్ లభించింది. ఈ సందర్భంగానే దీక్ష వెంట తను ఎగ్మోర్ వెళ్ళి వస్తుండగా రైల్లో ఈ విరాట్      కన్పించాడు.

‘‘ఏయ్ సహస్ర!‘‘ అంటూ దీక్ష పలకరింపుతో ఆలోచనల నుంచి బయటపడిరది. సహస్ర.

‘‘వద్దనుకున్న వాడి గురించి మరీ ఎక్కువగా ఆలోచించకూడదమ్మా.      పాపం నీ మీద మనసు పారేసుకున్న ఈ సుకుమారుడికి దిష్టి తగులుతుంది’’ అంటూ ఫోన్ లాక్కుంది దీక్ష.

‘‘నేనేం వాడి గురించి ఆలోచించటంలేదులే, ట్రై చేస్తానన్నావ్ గా ఛాయిస్ నీదే’’ అంది నవ్వుతూ సహస్ర.

‘‘నీ ఉద్దేశం నువ్వు వదులుకున్న వాడ్ని నేను కట్టుకుంటాననుకున్నావా?      నెవ్వర్. పాపం నీ కోసం ప్రయత్నిస్తున్నాడుగా. చూద్దాం నిన్ను ఏ మాత్రం పట్టుకుంటాడో, పడగొడతాడో’’ అంది టీజింగ్ గా దీక్ష.

నిజానికి విరాట్      తమ కాలనీలోనే ఉన్న సంగతి సహస్ర దీక్షలకు తెలిదు. తెలిసే అవకాశం కూడా లేదు ఎందుకంటే....

జరిగిన కథ

ఇటు విరాట్, అటు సహస్ర, దీక్షలు పెద్ద పారిశ్రామికవేత్తల కుటుంబానికి చెందినవారే. కొన్ని కారణాల వలన గోస్వామి కాలనీలో ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటూంటారు. రైళ్ళో కలిసినప్పుడు దీక్ష తీసిన విరాట్ ఫోటోలను సహస్రకి చూపిస్తుంది.....

.....................................................

సహస్ర దీక్షలు పనిచేస్తున్న షాపింగ్ మాల్ ఉదయం తొమ్మిది గంటలకు తెరుస్తారు. సరిగ్గా అప్పటికి స్టాఫ్ రెడీగా వుండాలి కాబట్టి ఉదయం ఇంట్లో టిఫిను మాత్రం చేసుకుని టీ తాగి హడావుడిగా ఎనిమిదిన్నర గంటలకే బయలుదేరి వెళ్ళిపోతారు.

షాపింగ్ మాల్లో వెనక పక్కవాళ్ళదే చిన్న కాంటీన్ ఉంది. మధ్యాహ్నం లంచ్ అక్కడే. లైట్ టిఫిను టీ కాఫీలు అందుబాటులో ఉంటాయి. షాపింగ్ మాల్లో సుమారుగా ఏభై మందికి పైగా మూడు అంతస్థుల్లో పనిచేస్తున్నారు. రాత్రి పది గంటలకు మూసేస్తారు. లేడీస్ ని ఒక గంట ముందుగా అంటే రాత్రి తొమ్మిది గంటలకు ముందుగా పంపించేస్తారు. కాబట్టి ఉదయం వెళ్తే తిరిగి ఇంటికి చేరేది తొమ్మిది గంటల తర్వాతే.

ఇక విరాట్ చందూలు పనిచేస్తున్న కంపెనీ ఉదయం పది గంటలకు ఆఫీసు తెరుస్తారు. సాయంత్రం ఆరు గంటలకు క్లోజ్ చేస్తారు. అయిదు గంటల తర్వాత ఆ రోజు పని ముగించుకుని స్టాఫ్ వెళ్ళిపోవటం ఆరుంబావు అవుతుంది. ఏడు గంటల లోపే విరాట్ చందూలు ఇంటి కొచ్చేస్తారు. ఆదివారం ఆఫీసుకు శెలవు రోజు. షాపింగ్ మాల్ కి మంగళవారం శలవు రోజు. ఇలా టైమింగ్స్ వేరు వేరు కావటం వలన కాలనీలో ఒకరికొకరు ఎదురుపడే అవకాశం గాని పక్కింట్లో ఎవరుంటున్నారో తెలుసుకునే అవసరం గాని వాళ్ళకి లేదు. అందుకే ఒకే కాలనీ లో ఉంటున్నా ఒకరికొకరు తెలిసిని పరిస్థితి.

సహస్ర దీక్షలు ఒకరి మీద ఒకరు జోకులేసి నవ్వుకుంటూ చాల సేపు మెలుకువగానే ఉన్నారు. బయట వర్షం తగ్గే సూచనలు కన్పించటం లేదు. చాలా రాత్రవటంతో ఎవరి గదిలో వాళ్ళు నిద్రకుపక్రమించారు.

ఇక్కడ ఈ ఇంట్లో లైట్లు ఆఫయినా

అక్కడ విరాట్ ఇంట్లో ఇంకా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. కిచెన్ లో పనిచేస్తూనే వికృతంగా ఏదో పాడేస్తున్నాడు చందూ.తొంగి తొంగి దొంగ చూపులు చూడ్డం బట్టి తనను ఉడికించడానికే పాడుతున్నాడని విరాట్ కి అర్ధమైంది. అర్ధమైనా ఆవేశపడకుండా ఓపిగ్గా టీవి లో ఇంగ్లీష్ సినిమా చూస్తూ కూర్చున్నాడు విరాట్.

అంత క్రితమే బయట వర్షం మొదలైంది. చలి చలి వాతావరణం హాయిగా ఉంది. లోపట్నుంచి జీడిపప్పు దోరగా వేపుతున్న కమ్మని వాసనొస్తోంది. చందూ ఏం చేయబోతున్నాడో అర్థం కాలేదు. ఇంతలో మరో పాట అందుకున్నాడు చందూ.

''రావా... కనరావా... కరుణ మానినావా చెలియా... ఫోను చెయ్యలేవా... రావా...!

తనను వెక్కిరిస్తూ అలా కలగాపులంగా పాట మార్చేసి వికృతంగా పాడుతున్న చందూను చూస్తుంటే విరాట్ కి నవ్వు కోపం కూడా వస్తున్నాయి. ఇక వదిలేస్తే మరీ రెచ్చిపోతాడని ''అరేయ్ పాత పాటల పిచ్చోడా, మర్యాదగా నోరు మూస్తావా లేదా? నేను వచ్చానంటే నీ పిచ్చిని, పట్టిన దయ్యాన్ని కూడా వదలగొట్టేస్తాను. ఆపుతావా లేదా ?'' అనరిచాడు.

''ఆపుతామండీ. ఆపక ఛస్తామా. అదేదో తమ కోసమే పాడుతున్నట్టు ఫీలయిపోతారేమిటి?'' అంటూ వేడి వేడి జీడిపప్పు ప్లేటు తెచ్చి ఎదురుగా టీపాయ్ మీద ఉంచి తిరి లోపలకు వెళ్ళాడు చందూ.

కాస్సేపట్లో చేతిలో విస్కీ బాటిల్, రెండు గ్లాసులతో సహా వచ్చాడు చందు. అది చూసి నొసలు విరిచాడు విరాట్. ''అలా చూడకు. ఈ చలి చలి వాతావారణంలో రెండు పెగ్గులు వేయకపోతే మన యూత్ కే అవమానం. అవునూ మర్చేపోయారా. నువ్వు తాగటం మానేసావు గదూ'' అంటూ ఓ గ్లాసు తీసేయబోయాడు చందూ.

''దాంతో మందే కాదు మంచినీళ్ళు కూడా తాగొచ్చు దించు'' అన్నాడు విరాట్ ''ఒ.కె. ఆ కలన్నావ్ గా టేబుల్ మీద వేడి వేడి రైసు చికెన్ కర్రీ, పప్పు ఆవకాయ పచ్చడి వడియాలు, పెరుగు అన్ని రడీ. డబుల్ ఆమ్లెట్ తెచ్చిస్తాను, ఈ లోపల భోం చేస్తూండు. నేను కాస్త తీర్థం పుచ్చు కొని వచ్చి జాయినవుతాను'' అంటూ మాట్లాడుతూనే ఫుల్ బాటిల్ విస్కీ ఓపెన్ చేసి గ్లాసులో ఒక లార్జ్ పెగ్ కలుపు కున్నాడు.'' ఫరవాలేదు. టీవి చూస్తూన్నాగా. నువ్వు లాగించెయ్ తర్వాత కలిసే భోం చేద్దాం'' అన్నాడు విరాట్.

''ఒకె.... ఆమ్లెట్ తిరగేయాలి. ఇప్పుడే వస్తాను'' అంటూ మళ్ళీ కిచెన్ లోకి వెళ్ళాడు చందూ...

అతనటు వెళ్ళనిచ్చి...

విస్కీ గ్లాసులేపి గటగటా కాళీ చేసి ఎప్పటిలాగా ఉంచి కొద్దిగా జీడిపప్పు నోట్లో వేసుకొని ఏమీ తెలినట్టు టివి చూస్తుండిపోయాడు విరాట్. కాస్సేపటికి ఆమ్లెట్ ప్లేట్ లో వచ్చి కూర్చోని తన గ్లాసు వంక చూసి విస్తుపోయాడు చందూ.''ఏమిట్రా గ్లాసులో విస్కీ ఏది? అడిగాడు.''తాగేసావ్ గా'' అన్నాడు విరాట్ సీరియస్ గా

''నేనా....'' చందూ గొంతులో ఆశ్యర్యం.

''లేకపోతే నేనా? ఒక పెగ్గు కలుపుకొని తాగేసి లోనకెళ్ళావ్ గా.''

''నిజంగానా... ఇంత మతిమరుపొచ్చిందేమిటి...?'' అనుకుంటూ మరో లార్జ్ పెగ్గు కలిపి నాలుగు గుక్కలు సిప్ చేసి ఆమ్లెట్ తుంచి నోట్లో వేసుకుని రెండో ఆమ్లెట్ తేవటం కోసం తిరిగి లోన కెళ్ళాడు చందూ.

ఈ సారి బాటిల్లో విస్కీని ఒక లార్జ్ పెగ్గుకి రెండో గ్లాసులో కలుపుకొని తాగేసి కామ్ గా కూర్చున్నాడు విరాట్. చందూ రెండో ఆమ్లెట్ తెచ్చినప్పట్నుంచి విరాట్ ఎదురుగా కూర్చున్నాడు. గ్లాసు కాళీ చేసి జీడిపప్పు చారెడు నోట్లో వేసుకొని విస్కీ బాటిల్ వంక చూసాడు చందు. అంతే మతిపోయిన వాడిలా కెవ్వున అరిచాడు.

''తేలుకుట్టినట్టు అలా అరుస్తావేరా ఏమైంది?'' అడిగాడు విరాట్

''విస్కీ ఏదిరా?''

''అదో... ఉందిగా''

''ఏది? ఫుల్ బాటిల్ ఓపెన్ చేసాను. రెండు పెగ్గులు తాగాననుకో. దాదాపు సగం కాళీ అయిపోయిందేమిటి? ఇంత ఎక్కడ తాగాన్రా? నిజం చెప్పు నువ్వు తాగావు కదూ..? నిజం చెప్పు నువ్వెందుకురా నన్నేడిపిస్తున్నావ్...?''

విరాట్ చిన్నగా నవ్వాడు.

“అది సంగతి ఇప్పుడర్థమైంది.  మొగమాటమెందుకు వేసెయ్”  అంటూ తిరిగి రెండు గ్లాసుల్లోనూ విస్కీ కలిపాడు చందూ.“ఏం చేస్తావ్... ? తనని మర్చి పొమ్మాంటావ్. నా వల్ల కావట్లేదు.”

“అలాగని చేతులు ముడుచుకుంటే పనులు కావండీ.  కాస్త బుర్రపెట్టి ఆలోచించాలి.”

“ఏమాలోచించాలి? వేలకు వేలు ఖర్చు చేసి పోస్టర్లు వేసినా ప్రయోజనం లేకపోయింది. తను సిటిలోంచి వెళ్ళిపోయుంటుందా..?”
“లేదు. ఇక్కడే ఉంటుంది.”

“ఎలా చెప్పగలవ్?”

“ఆమెని పబ్లిసిటీ చూసే ఉంటుంది. చూసినా ఫోన్ చేయలేదంటే అందుకు మూడు కారణాల్ని మనం వూహించుకోవచ్చు.  ఒకటి నువ్వు తనకి నచ్చకపోవచ్చు. లేదా అప్పుడే ఎంగేజ్ మెంట్ అయిఉండొచ్చు, రెండో కారణం ఇప్పటికే ఎవడితోనో లవ్ లో ఉండి ఉండాలి.  లేదా జాతికులం తమ వాళ్ళు అంగీకరించరన్న భయంతో ఉదాసీనంగా ఉండొచ్చు.
ఇకమూడోకారణంలవ్మీదనమ్మకంలేకపోవచ్చు.

ఒక్కసారి ఫోన్ చేస్తే ఆనంబర్ కి తిరిగి తిరిగి నువ్వు ఫోన్ చేస్తావన్న భయంతో మౌనం వహించవచ్చు.”“ఒకె తను ఫోన్ చేయకపోవటానికి చాలా కారణాలు ఉండొచ్చనుకుందాం. ఇంతకీ తను చెన్నై లోనే ఉందని ఎలా చెప్పగలవ్?.

“ఎలాగంటే నీకు చెప్పకుండా దాచిన ఇన్ఫర్మేషన్  కొంత నా దగ్గరుంది గాబట్టి.”

“ఏమిటా ఇన్ఫర్మేషన్  ఎందుకు దాచావ్?”  ఆశ్చర్యపోతూ అడిగాడు విరాట్.

“నువ్వెంత ఘాటుగా ప్రేమిస్తున్నావో తెలుసుకుందామని”

“తెలిసిందిగా,     ఇన్ఫర్మేషనేమిటో చెప్పు”

“చెప్తాను. భోంచేసాక.”

“అయితే ఇక మందు ఆపెయ్.” అంటూ బాటిల్     తీసుకెళ్ళి లోన దాచేసి వచ్చాడు విరాట్. అప్పటికే గ్లాసులు కాళీ అయిపోయాయి. డైనింగ్ టేబుల్ వద్ద కెళ్ళి భోజనానికు క్రమించారు.

బయట వర్షం కుండపోతగా కురుస్తూనే ఉంది.

విరాట్ సొంతవూరు కొయంబత్తూరు, చందూది ఆ పక్కన ఉసిలంపట్టి గ్రామం.

కోయంబత్తూరులో వెంకటరత్నంనాయుడు గారంటే తెలినివళ్ళుండరు. పెద్ద ఇండస్ట్రియలిస్టు. ఆయనకి చాలా ఇండస్ట్రీలు వ్యాపారాలు ఉన్నప్పటికీ ముఖ్యంగా కావలసింది సిటీలోనే అతి పెద్దదైన బట్టలమిల్లు.     అందులో అయిదు వందల మందికి పైగా కార్మికులు షిప్టు పద్ధతిలో ఇరవైనాలుగు గంటలూ పనిచేస్తూనే ఉంటారు. ఆయన వ్యాపారాలు సంవత్సరానికి వెయ్యి కోట్ల టర్నో వరవుతుంటాయి. స్టేట్ నుండి సెంట్రల్ వరకు పలుకుబడి గల వ్యక్తి.     ఆయన భార్య పేరు మంగతాయారు. ఆ దంపతులకు ముగ్గురు సంతానం ఒక కూతురు, ఇద్దరు కొడుకులు. కూతురి పేరు కనకమహాలక్ష్మీ, ఆమెను ధర్మపురి జిల్లా లోని ఒక పెద్ద ఇండస్ట్రియలిస్టు కొడుకిచ్చి పెళ్ళిచేసారు. ఆమెకు ఒక కొడుకు, కూతురు.     కనకమహాలక్ష్మి తర్వాత పుట్టిన ఇద్దరు కొడుకుల్లోను పెద్దవాడి పేరు విక్రాంత్, అతనికి పెళ్ళయింది. పిల్లలు వెంకటరత్నం నాయుడికి కుడి భుజంగా ఉంటూ వ్యాపారాల్లో తండ్రికి అన్ని విధాలా సాయ పడులోంది అతనే. ఇక మిగిలింది ఆఖరి కొడుకు. అతనే విరాట్. ఇంకా పెళ్ళి కాలేదు, పెళ్ళి దగ్గరే అసలు సమస్య మొదలై అతను కొయంబత్తూరు వదిలి వచ్చేసాడు.

విరాట్ అమెరికాలోను, జర్మనీ లోను చదువుకున్నాడు. అయితే చిన్నప్పట్నుంచి అతనివన్నీ స్వతంత్ర భావాలు. అన్నలా తండ్రిని అనుసరించటం అతనికిష్టం లేదు.

అక్క కనకమహాలక్ష్మి కూతురుంది.     ఆమె పేరు సాగరిక.     విరాట్ కి స్వయానా మేనకోడలు. తనకు సాగరికకు వివాహం నిశ్చయం చేస్తూ పెద్దలు మాట్లాడేసుకోవటం విరాట్ కి నచ్చలేదు. అతడ్ని చేసుకోవటం సాగరికకు ఇష్టమే కాని విరాట్ కు మేనరికం ఇష్టం లేదు. కాని ఇటు తండ్రి, అటు అక్క కూడా ఈ విషయంలో పట్టుదలగా ఉండటంతో విరాట్ కి దిక్కు తోచలేదు. సాగరికనైతే

ఒప్పించగలిగాడు కాని మిగిలిన ఎవరినీ మార్చటం సాధ్యం కాలేదు. ఆ విధంగా అభిప్రాయ బేధాలతో కొయంబత్తూరు వదిలి ఎవరికీ చెప్పకుండా చెన్నై వచ్చేసాడు. వచ్చినరెండో మాసంలోనే గోస్వామి కన్స్ ట్రక్షన్ వాళ్ళనుండిఆయింటినికొనుగోలుచేసాడు. అతనిపేరనే సుమారు పది కోట్లు బ్యాంకు బాలెన్స్ వుంది కాబట్టి డబ్బుకి సమస్య లేదు. కాలక్షేపానికి ఇప్పుడు పనిచేస్తున్నా సాఫ్ట్ వేర్ కంపెనీలో చేరాడు. తర్వాత ఫ్రెండు చందూని తన వద్దకు రప్పించుకున్నాడు.

కోయంబత్తూరు వదిలి వచ్చేసినా ఇంటితో సంబంధం వదులుకోలేదు. ఫోన్లు చేస్తూనే ఉంటాడు. తను చెన్నైలో ఉన్నట్టు మాత్రం చెప్పడు. చెప్తే తండ్రి వెంకటరత్నం నాయుడు బలవంతంగా లాక్కెళ్ళి సాగరికతో పెళ్ళి జరిపిస్తాడని భయం. సాగరిక పెళ్ళైయ్యే వరకు తనకి అజ్ఞాత వాసం తప్పదు.

ఇక చందూ విషయం...

అతను సాధారణ రైతు కుటుంబం లోంచి వచ్చాడు.

ఉసిలంపట్టి గ్రామంలో అతని తండ్రి అయిదెకరాల రైతు, చందూ తర్వాత ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఇంటికి పెద్ద కొడుకని మూడెకరాలు అమ్మి మరీ చందూని బాగా చదివించారు.

చదువైపోయాక సరైన ఉద్యోగం దొరక్క అవస్థ పడుతున్న టైంలో మిత్రుడు విరాట్ అతడ్ని తన వద్దకు రప్పించుకుని ఉద్యోగం వేయించి తన వద్దే ఉంచుకున్నాడు.

చందు భోజన ప్రియుడు.

సరదాగా నేర్చుకొన్నా పాక శాస్త్రంలో అతను ప్రవీణుడు. వంట సంగతి అతనే చూసుకుంటాడు. విరాట్ తో ఉన్నందు వల్ల అతనికి రూమ్ రెంట్ లేదు, భోజనం ఖర్చులేదు. ఇంకా చెప్పాలంటే పైసా ఖర్చు లేదు. వచ్చిన జీతం వచ్చినట్లు ముప్పైవేలు నెల నెలా ఇంటికి పంపించేస్తాడు. ఆ విధంగా తనను చదివించిన తండ్రినీ తమ కుటుంబాన్ని ఆదుకోగలిగాడు. రెండు మాసాల క్రితమే పెద్ద చెల్లెలు పెళ్ళి ఘనంగా జరిపించి వచ్చాడు. కాని ఉసిలంపట్టి గ్రామంలో ఎవరితో కూడ తను చెన్నైలో విరాట్ తో ఉంటున్న సంగతి చెప్పలేదు.

ఒక్క తన తండ్రితో మాత్రమే చెప్పి ఎవరికీ చెప్పొద్దని హెచ్చరించాడు. గ్రామంలో ఎవరడిగినా తను బెంగుళూరులో ఉంటున్నట్టు చెప్తూ వస్తున్నాడు. పై సంవత్సరం రెండో చెల్లెలు పెళ్ళి కూడ జరిపించేస్తే బాధ్యత తీరుతుంది. ఆ తర్వాత తన పెళ్ళి అనే ఆలోచనతో ఉన్నాడు.‘‘చెప్పరా నీకు ఆ అమ్మాయి గురించి తెలిసిన సమాచారం ఏమిటి..?’’ భోంచేసి తిరిగి తిరిగ్గా హాల్లోని సోఫాలో సెటిలవగానే అడిగాడు విరాట్.

‘‘నువ్వు ఇంతగా ఆ అమ్మాయిని ఇష్టపడుతున్నావ్ గాబట్టి చెప్తున్నాను. ఆమె పేరు సహస్ర. పక్కన ఉన్న ఆమె ఫ్రెండు పేరు దీక్ష’’ అంటూ బయటపెట్టాడు విరాట్.

‘‘సహస్రా?... నిజమే చెప్తున్నావా..?’’ షాకింగ్ గాఅడిగాడు విరాట్

‘‘కాదు అబద్ధం చెప్తున్నాను. ముఖం చూడు’’

‘‘నీకు బుద్ధిలేదురా, అందుకే జోక్ చేస్తున్నావని డౌటు.’’

‘‘డౌట్ వద్దు, నేను నిజమే చెప్తున్నాను. తన పేరు సహస్ర.’’

‘‘నీకెలా తెలుసు?’’ ఆనందోద్వేగానికి లోనవుతూ అడిగాడు విరాట్.

‘‘ఎలా ఏమిటి? నువ్వు ఆ రోజు ఆమె అందాన్ని చూస్తూ కూర్చున్నావ్. నేను వాళ్ళ సంభాషణ మీద దృష్టి పెట్టాను. వాళ్ళు ఒకరినొకరు అలాగే పిలుచుకున్నారు. చెన్నైలోనే ఎక్కడో వాళ్ళు ఒకే చోట పని చేస్తున్నారు. ఎగ్మోర్ లో ఎవరిదో సంతకం కోసం వెళ్ళొస్తున్నారు.చందూ మాటలు విన్నాక... ప్రపంచాన్ని జయించినంత ఆనందానికి లోనయ్యాడు విరాట్.

‘‘ఏమిట్రా ఆలోచిస్తావ్...? ఇంకా నమ్మకం లేదా...? పోనీ సహస్ర ఫోటో చూపిస్తాను. నమ్ముతావా...?’’ అంటూ చటుక్కున తన ఫోన్ అందుకున్నాడు చందూ.’’

ఉత్కంఠ అంచున నిల్చున్న వాడిలా అయిపోయాడు విరాట్.

“ఎవరూ చూడకుండా ఆ అమ్మాయిని సెల్ ఫోన్ తో రెండు ఫోటోలు తీసాను. ఏ మాటకామాట చెప్పుకోవాల్రా బాబు. మీ జంట అదిరిందనుకో” అంటూ సెల్ లోని సహస్ర ఫోటోల్ని చూపించాడు.

సహస్ర ముఖం మంచి ఫోటోజెనిక్ ఫేస్.... హెలెన్ ఆఫ్ట్రాయ్...

అందమంతా తానే అన్నట్టుంది... క్వీన్ ఆఫ్ రోమ్... కియోపాట్రాలా ఎంత అద్భుతంగా ఉంది...!రెండు ఫోటోలూ కూడ క్లోజ్ లో చాలా అద్భుతంగా వచ్చాయి చూస్తున్న విరాట్ కి ఆమెను కళ్ళెదుట తిరిగి చూస్తూన్నట్టుంది. ఆనందం పట్టలేక చందూ బుగ్గ మీద ముద్దు పెట్టేసాడు.

“ఫ్రెండువంటే నువ్వు రా చందూ. ఇప్పుడే వస్తానుండు” అంటూ లేచి గబగబా గదిలోకి వెళ్ళాడు. బెడ్రూమ్ లోని తన కంప్యూటర్ కి సెల్ ఫోన్ కనెక్షనిచ్చి సహస్ర ఫోటోల్ని ప్రింటవుట్లు తీసాడు. ఫోటోలో తన అందచందాలతో మతి పోగొడుతోంది. సహస్ర. వాటిని తీసుకొని తిరిగి హాల్లోకి వచ్చేసరికి సోఫాలో గుర్రు పెట్టి నిద్రపోతూ కన్పించాడు చందూ.


అతడ్ని లేపడం ఇష్టం లేక లైట్లార్పి బెడ్రూం లోకి వెళ్ళకుండా తనూ అక్కడే మరో సోఫాలో పడుకున్నాడు. సహస్ర ఫోటోల్ని గుండెల మీద ఉంచుకొని క్షణాల్లో తనూ గాఢ నిద్రలోకి జారిపోయాడు. మరునాడు ఎలాగో ఆదివారం ఆఫీసు సెలవు రోజు.

ఏయ్ సహస్ర ఆగాగు. స్కూటీ ఆపు” వెనక కూచున్న దీక్ష అరిచింది.

ఆమె ఆగమని చెప్పేలోపే...

స్కూటీ రెండు వందల గజాల దూరం ముందుకెళ్ళి ఆగింది

“ఏమైందే? మళ్ళీ ఏం మర్చిపోయావే..?” కసురుకుంది సహస్ర.



జరిగిన కథ. : సహస్ర, దీక్షలను తాను తీసిన ఫోటోలను విరాట్ కి చూపించడమే కాక తాను సేకరించిన ఇంఫర్మేషన్ కూడా చెబుతాడు చందు...ఆమె ఫోటో చూస్తూనే మైమరచిపోతాడు విరాట్. ఇక ఇంటి నుంచి స్కూటీ మీద బయల్దేరిన సహస్ర, దీక్షలిద్దరూ ఆగుతారు....

....................................

“ఏమి మర్చిపోలేదు గాని స్కూటీ వెనక్కి తిప్పు చెప్తాను” అంది దీక్ష.

‘‘అసలే టైమవుతుందంటే మళ్ళీ యిదేమిటి?  ఎక్కడికెళ్ళాలి ఇంటికా...?’’

‘‘కాదు ముందు స్కూటీని వెనక్కి తిప్పు చెప్తాను.’’

గో స్వామి కాలనీ గేటు నుంచి ఎగువకుపోతున్న రోడ్లో మధ్యలో ఎడం పక్క ఒక పాల డిపో వుంది.  ఆ డిపోను దాటి ముందుకొొచ్చాక ఆగింది స్కూటీ. విసుక్కుంటూనే స్కూటీని వెనక్కి తిప్పింది సహస్ర.

‘‘వెళ్దాం ఆగు. అటు పాల డిపో వంక చూడు. పాల పాకెట్లు తీసుకొని రోడెక్కి కాలనీ వైపుకొస్తున్నాడో యువకుడు. వాడ్ని గమనించు’’ అంటూ వేలెత్తి అటు చూపించింది దీక్ష.

‘‘మనకి టైమవుతోందే బాబు,  వాడెవడైతే మనకేంటి..?’’

‘‘ఒసే మొద్దు వాడ్ని  సరిగా చూడు. వాడు చందూ.’’

‘‘చందూ ఎవడు?’’

‘‘అప్పుడే మర్చిపోయావా?  నిన్ను వరించిన వాడి ఫ్రెండు’’

ఆ మాటతో ఒక్కసారిగా... ఉలికిపడింది సహస్ర. ‘‘ అంటే...  విరాట్...  ఆ రోజు రైల్లో విరాట్  పక్కనుంది?’’

‘‘వీడే...  విరాట్ ఫ్రెండు చందూ.’’

“ఓ మైగాడ్” అంటూ హెల్మెట్ తీయబోయింది సహస్ర.

“హెల్మెట్ తీయకు. వాడు మనల్ని గుర్తుపడతాడు”

“చందు ఇక్కడేం చేస్తున్నాడు? వాళ్ళు ప్రాంతంలోనే ఉన్నారా..?” అనుమానంతో అడిగింది సహస్ర.

“ఒక్కడే ఉంటున్నాడో ఇద్దరూ ఉంటున్నారో ఎవరికి తెలుసు. ఇద్దరిలో ఎవరు మనల్ని చూసినా గుర్తుపట్టేస్తారు.”

“ఇప్పుడేం చేద్దాం, టైమవుతోంది.”

“కొంపలేం మునగవు కాని ముందీసంగతి తేల్చుకోవాలి వాడ్ని మనమే చూసాం గాబట్టి మంచిదయింది. వాడ్ని ఫాలోచెయ్యి. నెమ్మదిగా పోనీ...”

సహస్ర స్కూటీని నెమ్మదిగా పోనిచ్చింది.

దీక్ష చూసింది చందూనే. అందులో సందేహం లేదు. ఆదివారం ఆఫీసుకు సెలవు, భారీ వర్షం గాబట్టి వీధులింకా జలమయం గానే ఉన్నాయి. తెల్లవారు జామున వాన తగ్గినా ఆకాశం ఇంకా మబ్బులు కమ్ముకునే ఉంది. చలిచలిగా ఉంది వాతావారణం.

టైం ఎనిమిదయినా ఇంట్లో ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు విరాట్. ముందుగా లేచిన చందూ బ్రష్ చేసుకొని పాల ప్యాకెట్ల కోసం బయటకు రావటంతో అనుకోకండా దీక్ష కంటపడ్డాడు.

తన వెనక దూరంగా ఫాలో అవుతున్న స్కూటీని అతను గమనించలేదు. కాలనీ గేటు దాటగానే ఎడం పక్కకు తిరిగాడు, సహస్ర వేగంగా స్కూటీని గేటు దాటించింది. చందూ మొదట వీధి లోకి తిరుగుతూ కన్పించాడు.

స్కూటీని వీధి మొదట్లోకి పోనిచ్చి ఆపింది.

మూడో ఇంటి గేటు తీస్తూ కన్పించాడు చందూ.

"ఏం చేద్దాం...?"    దీక్షను అడిగింది సహస్ర.

"మనకు కావలసింది వీడు కాదు. విరాట్.    వాళ్ళిద్దరూ అదే విల్లాలో ఉంటున్నారని నా డౌట్.    చందూని లోనకు పోనివ్వు. ముందుకు పద చూద్దాం"    అంది దీక్ష.

స్కూటీని పోనిచ్చింది సహస్ర.

ఆ యింటిని గమనిస్తూ వీధి ఎగువ వరకు వెళ్ళారు.    చందూ ఇంట్లోకి పోతూ కన్పించాడు.    ఎగువ నుంచి రిటనవుతూ మరోసారి గమనించారు.    ఈ సారి లక్కీగా విరాట్ కన్పించాడు. అప్పుడే లేచినట్టున్నాడు ఇంగ్లీష్ న్యూస్    పేపర్ తో బయటికొస్తున్నాడు. తమను గమనించక ముందే స్కూటీని వేగంగా పోనిచ్చి కాలనీ గేటు దాటాక ఆపింది సహస్ర.

"ఓ మైగాడ్,    ఇదేమిటే వాళ్ళిద్దరూ ఇక్కడే ఉన్నారు.    ఇప్పుడేం చేద్దాం"    అంది కంగారు అణచుకొంటూ సహస్ర. "ఉన్నారని తెలిసిందిగా.... వాళ్ళే మీ పక్షులు కాదు చప్పట్లు కొట్టి తరిమేయడానికి. వాళ్ళ కంటపడకుండా మన జాగ్రత్తలో మనం ఉంటే సరి.""ఎంత జాగ్రత్తగా ఉన్నా మనది వాళ్ళదీ కూడ ఒకటే కాలనీ.    ఏదో రోజు తెలిసిపోతుందేమో...!"

"తెలిసి నష్టం ఏమిటి? నిన్ను మెచ్చినవాడు నీకు నచ్చితే ప్రాబ్లం సాల్వ్."

"నీ ముఖం ఇప్పుడు నాకు లవ్వొక్కటే తక్కువ"

‘‘ఎక్కువో తక్కువో పక్కనపెట్టు.      ఇవాళ ఆదివారం వాళ్ళకు సెలవు అయి ఉంటుంది.      మంగళవారం మనకు సెలవు,      ఆ రోజు తేల్చేద్దాం.’’‘‘ఏం చేద్దాం.?’’

‘‘వాళ్ళింట్లోకి దొంగతనానికి వెళ్దాం సరేనా...      ఇక టైమవుతోంది పోనీ’’      సహస్ర స్కూటీని ముందుకు దూకించింది.

ఉదయం సుమారు పది గంటలకు మబ్బులు చెదిరిపోయి సూర్యుడు చెన్నై నగరం వంక తొంగిచూసాడు .అప్పటికి విరాట్ చందూలు స్నానాలు ముగించి టిఫిను, కాఫీలు అవగానే తిరిగి రిలాక్స్ గా హాల్లో సెటిలయ్యారు. ఆదివారం సెలువ రోజయినా ఇద్దరూ సినిమాలకు షికార్లకు వెళ్ళేది చాలా అరుదు.      చందూ టివి ఆన్ చేసాడు.

విరాట్ టివి చూడ్డం లేదు.

రాత్రి తీసిన ప్రింటవుట్స్ లోని సహస్ర ముఖాన్ని దీక్షగా చూస్తున్నాడు. పావుగంట తర్వాత ఈ విషయం గురించి పక్కకొచ్చి కూర్చున్నాడు చందూ.

‘‘ఫోటోలు బాగా వచ్చాయా...?’’ అడిగాడు.

‘‘సెల్ ఫోన్ తో కూడా ఇంత బాగా ఫోటోలు తీయొచ్చని వీటిని చూసాకే అర్ధమైంది.      నీలో కళాకారుడున్నాడురా. ఒప్పుకుంటాను.      ఆల్ రెడీ మిమిక్రి ఆర్టిస్టువి. ఇప్పుడు ఫోటోగ్రాఫర్ వని తెలిసింది‘‘      అన్నాడు విరాట్.

‘‘తెలిసిందిగా ఓ మంచి కెమెరా కొనివ్వొచ్చుగా’’

‘‘సహస్ర దొరకని బెస్ట్      కెమెరా కొనిస్తాను’’

‘‘థాంక్స్ రా ఇంతకీ సహస్ర ఎప్పుడు దొరుకుతుంది.’’

“దొరకదనుకుంటున్నావా…? రెండు వారాల్లో తప్పకుండా నా ముందుంటుంది.”

“మూడు రోజులయినా ఫోన్ చేయలేదంటే…”

“అందుకు కారణాలేమిటో రాత్రి నువ్వే విశ్లేషించావు గా…”

“రెండు వారాల్లో ఫోన్ చేయలేదనుకో… అప్పుడు..?”

“సస్పెన్స్ అప్పుడేం చేస్తానో నువ్వే చూద్దూవు గాని.”

“ఒకె…………… కాని నాకో సందేహం మనసులో ఉండిపోయింది. నీతో కూడ చెప్పలేదు.”

“చెప్పు.”

“ఏం లేదు ఆ రోజు ఆ అమ్మాయి రైలెక్కినపుడు గమనించావా..? ముస్లిం అమ్మాయిలా ఘోషాస్టయిల్లో ముఖం తెలీకుండా చున్నీ తో కళ్ళు మాత్రం వదిలి ముఖానికి చుట్టుకొని వుంది . సీట్లో కూర్చున్నాకే తీసింది గుర్తుందా?.”

“యస్ అఫ్ కోర్స్ యు ఆర్ రైట్. నేనూ ముస్లిం అనుకున్నాను. ముఖాన బొట్టు చూసాకే కాదని గుర్తించాను. రైలు దిగే ముందు తిరిగి చున్నీ ముఖానికి చుట్టుకుంది.”

“కదా?… ఆలోచించు. పబ్లిక్ లో అలా ముఖం తెలియకుండా దాచుకోవలసిన అవసరం ఏమిటి?

"నిజమే...?"

ఈ విషయం గురించి తనూ సీరియస్ గా ఆలోచించలేదు. కాని అలాగని సందేహించాల్సిన అవసరం కూడ లేదు. ఎందుకంటే ఉన్నత కుటుంబాలకు చెందిన లేడీస్ ముఖం తెలియకుండానే ముసుగుతో బయటకు రావటం తరతరాలుగా హైందవ ఆచారం. ఈ అమ్మాయి కూడా అలాంటి కుటుంబానికి చెందిఉండొచ్చు. కాకపోతే ఇప్పుడంతా పంజాబి డ్రస్లు, చుడీదార్లు ఫ్యాషనై పోయింది గాబట్టి ఆచారాన్ని పాటిస్తూ చున్నీని అలా చుట్టుకునుండొచ్చు. ఇదే అభిప్రాయాన్ని చందూతో చెప్పినపుడు మొదట అంగీకరించాడు. తర్వాత ఒక డౌటు కూడా బయటపెట్టాడు.

"ఏమో ఏవో సమస్యల వల్ల తెలిసిన వాళ్ళు తనను గుర్తించకుండా కూడా అలా ముఖాన్ని కవర్ చేసుకోవచ్చు." అన్నాడు."సహస్ర ముఖం తెలికపోయినా ఫ్రెండు దీక్ష ముఖం మామూలుగానే వుందిగా, దీక్షను బట్టి సహస్రను గుర్తించటం కష్టంకాదు. ఆమె ఏదో ఉన్నత కుటుంబానికి చెందిన సాంప్రదాయ యువతి. అందుకే అలా చేస్తోంది." అన్నాడు విరాట్."నీ మాటే కరెక్టు కావచ్చు. ఇంతకీ భోం చేసాకా మధ్యాహ్నం మన ప్రోగ్రాం ఏమిటి? దేవి థియేటర్ లో షారూఖాన్ సినిమా వచ్చింది. ఉదయం థియేర్ లో రజనీకాంత్ సినిమా ఉంది. ఇవాళ ఏదో ఒక మూవీకి మనం వెళ్ళాల్సిందే" అన్నాడు.

"సారీ రా నాకు మూడ్ లేదు. కావాలంటే బైక్ ఇస్తాను. వెళ్ళిచూసిరా" అంటూ సహస్ర ఫోటోలు తీసుకుని తన బెడ్రూం లోకి వెళ్ళిపోయాడు విరాట్.

"అవున్లే నీకు మూడ్ ఎందుకుంటుంది? సహస్ర ఫోటోలున్నాయిగా చూసుకుంటూ సమయం గడిపేస్తావ్ నువ్వింట్లోనే ఉండరా బాబు. నేను సినిమాకి పోయొస్తాను" అన్నాడు వెనక నుంచి చందూ.

ఆ రోజు మంగళవారం.

సహస్ర దీక్షలకు సెలవు రోజు...

లేవటమే ఆలస్యంగా ఏడు గంటలు దాటాక నిద్ర లేచారు. అదీ పని పిల్ల వస్తూ వస్తూ పాల ప్యాకెట్లు తెచ్చి తలుపుకొడితే ముందుగా దీక్ష తర్వాత సహస్ర లేచారు. ఇక ఉదయం ఇంటి పనులు ఆరంభమయ్యాయి. నీళ్ళు పట్టి ఇల్లు వాకిలి శుభ్రం చేసి

అంట్లు తోమితనే కాఫీ పెట్టి ఇద్దరికీ ఇచ్చి తను తాగి వెళ్లిపోతుందామె. ఈ లోపల స్నానం చేసి పూజ ముగిసాక కిచెన్ లోకి చేరతారు ఇద్దరూ.

పన్నెండు గంటల వరకు ఇంట్లోనే కాలక్షేపం చేసారు. పన్నెడు తర్వాత ‘‘ఇక బయల్దేర్దాం ’’ పద అంది రెక్కలాగుతూ దీక్ష.

‘‘ఎక్కడికి...?’’ అంది సహస్ర.

‘‘మర్చిపోయావా, మూడో నంబరు ఇంట్లో మనం దొంగతనానికెళ్ళాలి.’’

‘‘వ్వాట్? నిజంగానే వెళ్ళాలా...? మొన్న ఏదో మాటవరసకలా అన్నావనుకున్నాను. వద్దు ఎవరన్నా చూస్తే బాగుండదు, పట్టపగలు’’ ‘‘చూడకుండానే వెళ్ళొద్దాం, వెళ్ళకపోతే వాళ్ళ జాతకాలు మనకెలా తెలుస్తాయి?’’

‘‘అంతేనంటావా?’’

‘‘ముందు త్వరగా రెడీ కా,’’

‘‘మరి వంట?’’

‘‘వచ్చాక చూద్దాంలే’’ పావుగంటలో రెడీ అయి బయలుదేరారిద్దరూ.

గోస్వామి కాలనీ మొత్తం నూట ఎనభై విల్లాల్ల నూ ట ఏభై వరకు యిళ్ళలో అంతా ఉద్యోగస్తులే, ఉదయం ముందుగా పిల్లలు కాన్వెంటులకు, కాలేజీలకు వెళ్ళిపోతారు. భార్యభర్తలు రెడీ అయి ఇళ్ళకు తాళం పెట్టి ఎవరి దారిన వారు ఆఫీసులకు వెళ్ళిపోతారు . మిగిలిన ముప్పై ఇళ్ళలో మగాళ్ళు ఆఫీసులకుపోతే స్త్రీలు, వృద్ధులు ఇళ్ళలో ఉంటారు.

ఉదయం పది గంటలు దాటితే కాలనీ వీధులన్నీ నిర్మానుష్యమైపోతాయి. తిరిగి సాయంత్రం నాలుగు గంటల తర్వాత నుంచి గాని వీధుల్లో జనం కన్పించరు. ఆ ధైర్యంతోనే అమ్మాయిలిద్దరూ ఆ వీధి కొచ్చారు.

స్కూటీని మొదట వీధి మొదట్లోనే ఒక చెట్టు నీడన లాక్ చేసింది దీక్ష.

వీధి మొత్తం నిర్మానుష్యంగా ఉంది.

చిన్న ప్లాస్టిక్ బ్యాగ్ అందుకుని...

ముందుకు దారి తీసింది దీక్ష...

ఆమెను అనుసరించింది సహస్ర...

ప్రతి యింటికి గేటుతో సహా తాళాలు వేసున్నాయి. పదిహేను యిళ్ళ వరకూ చూసుకుంటూ ముందుకెళ్ళారు. ఒకటి రెండు యిళ్ళలో ఆవరణాలో కట్టేసిన కుక్కలున్నాయి. పదిహేనో ఇంట్లో టివి సౌండ్ తో బాటు ఏవో మాటలు విన్పిస్తున్నాయి. ఆ ఇంట్లో ఆడాళ్ళెవరో ఉన్నారు.

ఇద్దరూ వెనుతిరిగారు

''లోన కుక్కలుంటాయంటావా..?'' మూడోనంబరు ఇంటిని సమీపిస్తుండగా అడిగింది సహస్ర.''ఉన్నా ఉండొచ్చు. అయినా ది గ్రేట్ జర్నలిస్టువి. నీకు భయమేమిటి..?'' అంది నవ్వుతూ దీక్ష.

''కుక్కలంటే నాకు భయం''

‘‘భయపడక నాలుగు బిస్కట్లు పడేస్తే అవే నోరుమూస్తాయి.    క మాన్ అంది’’ దీక్ష.

గేటుకి తాళం వేసుంది,

ఎవరూ చూడ్డం లేదని గమనించి ముందుగా గోడ దూకి సహస్రకు చేయందించింది దీక్ష.

అవన్నీ ఒకే డిజైన్ తో నిర్మించిన విల్లాలు గాబట్టి పెద్దగా మార్పుండే అవకాశం లేదు,    విశాలమైన ఆవరణలో చక్కటి పూల మొక్కలతో బాటు నీడనిచ్చే మూడు ఫల వృక్షాలున్నాయి.

‘‘ఫరవాలేదే?    నీ ప్రేమను ఆశిస్తున్నవాడు మంచి టేస్ట్    ఉన్నవాడే,    ఇద్దరూ మగాళ్ళే ఉంటున్నా ఇల్లు ఎంతో నీట్ గాను అందంగాను ఉంచుకున్నారు చూడు’’ అంది పోర్టికో వైపు అడుగులేస్తూ దీక్ష.

‘‘వాడెవడో తెలుసుకోవాలనేగా    మనమొచ్చింది.    ఇంతకీ ఈ విల్లా విరాట్ దా చందూ దా మనకి తెలీదు’’    అంది సహస్ర.‘‘ఇప్పుడు తెలుసుకుంటాంగా’’

‘‘ఎలా..?    కిటికీలతో సహ మూసేసున్న ఇంట్లోకి ఎలా ప్రవేశిస్తాం?’’ ‘‘డోన్ ట్ వర్రీ తడితే తలుపులు తెరుకుంటాయి. ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతుంది అన్నారు. ఇంటి చుట్టూ ఓ రౌండ్కొడితే మనకి ఏదో మార్గం కన్పిస్తుంది’’ అంది దీక్ష.

పోర్టుకో నుంచి కుడి పక్క ఉత్తరంగా వెళ్ళి పశ్చిమం వైపు తిరిగారు, పదడుగులు వేసారో లేదో..... ఇంతలో చెవులు పగిలేలా దగ్గర లో భౌ.........మని మొరిగిందో కుక్క అంతే అదిరిపడిన దీక్ష కెవ్వుమని వెనక్కి దూకి సహస్రను వాటేసుకుంది.    తిరిగిచూసిన సహస్రకు సరిహద్దు గోడ మీద తలెత్తిచూస్తూ మొరుగుతున్న ఆల్సేషియన్    డాగ్ తల కన్పించింది. కిసుక్కున నవ్వింది సహస్ర.

‘‘ఎందుకే నవ్వుతావ్..?’’ అంది సహస్రను వదిలి.

‘‘ఎందుకా నాకు ధైర్యం చెప్పి నువ్వు భయపడ్డందుకు, అంది పక్క కాంపౌండ్ లో కుక్క అటు చూడు’’    అంటూ బేగ్ లోంచి

నాలుగు బిస్కట్లు తీసి గోడ అవతలికి విసిరింది సహస్ర, అంతే టక్కున నోరు మూసి గోడ వదలి బిస్కట్ల కోసం పరుగు తీసింది కుక్క."చి పాడు కుక్క . చూస్తుంటే అది తన యింటి కన్నా పక్కింటికే కాపలా ఉన్నట్టుంది" అంది ధైర్యం తెచ్చుకుంటూ దీక్ష.

"అయినా అంత భయపడిపోయావేమిటే... నీకూ కుక్కలంటే...?

"నీలాగే... చచ్చేంత భయం."

"నాకంత భయం లేదులే,"

మాట్లాడుతూనే పశ్చిమం వైపు ఇంటి వెనక్కి చేరుకున్నారు. ఇల్లంతా తలుపులు కిటికీలు మూసి వున్నాయి వెనక డోర్ కూడ బలంగా బంధించి ఉంది.

వాయువ్య మూలన మాత్రం కిటికీ రెక్క మూయటం మర్చి పోయినట్టున్నారు. సగం తెరుచుకొని లోన ఐరన్ ఫ్రేం కనిపిస్తోంది."మార్గం దొరికింది" అంది ఉత్సాహంగా దీక్ష.

"ఎలా..?" వెనక నుంచి అడిగింది సహస్ర.



జరిగిన కథ : పాల డిపో దగ్గర చందూని చూసిన సహస్ర, దీక్షలు వాళ్ళ రూం ఆ వీధిలోనే ఉండి ఉంటుందని పసిగట్టి అతడిని ఫాలో అవుతారు. తర్వాత తీరిగ్గా గోడదూకి వాళ్ళింట్లోకి ప్రవేశిస్తారు................అక్కడ......

................................................

“చెప్తాగాని ఇది పట్టుకో” అంటూ స్క్రూ డ్రైవర్ తీసుకొని ప్లాస్టిక్ సంచిని సహస్ర చేతికిచ్చింది. కిటికి గ్లాస్ రెక్కల్ని తెరిచింది. లోన ఐరన్ ఫ్రేంని బిగించిన స్క్రూలను స్క్రూ డ్రైవర్ సాయంతో తీసే ప్రయత్నం ఆరంభించింది. కాస్త కష్టంగా

ఉన్నా క్రమంగా ఒక్కో స్క్రూ ఊడి చేతిలోకి వస్తోంది.

“ఏయ్ దీక్షా, ఇప్పుడెవరన్న మనల్ని చూస్తే నిజంగానే దొంగలమనుకుంటారు. దొంగలేగా ఇలాంటి పనులు చేసేది..?” అంది సహస్ర.

“అంటే.......... నేను దొంగననుకుంటున్నావా?”

“ఛఛ ........ అలాగని కాదుగాని అస్సలు అనుభవం లేకపోతే ఇలాంటి పనులు కష్టం కదా...?”

“సర్లే........ దీనికి కావలసింది అనుభవం కాదు ఆలోచన, అఫ్ కోర్స్ చిన్నప్పుడు మా అల్లరిలో దొంగతనం కూడ ఓ భాగం అనుకో.”

‘అలాచెప్పు మరి...”

“నీకు తెలుసా మన మధురైలో మా వీధి అమ్మాయిలందరికీ నేనే రింగ్ లీడర్ని. అప్పుడు చూడాలి మా అల్లరి, ఇంటికి తాళం పెట్టి వెళ్ళాలంటే జనం భయపడచచ్చేవారు, ఏ పెరట్లోను పళ్ళు కాయలు వదిలేవాళ్ళం కాదు. అప్పుడప్పుడు పెరటి గుమ్మం తలుపు ఎలాగో తెరిచేసి కిచెన్ లో జొరపడి దొరికివన్ని తినేసి ఫ్రిజ్ లో కూల్ డ్రింకులు ఖాళీ చేసేసి నానా భీభత్సం చేసి వెళ్ళిపోయేవాళ్ళం. పొరబాటున ఎవరన్నా మా డాడీకి రిపోర్ట్ చేసారో అంతే సంగతులు, వీలుచూసి చీకట్లో దొరకపుచ్చుకొని చితగ్గొట్టేవాళ్ళం... హైస్కూలు చదువయ్యే వరకు ఇదే వరుస కాలేజీలో జాయినయ్యాక కదా మనం కలిసింది.”

అది గెస్ట్ రూంలా ఉంది.

అక్కడ ఒక డబుల్ కాట్ బెడ్, సీలింగ్ ఫ్యాన్ ఒక టేబుల్ కుర్చీ తప్ప ఆ గదిలో చెప్పుకోతగ్గ ఫర్నీచరేమీ లేదు. రూం డోర్ లాక్ చేయలేదు, తలుపు తెరుచుకుని హాల్లో అడుగుపెట్టారు.

గోస్వామికాలనీలో విల్లాలు ప్లాన్లన్నీ ఒకటే గాబట్టి హాలు మిగిలిన గదులు అమరిక వాళ్ళకి కొత్త కాదు. త్రి బెడ్రూమ్స్ విల్లాలు అవి. అన్నీ అటాచ్డ్ బాత్రూమ్స్ తో విశాలంగా ఉంటాయి. హాలు కూడ పెద్దది.

సెంటర్ ముఖద్వారం, దాని తిన్నగా బ్యాక్ డోర్ ఉన్నాయి. తూర్పు ఫేసు భవనం అది. కాబట్టి వెనక డోర్ కి రైట్లో వాయువ్యం వైపు బెడ్రూంని గెస్ట్ రూమ్ గా వదిలేసారు. ఆ రూమ్ కి దక్షిణం గోడనానుకొని హాలు నుంచి వెనక డోర్ కి నాలుగడుగుల నడవా ఉంది.

ఆ నడవానానుకొని దక్షిణం పక్కన ఉత్తరం ఫేస్ తో పక్కపక్కన రెండు బెడ్ రూంలున్నాయి. రెండో బెడ్రూం నానుకొని ఆగ్నేయంలో కిచెన్, కిచెన్ డోర్ కి ఇవతలగా హాలు వైపు ఓపెన్ గా పెద్ద డైనింగ్ టేబుల్ నాలుగు కుర్చీలు ఉన్నాయి. డైనింగ్ టేబుల్ మీద సెంటర్లో డిష్ దాన్ని చుట్టూ అరడజను పూరగాయ పచ్చడి సీసాలు చక్కగా మూతలు పెట్టుకున్నాయి.

హాల్లో ఎటుచూసినా ఖరీదైన ఫర్నీచర్ ఉంది. హాలు మధ్యలో మూడు సోఫా సెట్లు మూడు పక్కలా అమర్చి మధ్యలో పెద్ద టీ పాయ్ ఉంచారు. ఆ సోఫాలకి ఎదురుగా మొదట బెడ్రూమ్ గోడ వద్ద పెద్ద టేబులుంది. దాని మీద బిగ్ సైజు ఎల్సిడీ టి వి, డి వి డి ప్లేయర్ మ్యూజిక్ సిస్టమ్, పక్కన అనేక సీడి లతో ర్యాక్ ఉంది.

ఇక ముఖద్వారం పైన గణపతి లక్ష్మీ సరస్వతుల పెద్ద ఫోటో, అటు ఈశాన్యం మూలన ఒక టేబుల్, దాని పైన వెంకటేశ్వరస్వామి పద్మావతి అమ్మవార్లు, శివపార్వతులు, శ్రీవళ్ళిదేవసేనసమేతశ్రీకుమారస్వామి ఫోటోలు పూలమాలలతో కనువిందు చేస్తున్నాయి. అక్కడ నిత్యం పూజాదికాలు జరుగుతున్నట్లు అర్థమవుతోంది. ఓ సారి కిచెన్ తోసహా అంతా చూసొచ్చాక...

"ఏం చేద్దాం?" అంది సహస్ర

"మనక్కావలసిన ఇన్ఫర్మేషన్ బయటదొరకదు, బెడ్రూమ్ లు చెక్ చేద్దాం" అంది దీక్ష.

"తాళం వేసుకెళ్ళారేమో" అని సందేహిస్తూ ఎదురుగా బెడ్ రూమ్ డోర్ హెండిల్ మీద చేయి వేసింది సహస్ర. క్లిక్ మని చప్పుడు చేస్తూ తెరుచుకుంది అది. డోర్ లాక్ చేసిలేదు. ఇద్దరూ లోనకెళ్ళారు. అది చందూ బెడ్ రూమ్. గదంతా చాలా నీట్ గా అందంగా అమర్చి వుంది, టేబుల్ మీద కేబినెట్ ఫోటోఫ్రేమ్ ఒకటి ఉంది. అందులో చందూ తన తల్లిదండ్రులు ఇద్దరు చెల్లెళ్ళతో బాటు దిగిన ఫోటో వుంది.

పక్కన ఆల్బంలో పెద్దచెల్లెలు పెళ్ళి సందర్భంలో తీసిన ఫోటోలు చాలా వున్నాయి. ఆ ఫోటోల్లో ఎక్కడా విరాట్ లేడు. కాని చందూ విరాట్ లు కలిసి తీయించుకున్న ఫోటోలు కొన్ని విడిగా వున్నాయి. చందూకి డైరీ వ్రాసుకునే అలవాటుంది. టేబుల్ సొరుగులోని డైరీని తీసి పేజిలు కొన్ని తిరిగేయగానే అర్ధమైపోయింది. ఆ విల్లా విరాట్ ది. తన ఫ్రెండు చందూని పిలిచి తన ఆఫీసులోనే ఉద్యోగం వేయించి దగ్గరుంచుకున్నాడు. విరాట్ తన వంటకాల్ని ఎంత మెచ్చుకుంటాడో చందూ తన డైరీలో అనేక చోట్ల ప్రస్తావించాడు విరాట్ స్వస్థలం కోయంబత్తూరు కాగా, ఆ పక్కన ఉసిలంపట్టి గ్రామంలో చందూ ఓ రైతు కుటుంబానికి చెందినవాడనీ అతని జీతం నెలకు ముప్పైవేలని, పెద్ద చెల్లెలు పెళ్ళి తనే జరిపించాడనీ అర్ధమయింది.

ఆ గదిలో కొంత సమయం గడిపి తర్వాత ఎక్కడివక్కడ యధాప్రకారం నీట్ గా సర్దేసారు. తర్వాత పక్కనున్న విరాట్ గదిలో ప్రవేశించారు. లోన అడుగుపెడుతూనే యిద్దరికీ షాక్! కొద్దిసేపు బొమ్మల్లా అలాగే నిలబడిపోయారు.

విశాలమైన ఆ గదిలో డోర్ కి ఎదురుగానే గోడకు చేర్చి డబుల్ కాట్ బెడ్ వుంది. అక్కడ గోడకు వాల్ పోస్టర్ సైజులో రెండు పెద్దపెద్ద ఫోటోలు అంటించి ఉన్నాయి. ఆ పోస్టర్లలో వున్నది ఎవరో కాదు సహస్ర. ఆ పోస్టర్లకు పైన గోడకు వేలాడుతున్న పెద్ద సైజు ఫోటోలోని దంపతులిద్దర్ని చూసి మరోసారి దీక్ష షాక్ అయింది. ఆ విషయం గమనించని సహస్ర "ఓ మై గాడ్... నా ఫోటోలు, అవీ పోస్టర్ సైజులో, వీటిని చూస్తుంటే నన్ను నేను చూసుకున్నట్టుంది! నా ఫోటోలు ఇక్కడికెలా వచ్చాయి..?" అంది ఉద్వేగంగా.

"కంగారుపడకు, విరాట్ ఫోటోలు మన దగ్గరున్నట్టే నీ ఫోటోలు వీళ్ళ దగ్గరుంటే ఆశ్చర్యం ఎందుకు? సరిగ్గా చూడు. ఫోటోలో నువ్వేసుకున్న డ్రస్సు ఆ రోజు విరాట్ రైల్లో నిన్ను పలకరించినప్పటి డ్రస్సే...?" అంది దీక్ష.

"యస్, అదే డ్రస్, అప్పుడే తీసుండాలి"

"నా ఆశ్చర్యం అందుక్కాదు"

"ఇంకెందుకు?"

“ఆ ఫోటోలకు పైన వేలాడుతున్న ఫోటోలో దంపతుల్ని చూడు.”

“చూసాను. ఏమిటి విశేషం?”

“వాళ్ళెవరో నిజంగా నీకు తెలీదా..?”

“తెలీదు చూడ్డానికి గుబురు మీసాలతో చాలా గంభీరంగా హుందాగా ఉన్నాడాయన, ఆవిడ సాంప్రదాయంగా వుంది. ఎవరా దంపతులు?”“ఆయన కోయంబత్తూరు కింగ్. మల్టీ మిలియనీర్, ఆయన పేరు వెంకటరత్నం నాయుడుగారు, ఆయన భార్య మంగతాయారు. కోయంబత్తూరులో ఒక నూలు మిల్లు, ఒక బట్టల మిల్లుకే అధిపతి. అయిదు వందల మంది మిల్లులో పనిచేస్తుంటారు. అవిగాక ఇతర వ్యాపారాలు చాలా ఉన్నాయి.

వెంకరత్నం నాయుడుగారు మా నాన్న గారు క్లాస్ మేట్స్ . మంచి ఫ్రెండ్స్. మా నాన్న గారు బతికున్న రోజుల్లో మధురై వస్తే మా యింటికి రాకుండా వెళ్ళేవారు కాదు. మమ్మీ డాడీ ఆక్సిడెంట్లో పోయినప్పుడు వచ్చి చూసి ఓదార్చి వెళ్ళారు. తర్వాత కలవటం కుదరలేదనుకో. ఇంతకీ...

వెంకటరత్నం దంపుతుల ఫోటో విరాట్ గదిలో ఎందుకుందో అర్థంగావటంలేదు” అంది ఆలోచిస్తు దీక్ష, “వెదికి చూద్దాం అదే అర్థమవుతుంది. ఆగు... ఆ పోస్టర్ల కింద విరాట్ స్కెచ్ పెన్నుతో ఏదో రాసాడు” అంటూ సహస్ర డబుల్ కాట్ ఎక్కేసి దగ్గరకెళ్ళి చూసింది. ఆశ్చర్యంగా ఆమె కళ్ళు మరింత విశాలమయ్యాయి. ఒక ఫోటో కింద యిలా వ్రాసుంది.

“మెరుపులా కనిపించి, నాలో వలపు అలజడి రేపి, తృటిలో మాయమయ్యావ్. నీకోసమే ఈ గుండె కొట్టుకుంటోంది. తిరిగి నీ దర్శనం ఎప్పుడు?”

రెండో ఫోటో క్రింద.

సహస్రా ఐ లవ్యూ అని వ్రాసుంది.

పసుపు రంగు మెరుపు ఇంకు స్కెచ్ పెన్ తో ముత్యాల్లా వ్రాయబడిన అక్షరాలను చూసి దిగ్భ్రాంతి లోనయి కాస్సేపు మోకాళ్ళ పై బెడ్ మీదే కూచుని ఆలోచనల్లో కూరుకుపోయింది సహస్ర.

ఇది కలా నిజమా?

తమ మధ్య గత పరిచయం లేదు, ముందు వెనకా ఎన్నడూ చూసిన గుర్తులేదు, కేవలం రైల్లో పావుగంట ప్రయాణంలో చూడ్డమే. తను ఆ కాస్త సమయం లోనే ఇంతగా అతడ్ని ఇంప్రెస్ చేసిందా..? అతడికి చూడగానే తన మీద ఏర్పడిరది ఆకర్షణా... లవ్వా...?

ఒక విషయం మాత్రం ఒప్పుకోవాలి.

వయసులోని ప్రతి కన్నెపిల్లా కోరుకునే ఒక రాకుమారుని లక్షణాలు విరాట్ లో వున్నాయి. కాబట్టి తనూ ఆ రోజు అతడ్ని ఓరకంట వీక్షించింది. ఒకవేళ అతడి లాగే తనలోనూ లవ్ ఫీలింగ్స్ కలిగాయేమోగాని తనకయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో లవ్ గురించిన ఆలోచనేలేదు, ఇంతకీ ఎవరీ విరాట్? తిరిగి తిరిగి మళ్ళీ మొదటికొచ్చి ఆగాయి సహస్ర ఆలోచనలు.

ఇంతలో...

దీక్ష నవ్వటంతో...

సహస్ర ఆలోచనలు చెదిరిపోయాయి.

తిరిగి చూస్తే టేబుల్ ముందు తిరిగ్గా కుర్చీలో కూర్చునుంది దీక్ష. ఉన్నట్టుండి ఏమైంది దీనికి?

“ఎందుకే నవ్వుతావ్”     కసురుకుంది.

“నవ్వక ఏం చేయనూ .?     నువ్వు పడిపోయావ్”

“అదేనమ్మా ఎక్కడ కూచున్నావ్?     నువ్వంటే పడిచస్తున్న వాడి బెడ్     ఎక్కిమరీ కూచున్నావ్? నీ ఫోటోలు చూసి మురిసిపోతున్నావ్. నీ గురించి తను రాసుకున్న అక్షరసుమాల్ని చూసి ఆనందిస్తున్నావ్. దీనికి అర్థం ఏమిటి?     ది గ్రేట్ జర్నలిస్టు సహస్ర లవ్ లో పడిపోయిందనేగా...?     ఎలాగూ అతని బెడ్ ఎక్కేసావ్ . అలాగే పడుకుని దొర్లు విరాట్     జన్మ ధన్యమైపోతుంది.     నువ్వు తన బెడ్ మీద పడుకున్నావని తెలిస్తే విరాట్ ని చూడాలి. అది తలుచుకుంటేనే నవ్వొచ్చింది!” అంది నవ్వాపుకొంటూ దీక్ష.

ఆ మాటలకి రోషంగా చూసింది సహస్ర.

“అనవసరంగా నవ్వులు పారేసుకోకు,     నేనేమీ పడిపోలేదు”     అంటూ మోకాళ్ళ మీద బెడ్     దిగటానికి ఇటు రాబోయింది. అంతే... తల దిళ్ళ మీదకు అడ్డంగా వాలిపోయింది. ఈ సారి సహస్రకీ నవ్వాగలేదు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

బెడ్ దిగింది సహస్ర. “ఇంతకీ వివరాలేమన్న తెలిసాయా?” అనడిగింది.

“ఆహా చక్కగా తెలిసాయి.     ఇటుచూడు”     అంటూ టేబిల్     సొరగులోంచి ఒక ఫోటో తీసి చూపించింది.

“ఫామిలీ గ్రూప్     ఫోటో . వెంకట్రత్నం నాయుడు గారు ఆయన భార్య మంగతాయారు, ఇటు తండ్రి పక్కన నిలబడిన ఆయన పెద్దకొడుకు విక్రాంత్,     ఆయన భార్యపిల్లలు,     ఇటు కుడి పక్క తల్లి పక్కన నిలబడింది ఎవరు చూడు...”     వివరించింది దీక్ష.

నిజంగానే సహస్ర కళ్ళు ఆశ్చర్య సంభ్రమాలతో విశాలమయ్యాయి. తల్లి పక్కన నిలబడింది ఎవరో కాదు విరాట్.''ఏమిటే... విరాట్ వెంకరత్నంనాయుడు గారి...'' అర్థోక్తిలో ఆగిపోయింది.

''ఇంకా డౌటా... ఆయన చిన్న కొడుకు'' అంటూ ఫోటోని యధా ప్రకారం డ్రాయరు సొరుగులో సర్దేసింది దీక్ష.

అల్మారా లోని సూట్ కేస్ లో విరాట్ పాస్ పోర్టు దొరికింది. డిగ్రీలకు సంబంధించిన జిరాక్స్ కాపీలు దొరికాయి. ''నీలాగే చాలాకాలం ఫారెన్ లో చదువుకొనొచ్చాడు...''

''అదంతా సరేగాని ఇంతకీ అంత గొప్ప కుటుంబానికి చెందినవాడై ఉండి ఇక్కడ అనామకునిలా ఉండి వేరే కంపెనీలో ఉద్యోగం చేస్తూ రైల్లో ఆఫీసుకు వెళ్ళిరావటం ఏమిటి?''

''నీ ప్రశ్నలకు సమాధానాలు చందూ డైరీలో ఉన్నాయి. విరాట్ ది బైకు. ఇద్దరూ ఆ బైక్ మీదే ఆఫీసుకు వెళ్ళొస్తారు. బైక్ సర్వీస్ కిచ్చినప్పుడు వారం రోజులు ట్రైన్ లో ఆఫీసు కెళ్ళారు. ఆ సమయంలోనే రైల్లో కలిసాం, ఇక అసలు విషయం విరాట్ ఇల్లు వదిలి రెండేళ్ళవుతోంది. వెంకటరత్నం నాయుడు గారు పట్టుదల మనిషి. మాటకు కట్టుబడే మనస్తత్వం. ఆయనకు విక్రాంత్, విరాట్లకు ముందుపుట్టిన కనకమహాలక్ష్మి అనే కూతురుంది. విరాట్ కి అక్క. ఆమెకు సాగరిక అనే కూతురుంది. అంటే వెంకటరత్నంనాయుడు గారి మనవరాలు. విరాట్ కు ఈడు జోడు. సాగరికను తన కోడల్ని చేసుకుంటానని కూతురుకి మాటిచ్చాడాయన. అక్క కూడ తన తమ్ముని అల్లుడ్ని చేసుకోవాలని పట్టుదలగా వుంది. కాని మేనరికం చేసుకోవడం విరాట్ కి ఇష్టంలేదు. అక్కడే ఉంటే నాయుడుగారు సాగరికతో బలవంతంగా తన పెళ్ళిని జరిపించేస్తాడని భయపడిన విరాట్ చెన్నై పారిపోయి వచ్చి అజ్ఞాతవాసం గడుపుతున్నాడు.''

''సో... విరాట్దీనాకేసే. ఇంతకీ విరాట్ ఇక్కడున్న సంగతి కొయంబత్తూరులో ఎవరికీ తెలీదన్న మాట.''

''అతను అప్పుడప్పుడూ ఇంటికి ఫోన్ చేసి తను ఢల్లీలోను, బొంబాయిలోనో ఉంటునట్టు అబద్ధంచెప్పి తన వాళ్ళ యోగక్షేమాలు అడిగి లుసుకుంటున్నాడు. చందూ కూడ ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాడు. ఒక్కటి మాత్రం నిజం. విరాట్ నిన్ను లవ్ చేయటం.''''అంటే నేను విరాట్ ని లవ్ చేయాలా?''

''చేస్తే తప్పేమిటంటాను.''

‘‘నెవ్వర్.’’

‘‘ఓహో,      విరాట్ కన్నా గొప్పవాడొస్తాడనా?’’

‘‘దీక్షా ప్లీజ్.      నా కసలు పెళ్ళిచేసుకునే ఉద్దేశమే లేదు.      ఒకవేళ చేసుకోవాలనిపిస్తే అప్పుడు చూద్దాం, ఆర్గ్యుమెంట్స్ ఆపి ముందు ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం పద.      భోజనం వేళయింది . ఆకలి....’’

‘‘కడుపు ఆకలికి భోం చేస్తాం.      వయసు ఆకలికి మగ తోడు కోరదా? పెళ్ళే వద్దంట. ముఖం చూడు ఇలాగే ముసలిదానివై పోతావా?’’‘‘ఆహా నాకు చెప్తున్నావ్      సరే నీ సంగతేమిటి?      నువ్వు పెళ్ళి చేసుకోవా?’’

‘‘నచ్చినవాడు దొరకని నేనూ చేసుకుంటాను.’’

‘‘కదా...      ఆ టైమొస్తే అన్ని జరుగుతాయి. టైమైంది ఎక్కడివక్కడ సర్దు వెళ్ళిపోదాం.’’

ఇక ఆలస్యం చేయలేదు దీక్ష.

యధాప్రకారం ఎక్కడవక్కడ సర్దేసింది.      వచ్చిన పని అయిపోయింది గాబట్టి ఇద్దరూ బయటకొచ్చి డోర్ మూసారు.

కిచెన్      వైపు దారి తీసింది దీక్ష.‘‘మళ్ళీ అటెక్కడికే మనం వెళ్ళాల్సిందిటు’’ గుర్తుచేసింది సహస్ర.‘‘నాకు తెలుసు. ఆకలంటున్నావ్ గారా...’’ అంది దీక్ష.‘‘ఇక్కడా... ఏందో కొంపముంచేలాఉన్నావ్...’’

‘‘ఏం మునిగిపోవులే.      ప్రస్తుతం మనం ఈ ఇంటి అతిధులం, వచ్చిన వాళ్లం భోం చేయకుండా వెళ్తే గృహస్తులు పాపం బాధపడతారు. ఆ పైన చందూ...      ఆయన వంటకాల్ని విరాట్ మెచ్చుకొంటున్నాడంటే ఖచ్చితంగా బాగుండాలి. కిచెన్ లో

ఏమున్నాయో మొత్తం కాళీ చేసి వెళ్ళిపోదాం. నువ్విలా డైనింగ్ టేబుల్ ముందుకూచో. నే వెళ్ళితెస్తాను.''

కిచెన్ లో ఫ్రిజ్ ఓపెన్ చేసారు.

ఉదయం లంచ్ బాక్కుల్లో పట్టుకెళ్ళగా ఇంకా ఒక మనిషికి సరిపడా రైస్ ఉంది. చికెన్ కర్రీ ఉంది. ఉదయం వండి కొద్దిగా బాక్సుల్లో వేసుకెళ్ళుంటారు, కర్రీ అద్భుతంగా ఉంది. పక్కన అయిదారు దోసెలకు సరిపడా దోసెపిండి రెడీగా ఉంది. ఇంకా సాంబారు, గుత్తి వంకాయ కూర, గడ్డ పెరుగు అబ్బో వాటిని చూడగానే అమ్మాయిల్దిరికీ ఆకలి రెట్టింపయింది. అన్నీ ఫ్రిజ్ లోంచి బయటికి తీసేసి స్టౌ మీద వేడి చేసుకున్నారు, పెనం మీద చెరో మూడు దోసెలు వేసుకుని పిండి కాళీ చేసారు. అన్నీ డైనింగ్ టేబుల్ మీద ఉంచుకొని ముందుగా దోసెలు తర్వాత రైసు తిన్నారు. చికెన్ కర్రీ ఖాళీ అయిపోయింది. సాంబారు ఫినిష్. పెరుగు సగం కాళీ. సుష్టుగా భోంచేసి లేచారు.

''ఏ మాటకామాట చెప్పుకోవాలి దీక్ష, చందూ వంట అదుర్స్'' అంటూ మెచ్చుకుంది సహస్ర.

''అద్భుతంగా ఉంది. వంక చెప్పలేం. ఇక లే వెళ్ళిపోదాం'' అంది దీక్ష.

''ఏంటి... ఇవన్నీ యిలా వదిలేసా...?''

''వదలక..? అంట్లు తోమి సర్ది వెళ్దామా? ఎవరుతిన్నారో అర్ధంగాక వాళ్ళని కాస్సేపు జుత్తుపీక్కోనీ, మన పని అయిపోయింది. కమాన్.''ఇద్దరూ వచ్చిన దారినే ఇంట్లోంచి బయటకొచ్చారు.



జరిగిన కథ : విరాట్, చందు ఇంట్లో లేని టైం లో వాళ్ళింట్లోకి ప్రవేశిస్తారు సహస్ర, దీక్షలు....ఆ ఇంట్లోని ప్రతి వస్తువూ చూసి అతడి అభిరుచికి ముగ్ధురాలౌతుంది సహస్ర. ఒక గదిలో తన ఫోటోలకు అందమైన ఫ్రేము కట్టి గోడకు అమర్చడం చూసి తనను అతడెంతగా ప్రేమిస్తున్నాడో తెలుసుకుంటుంది. అతడి అమ్మానాన్నలెవరో తెలిసేసరికి ఆశ్చర్యపోతారు స్నేహితురాళ్ళిద్దరూ.......

.................ఆ తర్వాత.......

దీక్ష కిటికీ ఫ్రేంని జాగ్రత్తగా ఎప్పటిలా ఉంచి స్క్రూలు బిగించి కిటికి రెక్కలు మూసేసింది.     ఈ సారి పక్క కాంపౌండ్ కుక్క కంట

పడకుండా రెండో పక్కనుంచి తిరిగి ముందు భాగానికొచ్చారు. ఎవరూ చూడ్డం లేదని గమనించాక గోడ దూకి రోడ్ మీదకు వెళ్ళిపోయారు.

ఆ రోజు...

విరాట్ చందూలు ఇంటి కొచ్చేసరికి రాత్రి ఏడు గంటలు దాటింది సమయం. చందూ బైక్ దిగి గేటు తాళం తీసి విరాట్ లోనకెళ్ళగానే తిరిగి గేటు మూసి లాక్ చేసాడు.

ఇంటి తాళం తీసి లోనకెళ్ళాడు చందూ. చకచకా ఇంట్లో లైట్లు వెలిగాయి ఇంతలో`

లోపట్నుంచి చందూ కెవ్వున అరవటం విని ఉలికిపడ్డాడు విరాట్. ఏం జరిగిందోనని కంగారుపడుతూ లోనకు పరుగెత్తాడు.అతను వెళ్ళేసరికి చందూ హాలు మద్యలో నిలబడి దయ్యం పట్టిన వాడిలా పిచ్చి చూపులు చూస్తున్నాడు.

''ఏరా...? నువ్వే అందర్నీ భయపెడతావ్, నీకు భయమేంటి...? ఏమైంది నీకు...?'' అంటూ భుజం మీద చెయ్యేసాడు. అంతే మరోసారి కీచుమనరచి దయ్యాలు... భూతాలు... అంటూ బయటకు పారిపోయాడు చందూ, వెంటనే అతడ్ని వెనక్కి లాగి వీపు మీద చరిచాడు విరాట్.

''పిచ్చి వేషాలేస్తే చంపేస్తాను. మర్యాదగా ఏమైందో చెప్పి తగలడు'' అనరిచాడు కోపంగా . భయం భయంగా చూసాడు చందూ.''ఏరా............ మనింట్లో దయ్యాలు భూతాలు అలాంటివేమన్నా ఉన్నాయా?'' అనడిగాడు వణుకుతున్న గొంతుతో.''లేకేంరా. ఉన్నాయి. నువ్వోదయ్యం, నేను భూతం. పెద్ద పిశాచాన్ని నేనిక్కడుండగా ఇక్కడికేమొస్తుంది? ఇంతకీ ఏమైందో చెప్పు.''''అలా ఓ సారి మన డైనింగ్ టేబుల్ వంకచూడు, తెలుస్తుంది.''

''చూసాను టేబులు కుర్చీలున్నాయి. ఇంకేముంది? కుర్చీల్లో కూచుని భూతాలు విందు చేసుకుంటున్నట్టేమన్నా కన్పిస్తుందా?''''ఇంకెక్కడి విందు రా నాయనో... అవి విందారగించి ఎప్పుడో వెళ్ళిపోయాయి. సరిగా చూడరా అది డైనింగ్ టేబుల్లా ఉందా? కార్పోరేషన్ వాళ్ళ డంపింగ్ గ్రౌండ్ లా ఉంది. ఉదయం మనం వెళ్ళేప్పుడిలాగే ఉందా? అద్దంలా ఎంత నీట్ గా ఉంచాను. ఇప్పుడు చూడరా ఎలా ఉందో....?''

చందూ అరుస్తుంటే...

అప్పుడు గమనించాడు విరాట్.

అతడికీ మతి పోయినంతపనైంది.

"వేసిన తాళాలు వేసినట్టున్నాయి. ఇంట్లోకి ఎవరు వచ్చుంటారు దయ్యాలు గాక...? వార్నాయనో... నా చికెన్ కర్రీ మాయమై డిష్ మిగిలింది. రైస్ బౌల్ ఖాళీ , సాంబారు ఖతం, పెరుగు ఫినిష్... ఫ్రిజ్ లో ఏదీ వదల్లేదురా దేవుడా... దోసెపిండి కూడా ఖాళీ చేసే సాయిరా...""చందూ, కాస్సేపు నీ చిందులు ఆపుతావా? వెదవది తినే వాటి గురించి ఆలోచిస్తావేరా? అర్థం కాలేదా ఇది దయ్యాల పనికాదు, ఇంట్లో దొంగలు పడ్డారు. డౌట్ లేదు, ముందు ఏం పోయాయో గదుల్లో చూడాలి" అంటూ వేగంగా తన గదిలోకి పరుగెత్తాడు విరాట్. దొంగలనగానే చందూలో చైతన్యం వచ్చింది. కంగారుగా తన గదిలో దూరాడు.

పావు గంట తర్వాత...

వెళ్ళినంత వేగంగానూ తిరిగి... బయటి కొచ్చేసారిద్దరూ...

"నీ గదిలో ఏం పోయాయి...?" అడిగాడు చందూ.

"ఏం పోలేదు ఎక్కడివక్కడ భద్రంగా ఉన్నాయి. బీరువా తెరవలేదు. టేబుల్ సొరుగులో ఉంచిన నా గోల్డ్ కాయిన్, నా బ్రాస్లెట్ అలాగే ఉన్నాయి, నీ గదిలో ఏం పోయాయి?"

"ఏం పోలేదు. అంతా మిస్టరీగా ఉంది. దొంగలెవరో గాని కేవలం భోజనం కోసమే దొంగతనానికొచ్చినట్టుంది. అంటే... ఇది దయ్యాల పనే. ఒకటి కాదు, రెండు దయ్యాలు. రెండు కంచాల్లో వున్నవన్నీ వడ్డించుకొని పీకల దాకా తిని పోయాయి"

‘‘దయ్యాలు సెంటు పూసుకొంటాయా?’’

‘‘సెంటా...........’’ అంటూ మరోసారి కెవ్వున అరిచాడు చందూ.

‘‘అవున్రా, గమనించనే లేదు, జాస్మిన్ సెంటు వాసనొస్తుంది కదూ, గదుల్లో కూడ ఈ వాసనొస్తోంది... అంటే వచ్చింది ఆడ దయ్యాలంటావా.’’

‘‘ఆడ దయ్యాలు కాదు ఆడ దొంగలు, ఇద్దరమ్మాయిలు మన ఇంట్లో పడి పీకల దాకా మెక్కి వెళ్ళిపోయారు. అసలు వాళ్ళు ఎలా వచ్చారో చెక్ చేయాలి పదా’’ అంటూ కదిలాడు విరాట్.

ఒక రౌండ్ ఇల్లు మొత్తం గదులు కిటికీలు తలుపులు చెక్ చేసారు. ఏమీ అర్థం కాలేదు. రెండో రౌండ్ చెకింగ్ లో గెస్ట్ రూం కిటికీ గ్లాస్ డోర్ తెరిచి ఉండటం కంటపడింది. అనుమానంతో ఐరన్ గ్రిల్ ఫ్రేం ని పరిశీలిస్తే విషయం తెలిసింది.

‘‘డౌటే లేదు, ఈ కిటికీ గుండా లోనకొచ్చి వెళ్ళేప్పుడు ఎప్పటిలా ఫ్రేంని బిగించి వెళ్ళారు. వాళ్ళు ఇంకో సారి వచ్చినా రావొచ్చు. రేపటి నుంచి ఏ కిటికీ కూడ వదలకుండా అన్నీ మూసేయాలి’’ అన్నాడు విరాట్.

తిరిగి హాల్లోకొచ్చారిద్దరూ.

‘‘విరాట్ నాకో డౌటురా. ఒక వేళ మన గురించి వివరాలు తెలుసుకోవాలని సహస్ర దీక్షలు ఇలా వచ్చుండొచ్చా..?’’ తన సందేహం బయటపెట్టాడు చందూ.‘‘నీ డౌట్ నాకూ వచ్చింది, కాని మనం గోస్వామి కాలనీ లో వుంటున్నట్టు వాళ్ళకెలా తెలుస్తుంది...? పోస్టర్లలో ఇచ్చిన సెల్ నెంబర్ కోయంబత్తూరులో తీసుకుంది. ఆ నంబర్ తో అడ్రసు తెలుసుకోలేరు. కాబట్టి వచ్చింది వాళ్ళు కాదు. కాలనీ అమ్మాయిలెవరో కావాలని ఈ తుంటరి పని చేసుంటారు. రేపట్నుంచి మన జాగ్రత్తలో మనం ఉందాం. తలపోటుగా ఉంది. అవన్నీ సద్దుకునే ముందు కాస్త టీ అయినాయివ్వరా?’’

‘‘వచ్చిన శంకిణీ స్త్రీలు ఎవరో గాని విందారగించాక పాల ప్యాకెట్లో పాలుకూడ కాచుకొని హార్లిక్స్ కలిపి తాగి మరీ వెళ్ళారు. లాభం లేదుగాని పద. మనం ఫుడ్ కి బయటికి పోవాల్సిందే ఈ పూటకి. వచ్చాక ఇల్లంతా సర్దుకుందాం.’’ అన్నాడు తెగ బాధపడిపోతూ చందూ.‘‘వచ్చిన వాళ్ళొచ్చినట్టే తిరిగి ఇంటికి తాళం పెట్టి బయటకు బయలుదేరారిద్దరూ.

ఆ రోజు జలుబు రొంపతో బాటు తల భారంగా ఉందని దీక్ష షాపింగ్ మాల్ కి పోకుండా సెలవు పెట్టి ఇంట్లోనే ఉండపోయింది. సహస్ర యథా ప్రకారం డ్యూటీకి వెళ్ళిపోయింది.

ఇంచుమించుగా ఇవే కారణాలతో అటు మొదటి వీధి మూడో ఇంట్లోని చందూ కూడ ఆఫీసుకు సెలవు పెట్టి ఇంట్లో ఉండిపోయాడు. విరాట్ ఒక్కడే ఆఫీసుకెళ్ళాడు. అలా అటు మూడోవీధి చివరింటి దీక్ష ఇటు మొదటి వీధి మూడోఇంటి చందూలు ఆ రోజు ఇళ్ళకు పరిమితమైపోయారు. ఈ రోజు ఉదయం ఎనిమిది గంటల వరకు కన్పించిన సూర్యుడు క్రమంగా అదృష్యమైపోయాడు. తూర్పు దిక్కు నుంచి సముద్రం మీదుగా చెన్నై నగరం మీదకు మూసుకొచ్చిన నల్లటి మబ్బులు దినకరుడ్ని తమలో దాచేసుకున్నాయి. ఈదురు గాలులు ఆగి ఆగి వీస్తూ వర్షా గమనాన్ని సూచిస్తున్నాయి. వాతావరణం చలి చలిగా ఆహ్లాదకరంగా మారింది.

సుమారు పది గంటల తర్వాత ఒక పావు గంట వాన జల్లుపడి ఆగింది. ఆ సమయంలో చేతి సంచితో బాటు గొడుగు తీసుకొని కూరగాయల మార్కెట్ కి బయలుదేరింది దీక్ష. అర్ధ గంట ఆలస్యంగా అటు నుంచి తనూ మార్కెట్ కి బయలుదేరాడు చందూ. సరిగ్గా మార్కెట్ గేటు నుండి ఏభై గజాల దూరం ఉంటుంది రోడ్డు. కాయగూరల సంచీతో మార్కెట్ గేటుదాటి దీక్ష రోడ్ వైపు వస్తూండగా చందూ రోడ్డు నుంచి మార్కెట్ సందు లోకి వస్తూ కన్పించాడు.

ముందుగా దీక్ష అతడ్ని చూసి అదిరిపడింది. అప్పటికే పదిహేనడుగుల ముందుకొచ్చేసింది. వెనక్కి తిరిగి మార్కెట్లోకి పారిపోయి తప్పించుకునే సమయం లేదు. ఆమె అతడ్ని చూసిన పదో సెకనులోనే చందూ కూడ ఆమెను చూసి గుర్తుపట్టేసాడు. తన కళ్ళని నమ్మలేక కళ్ళు నులుముకొని మరీ చూసాడు.

సందేహం లేదు...

ఆమె దీక్ష !

తను ఇక్కడుందేమిటి...?

ఇదే మార్కెట్ నుంచి కాయగూరలు తీసుకుంటోందంటే డౌటే లేదు. ఈ పరిసరాల్లోనే ఎక్కడో తను ఉంటోంది. తోక దొరికితే కుందేలు దొరికినట్టే. ఈ దీక్షను పట్టుకుంటే సహస్ర చిరునామా దొరికిపోతుంది.

ఈ లోపల...

దీక్షకు దిక్కు తోచక కళవరపడిపోతూండగా క్షణకాలం కాలు, చెయ్యి ఆడలేదు. తనను చూసేసాడు. ఏదోటి చేసి తప్పించుకోకపోతే కొంప మునుగుతుంది. వెంటపడి సహస్ర గురించి అడుగుతాడు, ఏం చేయాలి ఎలా తప్పించుకోవాలి?

దీక్ష ఉన్నట్టుండి మెల్లకన్ను పెట్టి ఎడం చెయ్యి మోకాలి మీద వేసుకొని అవిటి దానిలా ఎత్తెత్తి అడుగులేస్తూ నడక ఆరంభించింది. అది చూసి...

"ఓసినీ... ఇలాంటి విద్యలు కూడ ఉన్నాయా నీ దగ్గర? నన్ను చూసి నటిస్తున్నావంటే మేం ఈ ప్రాంతంలోనే ఉన్నట్టు తెలుసన్న మాట. విరాట్ రైల్వే స్టేషన్లో అతికించిన పోస్టర్లను చూసారన్న మాట. చూసే తప్పించుకు తిరుగుతున్నారన్న మాట. రా... రా... నీ పని చేస్తా" అనుకుంటూ తనూ ఆమెను చూసి చూడనట్టే దాటి ముందుకెళ్ళి పోయాడు చందూ.దీక్షకి చందూ తనని గుర్తుపట్టలేదని ఒకటే సంతోషం. రోడ్డెక్కితే చాలు జంపయిపోవచ్చు. నాలుగడుగులు ముందుకొచ్చేసింది. ఇంతలో వెనక నుంచి...

"ఇదిగో అమ్మాయి దీక్షా... కాలికేమైందే అలా కుంటుతున్నావ్...?" అంటూ తెలిసినావిడ ఎవరో పిలవటంతో సహజమైన నడకతో గిరుక్కున తిరిగి చూసింది. మరో షాక్...

ఎదురుగా చందూ నిలబడున్నాడు. అక్కడెవరూ తెలిసిన ఆడవాళ్ళు ఎవరూ లేరు, మరి తనను పిలిచిన లేడీ ఎవరు...? దీక్ష కంగారుగా చూస్తుండగా అంతలో... "ఏమిటి...? మరీ షాకయి పోవద్దు పిలిచింది నేనే!" అంటూ తిరిగి అదే లేడీ గొంతుతో మాట్లాడిరది ఎవరోకాదు, ఎదురుగా ఉన్న చందూ.

‘ఓర్నాయనో,  వీడిగొంతు అమ్మాయి గొంతులా మారిపోయిందేమిటి?’  అనుకునే లోపు చందూ మామూలు గొంతులో…“నువ్వు దీక్షవని నాకు తెలిసిపోయింది. నీ ఓవర్ యాక్షన్ కాస్త ఆపితే కాస్సేపు మాట్లాడుకోవచ్చు” అన్నాడు.

చందూ తనను చీట్ చేసాడని అర్థం కాగానే దీక్షకు పిచ్చి కోపం ముంచు కొచ్చింది,  “గొంతు మార్చి మోసం చేస్తావా…?  ఆగు నీ పని చెప్తా” అనుకుంటూ స్ట్రెయిట్ గా నిలబడి ఉరిమి చూసింది. “ఎవరు..? ఎవరు  నువ్వు..? నాతో పనేమిటి వెళ్ళు వెళ్ళు” అంటూ విస విసా రోడ్ వైపు అడుగులేసింది. కాని వదలకుండా ఆమె దారికి అడ్డం వచ్చేసాడు చందూ.

“నీ పేరు దీక్ష, అవునా..?” అనడిగాడు.

“లేదు నా పేరు రక్ష” అంది.

“శిక్ష ఏమీ కాదు…? బుకాయించక… దీక్షననగానే నువ్వు వెనక్కి తిరిగి చూసావ్..?”

“నేను నిన్ను చూళ్ళేదు. అయినా గొంతు మార్చి అమ్మాయిలా పిలవడానికి సిగ్గు లేదూ?”

“నువ్వు అవిటి దానిలా నడిచి నన్ను ఏ మార్చాలని చూసావ్.  నీకు సిగ్గుందా..?”

“హలో…  ఎవరయ్యా నువ్వు?  నా వెంటపడుతున్నావ్,  నీకేం కావాలి..?” కాస్త గొంతు పెంచింది దీక్ష.

అప్పుడే చుట్టు పక్కల వాళ్ళ దృష్టి తమ మీద పడింది.  అల్లరి చేసి తప్పించుకోవాలని ప్లానా?  చెప్తా అనుకుంటూ “ చూడు దీక్ష సహస్ర ఎక్కడుందో చెప్పు.  వెళ్ళిపోతాను” అన్నాడు.

“సహస్ర ఎవరూ…?” అంది అమాయకంగా పోజిచ్చి.

“సహస్ర తెలీదా..? నువ్వు పెద్ద మాయలేడివని అర్ధమైపోయింది..?   వదిలితే చేతికి దొరకవు.   మర్యాదగా సహస్ర ఎక్కడుందో చెప్తావా లేదా..?”

“చెప్పను ఏం చేస్తావ్..?   మీద మీద కొస్తున్నావ్...? ఏంటి ఉద్దేశం...?   ఈవ్ టీజింగ్ అంటే పోలీసులే రానక్కర్లేదు.   పబ్లిక్ నిన్ను పచ్చడి చేస్తారు. మీ ఉసిలం పట్టి అనుకున్నావా..?”   అనేసి గబుక్కున నాలిక్కరుచుకుంది.   టంగ్ అనవసరంగా స్లిప్పయింది. ఏం టెన్షన్ పెడతాడో అని గాభరా పడి తప్పించుకు పోబోయింది దీక్ష.

ఉసిలంపట్టి అనగానే ఉలిక్కిపడ్డాడు చందూ...

తనది ఉసిలంపట్టి గ్రామమని ఈవిడకెలా తెలుసు...?!!

వామ్మో...   తమ గురించి మొత్తం ఇన్ఫర్మేషన్   పట్టేసినట్టుంది. అన్నీ తెలిసే నాటకాలాడుతోంది.   కోపంతో మళ్ళీ ఆమె దారికి అడ్డం వచ్చేసాడు.

“ఏయ్ శంకిణీ.... ఆగు” అన్నాడు చందూ.

“నేను శంకిణీనా...”

“శంకిణీ లంకిణీ,   శాకిణీ, ఢాకిణీ అన్నీ నువ్వే. మాది ఉసిలంపట్టి అని నీకెలా తెలుసు..?”

“మరీ ఆవేశపడకు.   ఉసిలంపట్టి కుర్రాళ్ళు తిక్కవేషాలేసి నా వంటలు అద్భుతంగా చేస్తారని విన్నాను. అందుకే అలా అన్నాను.”

“వంటలు.... ఓసినీ... నాకిప్పుడర్ధమైపోయింది. మా యింట్లో పడ్డ ఆడ దొంగలు మీరే కదూ...?”

“దొంగలేమిటి? కాసేపాగితే డైరీలు చదివేసానని కూడ అంటావ్. తప్పుకోరా... నేను వెళ్ళాలి”.

“నన్ను ఏరా అంటావా...”

“నువ్వు నన్ను ఒసే అన్నావ్ గా నేనంటే తప్పా? పొద్దుటే ఎవరి ముఖం చూసానో, జిడ్డులా తగులుకున్నావేంట్రా బాబూ. ఇలా కాదుగాని ఆగు నీ పనిచెప్తా...” అంటూ చుట్టూ చూసింది దీక్ష.

అప్పటికే మార్కెట్ కొచ్చిన కొందరు స్త్రీ పురుషులు వచ్చినపని మర్చిపోయి దూరంగా ఉండి చోద్యం చూస్తున్నారు. ఇటు పూల కొట్టు పరిమళం, తమలపాకుల కొట్టు తంగపుష్పం, కొబ్బరికాయల కొట్టు దశావతారం అంతా ఓ పక్కవ్యాపారం సాగిస్తూనే ఓ కన్ను ఇటేసి గమనిస్తున్నారు.

“ఇదిగో పరిమళం పిన్ని, తంగపుష్పం అత్తా, దశావతారం మావయ్యా... రండి రండి కాపాడండి” ఉన్నట్టుండి అరిచింది దీక్ష.అదిరిపడ్డాడు చందూ.

అయ్యా బాబోయ్ వరసలు కలిపి మరీ అందర్నీ పిలిచేస్తోంది. ఖచ్చితంగా ఇది నన్ను తన్నించే ఉద్దేశంలోనే ఉంది. ఎస్కేపవ్వటం మంచిదేమో... కంగారు అణచుకుంటూ ఆలోచిస్తున్నాడు చందూ. కాని పారిపోడానికి మనసంగీకరించటం లేదు. ఇంతలో చుట్టూ జనం చేరిపోయారు.

చెంగు తిప్పి బొడ్లో దోపి చందూనూ ఎగాదిగా చూసింది పరిమళం. ఆమె తీరు చూస్తే ఎలాంటి మగాడ్నయినా ఒక్క గుద్దులో మట్టి కరిపించేలా ఉంది.

“ఏంది దీక్షమ్మా, ఇందాకట్నుంచి చూస్తున్నాను. ఏంటి మీ యవ్వారం? ఈ పిల్లగాడు నిన్నల్లరి చేస్తున్నాడా సెప్పు, జడ్జిగారి పిల్లదాన్ని నలుగురు తుంటరోళ్ళు ఏడిపిస్తుంటే పట్టి కొట్టి అదో.. ఆ సెట్టు కింద గుండు కొట్టి పంపించినాం. చెప్పు దీక్షమ్మ ఏం జరిగింది?” ఇంత లావున నోరు తెరిచి పరిమళం అరుస్తుంటే చందూకి అరచేతులు చెమటలు పట్టేశాయి. ఇంతలో

దశావతారం కల్పించుకొంటూ ఓసి   ‘‘ఆగండెహె... ఈ బాబు చాలా మంచోడు, అలాంటోడు కాదు. అసలేం జరిగిందో విచారించండి. ఇద్దరూ మన మార్కెట్ కివచ్చిపోయేవాళ్ళేగా. ఏనాడన్నా గొడవకెళ్ళినారా ఏంటి..? అంటూ చందూకి సపోర్టు రావటంతో కాస్త ఊపిరి తీసుకున్నాడు చందూ.

వెంటనే తంగపుష్పం అందుకుంటూ. ‘‘ఈ మగాళ్ళకి ఎప్పుడేం పాడుబుద్ధి పుడతాదో...   నువ్వు చెప్పు దీక్షమ్మ, నిన్ను ఏడిపిస్తున్నాడా...? భయపడక. చెప్పు. నాలుగు తగిలిస్తే మళ్ళీ నీ జోలికి రాడు’’ అనరిచింది.

చందూకి గుండెల్లో రాయిపడినట్టయింది. దీక్ష సైగ చేస్తే చాలు ఆడాళ్ళంతా తనకి దేహశుద్ధి చేసేలా ఉన్నారు. పారిపోడానికి దారి ఎటుందాని అతడి కళ్ళు వెదక సాగాయి. కాని దీక్ష ఎలాంటి సైగ చేయకుండానే సిగ్గుపడిపోతూ... ‘‘ఛఛ అలాంటిదేం కాదత్తా’’ అంది.

‘‘మరింకేంటి తల్లి ఏంటి మీ గోల.?’’ విసుగ్గా అరిచింది పరిమళం.‘‘మరి.... మరి...   ఇతనెవరో కాదు పిన్నీ నా బావ!’’ అంది దీక్ష.

అంతే!



జరిగిన కథ :

ఆఫీస్ లనుండి వచ్చి తాళం తీసిన చందు, విరాట్ లు  డైనింగ్ టేబుల్ మీద సీనంతా చూసి దొంగలొచ్చారనుకుంటారు. ఆ తరువాత  ఎక్కడి సామాన్లక్కడ వుండడం తో ఇదంతా  ఎవరో ఆకతాయిల పనే అయి వుంటుందనుకుంటారు. మార్కెట్లో అనుకోకుండా  చందూకి ఎదురైన దీక్ష అతన్నుంచి తప్పించుకోవడానికి విఫల యత్నం చేస్తుంది. అక్కడ  ఇద్దరి మధ్య ఊహించని విధంగా కొత్త నాటకమాడుతుంది దీక్ష... ఆ తరువాత

......................................

తెరిచిన నోళ్ళు మూయటం మర్చిపోయారంతా.     చందూ అయితే ఓరి దేవుడో ఈ ట్విస్టేమిట్రా నాయనో..?     అసలిది తనని ఎక్కడ ఎలా ఇరికించాలని చూస్తోందో అర్ధమై చావటల్లేదు అని జుత్తు పీక్కున్నాడు చుట్టూ ఉన్న జనం పక్కున నవ్వుకున్నారు.

''ఓహో... బావ మరదళ్ళ సరసాలయితే ఇంట్లో బాగుంటది, పబ్లిక్ లో ఇదేం బాగలేదు గాని ఎల్లండెల్లండి''     అనరిచింది మరో స్త్రీ.

''అది కాదత్తా బావకి నేనంటే చాలా యిష్టం.     కాని నాకే...     అస్సలు ఇష్టం లేదు.     చేసుకోనని ఎప్పుడో చెప్పేసాను. అయినా వినకుండా ఇదో.... యిలా ఎక్కడబడితే అక్కడ ఆపి పెళ్ళికి ఒప్పుకోమ నివిసిగిస్తున్నాడు. ఇష్టం లేని పెళ్ళి చేసుకుని ఏం సుఖ పడతాను చెప్పండి.

మనిషి మంచోడే...     నాకిష్టం లేదంతే ఏం చేయను,     మీరయినా ఇక నా వెంటపడొద్దని బావకి నచ్చ చెప్పండి ప్లీజ్ '' అంటూ ఎంతో సహజంగా, దీనంగా దీక్ష అర్థిస్తుంటే చందూకి గింగిరాలు తిరిగి బొంగరంలా వాలి పోయినంతపనైంది. ''ఇదేం చోద్యమమ్మా, అతను ని బావంటున్నావు. లక్షణంగా వున్నాడు.     నువ్వంటే యిష్టపడుతున్నాడు. చేసుకోవచ్చుగా. ఎందుకిష్టం లేదేమిటి..?'' అంటూ బుగ్గులు నొక్కుకుంది పరిమళం.''ఎలా చేసుకోను చెప్పండి..?     ఏనాడన్నా ఓ ముద్దూ ముచ్చటా ఉందా..?     చేతులకి గాజులేయించాడా కట్టుకోడానికో చీర కొనిచ్చాడా, ఎప్పుడు చూడు అమ్మా నాన్న చెల్లెళ్ళంటూ సంపాదనంతా వాళ్ళకే పెట్టేస్తున్నాడు.     పెద్దచెల్లెలు పెళ్ళి తనే చేసాడు,     అంత ప్రేమే వుంటే నాకో నగానట్రా కొనివ్వచ్చుగా! నావల్ల కాదు బాబూ నేను చేసుకోనంతే. కాస్త మీరయినా నచ్చచెప్పి పంపించేయండి''     అంది. ఆ మాటలు వినగానే ఒక్కసారిగా చందూకి కళ్ళ ముందు చుక్కలు కన్పించాయి.     కర్ర విరక్కుండా పాము చావకుండా మధ్యే మార్గంగా తను తప్పించుకు పోవటానికి భలే ఎత్తు వేసింది.     డౌటు క్లియరై పోయింది.     తమ ఇంట్లో పడి మెక్కిపోయిన ఆడ గొంగలు వీళ్ళే. ఇల్లంతా చక్క బెట్టి డైరీ చదివేసి ఎక్కడివక్కడ సర్దేసి చక్కగా వెళ్ళిపోయారు, లేకపోతే దీక్షకి ఇన్ని విషయాలు తన గురించి తెలిసే ఛాన్సే లేదు. చందూ ఆలోచనల్లో చందూ ఉండగానే చుట్టూ చేరిన వాళ్ళు తలో మాట చందూకి బుద్ధి చెప్పటం ఆరంభించారు. తిరిగి చూసిన చందూకి అక్కడ దీక్ష కనిపించ లేదు. అప్పటికే తను రోడ్డు వరకు వెళ్ళిపోయి ఆటో ఎక్కేస్తోంది.     చందూ పరుగెత్తుకొచ్చే లోపు ఆటో వెళ్ళిపోసాగింది.     అది తమ కాలనీ గేటు వైపే వెళ్ళటం చూసి షాక్     తిన్నాడు చందూ. ఆటో నంబరు గుర్తు పెట్టుకుంటూ కాయగూరల సంగతి మరిచిపోయి వడివడిగా ఆటో వెళ్ళిన వైపుగా నడక ఆరంభించాడు. అంత వరకూ మౌనంగా ఉన్న కారు మబ్బులు ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో సందడి ఆరంభించాయి. తిరిగి తడి పొడి చినుకులతో వాన జల్లు ఆరంభమైంది.

తమ గోస్వామి కాలనీ గేటుకి కొంచెం దూరంలో ఉండగానే కాలనీలోకి వెళ్ళిన ఆటో తిరిగొస్తు కన్పించింది. అది తమ మొదటి వీధిలోకి గాని గేటు ఎదురుగా వున్న రెండో వీధిలోకి గాని పోకుండా కుడి పక్క వీధిలొకెళ్ళి తిరిగి రావటం చూస్తుంటే ఖచ్చితంగా దీక్ష మూడో వీధిలో దిగుంటుంది.     ఎక్కడ దిగిందో తెలిస్తే చాలు.

తనను సమీపించగానే ఆటోని ఆపాడు...

‘‘ఎక్కడి కెళ్ళాలి సార్...?’’ అడిగాడు ఆటో వాలా.

‘‘వెళ్ళక్కర్లేదుగాని ఆటో ఎక్కిన అమ్మాయిని మూడో వీధిలో ఎక్కడదించావో చెప్పుచాలు’’ అడిగాడు చందూ.

‘‘చెప్పబడదు సార్ ’’ అన్నాడు వాడు.

‘‘అదేంటయ్యా కాస్త చెప్పి సాయం చేయొచ్చుగా’’

‘‘నాకూ చేయాలనే ఉంది సార్, కాని ఫ్రీ సర్వీస్ చేసే అలవాటు నా ఆటోకి లేదు.’’

‘‘అర్ధమైంది, ఇప్పుడుంటుంది చెప్పు’’ అంటూ ఏభై రూపాయల నోటు ఒకటి చేతిలో పెట్టాడు.

‘‘థాంక్యూసార్, మీరే మెరుగు సార్ చెప్పగానే అర్ధం చేసుకొని ఏభై యిచ్చారు. ఆ పిల్ల మహా పెంకి సార్ . పది రూపాయలు చేతిలో పెట్టి పైన పైసాయివ్వను పొమ్మంది. వెళ్ళండి సార్, మూడో వీధిలో చిట్ట చివరి విల్లా. ఇంటి నంబరు నూట ఎనభై. ఆయిల్లు దీక్ష మేడందే సార్. అన్నట్టు మీరుండేదీ యిదే కాలనీ గదా. మీకు తెలికపోడం ఏంటి సార్..?’’

చందూ చిన్నగా నవ్వి ‘‘ఏదైనా అవసరంపడినప్పుడే గదా తెలుసుకోవాలనుకుంటాం. ఇప్పుడు అవసరం పడిరది. థాంక్యూ బ్రదర్. వెళ్ళిరా’’ అన్నాడు.

‘‘వర్షం పెరిగేలా ఉంది సార్, ఆటో ఎక్కండి. అక్కడ దించేస్తాను డబ్బులివ్వద్దులే’’

''వద్దులే నువ్వెళ్ళు''

ఆటో వెళ్ళిపోయింది.

రెండు నిముషాల నడక తర్వాత దీక్ష ఇంటిని సమీపించాడు చందూ

తడిపొడి చినుకులు అప్పటికే బట్టల్ని కాస్త తడిపేసాయి. ఇంటిని సమీపిస్తుండగా ఉన్నట్టుండి వాన ఎక్కువైంది. ఇక ఆలస్యం చేయకుండా పరుగెత్తి గేటు తీసుకొని లోనకెళ్ళి పోర్టికోలో అడుగుపెట్టాడు.

''ఛ! పాడువాన..... ఇప్పుడే కురవాలా..?'' విసుక్కొంటూ ముఖ ద్వారం వంక చూసాడు చందూ. అంచనా మరోసారి ఘోరంగా తప్పింది.వీధిగుమ్మంతలుపులుమూసిఉంటాయని, లోనబోల్టుబిగించుకొన్న దీక్షతనెంతఅరిచినా బ్రతిమాలినా తలుపు తీయదని అనుకున్నాడు.

కాని అందుకు బిన్నంగా...

తలుపులు బార్లా తెరిచే ఉన్నాయి. లోన దీక్ష ఒక్కతే ఉందో సహస్ర కూడ ఉందో అర్థం కాలేదు. కర్చీఫ్ తీసి తలతుడుచుకొంటూ పోర్టికో లోంచి మెట్ల మీదకు వెళ్ళాడు. ఇంతలో...

''నువ్వు వదలవు. ఇల్లు వెదుక్కొంటూ వచ్చేస్తావని వూహించాను. తడిసినట్టున్నావు. మెట్ల మీద బకెట్లో నీళ్ళున్నాయి. తాడు మీద టవలుంది. కాళ్ళ కడుక్కొని తల తుడుచుకొని లోనకురా!'' అంటూ లోపట్నుంచి దీక్ష మాటలు విన్పించాయి.మళ్ళీ సందేహం...లోనకు పిలిచిబడితె పూజ చేయదు గదా...?

''హలో.......... అశరీరవాణిలా మాటలు విన్పిస్తున్నాయి. నువ్వెక్కడున్నావ్..?'' ఉన్నచోట నిలబడి అడిగాడు.''నీ కోసం హారతి పళ్ళెం సిద్ధం చేస్తున్నా. బుద్ధి లేకపోతే సరి. వీధి గుమ్మంలోంచి ఏంటా అరుపులు..? వచ్చి కూచో!'' ఈ సారి దీక్ష మాటల్లో కమాండిరగ్ ధ్వనించింది.

'ఓరి దేవుడా,  ఇది పిల్ల కాదురా బాబు పిడుగు,  ఎన్ని నాటకాలాడులోంది..?  ఇంతదాకా వచ్చాక తప్పుతుందా చూద్దాం'  అనుకుంటూ కాళ్ళు కడుక్కొని, చెప్పులు పక్కన వదిలితాడు మీద టవల్  అందుకున్నాడు. తల తుడుచుకొంటూ గడప దాటి హాల్లోకెళ్ళాడు.కిచెన్లో బిజిగా కన్పించింది దీక్ష. స్టౌ మీద టీ మరుగుతున్నట్టుంది. కమ్మటి టీ వాసన మజాగా వుంది. " ఒక్క నిముషం సోఫాలో కూచో.  వచ్చేస్తున్నా!"  అంది అతడ్ని చూసిన దీక్ష.

మౌనంగా సోఫాలో కూచున్నాడు.

ఈ అమ్మాయిలేమిట్రా బాబు ఓ పట్టాన అర్థంకారు.

మార్కెట్లో చూసిన దీక్షకి ఇపుడు ఇంట్లో చూస్తున్న దీక్షకి ఎంత తేడా వుంది!  పైగా తన ఆలోచనలింత షార్ప్ గా ఉంటాయా..? అక్కడ పోట్లాడి పారిపోయి వచ్చింది. ఇక్కడ తన రాకను ముందే వూహించి చుడీదార్ నుంచి చీరకట్టు లోకి మారిపోయి, బయట బకెట్ లో నీళ్ళు, దండెం మీద టవలు రెడీగా ఉంచింది.

అతడి ఆలోచనల్ని చెదరగొడుతూ బిస్కట్లు ఉంచిన ట్రే లో అక్కడి కొచ్చింది దీక్ష.  చిరునవ్వులు చిందుస్తూ... "సారీ మొదటి సారిగా మా యింటి కొచ్చావ్.  స్వీట్  పెడదామంటే టీ చప్పగా  ఉంటుంది.  అందుకే సాల్ట్  బిస్కట్లు తెచ్చాను. తింటూ ఉండు టీ తెస్తాను"  అంది ట్రే ని టీపాయి మీద ఉంచి.

"మర్యాదలెందుగ్గాని,  సహస్ర ఎక్కడుంటుందో అడ్రసు చెప్పు.  వెళ్ళిపోతాను" అన్నాడు కాస్త బింకం ప్రదర్శిస్తూ."చెప్పనంత వరకు ఉంటావ్ గా.  ఉండు.  చెప్పాకే వెళ్ళు.  ఓ పక్క వాన పడుతుంటే వెళ్ళిపోతాట్ట. ముఖం చూడు" అంటూ కసురుకుంది మళ్ళీ కిచెన్ లోకి వెళ్ళింది.వెళ్తున్న దీక్షను వెనక నుంచి చూసి కాస్సేపు తనను తాను మర్చిపోయాడు చందూ. కాస్త రంగు తక్కువగాని దీక్షకేం తక్కువ..?  తనూ అందంగానే ఉంది అన్పించింది. మాటకారి, చలాకీతనం, తెలివి తేటలు, ఎందులోనూ తక్కువకాదు.

బయట వర్షం జోరు ఇంకా పెరిగింది.

దానికి కాస్త గాలివిసురు కూడ తోడైంది.

ఇంట్లో దీక్ష తప్ప ఇంకెవరూ ఉన్నట్టు లేదు. ఇలాంటి వాతావరణంలో వయసులో జంట ఒకే ఇంట్లో ఉంటే పిచ్చి ఆలోచనలొస్తాయి. ఆపైన ఎవరన్న చూస్తే పెడార్థాలు తీస్తారు, "దీక్షా... త్వరగా రా, నే వెళ్ళాలి..." తనలో తను విసుక్కుంటూనే రెండు సాల్ట్ బిస్కట్లు తిన్నాడు. ఇంతలో అందమైన రెండు పెద్దసైజు చైనా కప్పుల్లో పొగలుకక్కుతున్న వేడి టీ పోసి ట్రే లో ఉంచి తెచ్చింది దీక్ష. ట్రే ని టీపాయి మీద ఉంచి ఎదురుగా సోఫాలో కూచుంది. చందూ టీ కప్పు అందుకోబోతే చనువుగా చేతి మీద కొట్టింది దీక్ష. "ఇంత వేడి టీ... తాగేస్తావా...? టీ కి తొందరముంది...? బిస్కట్లు ఎవరు తింటారు...? ముందివి తీసుకో" అంటూ తనూ తీసుకుంది. ఆమె ముందు తను పసివాడై పోతున్నట్టుంది చందూకి.

"నాకేమీ అర్థంగావటం లేదు. పిచ్చిపట్టేలా ఉంది. ఓరి దేవుడో.. అసలు నువ్వు గయ్యాళివా... తిక్కదానివా... మంచి దానివా..""తెలివైనదాన్ని..." అతడి మాటల్ని ఖండిస్తు నవ్వింది దీక్ష.

"ఆ సంగతి నాకు ఇప్పుడేగా తెలిసింది. ఖర్మ అక్కడేమో పోట్లాడావ్. తన్నించబోయి బావనంటూ తప్పించావ్. పారిపోయివచ్చేసావ్. తీరా ఇంటికొస్తే మంచిగా కూచోబెట్టి మర్యాద చేస్తున్నావ్. ఓర్నాయనో... నిన్నెలా అర్థం చేసుకోవాలి?"

"నువ్వు నాకు అర్థమయ్యావ్ లేరా. నేన్నీకు అర్థంగాక పోయినా ఫరవాలేదు."" అదిగో... మళ్ళీ నన్ను రా అంటున్నావ్. ఇలా పరిచయమయ్యాయో అరేయ్... ఒరేయ్... అంటున్నారు.." అయోమయానికి లోనవుతూ అన్నాడు చందు.

"ఏవండీ... ఏంటండి అనటానికి టైమ్ కావాలి. అరేయ్... ఒరేయ్ అనటానికి టైమెందుకు?

"నువ్వు నన్ను అలాగే పిలు.. ఒసే... రావే.. పోవే.. బాగుంది. ఇలా పిలుచుకోవటం కొత్తగా చాలా బాగుంది. ఫ్రండ్స్ అలాగే పిలుచుకుంటారుగా. నీకు తెలుసా..? ఇంత వరకు నన్ను ఏ మగాడు అలా పిలిచింది లేదు. అఫ్ కోర్స్ పిలిస్తే పళ్ళూడగొట్టేదాన్ననుకో. అందరితో అంత చనువుగా ఉంటామా ఏంటి?"

"అందుకేనా నన్ను బావని చేసేసావ్..? ఏంటి..? నీకు గాజులు వేయించ లేదా..? చీర కొనివ్వలేదా.. నగా నట్రా... అందుకే

నేనంటే ఇష్టం... లేదా...'' అంటూ ఇక ఆపుకోలేక పెద్దగా నవ్వేసాడు చందూ. తనూ నవ్వేసింది దీక్ష.

''నేనలా చెప్పకపోతే వాళ్ళు నిన్ను తన్నే వాళ్ళు తెలుసా? అందుకే అలా చెప్పాను'' అంది నవ్వాపుకొంటూ.

బయట వర్షం మరీ ఎక్కువైంది.

భారీ వర్షం.

పట్ట పగలే చీకట్లు ముసురుకుంటున్నట్టుంది.

హాల్లో ట్యూబ్ లైటు ఆన్ చేసి వచ్చి కూచుంది దీక్ష. బిస్కట్లు తింటూ కబుర్లు చెప్పుకొని టీ తాగారు.

''ఇంతకీ సహస్ర గురించి చెప్పలేదు'' గుర్తు చేసాడు.

''ఏరా మా సహస్ర నీ ఫ్రండు విరాట్ కి అంత నచ్చిందా..? ఏకంగా రైల్వేస్టేషన్ల లోనే పోస్టర్లు వేయించేసాడు?'' అంది నవ్వుతూ.''అవును మావాడికి నచ్చకపోతే పట్టించుకోడు. నచ్చితే ప్రాణంపోయినా వదులుకోడు. సహస్రని చూడాలని తన ప్రేమని చెప్పాలని తపించి పోతున్నాడు''

''నాకు తెలుసు. సహస్ర నేను మీ యింట్లోకి దొంగతనంగా వచ్చినప్పుడే ఆ విషయం అర్థమైంది. పడగ్గదిలో ఏకంగా మా సహస్ర వాల్ పోష్టర్లే అంటించుకున్నాడుగా''

''మేం ఇక్కడే ఉంటున్నట్టు ఎలా తెలిసింది?''

''ఎలా ఏంటి..? ఒకే కాలనీలో ఉంటున్నప్పుడు ఏదో రోజు దొరికిపోకుండా ఉంటామా..? మేము స్కూటీ మీద షాపింగ్ మాల్ కి

వెళ్తుండగా నువ్వు పాలకి పోతూ కన్పించావ్'' అంటూ జరిగింది క్లుప్తంగా వివరించిది దీక్ష.

''సహస్ర ఎక్కడ?'' ఆత్రుతగా అడిగాడు.

''డ్యూటికి వెళ్ళిపోయింది. తన గురించి చెప్పాలంటే నువ్వు నాకో మాటివ్వాలి''

''ఏమని?''

''మేము ఈ కాలనీ లోనే ఉంటున్న సంగతి నువ్వు విరాట్ తో చెప్పకూడదు''

''మళ్ళీ ఇదేం మెలిక...? ఇంత కష్టపడిరది వాడి కోసమే గదా''

''ఆ కష్టం వేస్ట్ కాకూడదనే ముందుగా హెచ్చరిస్తున్నాను. విరాట్ కి తెలిస్తే సహస్ర ఇక్కడుండదు. నాతో కూడా చెప్పకుండానే వెళ్ళిపోతుంది''

చందూకి ఏం మాట్లాడాలో తెలిక...

కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు.

''ఎంతకాలమిలా...? అసలి సహస్ర ఎవరు...? ఎక్కడ్నించి వచ్చింది?'' సూటిగా చూస్తు అడిగాడు.

''విరాట్ తో చెప్పనని ప్రామిస్ చెయ్యి. అన్ని విషయాలుచెప్తాను'' అంటూ చేయి చాపింది దీక్ష.

“ఓకే. చెప్పను ప్రామిస్” అంటూ చేతిలో చేయి వేసాడు. అతడి చేతిని బిగించి పట్టుకుంది దీక్ష. చందూకి నరాలు జివ్వుమన్నాయి. ఒళ్ళంతా ఒక్కసారిగా కరెంట్ షాక్ తిన్నట్టయింది. చేతిని లాక్కోబోయాడు. వదల్లేదు దీక్ష.

“ఈ క్షణం నుండి మనం ఫ్రెండ్స్. చెప్పరా. ఒకేనా?” కళ్ళలోకి చూస్తూ అడిగింది.

“ఒకే ఒకే.. ముందు చెయ్యి వదలవే బాబూ. అసలే బ్రహ్మచారిని. నువ్వు ఇలాంటి టచింగ్లిస్తే మాడిమసైపోతాను. వాతావరణం చూస్తే బాగాలేదు” అంటూ చేయి వెనక్కి తీసుకున్నాడు.

ఫక్కున నవ్వింది దీక్ష.

“మరీ అమాయకుడిలా ఫోజులివ్వకు. ఇంతకీ మా సహస్ర ఎవరుకుంటున్నావ్?” అంది.

“నువ్వింకా చెప్పలేదుగా. నాకెలా తెలుస్తుంది” అన్నాడు.

“ఇప్పుడు చెప్తాను. కాని విరాట్ తో నిజంగా చెప్పవు గదా?”

“నీకు మాటిచ్చాను. చెప్పను సందేహించక్కర్లేదు.”

“నీకు తెలియదు చందూ. మీలాగే సహస్త్ర నేనూ ప్రాణ స్నేహితులం. మాది స్వస్థలం మధురై. మమ్మీ, డాడి ఆక్సిడెంట్ లో పోయారు. ఆడ పిల్లకు ఆస్థి పంచకుండా మా అన్నలయిదుగురూ కాజేయాలని చూసారు. కోర్టుకెళ్ళి గెలిచాను. ఆ కష్టసమయంలో సహస్ర నాకు ఎంతో అండగా నిలబడిరది.

నా వాటాగా వచ్చిన అయిదు కోట్లు తీసుకొని మా వాళ్ళ ముఖం చూడ్డం ఇష్టంలేక చెన్నై వచ్చేసి ఈ ఇల్లు కొనుక్కుని జాబ్ చేసుకుంటున్నాను. నేనిక్కడున్న సంగతి సహస్రకు తప్ప మధురై లో గాని, మా బంధువుల్లోగాని ఎవరికీ తెలీదు. నిజానికి నేను ఉద్యోగం చేయాల్సిన పని లేదు. బ్యాంకుల్లో నా డబ్బు మీద వచ్చే వడ్డీ చాలు హాయిగా బ్రతికేయొచ్చు. మనిషై పుట్టాక

ఓపికున్నంతవరకూ కష్టపడుతూనే ఉండాలి. సోమరితనం అంటే నాకసహ్యం. అందుకే ఉద్యోగం.

సహస్ర నా వద్దకి రాక పూర్వం ఒంటరితనం నన్ను ఎంతో భయపెట్టేది. నా అనే వాళ్ళు లేరు. ఒంటరి బతుకు. ఇంటికొస్తే పలకరించే దిక్కులేదు. ఇదేమి జీవితంరా భగవంతుడాని ఏడ్చేదాన్ని..'' అంటూ బాధతో గొంతు మూగ పోగా కన్నీళ్ళు పెట్టుకుంది దీక్ష.ఆమె మాటలు వింటూ చందూ కూడా బాధపడ్డాడు.

''రిలాక్స్ దీక్ష ప్లీజ్'' అన్నాడు.

పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

''సారీ చందూ. నా గతం చెప్పి నిన్ను ఇబ్బంది పెడుతున్నట్టున్నాను. నిజానికి సహస్ర వచ్చాకే తిరిగి నాలో ధైర్యం వచ్చింది. జీవితం మీద విసుగుపోయింది. కొత్త ఉత్సాహం ఏర్పడిరది. ఇదంతా నీతో ఎందుకు చెప్తున్నానంటే విరాట్ మూలంగా సహస్ర తిరిగి నాకు దూరంగా వెళ్ళిపోతేనేను మళ్ళి ఒంటరిదాన్నయిపోతాను..''

''ఒకే.. నాకు అర్థమైంది. నేనుగా చెప్పనని మాటిస్తున్నాగా.. మనలాగే వాళ్ళిద్దరూ ఒకరి కొకరు తారసపడితే అప్పుడు సంగతి ఏమో. నన్నునమ్ము. నా అంతట నేను చెప్పను సరేనా?''

''ఒకే!'' అంటూ మరోసారి చెమర్చిన కళ్ళు తుడుచుకుంది.

బయట వాన జోరు ఇంకా తగ్గలేదు. ఈదురు గాలి ఆగి ఆగి వీస్తోంది.

''మా స్వస్థలం మధురైయని చెప్పా గదా. సహస్ర సాధారణ కుటుంబానికి చెందిన యువతి కాదు. మధురైను ఒకప్పుడు పరిపాలించిన తెలుగు నాయక రాజుల వంశానికి చెందిన అమ్మాయి. ఆమె తండ్రి మహాదేవ నాయకర్ తల్లి మూగాంబిగై, మధురైలో సగం లిక్కర్ షాపులు నాయకర్వే. ఇతర వ్యాపారాలూ అనేకం ఉన్నాయి. మల్టిమిలియనీర్. అటువంటి నాయకర్ దంపతులకు ఏకైక కుమార్తె సహస్ర'' అంటూ చెప్పటం ఆపింది దీక్ష.



జరిగిన కథ : చందూకి దీక్ష మార్కెట్లో కనిపించి, కవ్వించి, కంఫ్యూజన్ కి గురిచేస్తుంది ఆమెని ఫాలో అయి ఇంటికి చేరుకుంటాడు. అక్కడెంతో గొడవ చేస్తుందనుకున్న చందూ అంచనాలకు విరుద్ధంగా చక్కగా రిసీవ్ చేసుకుంటుంది...తనకూ, సహస్రకూ మధ్య ఉన్న స్నేహం, తమ కుటుంబ నేపథ్యాలూ చెప్పడం మొదలెడుతుంది....

ఆ తర్వాత....

ఆసక్తిగా వింటున్నాడు చందూ.

తమ వూహే నిజమైంది.

ఉన్నత కుటుంబానికి చెందిన అమ్మాయి గాబట్టే ముఖం తెలికుండా చున్నీ కట్టుకొని ఘోషా పాటిస్తోంది. అయినా ఓ మాట అడిగితే డౌటు క్లియరవుతుందని దీక్షను అడిగితే కారణం అది కాదనట్టు తల అడ్డంగా వూపింది.

''సహస్ర మంచి పేరున్న జర్నలిస్టు. రచయిత్రిగా పాఠకులకు చిరపరిచితురాలు. ఆధునిక బావాలు గల యువతి. ఘోషా పాటించే అలవాటు తనకు లేదు'' అంది.

''మరెందుకలా?'' కుతూహలంగా అడిగాడు.''నాతో వివరంగా తనూ ఇంతవరకు చెప్పలేదు. సింపుల్ గా తను మధురై వదిలి రావటానికి రెండే కారణాలు చెప్పింది. ఒకటి ఇష్టం లేని పెళ్ళి నుంచి తప్పించుకోడానికి. రెండోది వృత్తిపరమైన సమస్య లేవో ఉన్నాయట. ఇంతే చెప్పింది. వృత్తి పరమైన సమస్యలు అందరికీ ఉండేవే, వాటికి భయపడేంత బలహీన మనస్తత్వం కాదు తనది. ఎలాంటి సమస్యనయినా ఎదిరించి పోరాడే ధైర్యం ఆమె బ్లడ్ లోనే ఉంది.''

''మరి ఘోషా పాటించాల్సిన అవసరం ఏమిటి?''

''భయం. తండ్రి అంటే భయం. మహా దేవనాకర్ చండశాసనుడు. ఒక్కతే కూతురని ఎంత గారాభంగా పెంచాడో అంతకంత తన మాట జరిగి తీరాలనే పట్టుదల మనిషి. బాధ్యత గల తండ్రిగా తనిచ్చే జీవితాన్ని సంతోషంగా తీసుకోవాలిగాని వయసు కొచ్చాం గదా అని తన జీవితాన్ని తనే నిర్ణయించుకునే స్వతంత్రం ఆడపిల్లకు లేదంటాడు. తన మాట తనదే గాని ఎవరు చెప్పినా వినని మొండి మనిషి. ఆ పైన లిక్కర్ సిండికేట్ల గురించి చెప్పాల్సింది లేదు. చేతికింద గూండాలు రౌడీలు పని చేస్తుంటారు.

కాబట్టి ఇష్టం లేని పెళ్ళి తప్పించుకోడానికి పారిపోయివచ్చినా, అక్కడ మహా దేవనాయకర్ చేతులు కట్టుకు కూచోడు. సహస్ర కోసం తన మనుషుల్ని పంపించి దేశమంతా గాలిస్తుంటాడు. పొరబాటున అలాంటి వాళ్ళ కంటపడితే ప్రమాదం. అందుకే చున్నీతో ముఖం దాచుకొంటోందని నా అభిప్రాయం'' అంది దీక్ష. ఆమె అభిప్రాయాన్ని తోసిపుచ్చే అవకాశం లేదు. చందూ కూడా అంగీకరించాడు.''ఒకే ఇక ఆ విషయం వదిలేద్దాం. పెళ్ళి ఇష్టం లేక వచ్చేసిందన్నావ్ బాగుంది. మరి మా విరాట్ కూడా తనకి నచ్చలేదా? అందుకే ఫోన్ చేయలేదా?'' అనడిగాడు.

ఆ మాటకి పెద్దగా నిట్టూర్చింది దీక్ష.

‘‘మీ మగాళ్ళెప్పుడూ యింతేరా. ముక్కుసూటిగా ఆలోచించి బోల్తా పడతారు. విరాట్ తనికి నచ్చలేదని నేను చెప్పానా?’’

కోప్పడిరది.

‘‘నేనడిగింది ఫోన్ ఎందుకు చేయలేదని’’

‘‘చేసే ఉద్దేశం తనకి లేదు’’

‘‘అంటే నచ్చలేదనేగా అర్థం?’’

‘‘ఇప్పుడు నిన్నో మాట అడుగుతాను. టక్కున బదులు చెప్పుచూద్దాం. నేన్నీకు నచ్చానా? మనం పెళ్ళి చేసుకుందామా?’’

‘‘వామ్మో మళ్ళీ నన్ను ఇరుకున పెట్టేస్తున్నావ్. ఇప్పుడేగా మన ఫ్రెండ్ షిప్ మొదలయింది. అప్పుడే పెళ్ళేమిటి?’’

‘‘ఆన్సర్ ప్లీజ్’’

‘‘చదవని వాడికి క్వశ్చన్ పేపరిస్తే ఆన్సర్ లేం రాస్తాడు...? నువ్వింకా నాకు అర్థం కాలేదు. ఏం చెప్పమంటావ్...?’’

‘‘ఇంతసేపు మాట్లాడిన నువ్వే టక్కున బదులు చెప్పలేకపోయావ్. విరాట్ తోనే మాట్లాడని సహస్ర ఫోన్ చేసి మాట్లాడేస్తుందని ఎలా అడుగుతున్నావ్? కొద్ది రోజులు ఆగి చూసి తర్వాత ఫోన్ చేయొచ్చని మౌనంగా ఉండిపోవచ్చుగా. సారీ చందూ నీకర్థం కావాలని అలా అడిగాను గాని నిన్నిబ్బంది పెట్టాలని కాదు. మనం ఫ్రెండ్స్ గానే ఉందాం అంతేగా?’’

‘‘అంతేలే ఈ కాస్త పరిచయం లోనే నిజంగా పెళ్ళి గురించి అడుతున్నావని ఎలా అనుకుంటాను?’’

‘‘సహస్రకు విరాట్ నచ్చాడు. అది మాత్రం ఖచ్చితంగా చెప్పగలను’’

‘‘ఎలా?’’

‘‘విరాట్ బెడ్రూమ్ లో తన పోస్టర్లు చూసి ఎంతో సంతోషపడింది. విరాట్ బెడ్ ఎక్కేసి కూచొని విరాట్ పెన్నుతో రాసుకున్న అక్షరాలు చదివి మురిసిపోయింది.’’

‘‘నిజంగానా...’’

‘‘అవును లవ్ చేయొచ్చుగా అనడిగితే ఏమందో తెలుసా? నా సమస్యలు నాకున్నాయి. లవ్ చేసి విరాట్ ని ఇందులోకి లాగలేను. రాసి పెట్టి ఉంటే తర్వాతయినా కలుస్తాంలే’’ అంది.

అంత ఓపెన్ గా దీక్ష వివరించాక...

ఇక ఏమడగాలో ఏం మాట్లాడాలో చందూకి బోధపడలేదు. కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు. అతడ్నే చూస్తూ కూచుంది దీక్ష. చందూకి అంతా కొత్తగాను థ్రిల్లింగ్ గానూ ఉంది. సహజంగానే తను అల్లరోడు. ఎందరో అమ్మాయిల్ని ఏడిపించాడు. ఎందరితోనో గొడవపడ్డాడు. కాని ఇంతవరకు ఏ అమ్మాయితోనూ యిలా ఏకాంతంలో కూచుని ఇంత సేపు మాట్లాడింది లేదు. దీక్ష చూపుల్ని ఎలా అర్థంచసుకోవాలో తెలీక ఇబ్బందిపడుతూ.

‘‘ఏయ్ మరీ అలా చూస్తావేంటి?’’ అన్నాడు.

‘‘ఏం చూడకూడదా? నీలా దొంగచూపులు చూడ్డం నాకు తెలీదు’’

“నేనేం చూడ్డం లేదు. వర్షం తగ్గు ముఖం పట్టింది. ఇక నేను వెళ్తాను” అంటూ లేవబోయాడు.

“లేచావంటే నామీద ఒట్టే. కూచో” అంది దబాయింపుగా.

“వెళ్ళాలంటున్నాగా” నసిగాడు.

“వెళ్ళి ఏం చేస్తావ్?”

“వంట చేసుకు తినాలి. ఆడ దిక్కులేని సంసారం. నీ మూలంగా కాయగూరలు తీసుకోకుండా వచ్చేసాను”

“వాన బాగా తగ్గాక వెళ్ళొచ్చులే. ఇంతకీ నువ్వెందుకు ఇంకా పెళ్ళి చేసుకోలేదు? పెళ్ళాం వస్తే ఈ తిప్పలుండవుగా”

“నువ్వు నా డైరీ చదివి కూడా ఈ ప్రశ్న అడగటం అస్సలు బాగాలేదు. నా రెండో చెల్లెలి పెళ్ళికూడా జరిపించేస్తే అప్పుడు నా పెళ్ళి గురించి ఆలోచిస్తాను. అయినా ఈ రోజుల్లో ఆడపిల్లలు మరీ గడుసు వాళ్ళు. పెళ్ళిచేసుకొని నా స్వతంత్రాన్ని కోల్పోవటం ఇష్టంలేదు.”ఆ మాటలకి కాస్త కోపంగా చురచుర చూసి లేచి కిచెన్ వైపు పోబోయింది దీక్ష.

“ నీకు కోపం వచ్చినట్టుంది. నే వెళ్తాను” అంటూ లేచాడు చందూ.

“మరి కోపం రాదా?” అంటూ ఆగి తిరిగి చూసింది దీక్ష.

“పెళ్ళి చేసుకుంటే స్వతంత్రం కోల్పోయినట్టా..? పిచ్చి ఆలోచనలు” నవ్వుతూ అంది.

“పోనీ అలాగే అనుకో, నే వెళ్తాను”

“ఉండమంటున్నానా?”

“వెళ్తానంటున్నాగా”

‘ఈ పూట ఇక్కడే భోం చేస్తున్నావ్. టి.వి. చూస్తూ టీ తాగి కూచో. వంటయిపోతుంది”

“లేదు లేదు నే వెళ్తాను”

“ఏం లేదు? చెప్పింది వినవా..?”

“తప్పదా…?”

ఫక్కున నవ్వింది దీక్ష.

“ఇదేరా ఈ అమాయకత్వమే నాకు నచ్చింది. ఇప్పుడే వస్తాను” అంటూ టి.వి. ఆన్ చేసి కిచెన్ లో కెళ్ళింది.

జెమిని లో బొమ్మరిల్లు సినిమా వస్తోంది తనకి ఇష్టమైన సినిమా. దీక్ష అందించిన మరో కప్పు వేడివేడి టీ తాగుతూ సినిమా చూస్తుండి పోయాడు. తన పంతం నెగ్గించుకుంది దీక్ష. ఆమె ఇష్ట ప్రకారమే భోంచేసి బయలుదేరాడు.

అప్పటికి వర్షం శాంతించింది.

వీధులన్ని జలమయంగా ఉన్నాయి.

తన ఫోన్ నంబర్ దీక్షకిచ్చి ఆమె సెల్ నెంబర్ తీసుకొని వీధిలోకొచ్చేసాడు చందూ.

I I I

సహస్ర నుంచి తప్పకుండా ఫోన్ వస్తుందని....

మొదట్లో చాలా ఆశపడ్డాడు విరాట్.

రోజులు గడిచిపోతున్నాయి గాని ప్రయోజనం లేకపోగా, ఎవరెవరో అమ్మాయిలు ఫోన్లు చేసి విసిగిస్తున్నారు. ఈ పరిస్థితిలో రెండు వారాలు గడిచిపోయాయి.

క్రమంగా విరాట్లో ఆశ సన్నగిల్లి సాగింది.

సహస్ర సిటీ లోనే ఉందని, ఎందుకో తన ప్రకటన చూసినా స్పందించటం లేదని అతడి నమ్మకం. కాని ఎన్నాళ్ళిలా? ఆమె నుంచి ఫోన్ కాల్ రాకపోయినా ఆమె పట్ల ప్రేమ పెరుగుతోందేగాని తరగటం లేదు. మర్చిపోలేక పోతున్నాడు.

కనీసం ఆమె కన్పించాలిగా. అప్పుడే సహస్ర మనసులో ఏముందో తెలుసుకోవటం సాధ్యపడుతుంది. రెండు వారాలనుకున్నది మూడో వారం కూడా గడిచింది. సహస్రను బయటకు రప్పించాలి. ఎలా...? తీవ్రంగా లోచిస్తున్నాడు.

మొదట్లో తన ఆలోచనలను చందూతో పంచుకునే వాడు. ఇప్పుడు అదీ మానేసి ముభావంగా ఉంటున్నాడు. పడ గ్గదిలో చేరినా నిద్రకు దూరమైన సహస్ర గురించే ఆలోచన. ఆమె ఫోటోను చూసుకుంటూ ఎప్పటికో నిద్రపోతున్నాడు . ఒక్కోసారి అన్పిస్తుంది. ఏమిటీ జీవితం ఎందుకిలా జరిగింది? సహస్ర ఎవరో తనెవరో... ఆమె తన కంట ఎందుకు పడాలి. తను ఆమె పట్ల ఎందుకింత ఆకర్షితుడు కావాలి. నిజంగా తమకు రాసిపెట్టి ఉందా లేదా... జీవితంలో ఇక కన్పించదా! ఇలా నిరాశ

చెందినప్పుడు ఎంతో బాధపడినా వెంటనే తిరిగి ఆశలు పెంచుకుని కన్పిస్తుందనే నమ్మకాన్ని బలపర్చుకున్నాడు.

విరాట్ పరిస్థితి అర్థమవుతున్నప్పటికీ...

చందూ ఏమీ చేయలేని పరిస్థితి.

దీక్ష అతడి కాళ్ళు చేతులు కట్టేసింది. అంటు సహస్ర కూడా విరాట్ ను మర్చిపోలేకపోతున్న మాట నిజమే. అయినా మౌనం వహించింది. ఇలా విరాట్ సహస్రలు ఒకే కాలనీలో వున్నా ఒకరికొకరు కలవని పరిస్థితి. ముఖ్యంగా విరాట్ కి సహస్ర తమ కాలనీలోనే ఉంటోందని తెలీకుండానే రోజులు గడిచిపోతున్నాయి.వీళ్ళిద్దరి పరిస్థితియిలా ఉంటే...

ఇటు చందూ దీక్షల స్నేహం చాలా దూరం వెళ్ళిపోయింది. అసలు ఆ రోజు దీక్ష ఇంట్లో భోంచేసి వచ్చిన రాత్రే పది గంటలకు దీక్ష చందూ సెల్ కి ఫోన్ చేసింది. ఆ టైమ్ లో ఎవరిగదిలో వాళ్ళు పరిమితమై ఉన్నారు. నిద్రపోయే టైమ్.

"ఏమిటీ ఈ టైమ్ లో ఫోన్ చేసావ్..?" చిన్నగా అడిగాడు. పక్క గదిలో విరాట్ పసిగడితే కొంప మునుగుతుంది.

"ఏదోగా ఉందిరా. అందుకే ఫోన్ చేసాను" అంది హస్ కీ వాయిస్ తో.

"ఎక్కడున్నావ్?"

"నిద్రపట్టక మంచం మీద దొర్లుతున్నాను . నువ్వెక్కడున్నావ్?"

"నాదీ అదే పరిస్థితిగాని, ఇంతకీ ఏదోగా ఉండటం ఏంది..? ఏమైంది..? ఒంట్లో బాగాలేదా...?"

"అదే అర్థంగావటం లేదు. బుర్ర నిండా పాడు ఆలోచనలు, ఒళ్ళంతా తిమ్మిరితిమ్మిరిగా మత్తుగా ఉంది. సలసలా

మరిగిపోతున్నట్టుంది. బెడ్ ముళ్ళ కంపలా తోస్తోంది. నిద్ర రావటం లేదు. ఏం చేయమంటావ్?''

''నాకేం తెలుసు...? నాకేమీ తెలీదు''

''నీకంతా తెలుసు చెప్పవా...?''

''అయితే విను. దీన్నే విరహమంటారు. ఇంకా చెప్పాలంటే కామ జ్వరమంటారు''

''అయ్య బాబోయ్. ఈ జ్వరానికి మందులుండవా?''

''ఉండవు''

''మరెలా తగ్గుతుందేమిటి?''

''పెళ్ళిచేసుకో తగ్గిపోతుంది . నువ్వెవరినయినా ప్రేమిస్తున్నావా?''

''ఎవర్నో ప్రేమిస్తే నీకెందుకు ఫోన్ చేస్తాను?''

''అంటే... నన్ను ప్రేమిస్తున్నావా...? వూహు మనది స్నేహం. జస్ట్ ఫ్రండ్ షిప్. అంతేగా!''

''అంతకన్నా ఎక్కువనిపిస్తోంది. ఏం చేయను..?''

''ఓర్నాయనో అర్ధరాత్రి బుర్ర తినకే నీకు పుణ్యముంటుంది. నీ మనసులో ఏముందోచెప్పెయ్.''

“ఓకే ఇపుడు కుదరదుగాని ఓ పని చెయ్యి. రేపు ఆఫ్ డే లీవ్ పెట్టేసి లంచ్ టైంకి ఆటోలో లజ్ కార్నర్ కివచ్చేయ్.”

“నేను రాను”

“ సరి నేనే మీ ఆఫీసు కొస్తాను”

“కొంప ముంచే ఆలోచనలు చేయకు. నేనే వస్తాలే. ఎక్కడికి రావాలో చెప్పు”

“పాండీ బజార్ మీదుగా నేరుగా ఎగువకొస్తే లజ్ కార్నర్ కొస్తావ్. అక్కడ కుడి పక్క మెయిన్ రోడ్ నానుకొని పెద్ద కాంపౌండులో మూండంతస్తుల బిల్డింగ్ లో...”

“తెలుసు అబిరామి షాపింగ్ మాల్ ఉంది”

“బయట ఆటోలో వెయిట్ చేస్తూ నాకు మిస్డ్ కాల్ యివ్వు చాలు. నేను ఆటో వద్ద కొచ్చేస్తాను”

“ఓకే వస్తాలే”

అవతల దీక్ష ఏదో చెప్పబోతోంది.

ఇంతలో డోర్ నెట్టుకొని విరాట్ లోనకొస్తూ “నిద్రపోకుండా ఫోన్లో ఎవరితోరా మాటలు..?” అనడిగాడు. విరాట్ను చూడగానే చందూ కంగారు దాచుకుంటూ . “సరేరా దీక్షిత్ రేపు కాల్ చేస్తాలే” అంటూ లైన్ కట్ చేసాడు.

విరాట్ నొసలువిరిచి “ఎవడ్రా ఈ దీక్షిత్..?” అనడిగాడు.

“ఈ మధ్యే పరిచయమయ్యాడు లేరా. మన పక్క ఆఫీసులో పని చేస్తాడు. నాగపూర్ కి రైల్లో వెళ్ళటం మంచిదా విమానంలో వెళ్ళటం మంచిదా అని బుర్ర తింటున్నాడు. నడిచి పొమ్మన్నాను. నువ్వేంటి ఇంకా నిద్రపోలేదా?” అన్నాడు.

అతడి మాటల్ని విరాట్ నమ్మాడు.

“ఏంటో రా సరిగా నిద్ర పట్టడం లేదు. ఓకె... పది దాటింది టైమ్. నిద్రపో” అంటూ తలుపు దగ్గరగా మూసి తన గదిలోకెళ్ళిపోయాడు విరాట్.

‘ప్రేమలో పడ్డాక నిద్రేం పడుతుందిలేరా బాబు. ఖర్మ నీ లవ్ ఫీవర్ని నాకు తగిలించావ్. నీ మూలంగా దీక్షకి దొరికిపోయాను . ఇది నన్ను ఎన్ని తిప్పలు పెడుతుందో ఏమిటో’ అనుకుంటూ కళ్ళు మూసుకొని నిద్రకుపక్రమించాడు చందూ.

I I I

మరునాడు...

తలపోటుగా ఉందని వంకపెట్టి ఆఫ్ డే లీవ్ శాంక్షన్ చేయించుకున్నాడు చందూ. లంచ్ టైం కి ముందే ఆఫీసు నుంచి బయటికొచ్చి ఆటో ఎక్కాడు.

లజ్ కార్నర్ దగ్గర్లో ఆటో ఆపించాడు. మిస్డ్ కాల్ ఇచ్చిన పదో నిముషంలో దీక్ష వచ్చి ఆటో ఎక్కింది. చీర జాకెట్ ధరించి సింపుల్ గా వాలుజడ వేసుకుంది. అదే జాస్మిన్ సెంటు సువాసన. ఇవాళ తన కంటికి మరింత అందంగా కన్పిస్తోంది.


“పాండీ బజార్ పోనీ” అన్నాడు ఆటోవాలాతో.

“అగాగు” అంది వెంటనే దీక్ష.

“అక్కడేం పని?” అడిగింది.

“ ఏం పనంటే ఏం చేస్తామండీ. గాజులేయించావా, చీర కొనిచ్చావా, నగా నట్రా పెట్టావాని మరదలు నిష్ఠురాలాడుతోందిగా. అవి కొనిద్దామని” అంటూ నవ్వాడు.

మూతి ముడుచుకుంది దీక్ష...



జరిగిన కథ: చందూకి చక్కటి ఆతిధ్యం ఇచ్చి పంపుతుంది దీక్ష. సహస్ర కనిపించక ఆమె జాడ తెలియక విరాట్ బాధపడిపోతుంటాడు. ఆఫీసునుండి ఆఫ్ డే పర్మీషన్ తీసుకుని బయలుదేరిన చందూ అనుకున్న ప్రకారం ఒక చోట దీక్షని కలుసుకుంటాడు. ఇద్దరు కలిసి అదే ఆటో లో వెళ్తుంటారు.

ఆ తరువాత.....................................

‘అక్కర్లేదు. నువ్వు కొనిస్తావ్ సహస్రతో ఏం చెప్పాలి? ఏం కొన్నా ఇద్దరం కలిసి తీసుకోవటం అలవాటు, ఒకటికి పది

అబద్ధాలాడటం కన్నా అసలు సమస్యే రాకుండా జాగ్రత్త పడటం మంచిది కదా. నేరుగా దేవి థియేటర్ కి పో'' అంది ఆటోవాలాతో .ఆటో కదిలింది. ఇక ఆమెతో వాదించ లేదు చందూ.

'జాస్మిన్ సెంటు నీకంత ఇష్టమా? మీరు మా ఇంటి కొచ్చిన వెళ్ళిన రోజు కూడా మా గదుల్లో ఇదే సువాసన'' అడిగాడు దారిలో.

''ఇది నా ఇష్టం కాదు. సహస్ర రాక ముందు అస్సలు సెంటు వాడే దాన్ని కాను. సహస్రకు జాస్మిన్ అంటే ఇష్టం. దాన్నుంచి నాకూ అలవాటైపోయింది.'' అంటూ అతడి చేతిని తన చేతిలోకి తీసుకుంది. చేయి వెనక్కి తీసుకోబోయాడు. వదల్లేదు.

''ఇవాళ నీతో లంచ్ చేసి సినిమా చూడాలను కున్నాను. దేవి కాంప్లెక్స్ లో రజనీకాంత్ సినిమా వుంది.'' అంది దీక్ష. థియేటర్ సమీపంలోని రెస్టారెంట్ లో లంచ్ చేసి దేవిలో రజనీకాంత్ సినిమా చూసారు. అయిదున్నర కి సినిమా వదలగానే తిరిగి ఆటో ఎక్కి మెరీనా బీచ్ కి చేరుకున్నారు దీక్ష చందూలు. ఆమెతో ఇలా తిరగటం చందూకి ఎంతో సంతోషంగాను పరవశంగానూ వుంది.

సాయంకాల సమయం.

మెరీనా బీచ్ సందడిగా ఉంది.

కెరటాల వెలుతురులతో బాటు సముద్రం మీదుగా వస్తున్న గాలి ఆహ్లాదపరుస్తున్నాయి. దూరంగా నడి సముద్రాన లంగరు వేసిన నాలుగు ఓడలు, చీకటి పడకముందే తీరానికి వచ్చేస్తున్న చేపల బోట్లు కనువిందు చేస్తున్నాయి.

కాస్త ముందుకెళ్ళి అంతగా జనం లేని చోట కెరటాలకు సమీపంలో పక్క పక్కన కూచున్నారిద్దరూ. మిగిలిన రోజుల కన్నా ఆదివారం మరీ జన సందోహంగా ఉంటుందిక్కడ. బీచ్ లోంచి చూస్తుంటే బీచ్ రోడ్ తో బాటు అవతల ఎత్తైన భవనాలు, హైకోర్టు, రోడ్ ఎగువున వంకీల వంతెన చూడ్డానికి చాలా బాగుంటుందా దృశ్యం.

అప్పటికే కనుచీకటి పడుతోంది.

బీచ్ లో లైట్లు వెలిగాయి.

సముద్ర గాలికి ఆమె పైట చెంగు…

గాల్లోకి ఎగురుతోంది…

"దీక్షా!" పిలిచాడు.

"వూ!' అంటూ సడన్ గా మరింత దగ్గరగా జరిగి అతడి చేతిని వెనక నుంచి లాగి నడుం మీద వేసుకుంటూ ఛాతి మీదకు వాలిపోయింది. ఆమె హఠాత్ పరిణామానికి ఉద్వేగపడ్డాడు. ఆమె స్పర్శ అతడిని పులకరింపజేసింది.

"కాస్సేపు నన్నిలా ఉండనీ" అంది దీక్ష.

"నా డౌటు చెప్పు మనం ఇప్పుడు ఎవరం? స్నేహితులమా, ప్రేమికులమా?" అడిగాడు చందూ తేరుకొంటూ."రెండోది కరెక్ట్. మన స్నేహం రాత్రికి రాత్రే ప్రేమగా మారిపోయిందిగా" నవ్వింది.

"మరి వాళ్ళిద్దరి సంగతేమిటి? విరాట్ సహస్రలు ఒకటి గాకుండా మనమిలా దగ్గరవటం కరక్ట్ కాదనుకుంటాను. ఆ పైన నాకు కొన్ని బాధ్యతలున్నాయి అవి తీరే వరకూ పెళ్ళి వద్దనుకున్నాను…"

ఉన్నట్టుండి లేచి సర్దుకు కూచుంది దీక్ష.

"ఇపుడు నీ అభ్యంతరాలేమిటి? అక్కడ నువ్వు ఇక్కడ నేను ఏదో విధంగా వాళ్ళ మనసు మార్చి ఒకటి చేయటం కష్టం కాదు.

ఇక నీకున్న బాధ్యతలంటావా! అమ్మ నాన్న చెల్లెలు. తల్లిదండ్రుల్ని బాగా చూసుకోవాలి. చిన్న చెల్లెలికి మంచి సంబధం చూసి పెళ్ళి చేయాలి. ఇవేగా?""అవుననుకో.."

"ఏంటి అవును. వరల్డ్ బ్యాంక్ లా పక్కన నేనుంటే బాధ్యత గురించి ఇంకా భయం దేనికి? నేన్నీదాన్నాయ్యక నీ బాధ్యతలు నావి కావా? నీకు అమ్మానాన్నయినా నాకు అత్తా మావయినా వాళ్ళేగా..? నేను చూసుకోనా..? నీ చదువుల కోసం అమ్మేసిన మూడెకరాల పొలంతో బాటు ఇంకో రెండెకరాలు కలిపి అయిదెకరాలు వాళ్ళకి కొనిచ్చేస్తాను. ఓపిక ఉన్నంతవరకు వ్యవసాయం చేసుకుంటూ హేపీగా ఉంటారు. ఓపిక తగ్గితే కౌలుకిచ్చేసి మన దగ్గర కొచ్చేస్తారు.

ఇక నీ చెల్లెలి పెళ్ళంటావా మంచి సంబంధం చూడు. కట్నం ఎంతయినా ఫరవాలేదు. పెళ్ళి ఖర్చులతో సహా అంతా నేనిస్తాను. గొప్పగా పెళ్ళిచేసి పంపిద్దాం. ఇక్కడ నాకు సొంత యిల్లు ఉంది. మనిద్దరం ఉద్యోగం చేసి సంపాదించుకునేది మనకి చాలదా?

ఇక నిన్నే ఎందుకు ఇష్టపడుతున్నానని సందేహం రావచ్చు. మీ కుటుంబం పట్ల, తల్లిదండ్రులు, చెల్లెలి పట్ల ఇంత బాధ్యతగా ఉన్నావంటే కట్టుకున్న భార్యను కూడా అంత బాధ్యతగానూ చూసుకుంటావని నా నమ్మకం. ఆ పైన నువ్వు నీ పద్ధతులు నాకు నచ్చాయి. ఇంకేం కావాలి? ఐ లవ్యూ చందూ." అంటూ ఒళ్ళోకి వాలిపోయింది అతడి ముఖాన్ని తన ముఖం మీదకు వంచుకుంటూ ... "కిస్ మీ చందూ" అంది హస్కీ వాయిస్ తో. ఎంతలో ఎంత మార్పు...? అనుకున్నదేమిటి...? జరుగుతున్నదేమిటి...? మనిషి స్క్రీన్ ప్లే కన్నా భగవంతుడి స్క్రీన్ ప్లే చాలా చాలా చాలా గొప్పది.

వాళ్ళిద్దరూ కలిస్తే బావుండని వీళ్ళిద్దరూ అనుకొంటే, వీళ్ళిద్దరూ కలిసారు. వాళ్లిద్దరూ ఎప్పుడు కలుస్తారో..? ఎలా కలుస్తారో తెలిదు. వాళ్ళున్న ప్రదేశం కను చీకటిగా ఉంది. సమీపంలో ఎవరూ లేరు. ఇక సందేహించకుండా ఆమె అధరాలు చుంబించి ముఖమంతా ముద్దులిచ్చాడు. ఎన్నో కబుర్లు ఎన్నో వూసులు టైం తెలిలేదు.

సుమారు ఏడు గంటల ప్రాంతంలో ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. అది మొదలు వాళ్ళిద్దరూ తరచు ఫోన్లో మాట్లాడుకొంటూ వీలు చిక్కినప్పుడంతా సినిమాలు షికార్లతో ప్రేమపక్షుల్లా విహరించ సాగారు. ఈ పరిస్థితుల్లో ఓ రోజు...

I I

చందూ నిద్రలేచి బయటకొచ్చేసరికే విరాట్ ఇంట్లో కన్పించలేదు. స్నానాదికాలు ముగించుకొని అప్పటికే బైక్ మీద బయటకెళ్ళిపోయాడు. చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళడు. ఇంత పొద్దుటే ఎక్కడికెళ్ళాడు? పైగా సెల్ గదిలో వదిలేసి వెళ్ళాడు. అనుకుంటూనే తనూ స్నానాదికాలు ముగించుకొని రెండు స్టౌలు వెలిగించి ఒకదాని మీద టీ రెండో దాని మీద టిఫిన్ కి ఇడ్లీ ఎక్కించి హాల్లోకి వచ్చాడు.

అంతలో విరాట్ బైక్ పోర్టికోలో ఆగింది.

కొన్ని దినపత్రికల కట్టను చంకనెట్టుకొని విరాట్ లోపలకొస్తూ కన్పించాడు.

‘‘ఇంత పొద్దుటే ఎక్కడికెళ్ళావ్...? ఆ పేపర్లేమిటి...?’’ అడిగాడు చందూ.

విరాట్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

‘‘చెప్తా ఇలా రా కూచో’’ అంటూ సోఫాలో కూచొని పేపర్లను టీపా మీద పడేసాడు విరాట్.

చందూ కిచెన్ లోకి వెళ్ళి టీ కప్పులతో తిరిగొచ్చాడు. ఒకటి విరాట్ కిచ్చి తనొకటి తీసుకొని ఎదురుగా సోఫాలో కూచుంటూ... ‘‘ఇవన్నీ ఈ రోజు పత్రికలేనా..? కొంపదీసి ఏ రైలు ఆక్సిడెంటో విమాన ప్రమాదమో జరిగిందా? లేక రాత్రికి రాత్రి గవర్నమెంట్ కూలి పోయిందా..? ఎందుకిన్ని కొన్నావ్..?’’ టీ సిప్ చేస్తూ అడిగాడు.

‘‘అవేం కాదులే’’ అన్నాడు రిలాక్స్ గా టీ తాగుతూ విరాట్.

‘‘మరింకేమిట్రా? భూకంపం గాని సునామీ గాని ఏర్పడి ఎక్కడన్నా దారుణంగా జననశింపు జరిగిందా?’’

"అదేం కాదు. సహస్ర కోసం నేను వేసిన ఫస్ట్ స్టెప్ ఫెయిలయింది గదా…?"

"అవును రెండో స్టెప్ ఏం చేద్దామని?"

"ఆల్ రెడీ చేసేసాను"

"చేసావా… ఏం చేసావ్?" కంగారు ఆణచుకుంటూ అరిచాడు చందూ.

"ప్రకటన.. అన్ని దిన పత్రికల్లోనూ ప్రకటనిచ్చాను. ఈ దెబ్బతో స్టేట్ లో సునామి ఏర్పడి సహస్ర నా ముందుకొచ్చి పడాల్సిందే"విరాట్ మాటలు వినగానే పొలమారి పెద్దగా దగ్గుతూ సగం తాగిన టీ కప్పును పక్కన పెట్టేసాడు చందూ. 'ఓర్నాయనో వీడేదో కొంప ముంచినట్టున్నాడు. సహస్రకి తెలిస్తే ఎలా స్పందిస్తుందో ఏమిటో ఖర్మ' అనుకుంటూ ఒక దినపత్రిక అందుకుని తెరిచాడు.ఫస్ట్ పేజీ డౌన్ లో రైట్ కార్నర్ లోనే ఉందా ప్రకటన. బాక్స్ కట్టి మరీ వేసారు. పైన సహస్ర ఫోటో అందంగా ప్రింటయింది. దిగువన ప్రకటన ఉంది. దాని సారాంశం…

"నా ప్రియురాల్ని పట్టిస్తే కోటి రూపాయలు"

పై ఫోటోలోని యువతి పేరు సహస్ర. ఈమె నా ప్రియురాలు. నా ప్రాణం అయిన సహస్ర అలిగి చెన్నైలో మిస్సయి జాడ తెలీటం లేదు. ఈమెను పట్టిచ్చిన వారికి అక్షరాల కోటి రూపాయలు బహుమతిగా యివ్వబడును. సహస్ర జాడ తెలిసిన వారు దిగువ సెల్ నంబర్ ను కాంటాక్ట్ చేయగలరు.

ఆ విధంగా వున్న ప్రకటన దిగువన…

విరాట్ పర్సనల్ సెల్ నెంబర్ యివ్వబడింది.

ఆ ప్రకటన చూసిన మరుక్షణమే చందు గుండెల్లో రాయిపడినట్టయింది. కనీసం తనతో మాట మాత్రమైనా చెప్పకుండా పిచ్చి

పని చేసాడు. ఇప్పుడీ ప్రకటన చూస్తే సహస్ర ఏం చేస్తుందో ఏమిటో మొత్తం గందరగోళమయ్యే పరిస్థితి కన్పిస్తోంది.

కళవళపడి పోతూ గబగబా మొత్తం పత్రికలన్నీ తిరగేసాడు. అన్నిటా అదే ప్రకటన. తమిళం ఇంగ్లీషు పత్రికలతో బాటు తెలుగు దిన పత్రికల్లో కూడా వేయించాడు.

''కొంప ముంచావ్ గదరా. ఎందుకిలా చేసావ్?'' అనడిగాడు చివరికి.

''కొంపలేం మునగవు లేరా. అంతగా అయితే సహస్రకు నేను నచ్చజెప్పుకుంటాలే. ఇంతకు మించి నాకు తోచలేదు. ఇంతవరకు ఫోన్ చేయలేదు. తనెక్కడుందో ఏమిటో.. ఈ దెబ్బతో తను రాకపోయినా ఎవరో ఒకరు తీసుకొచ్చి అప్పగిస్తారు.'' అంటుంటే చందూ పిచ్చి పట్టినట్టు చూసాడు. ఇంకా దాచి ప్రయోజనం లేదనిపించింది. ఒకరు తీసుకు రానక్కర్లేదు ప్రకటన చూడగానే తనే పోట్లాటకి వచ్చేస్తుంది.''ఒరే ఒరే ఆపరా బాబు'' అనరిచాడు చందూ.

విరాట్ ఆశ్చర్యంగా చూసాడు.

''సహస్ర ఎక్కడో ఉండటం ఏమిట్రా. సహస్ర దీక్ష ఇద్దరూ మన కాలనీలోనే ఉన్నారు'' అంటూ బయటపడిపోయాడు చందు.

''ఇక్కడుంటం ఏమిట్రా? ఉంటే కనబడరా? పొద్దుటే వెధవ జోకులేయకు''

''ఇది జోకు కాదురా నిజం. వాళ్ళు నీకు కనబడరురా. నాకు కనబడ్డారు. దీక్షతో మాట్లాడాను.

ఆ మాట వింటూనే అదిరిపడి...

లేచి నిలబడ్డాడు విరాట్.

‘‘ఏమిట్రా నువ్వంటున్నది?     నిజమా…’’     నమ్మలేనట్టడిగాడు.

‘‘నిజంరా బాబు. ఆ రోజు మనింట్లో పడ్డ ఆడ దొంగలు ఎవరనుకుంటున్నావు..?     సహస్ర దీక్షలిద్దరూ మన వివరాల కోసం ఇంట్లోకి దొంగతనంగా వచ్చి పోయారు’’

‘‘ఓ షిట్…     నువ్వు చెప్పేదంతా…’’

‘‘ఇంకా నమ్మకం లేదా?     ఇదే కాలనీ మూడో వీధి చివర నూట ఎనభైయ్యో ఇల్లు దీక్షది.     నేన్నీ దగ్గరున్నట్టే సహస్ర ఆ యింట్లో దీక్షతో ఉంటోంది.     వాళ్ళిద్దరూ లజ్ కార్నర్ లోని అభిరామి షాపింగ్ మాల్లో జాబ్ చేస్తున్నారు.’’

‘‘నిజంగానే కొంప ముంచావ్రా. ఇంత తెలిసిన వాడివి నాతో ఎందుకు చెప్పలేదు?’’

‘‘ఎలా చెప్పమంటావ్..?     దీక్ష నా నోరు కట్టేసింది.     నీకు తెలిస్తే సహస్ర తనతో కూడా చెప్పకుండా వెళ్ళిపోతుందట. చెప్పొద్దని ప్రామిస్     తీసుకుంది. సహస్ర కు నువ్వంటే ఇష్టమే కాని తన సమస్యల్లోకి నిన్ను లాగటం ఇష్టం లేక మౌనంగా ఉంటోంది’’

‘‘డామిట్     సమస్యలేమిటి బోడి సమస్యలు.     తను నన్ను ఇష్టపడాలే గాని ఎలాంటి సమస్యలయినా చూసుకోడానికి నేను లేనా?     అసలు నువ్వు సహస్రతో మాట్లాడావా?’’

‘‘లేదు దీక్ష అంతా చెప్పింది.     నువ్వింకొద్ది రోజులు ఓపిక పట్టాల్సింది.     ఓ మాట నాతో చెప్పినా ఆపేవాడ్ని అనవసరంగా ప్రకటనిచ్చి ఘోరమైన తప్పుచేసావ్. తనేం చేస్తుందో ఏమిటో…’’     అంటూనే గేటు వైపు చూసి ఉలిక్కిపడ్డాడు.

‘‘ఈ ప్రకటనతో సునామి వస్తుందన్నావ్ గా…? అదో వచ్చేస్తోంది. ఎలా నచ్చ చెప్పుకుంటావో చెప్పుకో’’     అంటూ వేగంగా కిచెన్ లోకి పారిపోయాడు చందూ.

అప్పటిగ్గాని తను చేసింది కరక్టు కాదు అని అర్థంకాలేదు విరాట్ కి.     నిజంగానే తొందరపడ్డాడు. బయట ఆగిన స్కూటీ మీది`

అమ్మాయిల్ని వెంటనే గుర్తుపట్టేసాడు.

దీక్ష స్కూటీ ఆపగానే వెనక కూచున్న సహస్ర 'ది హిందూ' ఇంగ్లీష్ దినపత్రిక చేత్తో పట్టుకొని రోషా వేశంలో పెద్ద అంగలు వేసుకుంటూ వచ్చేస్తోంది. స్కూటీ లాక్ చేసి దీక్ష కూడా వస్తోంది. ఇద్దరూ ఇంకా నైటీల్లోనే ఉన్నారు. సహస్ర మాత్రం ఎప్పటిలాగే చున్నీతో ముఖం తెలికుండా చుట్టుకునుంది.

ఆమె యింటి వద్ద ఒకటి రెండుయిళ్ళ వాళ్ళకి తప్ప కాలనీలో ఇంత వరకూ ఎవరికీ ఆమె ముఖం ఎలా ఉంటుందో తెలీదు. వస్తున్న అమ్మాయిలిద్దర్నీ చూస్తూ...

స్థాణువులా ఉన్న చోటే నిలబడిపోయి...

అలా చూస్తుండిపోయాడు విరాట్.

I I I

ఒక్కోసారి మనం చేసే పనులు ఎదుటి వాళ్ళనే కాదు. మనల్ని ఇరుకున బెట్టి ఇబ్బందుల్లో పడేస్తాయి.తెలిసి వేసినా తెలీక వేసినా తేనెతుట్టె మీద రాయి పడితే కదిలి తేనేటీగలు వెంటపడి తరుముతాయి.

విరాట్ ఇచ్చిన ప్రకటన తేనెతుట్టెను కదిపింది. సహస్ర ఎవరు బ్యాగ్రౌండ్ ఏమిటి గతం ఏమిటి ఏమీ తెలికుండానే ఆమె ఫోటోతో సహా ప్రకటనిచ్చి నిజంగానే తప్పు చేసాడు. ఇంతవరకు విరాట్ ఎక్కడున్నాడో సహస్ర ఎక్కడుందో వాళ్ళ స్వస్థలాల్లో ఎవరికీ తెలీదు. ఇప్పుడు తెలిసిపోయే పరిస్థితి ఏర్పడింది.

మధురై....

సహస్ర తండ్రి మహాదేవ నాయకర్ కి ఉదయం లేవగానే బెడ్ కాఫీ తాగి దినపత్రిక చదవటం అలవాటు. నాయకరాజుల వంశస్థుడు

గావటంతో అందుకు తగ్గట్టే మనిషి ఎత్తుగా కాస్త లావుగా దృఢంగా ఉంటాడు. నిమ్మకాయలు నిలబెట్టగల గుబురు మీసాలు ఆయన ముఖానికి ప్రత్యేక ఆకర్షణ. ఇప్పటికీ ఉదయం రెండు గంటలు వ్యాయామం చేయటం ఆయన అలవాటు. చాలా గంభీరంగా సీరియస్ గా ఉంటాడు మనిషి. కంటి చూపులు చాలా షార్ప్ గా ఉంటాయి.

ఆ రోజు ఉదయం పేపర్ తెరవగానే అన్నాడియంకె తన పార్టీ ఎమ్మెల్యేలు ఏడుగురుని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం ప్రముఖంగా ప్రచురించబడిరది. వివరాలు చదవబోతూ దిగువకు చూసిన మహాదేవ నాయకర్ అక్కడ రైట్ కార్నర్ లో తన కూతురు సహస్ర ఫోటో చూసి ఉలిక్కిపడ్డాడు.

వెంటనే దిగువకొచ్చి...

ప్రకటన చదివాడు.

అంతే` ఆయన ముఖం కోపంతో కందగడ్డలా అయిపోయింది. వెంటనే గొంతు పెంచి ` ‘‘ఇదిగో ఇంటావిడ ఎక్కడున్నావ్..? త్వరగా రా’’ అనరిచాడు.

‘‘వస్తున్నానండి. ఏం కావాలి?’’ అంటూ లోపల్నుంచి ఆయన భార్య మూగాంబిగై పరుగులాంటి నడకతో వచ్చింది. ఆయన ఉగ్రరూపాన్ని చూస్తూనే బాల్కానీ డోర్ వద్దే ఆగిపోయింది. భయం భయంతో చూస్తు ‘‘ఏమైందండీ...? ఎందుకంతకోపం?’’ అనడిగింది.

‘‘కోప్పడక సంతోషపడమంటావా? ఒక్కగానొక్క కూతురని నెత్తికెత్తుకున్నందుకు తలకు నీళ్ళు పోసింది. నా పరువు తీయడానికే పుట్టినట్టుంది. చూడు మన గారాల కూతురు ఫోటో పత్రికలో వచ్చింది. నువ్వయినా చూసి సంతోషపడు’’ అంటూ పేపర్ను కోపంతో ఆమె వైపు విసిరికొట్టాడు.

దాన్ని అందుకుని ప్రకటన చూసి నిశ్చేష్టురాలయిందావిడ.

‘‘బంగారంలాంటి సంబంధం చూసాను. పెళ్ళిచేసుకోమంటే పారిపోయి పరువు తీసింది. ఇన్ని రోజులూ ఎంత వెతికించినా

ఎక్కడ ఉందో తెలీలేదు.     ఇప్పుడు చూడు ఏమైందో... నా కూతురు అలాంటిది కాదు.

విరాట్ సృష్టించిన     ప్రకటనల సునామీ వాళ్ళిద్దరిని కలిపిందా? కలిపినట్టే కలిపి ప్రత్యక్ష వైరానికి నాంది పలికిందా? తెలుసుకోవాలంటే వచ్చే వారం దాకా అగాల్సిందే...



జరిగిన కథ: సహస్ర     కోసం విరాట్                    సృ ష్టించిన ప్రకటనల దుమారం ఎంత దూరం వెళ్తుందోనని భయపడుతుంటాడు చందు. అతడు అనుకున్నంతా అవుతుంది. అమ్మాయిలిద్దరూ నేరుగా వాళ్ళింటికి వచ్చేస్తారు. ప్రకటన చూసిన సహస్ర     తండ్రి తీవ్రం గా స్పందిస్తాడు.

ఆ తరువాత.......................

ఉత్తమురాలు. ప్రేమా దోమా దానికి తెలీదు అన్నావ్ గా. ఇప్పుడేమంటావ్. చెన్నైలో ఉంది. వాడెవడ్నో ప్రేమించి వదిలేసినట్టుంది.వాడు

ఏకంగా పత్రికా ముఖంగా 'కన్పించటం లేదు' అని ప్రకటనే ఇచ్చేసాడు. పట్టిస్తే కోటి రూపాయలు బహుమానం అట. ఎవడో కోటీశ్వరుడయి ఉండాలి...."

"అది కాదండీ..."

|

"ఇంకేం చెప్పకు. నా కూతుర్ని వెనక్కి తెచ్చుకొని ఎలా పెళ్ళి జరిపించాలో నాకు తెలుసు. నీ సలహా సంప్రదింపులేమీ అక్కర్లేదు" అంటూ బాల్కనీ వద్దకెళ్ళి కిందకు చూసాడు.

కాంపౌండ్ లో అతని మనుషులు చాలా మంది ఉన్నారు.

"అరేయ్ కదిరేశన్, వడివేలు ఎక్కడ్రా.... వాళ్ళిద్దర్నీ రమ్మని చెప్పండి" అంటూ ఆర్డర్ వేసాడు.

సరిగ్గా పావు గంట తర్వాత వాళ్ళిద్దరూ మహ దేవనాయకర్ ముందున్నారు. ఆయన చెప్పింది జాగ్రత్తగా విన్నారు. మరో గంట తర్వాత తమ సహచరులు మరో ఆరుగురు గూండాలతో కదిరేశన్ వడివేలు ప్రయాణిస్తున్న జీపు మధురై వదిలి చెన్నై మార్గంలో దూసుకుపోనారంభించింది.

మహా దేవనాయకర్ ఆ పూటకి బయటకు పోకుండా ఫోన్ స్విచ్చాఫ్ చేసి సహస్ర ఫోటోనే చూసి బాధపడుతూ ఇంట్లోనే ఉండిపోయాడు.

ఈ ఈ ఈ

విశాలమైన టేక్ వుడ్ టేబుల్ మీద...ఆ రోజు దినపత్రికలన్నీ వరసగా పరిచి ఉన్నాయి.

అన్నిటిలోనూ ప్రకటనతో బాటు అందమైన సహస్ర ముఖం కన్పిస్తోంది. టేబిల్ వెనక రివాల్వింగ్ ఛేర్ లో మధ్యవయసు భారీ కాయుడు ఒకరు కూచున్నారు. పక్కన సిల్వర్ డిష్ లోని ఆపిల్ ముక్కల్ని ఒక్కోటీ నములుతూ సహస్ర ఫోటోని దీక్షగా చూస్తున్నాడు.టేబుల్ ముందు ఎదురుగా అతడి ముఖ్య అనుచరులు నలుగురు చేతులు కట్టుకుని నిలబడున్నారు.

అది మధురై శివార్లలోని సువిశాలమైన టేకు తోటలోని ఎస్టేట్ బంగళా. ఎస్టేట్ ను చుట్టి ఎత్తయిన కాంపౌండ్ వాల్ ఉంది. ఎస్టేట్ కు పటిష్టమైన కాపలా ఉంది. పర్మిషన్ లేకుండా చీమ కూడా లోన ప్రవేశింపలేదు.

ఆయన పేరు త్యాగరాజన్.

ఆయన తండ్రి పేరు దేవరాజన్. సెంట్రల్ మినిస్టర్. ఆయన తాతగారి పేరు మణివణ్ణన్. ఆయన తమిళనాడు మాజీ సి యం. గత ఎన్నికల్లో ఆయన పార్టీ ఓడిపోవటంతో అంతవరకు ప్రతిపక్షంగా వున్న పార్టీ అధికార పార్టీ అయింది. ప్రస్తుత సి యం శెల్వీచెందామరై. ప్రతిపక్ష నాయకుడు మణివణ్ణన్.

తాతగారు మణివణ్ణన్ సి యం గా ఉండగా త్యాగరాజన్ తన వ్యాపారాలను బాగా విస్తరించుకున్నాడు.

ఆయనకున్న ప్రధాన వ్యాపారాల్లో ఒకటి రియల్ ఎస్టేట్ . రెండు మైనింగ్ కార్పోరేషన్. తాత స్టేట్ సియం, తండ్రి దేవరాజన్ సెంట్రల్ మినిస్టర్ గావటంతో అడ్డగోలుగా లైసెన్సులు పొంది మైనింగ్ కార్పోరేషన్ స్థాపించి ఇష్టానికి భూమిని తవ్వి పారేసి విలువైన ఖనిజాలను విదేశాలకు తరలిస్తూ కోట్లు సంపాదించాడు. ఇంకా సంపాదిస్తూనే ఉన్నాడు.

త్యాగరాజన్ మనుషులు మధురై జిల్లాతో బాటు పక్క జిల్లాల్లోను సంచరిస్తూ రియల్ ఎస్టేట్ కు అనుకూలంగా ఉన్న భూముల్ని గుర్తిస్తుంటారు. అలాగే ఎక్కడ విలువైన ఖనిజాలున్నాయో సమాచారం సేకరించి రిపోర్ట్ తయారుచేసి ఇస్తుంటారు. ఇక తర్వాత అతడి ముఖ్య అనుచరగణం రంగంలోకి దిగుతుంది. అవసరమైతే తనూ ముందుంటాడు

త్యాగరాజన్.గుర్తించినవి ప్రయివేట్ భూములయితే రైతుల్ని బెదిరించి తక్కువ ధరకే తమ కంపెనీ పేర రాయించేసుకుంటారు. ఎదురు తిరిగితే కిడ్నాప్ చేయించి బలవంతంగా రాయించుకుంటారు. ఈ క్రమంలో అనేక హత్యలు కూడ జరిగాయి. ఇక గవర్నమెంటు భూములయితే లంచాలు కట్టి పర్మిషన్ సంపాదించి ఇష్టం వచ్చినట్టు తవ్వి పారేస్తుంటారు.

మధురై జిల్లా నుండి ఆ బెల్టు మొత్తం ఎనిమిది జిల్లాల్లో త్యాగరాజన్ మాటకు తిరుగులేదు. అతని అక్రమాల గురించి తెలిసినా జనం నోరు విప్పరు.

ఈ నేపథ్యం లోఎవరయినా తనను వేలెత్తి చూపినా, తన గురించి తన కంపెనీల గురించి పత్రికలకు వ్రాసినా, తన మీదా లేదా తన కంపెనీల మీద కేసులు వేసినా, పోలీసు రిపోర్టిచ్చినా అలాంటివారిని క్షమించే అలవాటు త్యాగరాజన్ కు లేదు. నిర్ధాక్షణ్యంగా వారికి మరణదండన విధించేస్తాడు. మనిషి ఎంత సాఫ్ట్ గా ప్రశాంతంగా చెరగని చిరునవ్వుతో పరామర్శిస్తాడో అంతకంత మహా ప్రమాదకరమైన వ్యక్తి. తనేమీ చేయడు. అంతా అతని మనుషులే చూసుకుంటారు. స్కెచ్ అతడిది. అమలుపరిచేది అతడి మనుషులు. ఎక్కడికక్కడ తన చేతులకు మట్టి అంటకుండా జాగ్రత్త పడతాడు. అందుకే తెలీనివాళ్ళు అతడ్ని చాలా మంచి వాడనుకొంటారు. తెలిసిన వాళ్ళు అతని కంటపడకుండా తప్పించుకుంటారు. లేదా దూరంగా ఉంటారు.అటువంటి చరిత్ర కలిగిన త్యాగరాజన్ని సమీప కాలంలో పునాదులు కదిలిపోయేలా చేసిందో యంగ్ జర్నలిస్టు. ఆ జర్నలిస్టే మధురైకు చెందిన లహరి. స్థానికంగా ఉంటున్న ఈ లహరి ఎవరో స్థానికులు ఎవరికీ తెలీదు. కాని సమకాలీన రాజకీయాల మీద విశ్లేషణలతో సహా పత్రికలకు వార్తా కథనాలు రాస్తుంటుంది. అది యిది అనకుండా ఏ పార్టీనయినా ఏ పార్టీకి చెందిన వారినయినా తప్పుచేస్తే కడిగి పారేస్తుంది. ఆమె దృష్టి క్రమంగా త్యాగరాజన్ మీద పడింది. త్యాగరాజన్ బాధితుల గోడు వింది. రహస్యంగా ఆయా ప్రాంతాల్లో సంచరించి అతని అక్రమ మైనింగ్ కు సంబంధించిన ఫోటోలు తీసి పేపర్లకెక్కించటం ఆరంభించింది. అలాగే అనేక సాక్ష్యాధారాలను సేకరించి రికార్డులు తయారుచేసింది.

రోజుకో కథనం దినపత్రికల్లో వస్తుంటే త్యాగరాజన్ కి కంపరం మొదలైంది. డిల్లీ నుంచి తండ్రి దేవరాజన్ ఫోన్ లో కొడుకును హెచ్చరించనారంభించాడు. ఇటు ప్రతిపక్ష నాయకుడిగా వున్న తాత ఆందోళన చెందుతూ ఆ జర్నలిస్టు ఎవరో తెలుసుకొని తగిన చర్య తీసుకోమంటూ ఫోన్లు చేస్తున్నాడు. అయితే లహరి ఎవరో తెలుసుకోవటం అంత సులువు కాలేదు.ఈ లోపల లహరి త్యాగరాజన్ నేర చరిత్రను పత్రికలకెక్కించటంతో వూరుకోలేదు. తన వద్ద ఉన్న రికార్డులను కాపీలు తీసి ఒకటి సుప్రీం కోర్టుకి, ఒకటి చెన్నై హై కోర్టుకి, ఒక కాపీని మధురై కోర్టుకు పంపిస్తూ ఒక కాపీని మధురై పోలీస్ కంట్రోల్ రూమ్ లోని ఎ యస్ పి ప్రకాష్ కు పంపించి కేసు ఫైల్ చేయమని కోరింది.ఇంతకీ లహరి ఎవరో ఎలా ఉంటుందో పత్రికాఫీసుల్లోని కొందరికి తప్ప బయట ఎవరికీ తెలీదు ఏ ప్రాంతమో ఎక్కడుంటుందో తెలీదు. ఆమె ఇచ్చిన అడ్రసుకు వెళ్ళిచూస్తే అది ఒక ఫామ్ హౌస్ అడ్రసు. ఆ ఫామ్ హౌస్ మహదేవనాయకర్ కి చెందింది. ఆయన్ని అడిగితే లహరి ఎవరో తనకు తెలీదని తమ ఫామ్ హౌస్ అడ్రసు ఎందుకిచ్చిందో అర్థంకావటం లేదన్నాడు. నిజంగా ఆయనకు తెలీదు. ఆయన తన కూతురు సహస్రకు తన మిత్రుడైన ఎం పి కొడుకుతో పెళ్ళి జరిపించే ఏర్పాట్లలో బిజీగా ఉన్నాడు.

లహరి ఫైల్ చేతికందిన గంటలోనే ఆ ఫైల్ తో సహా త్యాగరాజన్ ముందు హాజరైౖ ఫైల్ అతడి చేతికిచ్చాడు ఎ యస్ పి ప్రకాష్. ఆ ఫైల్ తిరిగేయగానే అతనికి కళ్ళు గిర్రున తిరిగినంత పనైంది. తన కొంపముంచే అనేక నిజాలు ఆ ఫైల్ లో ఉన్నాయి. ఎంక్వయిరీ కమిషన్ వేసినా ఎలాగో మేనేజ్ చేయొచ్చేమోగాని సి బి ఐ రంగంలోకి దిగితే కొంప కూలినట్టే.''ఈ ఫైల్ నా చేతికి రాబట్టి సరిపోయింది. వేరే ఎవరి చేతికెళ్ళినా మీ పునాదులు కదిలేవి'' అన్నాడు ఎ యస్ పి ప్రకాష్.''మీరు చదువుకున్నారుగాని బుర్రపని చేయదయ్యా. ఫైల్ ని సరిగా గమనించావా? మొదట పేజిలోనే స్పష్టంగా రాసుంది ఎ కాపీ టు సుప్రీంకోర్టు, ఎ కాపీ టు హైకోర్టు, ఎ కాపీ టు మధురై కోర్టు, ఇంకేముంది? ఈ లహరి ఎవరో గాని అజ్ఞాతంలో ఉండే నన్ను పూర్తిగా ఇరికించేయాలని చూస్తోంది. దీని అంతు చూడకుండా వదలను'' అనరిచాడు త్యాగరాజన్.

స్థానిక కోర్టుకు ఆ ఫైలు చేరగానే త్యాగరాజన్ మేనేజ్ చేసాడు. ఇటు ఎ యస్ పి ప్రకాష్ ఫైల్ అందుకున్నా కేసు ఫైల్ చేయలేదు. పోలీస్ కేస్ పుటప్ చేయకుండా డైరెక్ట్ గా కోర్టు నాశ్రయించటం రూల్స్ కు విరుద్ధం కాబట్టి ఈ ఫైల్లోని సమాచారాన్ని అంగీకరించలేదు. అంటూ ఫైల్ ని రిజక్ట్ చేసారు జడ్జి.అయితే ఇదే సమయంలో సుప్రీం కోర్టు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంది. అడ్డగోలుగా పర్మిషన్లు యిచ్చినందుకు కేంద్రప్రభుత్వం మీద అక్షింతలు వేస్తూ ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈ కేసును సీరియస్ గా పరిశీలించి విచారణ చేపట్టవలసిందిగా హైకోర్టుని ఆదేశించగా హైకోర్టు స్థానిక కోర్టు కి ఆదేశాలు జారీచేసింది. దాంతో జడ్జి ఈ కేసును రీ ఓపెనింగ్ చేసి ఇటు వారికి అటు త్యాగరాజన్ కూడ కోర్టుకు హాజరు కావలసిందిగా సమన్లు జారీచేసారు.ఇదీ ఒకందుకు మంచిదే అనుకున్నాడు త్యాగరాజన్ . ఫైల్ లో ఉన్న సాక్షుల్ని, బాధితుల్ని బెదిరించో భయపెట్టో, ఒకరిద్దర్ని ఫినిష్ చేసో మేనేజ్ చేయటం కష్టం కాదు. కాని ప్రధాన కక్షిదారు బ్రతికుండ కూడదు. లహరిని అంతంచేస్తే కేసులన్నీ వీకయిపోతాయి. కాని లహరి ఎలా ఉంటుందో తెలుసుకోవటం ఎలా? కోర్టు మెట్లు ఎక్కకముందే హతమయిపోవాలి. వెంటనే త్యాగరాజన్ మనుషులు రంగంలోకి దిగారు. హిందూ దినపత్రికలో సి సి కెమెరాల్ని ఆపరేట్ చేసే వ్యక్తిని అతి కష్టం మీద మేనేజ్ చేసి లహరి అక్కడికి వచ్చి వెళ్ళినప్పటి దృశ్యాల క్లిప్పింగ్స్ కొన్ని సంపాదించగలిగారు. కెమెరా విజువల్స్ సరిగా లేకపోయినా ఆఫీసులోకి వచ్చిపోతున్న లహరిని గుర్తించటం కష్టం కాలేదు.

''చాలా చిన్న వయసులా ఉంది గదరా. చాలా అందంగా కూడ ఉంది. ఏ వూరు..? ఎవరి తాలూకు?'' అడిగాడు.''తెలీదు సార్'' బదులిచ్చారు అనుచరులు.''కత్తిలా ఉండే ఇలాంటి అమ్మాయిలెప్పుడూ పక్కలో బళ్ళాలేరా. ఉంచకూడదు. ఈ పొగరు బోతు అమ్మాయికి నేను మరణదండన విధిస్తున్నాను. కోర్టు మెట్లు ఎక్కక ముందే ఫినిష్ చేయండి'' అంటూ ఆదేశించాడు త్యాగరాజన్త్యాగరాజన్ మనుషులు కోర్టు వాయిదా రోజున లహరి రాగానే వేసేయటానికి కోర్టు బయట రెడీగా ఉన్నారు. జర్నలిస్టు లహరికి తనెలా ఉంటుందో త్యాగరాజన్ కి గాని అతని మనుషులకి గాని తెలీదని గట్టి నమ్మకం. ఆ నమ్మకంతోనే సాదాసీదాగా ఆటోలో కోర్టు వద్ద కొచ్చేసింది. కోర్టులో హాజరు కాగానే తనకు రక్షణ కల్పించమని అడగాలనుకుంది కాని...

ఆటో దిగి మెట్ల వైపు అడుగులేస్తుండగానే ఆమెకు అనుమానం వచ్చేసింది. అక్కడ తచ్చాడుతున్న కొందరు మనుషుల్ని గుర్తుపట్టేసింది.వాళ్ళ కదలికల్ని గమనించగానే తనను కవర్ చేయబోతున్నారని తెలిసిపోయింది. తను వాళ్ళకు ఎలా

తెలిసిపోయిందో తెలీదు కాని ఆలోచించే సమయం లేదు, ప్రమాదం మీద పడకముందే తప్పించుకోవాలి .గిరుక్కున వెను తిరిగింది లహరి.తిరిగీ తిరక్కముందే ఆమె వెనక ప్రత్యక్షమయ్యాడో గుండా. వాడి చేతిలో కత్తి తళతళా మెరుస్తోంది. ఆమె వెనుతిరగ్గానే నిర్ధాక్షిణ్యంగా పొడవపోయాడు. వెంట్రుకవాసిలో వేటును తప్పించుకున్న లహరి లాఘవంగా వాడి చేతిని బ్లాక్ చేసి చివ్వున గాల్లోకి ఎగిరింది. ఆమె కుడి పాదం సూటిగా ప్రత్యర్ధి చెవి పక్కన దారుణంగా తాకింది. ఏం జరిగిందో తెలిసే లోపే పెద్ద కేకపెట్టి విరుచుకు పడిపోయాడు వాడు. పడ్డవాడు తిరిగి లేవలేదు.వాడు ఏమయ్యాడో కూడ చూడలేదు లహరి. వాడి కత్తిని సొంతం చేసుకొన్న మరుక్షణం దూసుకొస్తూ కత్తుల్ని ప్రయోగించబోతున్న ఇద్దరు గుండాల దాడి నుంచి మెరుపు వేగంలో తప్పించుకొంటూ మరోసారి గాల్లోకి ఎగిరింది. కరాటేలో గాని కుంఫ్ లోగాని ఫ్లైయింగ్ కిక్ ఎంత ప్రమాదకరమైందో మార్షల్ ఆర్ట్స్ గురించి తెలిసిన వాళ్ళకే తెలుసు. లహరి మార్షల్ ఆర్ట్స్ లో మాస్టరని ఆమె కదలికల్ని గమనిస్తున్న ఎవరికైనా ఇట్టే అర్ధమైపోతుంది.

కన్ను మూసి తెరిచే లోపు మరోసారి ఆమె కుడి పాదం ఒకడి తలకు కనక్టయింది. గాల్లో ఉండగానే రెండోసారి తల మీద ఆమె మోచేయి తాకింది. ఆమె పాదాలు నేలమీద అనే సరికి గుండాలిద్దరూ మట్టి కరిచారు.ఈ లోపల మిగిలిన గుండాలు ఆరుగురు ఒకరినొకరు హెచ్చరించుకొంటూ ఐరన్ రాడ్స్ తో కమ్ముకొచ్చారు. హరికి తను ఎక్కువసేపు ఇక్కడుండటం మంచిదికాదని అర్ధమైపోయింది. మీడియా వాళ్ళ దృష్టిలో పడినా పబ్లిక్ తనను గుర్తించినా చాలా సమస్యలొస్తాయి. అందుకే ఇక ఆలోచించలేదు. వేగంగా మధ్యకు జొరపడిపోయి ఒకడి నుంచి ఇనుపరాడ్ ను సొంతం చేసుకుంది అంతే.

చెరకు తోటలో పడిన మత్తేభంలా ఎడా పెడా గుండాలను విరగదీసి దారిచేసుకొని వేగంగా కోర్టు పక్కవీధిలోకి పరుగుతీసి మాయమైంది. ఈ సంఘటన జరిగినప్పుడు త్యాగరాజన్ కోర్టు బయటలేడు. లోపలున్నాడు. బయట అరుపులు గోల విన్నాకే బయటకొచ్చాడు. అప్పటికే లహరి ఎస్కేప్ అయింది కాబట్టి ఆమె ఎలా ఉంటుందో డైరెక్ట్ గా అతను చూసే అవకాశం కలగలేదు

ఆడపిల్ల ప్రాణం తీయాలని పథకం వేసి వచ్చిన గుండాలు చెల్లా చెదరుగా పడిపోయారు. వాళ్ళలో ఎవరి పరిస్థితి ఏమిటో వాళ్ళకే అర్ధంకాలేదు. అక్కడికీ కాస్త కాలు చెయ్యి బాగున్న నలుగురు గుండాలు ఇనుపరాడ్లు వూపుకుంటూ లహరి పారిపోయిన వీధిలోకి చూసారు. వీధి చివర మలుపుతిరగటం వరకే వాళ్ళకి కన్పించింది. ఆ తర్వాత ఆమె ఎటుపోయిందో జాడ తెలిలేదు. లహరినయితే త్యాగరాజన్ అంతం చేయించలేకపోయాడు కాని కేసును వాయిదా వేయించుకోడంలో సక్ససయ్యాడు. ప్రధాన కక్షిదారు అయిన లహరి కోర్టుకు హాజరు కాలేకపోయినందున కేసును వచ్చే నెల ఇదే తేదీకి వాయిదా వేయడమైనది. లహరి అనే జర్నలిస్టుకు తిరిగి సమన్లు పంపించమని ఆదేశించడమైనది. అంటూ ప్రకటించారు జడ్జి.

ఆ రోజు లహరిని అటాక్ చేసిన గుండాల్లో ఇంచు మించు అంతా హాస్పిటల్లో అడ్మిటయ్యారు. వాళ్ళలో ముగ్గురు ఇంకా హాస్పిటల్ బెడ్ మీదే ఉన్నారు.ఈ లోపల ఒక అద్భుతం జరిగింది...|

అక్కడ సెంట్రల్ మినిస్టరయిన దేవరాజన్ చక్రం తిప్పాడు. సెంట్రల్ గవర్న మెంట్ అధికార పార్టీకి మణివణ్ణన్ పార్టీ అలియన్స్ గా ఉంటూ వస్తోంది. స్టేట్ లో ఓడిపోయిన వాళ్ళ పార్టీ ఎంపిలు పదిహేను మంది డిల్లీ లో ఉన్నారు. కాబట్టి కేసు నుంచి తన కొడుకు త్యాగరాజన్ ను ఎలాగయినా గట్టెక్కించాలనే ఉద్దేశంతో పార్టీ మీద, ప్రధానమంత్రి మీద వత్తిడి తీసుకొచ్చి ఈ కేసు మీద ఒక ఎంక్వయిరీ కమీషన్ ను నియమింప చేసాడు.ఆ ముగ్గురు సభ్యులతో కూడిన ఎంక్వయిరీ కమీషన్ ను నియమించి తమిళనాడు ప్రభుత్వానికి పంపిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఆ వివరాలన్నీ సుప్రీం కోర్టుకు అందజేస్తూ ఆరు మాసాల్లో ఎంక్వయిరీ కమిటీ తన రిపోర్టును సబ్ మిట్ చేసే వరకు ఈ కేసును తాత్కాలికంగా నిలిపి ఉంచాల్సిందిగా అభ్యర్ధించింది. ఆ విధంగా ప్రస్తుతం ఈ కేసు కోర్టులో పెండింగ్ లో ఉంచబడిం`ది.జగన్మోహన్ కి ఇలాంటి వాటిని ఎలా మేనేజ్ చేయాలో బాగా తెలుసు. కాబట్టి కమీసన్ సభ్యులు ముగ్గురు అడుగుపెట్టినప్పుడే ముడుపులు ముచ్చట్లు జరిగిపోయాయి. కాబట్టి ప్రస్తుతానికి ఈ కేసుల గురించి భయం లేదు. కాని జర్నలిస్టు లహరి బ్రతికుంటే ఎప్పటికైనా ప్రమాదమే. ఆమెను అంతం చేసే వరకు తనకు మనశ్శాంతి లేదు. ఆమె గురించి మధురై లోను చుట్టు పక్కల అతని మనుషులు చాలా గాలించారు. కాని ఆ రోజు కోర్టు వద్ద తన మనుషుల్ని చావు దెబ్బ కొట్టి తప్పించుకున్న లహరి జాడ ఆ తర్వాత ఎవరికీ అంతు చిక్కకుండా పోయింది.ఇది జరిగి నాలుగు మాసాలు పూర్తయి అయిదో మాసం వచ్చేసింది. ఇంకో రెండు మాసాల్లో ఎంక్వయిరీ కమీషన్ గడువు పూర్తి కావస్తుంది. కావాలంటే కాలాతీతం చేయటానికి మరో మూడు మాసాలు గడువు పెంచుకునే అవకాశం ఎలాగూ ఉంది. ఈ పరిస్థితుల్లో గతం వదిలేస్తే ప్రస్తుతం...

వూహించని విధంగా అన్ని పత్రికల్లోను ఫోటోతో సహా వచ్చిన కోటి రూపాయల బహుమతి ప్రకటన సంచలనం సృష్టించింది. అందుకే న్యూస్ పేపర్లను టేబుల్ మీద వుంచి పరిశీలిస్తున్నాడు త్యాగరాజన్్. చాలా సేపటి తర్వాత తలెత్తి ఎదురుగా వున్న అనుచరుల వంక అనుమానంగా చూసాడు.

''ఏరా...... ఈ ఫోటో చూస్తే ఈ అమ్మాయే లహరి అన్పిస్తోంది. కాని చూస్తే సహస్ర అని ఉందేమిట్రా? ఈమె లహరి కాదంటారా?'' అంటూ సందేహం వెలిబుచ్చాడు.

''పేరు మార్చుకుందేమో సార్'' అన్నాడొకడు.

''కాని ఇదే అమ్మాయి సార్, డౌట్ లేదు'' అన్నాడు మరొకడు.

త్యాగరాజన్ ఇల్లీగల్ కార్యకలాపాలకు ఈ టేకు తోట ఏస్టేట్ బంగళా వేదికగా ఉంటూ వస్తోంది. గతంలో కొందర్ని చంపి ఆ తోటలోనే పాతిపెట్టి అడ్రస్ గల్లంతు చేసిన సంఘటనలూ ఉన్నాయి.



అనుచరులకీ అడ్డా అది. అందుకే ఎప్పుడూ అక్కడ పటిష్టమైన కాపలా ఉంటుంది. ఇక త్యాగరాజన్ కంపెనీలకు సంబంధించిన ఆఫీసులు మధురైలో ను ముఖ్యపట్టణాల్లోను ఉన్నాయి. ఆ ఆఫీసుల్లో సంచరించే త్యాగరాజన్ చాలా ఆఫీషియల్ గా హుందాగా కన్పిస్తాడు, అక్కడంతా ఎడ్యుకేటెడ్ ఎంప్లాయీస్ పని చేస్తుంటారు.

అనుచరుల మాటలు ఎంత వరకు నమ్మాలో అర్ధంగాక అతను ఆలోచిస్తుండగా అంతలో అతడి ఇల్లీగల్ కార్యకలాపాలను గమనించే రైట్ హ్యాండ్ లాంటి ఎట్టయప్పన్ లోన కొచ్చాడు. ఎట్టయప్పన్ మళయాలి. త్యాగరాజన్ కి నమ్మిన బంటుగా మారి తను బాగానే సంపాదించుకున్నాడు. మనిషి కూడ నల్లగా ఎత్తుగా చూడ్డానికి మెరటోడి లా కన్పిస్తాడు. త్యాగరాజన్ కన్నా ఎట్టయప్పకే అతడి అనుచరులు భయపడుతుంటారు. వాడు లోనకొస్తూ “మీ సందేహం నేను తీరుస్తా సార్ ” అన్నాడు.

“చెప్పు ఈ అమ్మాయి జర్నలిస్టు లహరి అంటున్నారు మనవాళ్ళు. కాదని నా డౌటు” అడిగాడు.

“డౌటు అక్కర్లేదు సార్! లహరి ఈ అమ్మాయే” అంటూ ఎదురుగా కూచున్నాడు ఎట్టయప్పన్.“ఎలాగా... ఇక్కడ సహస్ర అని వుంది.”

“ఈ ప్రకటన రావటం మనకు చాలా మంచిదయింది. బయట వీధుల్లో ఇదే చర్చ. నా ఎంక్వయిరీలో తెలిసింది. ఈ అమ్మాయి అసలు పేరు లక్ష్మీ సహస్ర. పెద్దింటమ్మాయి. విదేశాల్లో చదువుకుంది. జర్నలిజంలో గోల్డ్ మెడలిస్టు. రచయిత్రి కూడ. తన పేరు లోని లక్ష్మీ లోని ‘ల’ అక్షరాన్ని సహస్ర లోని ‘హ’ అక్షరాన్ని కలిపితే ‘లహ’ అయింది. దీనికి ‘రి’ చేర్చి జర్నలిస్టు లహరిగా ప్రసిద్ధి చెందింది. తనరూపంగాని ఐడెంటిటీ గాని ప్రత్యర్థులకు తెలీకుండా జాగ్రత్త పడింది.

“సో... ముందు జాగ్రత్తన్న మాట”

“అవును సార్. ఇక తన అసలు పేరు లోని సహస్రతో కథలు వ్యాసాలు వ్రాస్తూ కథ రచయిత్రి సహస్రగా కూడ పేరు సంపాదించుకుంది. కాబట్టి జర్నలిస్టు లహరి, కథా రచయిత్రి సహస్ర ఇద్దరూ ఒకటే.”

“సో... ఇక్కడ మనల్ని కెలికి తిప్పలు బెట్టి తప్పించుకుని చెన్నైలో తేలిందన్న మాట. వెరీ ఇంటెలిజెంట్. మార్షల్ ఆర్ట్స్ లో దిట్ట. రెండు మూడు నిముషాల్లోనే పదిమందిని చావు దెబ్బకొట్టి తప్పించుకు పోవటం మాటలా..? నేను తప్పుచేసాను. రివాల్వర్ తో కాల్చి పారేయమంటే కోర్టు ముందే చచ్చుండేది. బ్యాడ్ లక్ తప్పించుకుంది. నేను విధించిన మరణదండన దిక్కరించి తప్పించుకున్న తొలి మహిళ” అంటూ మెచ్చుకున్నాడు.

“నువ్వు మరీ ఎక్కువ పొగిడేస్తున్నట్టున్నావ్... నా కన్నా అందంగా ఉందా ఏమిటి?” అంది పక్క సీట్లోని లక్ష్మి.తెరిచిన నోరు మూయటం మర్చిపోయి ఆమె వంక చూసాడు త్యాగరాజన్.

లక్ష్మి...

ఆవిడ సాదాసీదా లేడీ కాదు...

పక్కజిల్లాకు చెందిన జాయింట్ కలెక్టర్. అలాగే త్యాగరాజన్ కు అంతరంగిక ప్రియురాలు. త్యాగరాజన్ ఫైళ్ళు వేగంగా కదిలి చక చకా పర్మిట్లు సంపాదించటంలో లక్ష్మి సహకారం చాలా ఉంది. ఇంకా చెప్పాలంటే డబ్బు కోసం తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రూల్స్ ని తుంగలో తొక్కి త్యాగరాజన్ కు న్ని విధాలా ఆది నుంచి సహకరిస్తూ వచ్చిన అధికారిణి. ఇందుకు ప్రతిఫలంగా కోట్లాది సొమ్ము ఆమె బినామి అకౌంట్లకు మళ్ళించాడు త్యాగరాజన్్.

లక్ష్మి చాలా అందంగా, రొమేంటిక్ గా ఉంటుంది.

ప్రస్తుతం ఆమె వయసు నలభై రెండు సంవత్సరాలు. కాని చూడ్డానికి ముప్పై దాటని ప్రౌఢలా ఉంటుంది. డబ్బు వయసును కూడ దాచేసి మనిషికి కొత్త యవ్వనాన్ని ఉత్సాహాన్నిస్తుంది. కాస్త ఒళ్ళుచేసినా మేలిమి బంగారు వన్నె మేని ఛాయతో మిస మిస లాడే వంపు సొంపులతో మగాళ్ళని ఇట్టే ఆకర్షించేరూపం.

లక్ష్మి ఏకాంతంలో త్యాగరాజన్ తో కలిసి మందు కొడుతుంది. సిగరెట్లు కాలుస్తుంది. నిర్లజ్జగా అతనికి ఏం కావాలో యిచ్చి తనకి ఏం కావాలో తీసుకుంటుంది.

లక్ష్మికి పెళ్ళయింది. భర్త యిద్దరు పిల్లలున్నారు. భర్త సివిల్ ఇంజనీర్ గా మహారాష్ట్రలో ఎక్కడో పనిచేస్తూ అప్పుడప్పుడూ వచ్చి పోతుంటాడు. లక్ష్మి అక్రమ సంబంధం అతడికి తెలిసిన విషయమే అయినా పట్టించుకోడు. డబ్బు అన్ని తప్పుల్ని క్షమించేస్తుంది. కూతురు కొడుకు యిద్దరూ జర్మనీలో చదువుకొంటున్నారు.

‘‘నన్నో పిచ్చోడ్ని చేస్తే ఎలా?’’ అన్నాడు ఆఖరి ఆపిలు ముక్కను సిల్వర్ డిష్ లోంచి తీసి నోట్లో వేసుకుంటూ.

లక్ష్మి మూతి ముడిచింది.

‘‘ఇందులో పిచ్చితనం ఏముంది? ఆ ప్రకటనలో అమ్మాయి నా కన్నా అందంగా ఉందా? అనడిగాను అంతేగా’’ అంది సమర్ధించుకుంటూ.‘‘అంతేగా అంటే?... అడగటంలో కూడ ఓ అర్ధం ఉండాలి గదా, నీ వయసు ఏమిటి? ఈ పిల్ల

వయసు పాతికలోపు. వయసు పిల్లతో నీకు పోటీ ఎలా..? ఈ వయసులో నువ్వు అందంగానే ఉండుంటావ్. కాని యిప్పుడు? సహజత్వం ఏదీ? వయసు తెలికుండా కొని తెచ్చుకొన్న అందమేగా అంతా? తనతో నీకు పోటీ ఏంటి? అందుకే నవ్వొచ్చింది?" అంటూ నవ్వాడు త్యాగరాజన్.ఆ యిద్దరు సంవాదం విని ఏంజాయ్ చేస్తూ ఎదురుగా కూచున్న ఎట్టయప్పతో బాటు మిగిలిన గుండాలు లోలోన నవ్వుకొంటున్నారు. లక్ష్మి ముఖం చిన్న బుచ్చుకుని చూసింది.

"ఓకె... నేనేదో తమాషాకి అడిగాననుకో, ఆ పిల్లమీద జాలి చూపిస్తున్నావా. తనకి విధించిన మరణదండన రద్దుచేసి యావజ్జీవ శిక్షగా మార్చబోతున్నావ్? అనడిగింది.

ఆ మాటలకి తల అడ్డంగా వూపాడు త్యాగరాజన్."మీ ఆడాళ్ళతో వచ్చిన చిక్కేయిది. బోడి గుండుకీ బొటున వేలికీ ముడివేసేయాలని చూస్తారు. ఎలా కుదురుతుంది? నేను విధించిన మరణదండన నుండి తొలిసారిగా ఓ ఆడపిల్ల తప్పించుకొని నాకే సవాల్ విసిరింది. కోర్టు దగ్గర అది కొట్టిన దెబ్బలకి నా మనుషులు ముగ్గరింకా ఆస్పత్రిలో బెడ్ మీద నాలుగు మాసాలుగా కోమాలో ఉన్నారు. అది బతికున్నంత వరకు మన పీకకు చుట్టుకున్న ఉరితాడు అలాగే ఉంటుంది. ఎలా వదిలేస్తాను? పాము చిన్నదయినా అందంగా ఉందని కొట్టి చంపకుండా వదిలేస్తామా? తల చితగొట్టి చంపేస్తాం. ఇదీ అంతే, మరణదండన అమలు జరిగి తీరుతుంది" అంటూ ఎట్టయప్ప వంక చూసాడు."ఇంతకీ ఈ కుర్రది ఎవరి తాలూకు? ఏ వూరు? దీని బ్యాగ్రౌండ్ ఏమిటి ఏమన్నా తెలిసిందా? అనడిగాడు.

"తెలిసింది సార్. ఈ అమ్మాయి సాదాసీద యువతి కాదు. ఈమె బ్యాగ్రౌండ్ చాలా స్ట్రాంగ్. వింటే మీరే ఆశ్చర్యపోతారు" అన్నాడు ఎట్టయప్ప.

"ఆహా.... వెరీ ఇంటస్ట్రింగ్... చెప్పుచెప్పు"

"ఈ అమ్మాయి ఎక్కడిదో కాదు సార్. స్థానికంగా మన మధురైకు చెందినదే. ఈమె తండ్రి మీకు బాగా తెలిసినవాడే. పైగా మీకు ప్రత్యర్థి. అధికార పార్టీకి చెందినవాడు. ప్రస్తుతం ఈ ప్రాంతపు లిక్కర్ సిండికేట్ ముఖ్య నాయకుడు. అనేక వ్యాపారాలతో కోట్లకు పడగలెత్తినవాడు. ఒకప్పుడు మధురై ప్రాంతాన్ని పరిపాలించిన ఆంధ్రనాయకరాజుల వంశానికి చెందినవాడు."

ఎట్టప్పన్ మాటలు వింటుంటే జగన్మోహన్ ముఖంలో చక చక రంగులు మారి పోనారంభించాయి"ఉన్నట్టుండి ఆగాగు"...... అనరిచాడు"ఏమిరా ఎట్టయప్పా నీవుచెప్పి నది మహాదేవ నాయకర్ గురించి కాదు గదా"? అనడిగాడు

అనుమానంగా.   "కాకపోవటం ఏమి సార్.   ఆయన గురించే చెప్తా వుండాను. ఆ మహాదేనాయకర్   ఏకైక కూతురే ఈ లక్ష్మీ సహస్ర."   అంటూ ధృవీకరించాడు ఎట్టయప్పన్"షాకైపోయాడు త్యాగరాజన్.

"లోకల్ గా ఈ అమ్మాయి జర్నలిస్టని జనాలకు తెలీదు.   తెలీకుండా జాగ్రత్తపడిరది.   కాని కథా రచయిత్రి సహస్రగా ఈ అమ్మాయి మాత్రం చాలా మందికి తెలుసు. ముఖ్యంగా పేద బిక్కి మధ్యతరగతి ప్రజల్లో తండ్రి మహాదేవనాయకర్   లాగే ఈమెకూ మంచి పేరుంది.   వాళ్ళకి ఏ సమస్య వచ్చి నా ముందుండి ఆదుకుంటుంది.   ఆర్థిక సహాయం చేస్తుంది. అవసరమైతే వాళ్ళ తరుఫున పోరాడుతుంది.   కాబట్టి సహస్ర అందరికీ తెలుసు గాని ఈ అమ్మాయే జర్నలిస్టు లహరి అని అందరికీ తెలీదు. ఇ ప్పుడే పేపర్ ప్రకటన చూసి సహస్ర చెన్నై లో తండ్రికి తెలీకుండా ఉంటూ ఎవరో కుర్రాడ్ని ప్రేమించిందని, పాపం ఏమయిందో ఏమిటో ఆమె ప్రియుడు పత్రికల మూలంగా ప్రకటన యిచ్చినాడని చెప్పుకొంటున్నారు"   అంటూ వివరించాడు.

ఆ మాటలకు కాస్త విసుగ్గా చూసాడు త్యాగరాజన్.   లక్ష్మి క్కూడ అర్థంగాక అయోమయంగా చూస్తోంది.

"అంతా గందరగోళంగా ఉంది.   నాయకర్ కి తెలీకుండా చెన్నై లో ఉండటం ఏమిటి?   మనకి భయపడగా పారిపోయింది? తన కూతురిపైన హత్యాప్రయత్నం జరిగిందని తెలిస్తే మహాదేవనాయకర్   మౌనంగా ఉండే మనిషికాడే"

"చెప్తా సార్,   అక్కడికే వస్తున్నా"   అంటూ త్యాగరాజన్ ఆపాడు ఎట్టయప్ప.

చాలా కాలంగా మధురైలో బలమైన రెండు వర్గాలు త్యాగరాజన్   వర్గం,   మహదేవనాయకర్   వర్గాలే. నగరంలో చిన్న చిన్న వర్గాలు ఏమున్నప్పటికీ అవి ఈ రెండు వర్గాల్లో ఏదో ఒక వర్గానికి అనుబంధంగా పనిచేసేవే.   అయితే ఈ రెండు వర్గాల కార్యకలాపాలు వేరువేరు గావటంచేత ఇంత వరకు వీళ్ళ మధ్య ఎలాంటి ఘర్షణలు గొడవలు చోటు చేసుకోలేదు. అలాగే మధురై ప్రజల్లో మహదేవనాయకర్ కి ఉన్నంత పలుకుబడి అభిమానం త్యాగరాజన్ కు లేదన్నది వాస్తవం. మహాదేవనాయకర్ నేర చరిత్ర లేదు. అతని వద్ద ఉన్న సహచరులు అక్రమాలు అన్యాయాలకు వెళ్ళే వాళ్ళు కాదు.   ప్రజలకిి ఏ ఇబ్బంది ఎదురైనా మహాదేవనాయకర్   ముందుంటాడు. ఎవరన్న తమకు అన్యాయం జరిగిందని ఆశ్రయిస్తే నాయకర్ తన మనుషుల్ని పంపి అన్యాయం చేసిన వాళ్ళ తాట తీయించి న్యాయం జరిపిస్తాడు.   అలాగే దాన ధర్మాల్లోను ముందుంటాడు. కాని త్యాగరాజన్   అలా కాదు.   అతడిది నేర చరిత్ర.   తన సంపాదన తనూ తప్ప ప్రజల బాగోగుల గురించి పట్టించుకోడు.   ఇద్దరి స్వభావాల కీ ఉత్తర దక్షిణ ధృవాలంత వ్యత్యాసం వుంది.

ఎట్టయప్ప చెప్పటం ఆరంభించటంతో త్యాగరాజన్   ఆలోచనలు చెదరి పోయి తిరిగి అతడి వైపు దృష్టి సారించాడు.

''సార్ !     మహాదేవనాయకర్    చాలా పట్టుదల మనిషి,     మనకి ఇది తెలిని విషయం కాదు.     తన మిత్రుడు ఈ ప్రాంతపు ఎంపి తో సంభందం కలుపుకోవాలని ఆయనకి మాటిచ్చేసాడు,     కాని ఈ సంబంధం చేసుకోవటం లక్ష్మీ సహస్రకిష్టం లేదు.     ఈ విషయంలో కొద్దికాలంగా తండ్రి కూతురు మధ్యన వాదం కొనసాగుతూ వస్తోంది.     ఏదీ ఏమైనా ఈ పెళ్ళి జరగాలంటాడు మహదేవనాయకర్, తనుచేసుకోనంటుందాపిల్ల. ఈ పరిస్థితుల్లో తన పట్టుదల కొద్ది నిశ్చితార్ధ నిమిత్తం ముహూర్తం నిశ్చయించేసారు మహాదేనాయకర్.

సరిగ్గా లహరి కోర్టు దగ్గర మనోళ్ళ నుంచి తప్పించుకున్న మరునాడే ఆ నిశ్చితార్ధం రోజు. ఆ రాత్రి బాగా ఆలోచించుకొని అటు యిష్టం లేని పెళ్ళి తప్పించుకోడానికి, యిటు కొంతకాలం పాటు మన కంటపడకుండా ఉండటానికి అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోవాలనుకుని ఉంటుంది.     అందుకే ఆ రాత్రికి రాత్రే ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదిలి మధురై నుండి పారిపోయింది.

రాజకీయ పరిచయాలున్న వ్యక్తి గాబట్టి మహాదేవనాయకర్    కూడ జర్నలిస్టు లహరినే........ ఆమె రాజకీయ విశ్లేషణలు వ్యాసాలను చాల ఆసక్తిగా చదువుతూంటాడు. కాని ఆ లహరి తన కూతురు లక్ష్మీ సహస్రని మాత్రం ఆయనకి తెలిదు. కాలక్షాపానికి సహస్ర పేరు మీద ఏవో కథలు రాస్తుంటుందని మాత్రమే తెలుసును.

కాబట్టి ఇష్టం లేని పెళ్ళి నుంచి తప్పించుకోడానికే తన కూతురు ఇల్లొదిలి పారిపోయిందనుకున్నాడు గాని కోర్టు ఆవరణలో లహరి మీద జరిగిన హత్యాప్రయత్నం గురించి ఆయనకు తెలీదు. తెలిస్తే మధురై యింత ప్రశాంతంగా ఉండేది కాదు''     అంటూ అసలు విషయం వివరించాడు ఎట్టయప్పన్.

ఎట్టయప్ప మాటలు వాస్తవాలని త్యాగరాజన్కి తెలుసు.     తమ మధ్య ఎన్ని గొడవలున్న తన కూతురు మీద హత్యాప్రయత్నం జరిగిందని తెలిస్తే మహాదేవనాయకర్    వూరుకోడు.     తమ రెండు వర్గాల దాడుల్లో మధురై అల్లకల్లోలమై ఉండేది. కాబట్టి ఈ ప్రశాంతత యిలాగే కొనసాగాలంటే తన కూతుర్ని ఎవరు చంపారో కూడ మహదేవనాయకర్కి తెలికుండా జాగ్రత్తపడాలి.     సానుభూతి చూపిస్తూ తను మహాదేవ నాయకర్ ఇంటికి వెళ్ళి లహరి శవం మీద పూలదండ వేసి రావాలి. ఇది జరగాలంటే మహాదేవనాయకర్    కన్నా ముందే లహరి చెన్నైలో ఎక్కడ ఉందో ట్రేసవుట్ చేసి హతం చేయాలి.మరోసారి త్యాగరాజన్    ఆలోచనల్ని చెల్లాచెదరు చేస్తూ ఎట్టయప్పన్    తన ఆఖరి ఇన్ఫర్మేషన్ బయటపెట్టాడు.

''నేనిటు వచ్చేముందే తెలిసిన వార్త సార్.     పేపర్    ప్రకటన చూడగానే మహాదేవనాయకర్ చెన్నైలో గల్లిగల్లి గాలించయినా లక్ష్మీ సహస్రను పట్టి -వెనక్కి తీసుకురమ్మని ఆదేశించి పదిమంది తన మనుషుల్ని గంట క్రితమే చెన్నై పంపించాడట''.

ఆ మాటలకు త్యాగరాజన్ సీరియస్ గా చూసాడు.

''సో......... మనమేలేటు. ఇప్పుడ మనం ఏం చేయాలి?'' అనడిగాడు.

''మనం కూడా పదిమందిని పంపిద్దాం సార్. మహాదేవనాయకర్ మనుషుల కన్నా ముందే మనోళ్ళు చెన్నై చేరుకునేలా ఫ్లైట్ లో పంపించేద్దాం. చెన్నైలో మన ఆఫీసు నుంచి వేన్తీసుకుంటారు. అవసరమైతే అక్కడ లోకల్ గుండాల సాయం తీసుకుంటారు. లేదంటే''.''ఆపరా! ........'' అంటూ ఎట్టయప్ప మాటలకు అడ్డం వచ్చాడు త్యాగరాజన్ '' ఏరా! ........ అదే మన్న చిన్న పల్లెటూరు అనుకున్నావా ? నాలుగు వీధులు తిరిగి ఆ పిల్లదాన్ని పట్టుకోడానికి? చెన్నై మహానగరం. ఎక్కడుందో తెలీకే దీని ప్రియుడు పేపర్ ప్రకటనిచ్చాడు. మన వాళ్ళు మాత్రం పరుగులెత్తి ఏం చేస్తారు? వ్యాన్ ఇచ్చి రోడ్ రూట్లో పంపించు. అయిదుగురు చాలు'' అన్నాడు. ''ఎందుకైనా మంచిది సార్. పదిమందిని పంపుదాం అన్నాడు'' ఎట్టయప్పన్.

''కాని ఆ పదిమందిలో కనీసం ఇద్దరయినా బెస్ట్ షూటర్స్ ఉండాలి. రివాల్వర్ ఎత్తుతే గురి తప్పకూడదు. మొదటి బుల్లెట్ కే ప్రాణం పోవాలి.''''ఆ విషయం నాకొదిలేయండి సార్''

''మరో మాట ''

''చెప్పండి సార్''



“మన వాళ్ళకి ఆత్రం ఎక్కువ.   బుర్ర తక్కువ.   పొరబాటు జరక్కూడదు.   పొరబాటున గురి తప్పిందో........

మన వాళ్ళని విరుచుకు తినేస్తుందా కుర్ర రాక్షసి.   కాబట్టి వెళ్ళినవాళ్ళు ముందు ఆ లహరిని గుర్తించాలి.   పబ్లిక్ లో గాని ఆఫీసుల్లో గాని దాన్ని చంపే ప్రయత్నం చేసి అల్లరి గాకూడదు.   ఆమెను గుర్తించాక అనుమానం రాకుండా అనుసరించి ఇల్లెక్కడో ఎవరితో ఉంటుందో ఆనుపాన్లు గమనించమను. తర్వాత ఏ ఆర్భాటం లేకుండా ఇంట్లోంచి బయటికి రాగానే కాల్చి పారేసి వచ్చేయమను.   హత్య చేసిన గంటలోపలే మన వాళ్ళంతా చెన్నై బయటికొచ్చేయాలి.   అర్థమైందా?   ఏర్పాట్లు పక్కాగా ఉండాలి. ఎంత ఖర్చయినా ఫరవాలేదు.   ఇచ్చి పంపించు.   వెళ్ళి ఆ పని చూడు”   అంటూ ఆర్డర్   వేసాడు

త్యాగరాజన్.

‘‘ఒకె సార్.......’’ అంటూ తీసుకొని బయటికెళ్ళిపోయాడు ఎట్టయ్యప్పన్. మరో గంట తర్వాత త్యాగరాజన్ మనుషులు పది మంది ప్రత్యేకమైన వ్యాన్ లో బయలుదేరి చెన్నై వైపు ప్రయాణం ఆరంభించారు.

I I I

అదే రోజు ఉదయం...........

కొయంబత్తూరు............

పాలెస్ వంటి వెంకటరత్నం నాయుడు గారి హౌస్..........

రెండో అంతస్తులోని తమ పడగ్గదిలో ఉదయం ఆరు గంటలకి లేవగానే స్నానాదులు ముగించుకొని ఏడుగంటలకంతా పూజాదికాలు ముగించి తీరిగ్గా బాల్కనీలోని తూగుటుయ్యాలలో కూచొని ఆ రోజు రెండు మూడు దినపత్రికలు చదవటం ఆయన అలవాటు.

అలాగే ఉదయం తన భార్య మంగతాయారు అందించే కాఫీ తాగితే గాని ఆయనకి తృప్తి ఉండదు. ఇంట్లో ఎందరు పనివాళ్ళున్నా వాళ్ళు వంట వార్పు వరకే పరిమితం. భోజన సమయంలో కూడ భార్య దగ్గరుండి వడ్డించాల్సిందే.

అలవాటు ప్రకారం ఆ రోజు ఉదయం కూడ తూగుటుయ్యాల మీద కూచొని పేపరు చూస్తూ నవ్వుకుంటున్నాడాయన. ఈ లోపల సిల్వర్ కప్పులో కాఫీ తెచ్చి అందించిన మంగతాయారు అది గమనించి ‘‘మీలో మీరు నవ్వుకుంటున్నారు ఏమైందేమిటి?’’ అనడిగింది.

‘‘పేపరు చూస్తుంటే నవ్వొస్తోందోయ్. రోజులు యిలా మారిపోతున్నాయేమిటి అన్పిస్తోంది’’. అన్నాడు కాఫీ సిప్ చేస్తూ వెంకటరత్నం నాయుడు గారు.

‘‘మారుతోంది రోజులు కాదులెండి.  మనుషులు.  ఇంతకీ విషయం ఏమిటి?’’

‘‘ఏమిటంటే ఏం చెప్పనోయ్.  మన కాలంలో పిల్లలు యిలా ఉండేవారా?  కట్టరా తాళి అంటే పెద్దలు చూపించిన పిల్ల మెడలో కళ్ళు మూసుకొని తాళి కట్టేవారు. ఎవరో ఎందుకు?  మన సంగతే చూడు.  పెళ్ళికి ముందు నీ ముఖం కూడ నాకు తెలిదు గదా.......’’

‘‘మన సంగతి వదిలేయండి.  పేపర్ లో విషయం ఏంటో చెప్పండి’’.  అంది నవ్వుతూ మంగతాయారు.

‘‘అక్కడికే వస్తున్నానోయ్.  ఈ ప్రకటన చూడు.  తన ప్రియురాల్ని పట్టిస్తే కోటి రూపాయలిస్తానంటూ పేపరు ప్రకటనిచ్చాడో ప్రబుద్ధుడు,  బుద్ధుండొద్దూ,  పెళ్ళాం కూడా కాదు, ప్రియురాలట.  అంటే యిద్దరూ ప్రేమించుకొనుండాలి. ఆ పిల్లతో ఏం గొడవపడ్డాడో ఏమిటో.  ప్రియురాలు తన దారిన ఎటో వెళ్ళిపోయింది. తనే పట్టుకోలేకపోయాడు. ఇక జనం పట్టుకుంటారా?

ప్రేమా దోమా అంటూ చెడిపోయి యిలా పేపర్లకెక్కటం పద్ధతేనా?’’  అంటూ పేపరు అందించాడు.

‘‘కాని ఈ అమ్మాయిని గమనించారా?  ఎంత లక్షణంగా ఉందో.  మహాలక్ష్మిలా ఉంది గదండీ’’  అంటూ మెచ్చుకుంది మంగతాయారు. ‘‘మన విరాట్ కి చిలక్కి చెప్పినట్టు చెప్పాను.  సాగరికను పెళ్ళిచేసుకోమని.  వూహు,  మేనరికం తన కిష్టంలేదట.  ఢిల్లీకో ముంబైకో పారిపోయి తప్పించుకు తిరుగుతున్నాడు.  ఎంతకాలమో చూస్తాను. చెవి మెలేసి మరీ వాళ్ళిద్దరి పెళ్ళి జరిపిస్తాను’’  అన్నాడు పట్టుదలగా.‘‘అవున్లెండి మీరాపని చేస్తారనేవాడు  ఇంటికి రావటమే మానేసాడు. రెండేళ్ళు కావస్తోంది.  బిడ్డ ఎక్కడున్నాడో ఎలా వున్నాడో? మీ పంతం మీదే గాని ఈ కాలం పిల్లలు మన మాట వింటున్నారా ఏమన్నానా’’  అంటూ సిల్వర్ కప్పు తీసుకొని లోనకెళ్ళిపోయిందావిడ.

ఇంతలో ఆయన సెల్ ఫోన్ మోగింది

అవతల లైన్ లో ఉంది కూతురి కూతురు తనకు మనవరాలు అయిన సాగరిక

"ఏమిటి పొద్దుటే ఫోన్ చేసావ్, ఏంటి విశేషం?" అనడిగాడు నవ్వుతూ.

"విశేషం ఉంది తాతయ్యా, మావయ్య విరాట్ ఎక్కడున్నాడో తెలిసి పోయింది." అవతల ఉత్సాహంగా అరిచింది సాగరిక.

ఒక్కసారి ఉద్వేగానికి లోనయ్యాడు వెంకటరత్నం నాయుడు.

"ఎక్కడ........ఎక్కడున్నాడు?" ఆతృతగా అడిగాడు.

సాగరిక మౌనం..........

"చెప్పు......... .చెప్పవే తల్లి"

"నేను చెప్పను"

"అదేమిటే మవాడ్ని చేసుకోవటం నీ కిష్టం లేదా?"

"నా యిష్టం సంగతి పక్కనపెట్టు తాతయ్య. మేనరికం మావయ్య కిష్టం లేదు గాబట్టి నాకూ ఇష్టం లేదంతే. మావయ్యకు నచ్చిన పిల్లతోనే పెళ్ళి జరిపిస్తానంటే చెప్పు. ఎక్కడున్నాడో చెప్తాను."

"ఓకే అలాగే చేద్దాం. చెప్పు"

"ఆహా ఉత్తినే చెప్పేస్తారు పాపం, ప్రామిస్ చెయ్యి. చెప్తాను"

“సరి ప్రామిస్ చేస్తున్నాను. చెప్పవే తల్లీ ఎక్కడుంటున్నాడు? నీగ్గాని ఫోన్ చేసాడా?”

“చేయలేదు గాని తాతయ్య ఇవాళ పేపర్ చూసావా?”

“ఇప్పుడా పనిమీదే ఉన్నాను”

“అన్ని పేపర్లలోనూ ఒక ప్రకటనుంది” “నా ప్రియురాల్ని పట్టిస్తే కోటి రూపాయలు” అని చదివావా?

“ఏమిటే పొద్దుటే నాతో వాదులాట. ఆ ప్రకటనతో మనకి సంబంధం ఏమిటి?”

“తాతయ్యా చదివావా లేదా ముందు చెప్పు”

మనవరాలి మాటలు వెంకటరత్నం నాయుడి గారిలో అనుమానం రేకెత్తించాయి. గుండెల్లో బాంబు పేలినట్టయింది. గుండె కొద్ది క్షణాలు టకటకా కొట్టుకుంది.

“మాట్లాడవేంటి తాతయ్య. చదివావా?” అవతలి నుంచి సాగరిక దబాయింపుతో ఆలోచనల నుంచి బయటపడి “ చదివానమ్మ కాని....” అన్నాడు.

“కానీ లేదు గీనీ లేదు. ఆ ప్రకటనిచ్చింది ఎవరో కాదు విరాట్ మావయ్య” అంది.

“విరాటిచ్చాడా... నేన్నమ్మను. ఎలా చెప్పగలవ్?” షాక్ తింటూ అడిగాడు

“ఎలా ఏంటి తాతయ్య ఓ సారి ఆ ఫోన్ నెంబర్ గమనించు. మావయ్య పర్సనల్ నంబరది. కోయంబత్తూరులో ఉండగా తీసుకుంది. ముఖ్యమైన వాళ్ళకి తప్ప ఈ నెంబరు ఎవరికీ యివ్వడు. అప్పట్లో ఒకటి రెండు సార్లు నాకు ఫోన్ చేయగా నోట్ చేసుకున్నాను. అనుమానం వచ్చి చెక్ చేస్తే అదే నంబరు. అంటే మావయ్య చెన్నైలో ఉంటూ ఎవరో సహస్రనే అమ్మాయిని ప్రేమించాడు. అమ్మాయి ఫోటో చూసాఁ చాలా బాగుంది. ఇదంతా ఎందుకు చెప్పానంటే ప్రామిస్ చేసాక మాట తప్పకూడదు. ఫోన్ చేసి మావయ్యను రప్పించి వాళ్ళిద్దరికీ పెళ్ళిచేయాలి సరేనా?”

“సరిసరి విషయం చెప్పావ్గా. ముందు వాడు దొరకనీ తార్వత చూద్దాం.” అంటూ లైన్ కట్ చేసాడు.

ఈ లోపల జరిగిందేమంటే లోనకు వెళ్ళినట్టే వెళ్ళిన ఆయన భార్య మంగతాయారు తిరిగి వెనక్కి వచ్చి గడప వెనకనుంచే ఆయన మాటలు వినేసింది. ప్రకటనిచ్చింది తమ చిన్న కొడుకు విరాట్ . ఈ ఫోటోలో అమ్మాయిని ప్రేమించాడని అర్థమైపోయింది. కాని ఏమీ తెలీనట్టు అప్పుడే వస్తున్నట్టుగా తిరిగి బాల్కనీ లోకి వస్తూ “ఎవరితోనండీ ఫోన్ లో ఇంత సేపు మాట్లాడుతున్నారూ?” అనడిగింది.

“ఇంకెవరు? మనవరాలు సాగరిక” అన్నాడాయన.

“ఏమంటుందేమిటి?”

“దాని ముఖం అదేమంటుంది? మావయ్య అడ్రస్ తెలిసిందా, ఎప్పుడు మా పెళ్ళి చేస్తారూ అనడుగుతోంది. ఏం చెప్పాలి చిన్న కొడుకుని నెత్తినెత్తుకున్నావ్ గా. చూడు ఎన్ని సమస్యలో”

“చూసి ఏం చేస్తాంలెండి. పిల్లలు వాళ్ళిష్టం. మనం వాళ్ళననుసరించిపోవాలిగాని మనల్ని వాళ్ళు అనుసరించరు. డైలీ సీరియల్ చదివిస్తాను. ఓ సారివ్వండి” అంటూ పేపరు తీసుకొని తిరిగి లోనకెళ్ళిపోయిందావిడ.

మంగతాయారు తమ సంభాషణవిందని వెంకటరత్నం నాయుడు సందేహించ లేదు. భార్య వెళ్ళిపోగానే మొదట ఆ నంబర్ కు ఫోన్ చేసి కొడుకుని చెడామడా తిట్టి ఇంటికి రమ్మని చెప్పాలనుకున్నాడు. కాని అలా చేస్తే వాడు చెన్నై వదిలి వెళ్ళిపోవచ్చు. ఆ పైన చెన్నైలో వాడు ఎక్కడ ఉంటున్నాడో అడ్రసేదీ ప్రకటనలో ఇవ్వలేదాయే. ఇలా కాదు గాని ముందు ఈ సెల్ నంబరు వాడిదో కాదో ఎంక్వయిరీ చేయించి వాడిదేనని తేలితే అప్పుడు ఏం చేయాలో ఆలోచించాలి. ముఖ్యంగా పెద్ద కొడుకు విక్రాంత్ తో చర్చించి

ఒక నిర్ణయం తీసుకోవాలి.సాగరికతో వాడి పెళ్ళి జరగాలంటే వాడు కోయంబత్తూరుకు రావాలి. వాడు ఎలాగు రాడు. ఇక్కడ్నుంచి చెన్నైకు మనుషుల్ని పంపించి వెదికించి కాళ్ళు చేతులు కట్టి తీసుకురావాలి. ఇందుకు తమ ఫ్యాక్టరీలో పని చేసే మునిసామి కరక్టు. పదిమందితో వెళ్ళి పని ముగించుకొచ్చేస్తాడు. విరాట్ ను తెచ్చి కాళ్ళ దగ్గర పడేస్తాడు. అనుకొంటూ లేచాడు వెంకటరత్నం నాయడు.

I I I

మధురై పోలీస్ కంట్రోల్ రూమ్....

ఎయస్పి ప్రకాష్ చాంబర్....

ఆ రోజు న్యూస్ పేపర్ చూడగానే ఎ యస్ పి ప్రకాష్ ఆనందం ఆపుకోలేక ఒక్కసారిగా 'హుర్రే' అనరిచాడు. ఆ అరుపు విని అదిరిపడి బయట పోలీసులు కింద పడబోయి ఎలాగో నిదొక్కుకుని ముఖముఖాలు చూసుకున్నారు.

"ఈ మెంటల్ గాడి తో చచ్చి పోతున్నాంరా బాబు. పొద్దుటే ఏమైంది వీడికి?" గొణిగాడో పోలీసు.

"ఏయ్ వన్నాట్ ఫోర్ ఆయన పర్సనల్ అసిస్టెంట్ నువ్వేగదా. పోయి ఏమైందో చూడు. పొద్దుటే కుక్కచేత కరిపించుకొచ్చాడో ఏమోఖర్మ. ఇంకోసారి అరిస్తే గుండాగి ఛస్తాం. పోయిచూడు" వన్నాట్ ఫోర్ కి సలహా ఇచ్చారు మరొకరు.

అతను ఎ యస్ పి చాంబర్ లోకి అడుగుపెట్టేసరికి ఆయన ఆ రోజు న్యూస్ పేపర్ కి తెగముద్దులిస్తు కన్పించాడు.

ముఖం నిండా నవ్వు పులుముకొని " సార్... ఏంటి సార్ విశేషం? చాలా హుషారుగా వున్నారు" అనడిగాడు.

పేపర్ లోంచి తలెత్తి చూసాడు. ఎ యస్ పి ప్రకాశ్ చాలా వుత్సాహంగా కన్పిస్తునాడు మనిషి.

“ఎయ్ వన్నాట్ ఫోర్ !  రా రా రా ఇవాళ చాలా ఆనందంగా ఉందిరా ఎందుకో తెలుసా?”  అన్నాడు ఛేర్ లోంచి లేస్తూ.“ఎందుకు సార్?”  అమాయకంగా అడిగాడు వన్నాట్ ఫోర్.

“దొరికిపోయిందిరా!”

“ఎవరు సార్?”

“నా కలల రాణి.  జాడ తెలిసిపోయిందిరా.  ఇక దొరికిపోయినట్టే”

వన్నాట్  ఫోర్ కి ఏమీ అర్థంగాక`

బుర్రగోక్కుని చూసాడు.

“మీరు ఏ రాణి గురించి చెప్తున్నారు సార్?”  అన్నాడు అమాయకంగా.

“ఈ ఫోటో చూడరా తెలుస్తుంది.”  అంటూ పేపర్  టేబుల్ మీద పరిచి ప్రకటన చూపించాడు.  అంతవరకు ప్రకాశ్ ముద్దులిచ్చింది ప్రకటనలోని సహస్ర ఫోటోకి. ఫోటో చూసి గుడ్లుమిటకరించాడు వన్నాట్ ఫోర్.

“ఈ సహస్ర ఎవరు సార్? ఈ ప్రకటన మీరే యిచ్చినారా?” అనడిగాడు.

“నేనివ్వలేదురా.  చెన్నైలో ఈవిడ చేతిలో మోసపోయిన ఎవరో ఒక బకరాగాడిచ్చాడు.  ఇచ్చి మంచి పనిచేసాడు.  సహస్ర చెన్నైలో ఉందని తెలిసిపోయింది. ఇన్ని రోజులూ దీని కోసం గాలిస్తునే ఉన్నారా.  ఇప్పటికి జాడ తెలిసింది.”

“నాకేమీ అర్థంగావటం లేదు సార్.	ఇంతకీ ఈ సహస్ర ఎవరు?”

“ఇంకా గుర్తుపట్టలేదా?	కొంత కాలం కిందట ఇదే సమయంలో ఇక్కడికొచ్చింది.	త్యాగరాజన్ కి వ్యతిరేకంగా ఓ ఫైలు తయారుచేసి తెచ్చి నా చేతికిచ్చింది.	రిపోర్టు రాసిచ్చి కేసు ఫైల్	చేయమని చెప్పి వెళ్ళింది..”

“ఓ.... గుర్తొచ్చిందిసార్. మీరుకేసుబుక్ చేయించలేదుగా. కోర్టు దగ్గర త్యాగరాజన్ గారి మనుషులు చంపబోతే చావగొట్టి తప్పించుకుపోయిందని విన్నాను. అంటే... ఈ ఫోటోలో అమ్మాయే ఆ అమ్మాయా సార్?	కాని ఆ పిల్ల జర్నలిస్టు లహరి అని...”“అవును లహరి.	ది గ్రేట్	లేడీ జర్నలిస్ట్.	డేరింగ్ డాషింగ్	అండ్ డైనమిక్..	కుంభ కోణాల గుట్టు రట్టు చేసే వీరనారి..	భయపడి పారిపోయింది” అంటూ పగలబడి నవ్వాడు ఎ యస్ పి.

అయినా వన్నాట్ ఫోర్ కి డౌట్లు క్లియరవలేదు.

“అంటే ఈ ఫోటోలో సహస్ర జర్నలిస్టు లహరి ఒకరే అంటారా సార్?” అనడిగాడు.

“డౌటా..” అంటూ వన్నాట్ ఫోర్ ని దగ్గరకు పిలిచి చెవిలో చెప్పాడు.

“ఎవరికీ చెప్పక.	ఈ అమ్మాయి అసలు పేరు లక్ష్మీ సహస్ర. మహాదేవనాయకర్	గారి ఒక్కగానొక్క కూతురు” అన్నాడు. వింటూ ‘ఆఁ!” అంటూ తెరిచిన నోరుమూయటం మర్చిపోయాడు వన్నాట్ ఫోర్.

“అవును జర్నలిస్టు లహరి తనే. రచయిత్రి సహస్ర తనే. ఈ రోజుకీ అసలు విషయం తెలిక త్యాగరాజన్ మనుషులు జుత్తు పీక్కుంటున్నారు.	నాకీ విషయం తెలుసు. అయినా త్యాగరాజన్ కి చెప్పలేదు. ఎందుకో తెలుసా?	ఆయన ఈ పిల్లని చంపించాలని చూస్తున్నాడు.	నేను రక్షించి పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. ఆ రోజు మొదట చూపులోనే తానే నా భార్య అని డిసైడయిపోయాను. మల్టీ మిలియనీర్	మహాదేవనాయకర్కి కాబోయే అల్లుడ్ని నేనే”	అంటూ నవ్వాడు.

ఆ మాటలు వింటున్న వన్నాట్ ఫోర్ కి మాత్రం నవ్వాలో ఏడ్వాలో తెలిక వికారంగా	చూసాడు.

‘ఓరినీ.. ఈ తిరుగుబోతు తిప్పడికి బంగారు బొమ్మలాంటి లహరి కావాలా? మోజు పిల్ల మీదా మహాదేవనాయకర్ కోట్ల మీదా? మహాదేవనాయకర్ తలుచుకుంటే వీడ్ని నలిపి చెప్పు కిందవేసి తొక్కేస్తాడు. నిన్ను కాదురా నీకీఉద్యోగం యిచ్చిన వాళ్ళననాలి’ అని మనసులో తిట్టుకుంటూనే పైకి నవ్వులు చిందిస్తూ `

“అబ్బో మీరు చాలా గొప్పవారు సార్. మీ ఆలోచనలూ అంత గొప్పగా వున్నాయి. కాని ఈ ప్రకటన బట్టి చూస్తే ఆ అమ్మాయికి ఆల్ రెడి ఒకడున్నాడని అర్థమవుతోంది....” అర్ధోక్తిలో మాటలు మింగేసాడు.

“ఉండనీరా.. తప్పేముంది? పెళ్ళికి ముందు లైఫ్ ఎంజాయ్ చేయటం ఈ రోజుల్లో కామన్. నేను చేయటంలా పెళ్ళి తర్వాత నుంచి నమ్మకంగా ఉంటే చాలు”

మనసులో ఉడుక్కొంటూ పైకి `

“కరక్ట్ సర్ . మీరు చెప్పిందే కరక్ట్. ఇంతకీ లహరిని ఎలా పట్టుకుంటారు సార్? చెన్నై వెళ్ళి వెదుకుతారా?” అనడిగాడు.

“మనం వెదకటం ఏమిట్రా పిచ్చి మొగమా? మనది ఏ జాతి? పోలీసు జాతి. ఇండియా అంతా విస్తరించిన జాతి. నేరస్తుల్ని పట్టుకోడానికి మనమే వెళ్తున్నామా? ఇన్ఫర్మేషనిస్తే చాలు పనైపోతుంది. ఇదీ అంతే. చెన్నై కమీషనరాఫ్ పోలీస్ ఎవరనుకుంటున్నావ్. నా మేనమామ. ఫోన్ చేస్తే చాలు ఆర్డర్ వేసేస్తాడు. లహరి ఎక్కడ కన్పిస్తే అక్కడ పోలీసులు అరెస్టు చేసి ఏదో కేసులో ఇరికించి లోన పడేస్తారు.

అప్పుడు నేను రంగప్రవేశం చేస్తాను. లహరిని కేసును ఉపసంహరించుకొనేలా చేస్తాను. త్యాగరాజన్ కి నచ్చచెప్పి ఆమెను చంపకుండానే కాపాడుకొని పెళ్ళి చేసుకుంటాను.”

ఎ యస్ పి మాటలు వింటుంటే పిచ్చెక్కినట్టయి బుర్ర బరుక్కోవాలనిపించింది వన్నాట్ ఫోర్ కి. ఇది సాధారణమైన కేసు కాదు. త్యాగరాజన్ అక్రమాస్తులకు సంబంధించింది. అతని ఇల్లీగల్ కార్యక్రమాలకు సంబంధించింది. సెంట్రల్ గవర్నమెంట్ నే షేక్ చేసింది. కేసు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉంది. కేసు మీద ఎంక్వయిరీ కమీషన్ నడుస్తోంది. ఇవాళో రేపో సిబిఐ

రంగంలోకి దిగొచ్చని, సుప్రీంకోర్టు ఆదేశించనుందని చెప్పుకుంటున్నారు.    ఈ పరిస్థితుల్లో లహరి తన కేసును ఉపసంహరించుకుంటే అయిపోతుందా? అసలు అంత నిజాయితీ గలిగిన అమ్మాయి ఉపసంహరించుకోడానికి అంగీకరిస్తుందా?.

ఆ పైన పది మంది గుండాల్ని చితగొట్టి పారిపోయిన డాషింగ్    లేడీ లహరి.    ఆమెను వీడు తట్టుకోగలడా? ఇక మీడియా విషయం చూస్తే రోజుకో కథనం పేపర్లలో వస్తోంది.    జర్నలిస్టు లహరి ఎక్కడా అనే హెడ్డింగ్ తో ఆ మధ్య కొన్ని పేపర్లలో వచ్చిన కథ నంసంచలనం సృష్టించింది. లహరి లేదని త్యాగరాజన్ మనుషులు ఆమెను చంపి అడ్రస్ గల్లంతు చేసారని జనం సందేహిస్తున్నారంటూ వచ్చిన ఆ వార్తను ఖండిస్తూ లహరి తను బ్రతికే ఉన్నానంటూ స్టేట్ మెంట్    ఇస్తే గాని ఆ గొడవ సద్దుమణగదు. ఓ పపక్క వాస్తవాలు యిలా ఉంటే ఈ ఎ యస్ పి పగటికలలు కంటున్నాడు అనుకొంటూ పిచ్చి నవ్వు నవ్వి`



‘‘యు ఆర్ గ్రేట్ సర్.  వెంటనే చెన్నై కమీషనర్  గారితో మాట్లాడండి’’  అంటూ చల్లగా బయటికి జారుకున్నాడు వన్నాట్ ఫోర్.

ఎ యస్ పి ప్రకాష్  వెంటనే తన సెల్  అందుకొని చెన్నైకి ఫోన్  చేసాడు.I

ఈ కోయంబేడు మార్కెట్ కు కూతవేటు దూరంలోనే ఒక స్లమ్  ఏరియా ఉంది.  అక్కడ పిక్ పాకెట్  బేచ్ పది మంది ఉన్నారు. అంతా పాతికలోపు కుర్రాళ్ళు ఉదయం లేవగానే కోయంబేడు మార్కెట్  బస్టాండ్  ప్రాంతంలో సంచరిస్తూ చేతివాటం చూపిస్తుంటారు.  ఈ బేచ్  నాయకుడి పేరు మురడన్ ముత్తు. ఆ బేచ్ లోఅందరి కన్నా వీడికే కాస్త వయసెక్కువ.  మనిషి చూడ్డానికి మొరటుగా మొండి బండ వెధవలా కన్పిస్తాడు.  ఆ పైన వీళ్ళు చేసే వెధవ పనులు కూడ అలాంటివే. వీళ్ళ గురించి ఆ లొకాలిటి వాసులకు బాగా తెలుసు.  చాలా సార్లు పోలీస్  స్టేషన్లకి జైళ్ళకి వెళ్ళొచ్చిన వాళ్ళు.ఆ రోజు ఉదయం మురడన్ ముత్తుకాలనీ సెంటర్ కొచ్చే సరికి తమ కుర్రాళ్ళంతా కాకా హోటల్ కి కాస్త దూరంగా తిన్నె మీద తిష్టవేసి ఆ రోజు న్యూస్  పేపర్ కింద పరిచి చూస్తూ తమలో తాము గుసగుసలు పోవటం కన్పించింది.

విషయం ఏమిటో తెలీక హోటల్  నుంచి టీ గ్లాసు అందుకొని వెళ్ళి వాళ్ళ పక్కన కూచుంటూ  ‘‘ఏంటి రా కాకుల్లా గుంపు చేరి పోయారు. ఏముంది పేపర్లో?’’ అంటూ అడిగాడు.ఒక్కసారిగా అంతా తలతిప్పి ముత్తును చూసారు

‘‘వచ్చావా అన్నా?  ఇంకా రాలేదేమిటాని నీ కోసమే ఎదురు చూస్తున్నామన్నా,’’  అన్నాడొకడు.

‘‘ఈ రోజు పేపర్లో నిధి వుందన్నా.

పట్టుకుంటే కోటి రూపాయలు మనవే.’’  ఉత్సాహంగా అరిచాడు మరొకడు.

‘‘రాను రాను మీరంతా కుమ్మరిపురుగుల్లా తయారువుతున్నారు.  ‘‘మీ కంటికెట్టా కనబడుతున్నారా?  పొద్దునే ఎదవజోకులూ మీరూను’’  అంటూ కసురుకున్నాడు ముత్తు.

“అయ్యో............ ఇది జోక్ కాదన్నా” అన్నాడొకడు.

“జోకు గాకేమిట్రా పేపర్లో నిధేమిటి కోటి రూపాయలేమిటి?” అంటూ తాగిన టీ గ్లాసు పక్కనపెట్టాడు ముత్తు.

“అయ్యో, నీ కర్ధం కావటంలేదన్నా. ఇది చూడు నీకే తెలుస్తుంది”. అంటూ న్యూస్ పేపర్ చేతికిచ్చాడు మరొకడు.పేపర్లో నా ప్రియురాల్ని పట్టిస్తే కోటి. ప్రకటన చూడగానే వాడి కళ్ళు విచిత్రంగా మెరిసాయి. ఉత్సాహం పొంగు కొచ్చింది. కాని అంతలోనే చప్పున చల్లారిపోయింది. పెదవి విరిచాడు.

“ఒరే ఏదో జేబులు కొట్టి హేపీగా బతికేస్తున్నాం. మనకెందుకు రా యిది. ఇలాంటివి మనకి కలిసి రావటం లేదుగాని వదిలేయండి” అన్నాడు.

“అలాగంటే ఎలాగన్నా? మన బతుకులెప్పుడూ యిలా తెల్లారి పోవాల్సిందేనా?” అన్నాడొకడు.

“కొడితే యిలాంటి జాక్ పాట్ కొట్టి లైఫ్ లో సెటిలయి పోవాలన్నా” అన్నాడు మరొకుడు.

“అవునన్నా మనకి ఎంత కాలమిలా జేబులు కొట్టే బతుకు? ఇంకెప్పుడు మనం బాగుపడేది? ” “ముత్తన్నా మా మాట వినన్నా. ఎందుకో గాని యిది వర్కటవుతుందనిపిస్తోంది. ఈ పిల్లదాన్ని పట్టిచ్చి కోటి రూపాయలు కొట్టేద్దామన్నా.”

వాళ్ళంతా చెప్తుంటే కాదనలేక మరోసారి ఆ ప్రకటనని, అందులో ఫోటోని చూసాడు. అతడి చూపులు సహస్ర ఫోటో మీద నిలిచిపోయాయి.“పిల్ల కత్తిలా వుంది గదన్నా”? ముత్తు కళ్ళలో కాంతి చూసి అడిగాడొకడు. తల వూపాడు మురడన్ ముత్తు.“అవున్రా, సినీ హీరోయిన్ లా ఉంది. కాని........ మన టైమ్ వేస్ట్ చేసుకోవటం తప్ప మనకిది కలిసొస్తుందన్న నమ్మకం కలగటం లేదు. మనలో ఒక్కడిదీ లక్కీ జాతకం లేదు. వదిలేయండి రా” అన్నాడు.

“అది కాదన్నా”.......... ముక్త కంఠంతో నచ్చజెప్పబోయారంతా

‘‘ఏది కాదురా’’? అనరిచాడు కోపంతో ముత్తూ.

‘‘దయ్యం ముఖాలేసుకొని, చెప్తే వినరేంటి? గతం మర్చిపోయారా? ఎన్నో చేసాం ఒక్కటన్నా వర్కవుటయిందా? అప్పట్లోనే కుక్క పిల్లని పట్టిస్తే ఏభై వేలు బహుమతి అని ఓ ప్రకటన చూసాం. ఎగరేసుకుంటూ పనులు వదిలి వీధి వీధి తిరిగి ఎక్కడో రెడ్ హిల్స్ దగ్గర ఆ కుక్క పిల్లను పట్టితెచ్చాం. ఏమైంది? అడ్రసుకెళ్ళి చూస్తే అది యస్ పి గారిల్లు.

మనల్ని జూడంగానే నవ్వి, చాలా కష్టపడి వెదికి తెచ్చారు. థాంక్స్ రా. అక్కడ కట్టేసిపొండి అన్నాడు, బహుమతి అడిగితే ఏమన్నాడు? మీ గురించి తెలుసురా, మీకు బహుమతి కావాల్నా? ఇంకో సారి ఆ మాటంటే డబ్బు కోసం మీరే మా కుక్క పిల్లను ఎత్తుకెళ్ళారని కేసు పెట్టిలోన పడేసి కుమ్మించేస్తాను. పోండి అన్నాడు. చివరికి దూల తీరి తల కాయలు చంకలో బెట్టుకొచ్చాం, అదలా అయిందంటేఆపై నెల్లో ఏమైంది?

వలసరవాక్కం అయ్యంగారి ప్రకటన. మా నాయనమ్మ అంబుజం తప్పిపోంది. వయసు డెబ్బై అయిదు. ఎర్రగా వుంటుంది. కొంచెం గూని, మతిస్థిమితం లేనిది. అప్పుడప్పుడు మంచిగా మాటాడుతుంది. ఉత్తప్పుడు తిట్టిపోస్తుంది. అడయారు, కెకెనగర్, అన్నానగర్ పరిసరాల్లో సంచరిస్తుండొచ్చని అనుమానం. ఈమెను పట్టిచ్చిన వారికి లక్ష రూపాయలు బహుమతి.

లక్ష రూపాయలు తలో పది వేలు బాగుంది గదాని వెధవది డబ్బు కాశపడి వీధి కుక్కల్లా గల్లిగల్లీ గాలించాం. వారం రోజులు చెడదిరిగి చివరకు వండలూరు జూ దగ్గర ఓ పిచ్చిదాన్ని పట్టుకున్నాం. అదే అయ్యంగారి బామ్మ అనుకున్నాం. తీరా అడ్రసుకు తీసుకెళ్తే ఏమెంది? గుర్తుందా? అయ్యంగారో వెర్రి నవ్వు నవ్వి ఓరి పిచ్చి మాలోకంలారా ఈ పిచ్చిది మా నాయనమ్మేంట్రా, మా నాయనమ్మ తప్పిపోయిన మూడో రోజే కొంపకి తిరిగొచ్చింది. అదిగో ఆవిడే అంటూ అరుగు చివర కూచుని తనలో తను మాటాడేసుకుంటున్నా ఓ ముసలమ్మను చూపించాడు.ఏంటిరా ఖర్మానుకుని వచ్చేస్తుంటే మనం పట్టుకున్న పిచ్చిది మన వెంటపడిరది. దాన్ని వదిలించుకోడానికి రైలెక్కి గుమ్మిడి పూండి తీస్కెళ్ళి వదిలేసొచ్చాం, ఇంత జరిగినా మనకి బుద్ధి రాలేదు. మూడు నెల్లక్రితం ఏమైంది?’’

‘‘అదంతా ఇప్పుడెందుకులే గాని అన్నా...........గతం వదిలేయ్. ఇప్పడి సంగతి చూడు’’ అంటూ ముత్తూ మాటలకి అడ్డం వచ్చాడొకడు.‘‘అవునన్నా, గతం మర్చిపోదాం. ఇదే చివరి ప్రయత్నమనుకుందాం.

‘‘అది కాదురా........’’

‘‘ఇంకేం చెప్పకన్నా.  పోనీ ఓ పని చెయ్యి.  ముందు ఈ నంబర్ కి ఫోన్ కొట్టు.  పట్టుకుంటే నిజంగా కోటి రూపాయలు ఇస్తాడు లేదా పక్కాగా తెలుసుకో.  ఇస్తానంటే ఒకె. అడ్రసు అడిగి తీసుకో. ఈ రోజే గాలింపు ఆరంభిద్దాం. ఇవ్వకుంటే వదిలేద్దాం’’ అంటూ మరొకడు సలహా ఇచ్చాడు.‘‘కాని...............  కోటి రూపాయల్రా.  ఇందులో ఏదో పెద్ద రిస్కుందని నా అనుమానం’’.........నసిగాడు ముత్తు

‘‘రిస్కుతో మనకి పనేందన్నా.  డబ్బు కావలంటే ఇంకేం సందేహంచకు.  ఫోనుకొట్టు’’  ముక్తకంఠంతో అరిచారంతా.

అంతగా వాళ్ళు చెప్తుంటే కాదనటం బాగుండదని ఫోన్ అందుకున్నాడు ముత్తు.

ఈ విధంగా ఆ రోజు విరాట్  ఇచ్చిన పేపరు ప్రకటన నిజంగానే చీమల పుట్టను కదిపింది.

అనాలోచినతంగా తను చేసిన పని సహస్రనే కాదు తననూ రిస్క్ లో పడేయనుందని ఆ క్షణంలో విరాట్ కు తెలిదు.  కేవలం సహస్ర కన్పిస్తే చాలని అలా ప్రకటించాడు. అ ప్రకటన చూడగానే అంకాళమ్మా మహంకాళి నూకాలమ్మ అందరూ తననే పట్టుకున్నట్టు చిందులేస్తూ పేపరు పుచ్చుకొని విరాట్  యింట్లో అడుగుపెట్టింది గదా.........

సరాసరి తన ముందుకొస్తూన్న సహస్రని సంభ్రంతో అలా నిలబడి చూస్తూండిపోయాడు విరాట్.  సహస్ర వస్తూనే తన చేతిలోని న్యూస్ పేపర్ని అతడి ముందుకు విసిరికొట్టి చేతులు రెండూ నడుం మీద ఉంచుకొని ఉరిమి చూసింది.  ఆమె కొస్తున్న కోపంలో వెంటనే నోట మాట రాలేదు.ఆ లోపల స్కూటీ లాక్ చేసి లోనకు దూసుకొచ్చిన దీక్ష వాళ్ళిద్దర్నీ చూస్తూ అక్కడే ఆగిపోయింది.

‘‘ఏంటండీ యిది.  ఎవరు మీరు?’’  అనడిగాడు తనను తాను కంట్రోల్ చేసుకొంటూ విరాట్.  అతడి ప్రశ్న సహస్రనే కాదే, దీక్షనూ విస్తుపోయేలా చేసింది.

‘‘నేనెవర్నా........ నిజంగా తెలిదా? నాటకాలాడుతున్నావా?’’ నిలదీసింది సహస్ర.

‘‘భలేవారండీ..... నిజంగానే తెలీదు.  ఎవరు మీరు?  నాకోసం శ్రమపడి ఈ రోజు న్యూస్ పేపర్స్ తెచ్చినట్టున్నారు, వేస్ట్.  మా యింట్లో చాలా పత్రికలున్నాయి.’’

‘‘ఒరేయ్.........’’ అంటూ పిచ్చి పట్టినట్టరిచింది సహస్ర.

‘‘నేనెవరో తెలీకుండానే నా ఫోటోలు బెడ్రూంలో అంటించుకున్నావా?’’  నిలదీసింది.

‘‘ఏదీ.........  సహస్ర ఫోటోల గురించా?  అది నా ప్రియురాలు.  నా ప్రాణం.  నా సర్వం.  కాబట్టి బెడ్రూంలో అతికించుకుంటాను.  ఏమైనా చేసుకుంటాను. అడగటానికి మీరెవరు?  అసలా ఫోటోల గురించి మీకెలా తెలిసింది?’’

‘‘అయిపోయావ్.  ఇవాళ నా చేతిలో అయిపోయావ్  రా కోతి.......  కుక్క ........ .పిల్లి......... నేనెవరంటావా?’’ అంటూ అవేశంతో ముందొకొస్తున్న సహస్రను చూస్తూ మూడడుగులు వెనక్కి వేసాడు విరాట్.

‘‘ముసుగు వీరుడిలా ముఖాన్ని చున్నీతో కప్పుకొస్తే నాకెలా తెలుస్తుంది.  ఇదిగో అమ్మాయ్  ఈ పిల్ల ఎవరో పొద్దుటే నా మీద పోట్లాట కొచ్చింది.  నువ్వయినా చెప్పు, నా లాంట మాయకుడ్ని యిలా భయపెట్టడం ఏం బాగోలేదు.’’ అన్నాడు దీక్షను చూస్తూ.

విరాట్  ఓవరాక్షన్  దీక్షకు అర్థమైపోయింది.  వస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకుంటూ కిచెన్ లో ఉన్న చందూ వద్దకెళ్ళిపోయింది.‘‘ఏంట్రా దాన్ని పిలుస్తావ్.  తెలివిగా మాట్లాడుతున్నావనుకుంటున్నావా?  నా ముఖం చూడాలి, అంతేగా........  చూడు....... ఇప్పుడు చెప్పు.  నేవర్ని?’’ అంటూ ముఖానికి చుట్టుకున్న చున్నీ తీసేసింది సహస్ర.

కోపంలో కూడా ఎర్రకలువలా మెరిసిపోతున్న సహస్రను అలా కాస్సేపు మయిమరచిపోయి చూస్తూండిపోయాడు విరాట్.‘‘ఇప్పుడు ఒప్పుకుంటాను, నువ్వు నా సహస్రవని.’’ అన్నాడు నవ్వుతూ

సహస్రకి ఒళ్ళు మండిపోయింది. చేయాల్సిందంతా చేసేసి ఏమీ తెలీని అమాయకుడిలా ఎలా నవ్వుతున్నాడు చూడు అనుకొంటూ కళ్ళు పెద్దవి చేసి ఉరిమిచూసింది. ‘‘నేన్నీ సహస్రనా? చెప్పు, నేన్నీ సహస్రనా?’’ నిలదీసింది.

“కాదా? , నేను నిన్ను ప్రేమించాకా నువ్వు నా లవర్ గాక పక్కవాడి లవరవుతావా?” మొండిగా బదులిచ్చాడు విరాట్.“షటప్................ అసలు నా గురించి ఏమనుకుంటున్నావ్? నువ్వు ప్రేమిస్తే చాలా? నేను ప్రేమించక్కర్లేదా? నా యిష్టా యిష్టాలతో నీకు పని లేదా? నాకు నీకు ఏమిటి సంబంధం? నీ వెంట తిరిగానా? ఐ లవ్ యూ చెప్పానా? నీ సహస్ర నెలా అవుతాను? నీకు నువ్వే డిసైడయితే అయిపోతుందా?” ఆమె దూరుసుగా మీది కొచ్చేస్తుంటే నాలుగడుగులు వెనక్కి వేసాడు విరాట్.

“ఏంటి మీది మీది కొస్తున్నావ్? కొట్టేస్తావా?” అనాడిగాడు.

“కొట్టడం కాదు. చంపేస్తాను.”

“అది నీ వల్ల కాదు. ఏమన్నావ్? నేను డిసైడయితే అవదా? అయిందిగా.........”

“ఒరేయ్........... ఏమైందిరా?”

“నువ్వు నన్ను ప్రేమించటమయింది.”

“నెవ్వర్............. నువ్వంటే కోపం......... అసహ్యం.......”

“అబద్దం............. నీ మాటలు అబద్దం. అంత కోపం వుంటే అంతగా అసహ్యించుకొంటే ఇంతకు ముందే ఓ సారి నువ్వు నా యింటి కోచ్చుండేదానివి కాదు.”

ఉలికిపడి చూసింది సహస్ర

దీక్షకి తనకీ తప్ప ఎవరికీ తెలీని ఈ విషయం. విరాట్ కెలా తెలిసిందో అర్ధంగాక బిత్తర పోయి చూసింది.

''అవునా కాదా? నా యింటికి దొంగతనంగా వచ్చావ్. నా పడగ్గదిలో కొచ్చావ్. నా గురించి తెలుసుకున్నావ్. నా బెడ్ ఎక్కి కూచుని నీ ఫోటోల్ని చూసుకు మురిసిపోయావ్. నేను పడుకునే బెడ్ మీద దోర్లావ్.''

''నేనేమీ కావాలని దొర్లలేదు. తూలిపడ్డాను'' అరిచింది సహస్ర.

''ఎలా పడ్డానా మీద ఇష్టంతోనేగా పడ్డావ్? ప్రత్యేకించి నువ్వు నాకు ఐ లవ్యు చెప్పాలా? నువ్వు నా యింట్లో ఆ రోజు ఇష్టంగా భోంచేసి వెళ్ళావంటే నా మీద ప్రేమతో కాదా?'' అంటూ ఒక్కో ప్రశ్న అడుగుతూ విరాట్ ముందుకొస్తుంటే ఈ సారి సహస్ర అయిదడుగులు వెనక్కి వేస్తూ ఆలోచనలో పడిపోయింది.

'ఇన్ని విషయాలు వీడికెలా తెలిసాయి? ...........ఎలా? ........ సి సి కెమెరా ఏమన్నా ఇంట్లో పెట్టాడా? అదేం లేదే......... అయినా తను ఇదే కాలనీలో ఉంటున్నట్టు తెలిస్తే ఎప్పుడో అక్కడి కొచ్చేసే వాడు గదా......... ఇప్పటికిప్పుడు ఈ విషయాలన్నీ ఎలా తెలిసాయి?'

ఆలోచనల్లో కూరుకు పోయిన సహస్ర ఉన్నట్టుండి ఉలికిపడిరది

ఇదేమిటి?

తనెందుకొచ్చింది. ఇక్కడఏంజరుగుతోంది?



పేపరు తెరవగానే తన ఫోటోతో ప్రకటన చూసి మండి పడి వీడ్ని చితగొట్టి బుద్ధి చెప్పాలని గదా అంత ఆవేశపడి వచ్చింది. అదంతా ఏమైపోయింది? తనని మాటల్లో బెట్టి మాయజేస్తున్నాడు వీడు. అసలు తన ఫోటో వేసి పేపరు ప్రకటనివ్వడానికి తానెవరు? అది వదిలేసి ఏదేదో మాట్లాడేయటం ఏమిటి నాన్సెన్స్.

తలెత్తి చూసింది

విరాట్     తన ముఖాన్నే చూస్తున్నాడు.

అదే చిరునవ్వు..........

అసలా నవ్వు చూస్తే చాలు, ఎలాంటి అమ్మాయయినా పడిపోతుందనిపించింది. కంగారుగా అతడి ఛాతీ మీద చెయ్యేసి వెనక్కి తోసింది. ‘‘ఏంట్రా, ఏంటా చూపు? తిక్కతిక్కగా ఉందా? చెప్పు ఈ పేపరు ప్రకటన అదీ నా ఫోటోతో సహా ఎందుకిచ్చావో చెప్పు?’’ కోపంగా అరిచింది. ‘‘ఎందుకో వేరే చెప్పాలా? నీ కోసమే. రైల్వేస్టేషన్ లో పోస్టర్లు వేసినప్పుడే మర్యాదగా నాకు ఫోన్ చేసుంటే ఈ ప్రకటనతో పనుండేది కాదుగా.’’

‘‘అంటే? తప్పు నాదంటావ్? నేనెందుకు నీకు ఫోన్ చేయాలి?’’

విరాట్ ఏదో చెప్పబోయాడు

ఇంతలో అతడి సెల్ మోగింది

‘‘వన్ మినట్ ప్లీజ్’’ అంటూ సెల్ అందుకున్నాడు విరాట్. సహస్రకి వస్తూన్న కోపానికి విరాట్ ని చితగొట్టేయాలనిపిస్తోంది. ‘‘హాలో ఎవరండీ? ఎవరు కావాలి?’’ అడిగాడు విరాట్.

‘‘సార్ నా పేరు ముత్తూ’’ అవతలి నుంచి గరగరలాడిందో గొంతు.

‘‘నువ్వు ముత్తువైతే నాకెందుకు చెత్తవైతే నాకెందుకు? నీకెవరు కావాలి. ఎందుకు ఫోన్ చేసావ్?’’ అడిగాడు విసుగ్గా.

‘‘ఈ రోజు మీ పేపరు ప్రకటన చూసాను సార్. ఫోటోలో అమ్మాయి చాలా బాగుంది సార్.’’

‘‘బాగుందా................ నాకయితే అస్సలు నచ్చలేదు.’’

‘‘అదేమిటి సార్. తను మీ ప్రియురాలు గదా.  మీరు ప్రేమించుకున్నారు గదా? ’’

‘‘అవును గదా?  ప్రేమించుకున్నాం.  ఏం లాభం,  అదో రాక్షసి,  పిశాచి, దయ్యం, అందమైన భూతం, అదిక్కడ నన్ను ముప్పుతిప్పలు పెడుతోంది. ఇంతవరకు ఐలవ్యూ చెప్పలేదు.  ఏం చేస్తాం ఖర్మ.  ఇంతకీ ఫోనెందుకు చేసావ్’’

స్పీకర్  ఫోన్ లో ఆ సంభాషణ వింటున్న సహస్ర కోపంతో మరింత ఉడికి పోతూ గుప్పిళ్ళు బిగించింది.  అవతల ముత్తు అడుగుతున్నాడు.

‘‘ఏం లేదు సార్,  ఈ అమ్మాయి సహస్రను పట్టిస్తే నిజంగా కోటి రూపాయలు ఇస్తారుగా?’’

‘‘నీకా చాన్స్ లేదు బ్రదర్.  ప్రకటన చూడగానే తనే నన్ను వెదుకుంటూ వచ్చేసింది.  ఫోన్ పెట్టెయ్’’  అంటూ లైన్ కట్ చేసాడు విరాట్.‘ ‘ఇప్పుడు చెప్పు,  ఏమన్నావ్’’  సహస్రని అడిగాడు.

‘‘ఊ’’  అంది అయోమయంగా సహస్ర.  విరాట్  మాటలు చేతలు ఆమెను గందరగోళం చేసి మైండ్ ని బ్లాక్ చేసేస్తున్నాయి.

‘‘ఏదో అన్నావ్ చెప్పు’’ తిరిగి అడిగాడు.

‘‘నేను కాదు. నువ్వన్నావ్’’ పిచ్చి కోపంతో అరిచింది సహస్ర.

‘‘ఏంటీ?  నేను రాక్షసినా,’’

‘‘కాదు,’’

“దయ్యాన్నా.”

“ఛ.......ఛ.......      దయ్యం కన్నా బాగుంటావ్”

“అందమైన భూతాన్ని కదూ”

“ఆ మాట నేననలేదు”

“అబద్ధాలాడకు.      నువ్వన్నావ్.      వాడితో ఫోన్ లో ఏమన్నావ్,      పిశాచి, దయ్యం, భూతం.......రాక్షసి,      ఏంటది? అందమైన భూతాన్నా.............”

“అంతకన్న ఎక్కువగా ............. అందంగానే వున్నావ్ గా”

“ఓరి దేవుడా,      నన్నిలాంటి వాడికంట్లో ఎందుకు పడేసావయ్యా?      పిచ్చెక్కిస్తున్నాడు.      మాటల గారడీతో మాయచేస్తున్నాడు.      వీడి జిమ్మడిపోను, వీడి ముఖం మండ”.............. తిట్లు అందుకొంది.

“అయ్యబాబోయ్ ..........నన్నే ”........... అరిచాడు.

“నిన్నే రా మాయలోడా.......... మండ్రగప్ప.......... శాఖాచరా......... నిశాచరా..... అష్టావక్రా.............. నీ జేజెమ్మ జెల్లకొట్ట, నన్నిలా తగులుకొని ఏడిపిస్తున్నావేంటి రా మండూక రాజా”.

“అమ్మో........వామ్మో.............ఓర్నాయనో.........ఆపవేబాబు. ఒరేయ్ చందూ.........

ఈ పిల్ల అర్ధంగాని తిట్లు తిట్టి నన్ను అన్యాయంగా చంపేయాలని చూస్తోందిరా. ఇవేం తిట్లో కాస్త వచ్చి చెప్పరా'' అనరిచాడు విరాట్ వెంటనే. ''మిత్రమా భయపడకు'' అంటూ కిచెన్ లోంచి చందూ గొంతు విన్పించింది.

''నిన్ను రక్షించటానికి పాకశాల యందు పదిలముగా యుంటిని. శాఖాచరుడనిన కొమ్మల మీద సంచరించువాడు అనగా కోతియని అర్ధం. నిశాచరుడనిన చీకట్లో తిరుగువాడని యర్ధము. అనగా రాక్షసుడు లేదా పిశాచి. అష్టావక్రుడనిన ఒంట్లో ఎనిమిది వంకర్లున్నా వాడని అర్ధము. జేజమ్మ జెల్లి కొట్టయనిన నీ బామ్మ చావ అని. మండూక రాజాయనిన కప్పల నాయకుడవని అర్ధము. కావున మిత్రమా నీ ప్రియురాలు నిన్ను మెచ్చుకొంటూ నిన్ను కోతి, పిశాచి, వంకరోడా, నీ బామ్మ చావ అని ముద్దుగా ఆశీర్వదిస్తూ నిన్ను పెద్ద మండ్రగప్పతో పోల్చుచున్నది'' అన్నాడు. అతని మాటల వెంటే దీక్షలోన చిన్నగా నవ్వటం విన్పిస్తోంది.

ఆ మాటలకు సహస్ర ముఖం మరింత జేగురించగా విరాట్ పకపకా నవ్వాడు.

''ఆహా, ఎంత చక్కగా పోల్చిందిరా''

''ఏయ్ ఏయ్? ఆగాగు....... నిన్ను కాదు నీ ఫ్రెండును తన్నాలి'' అంటూ పిచ్చి కోపంతో టీపాయి మీద పేపర్ వెయిట్ ని బలంగా కిచెన్ డోర్ వైపు విసిరింది. అది పెద్ద శబ్దం సృష్టిస్తూ డోర్ ని తాకి బార్లా వెనక్కి నెట్టేసింది.

లోన జంట అదిరిపోయింది.

దీక్ష తీరిగ్గా కూచొని టిఫిన్ లాగించేస్తోంది. చందూ వంట పనిలో బిజీగా ఉన్నాడు.

''ఓర్నాయనో ప్రయోగం ఆరంభమైంది. ఏయ్ దీక్షా, ముందే డోర్ మూసేసిరా'' అనరిచాడు చందూ.
అదంతా కళ్ళారా చూడగానే

దీక్ష ఆపోజిషన్ పార్టీలో ఎప్పుడో చేరిపోయిందని అర్ధమైపోయి హతాశురాలయింది సహస్ర. '' ఏయ్ దీక్షా ఆగవే.......''

అంటూ సహస్ర కిచెన్ వైపు వెళ్ళేలోగ దీక్ష డోర్ మూసి లోపల బోల్ట్ వేసేసింది.

వస్తున్నాను నవ్వుని బలవంతంగా ఆపుకున్నాడు విరాట్. విసరిసా తిరిగి అతడి ముందుకొచ్చింది సహస్ర. కోపం పట్టలేక పోతోంది సహస్ర. కళ్ళలో దూకటానికి సిద్ధంగా ఉంది నీరు. ఏమిటిది? ఎంత పెద్ద తప్పుచేసాడు?

తను ఎంత ప్రమాదంలో ఉందో తెలిక ఇదంతా తమాషాగా తీసుకొని వాళ్ళు నవ్వుకుంటున్నారు. ఏం చేయాలి? ముందీ కోపం తగ్గాలంటే వీడ్ని కొట్టాలి, చితగొట్టాలి. వెనక్కి వస్తూనే ఆవేశంతో టీపాని ఒక్కతన్ను తన్నింది. కాలు వెంబడే గాల్లోకి లేచిన టీపాయ్ గింగిరాలు తిరుగుతూ పోయి గోడకు వేలాడుతున్న నిలువుటద్దాన్ని తాకి భళ్ళున పగలగొట్టింది. ''ఏయ్ ఆగాగు సహస్ర. ప్లీజ్ నీ కోపం నా మీద చూపించు. పాపం ఇంటి సామాన్లు అవేం చేసాయి'' అన్నాడు విరాట్.

''రేయ్ విరాట్, నా సంగతి నీకు తెలీదు. కోపం వస్తే ఏం చేస్తానో నాకే తెలీదు. నిన్నూ వదల్ను. నీ యింటినీ వదల్ను. నా ఫోటో ప్రకటించి అల్లరి చేస్తావా.......... ఇవాళ నా చేతిలో అయిపోయావే'' అంటూ ముందుకు దూకబోయింది సహస్ర.

''ఆగాగు''........ అన్నాడు వెంటనే విరాట్.

''ఫోన్........... ముందు ఫోన్ మాట్లాడి తర్వాత మన తగువు తేల్చుకుందాం.'' అంటూ సెల్ ఫోన్ అందుకున్నాడు.

ఆగింది సహస్ర

స్పీకర్ ఫోన్ ఆన్లోనే ఉంచటంతో మాటలు బయటికి విన్పిస్తున్నాయి. ఫోన్ చేసింది వాడే..... మురడన్ ముత్తు.

''మళ్ళీ ఎందుకురా ఫోన్ చేసావ్?'' విసుగ్గా అన్నాడు విరాట్.

“సార్ నాపేరు మురడన్ ముత్తూ. మాది కోయంబేడు మార్కెట్, బస్టాండ్ ప్రాంతాల్లోఎవరినడిగినా నా గురించి చెప్తారు. చాలా పట్టుదల మనిషిని సార్”“ఇప్పుడే మంటావ్ రా?”

“ఇందాక మీరు చెప్పింది సరిగా అర్థమై చావలేదు సార్. ఇలా ప్రకటనివ్వగానే అలా వచ్చేసిందంటే ఎలా నమ్ముతాను సార్? మీరేదో విసుగులో వున్నట్టున్నారు. మీరు కోటి రూపాయలు ఇస్తానంటే చెప్పండి సార్, వారం తిరిగే లోపు చెన్నైలో ఆ పిల్ల ఎక్కడ వున్నా పట్టితెచ్చి మీ కాళ్ళ దగ్గర పడేస్తా”

అయిందా ఇంకా ఏమన్నా చెప్పాలా........ నిజంగానే సహస్ర వచ్చేసిందిరా మూర్ఖ. ప్రస్తుతం సెటిల్ మెంట్లో వున్నాం. ఆ కోటి రూపాయలు నా ప్రియురాలి కే చెందుతాయి. నువ్వేం శ్రమ పడనక్కర్లేదు. ఫోన్ పెట్టెయ్.”

“అది కాదు సార్............”

“ఇంకోమాట మాటాడితే నిన్ను కోయంబేడు నుంచి లాక్కొచ్చి పక్కన ఏర్ పోర్ట్ లో పడేసి విమానాల చేత తొక్కించేస్తాను. బ్లడీఫూల్ ”అంటూ కట్చేసాడు విరాట్.

సహస్ర వైపు తిరిగే లోన

తిరిగి ఫోన్ మోగింది

విసుగ్గా ఫోన్ తీసి చూశాడు

ఈ సారి ముత్తూ కాదు

నంబర్ మారింది

“హాయ్”  అన్నాడు.

“ఏరా……….  ఈ రోజు పేపరు ప్రకటనిచ్చింది నువ్వేగా?”  అవతలి నుంచి గరగరలాడిందో గొంతు.  ఆ గొంతులో నిర్లక్ష్యం,  దర్పం.

హంకార ధ్వనినిస్తున్నాయి. తనకి ఫోన్ చేసి తననే ఏరా అని పిలుస్తున్న అవతలి వాడి పొగరుకు విరాట్ కి ఒళ్ళు మండింది.

“నువ్వెవడ్రా?  ఫోన్  చేసి మరీ నన్నే అరే ఒరే అంటున్నావ్.  ఇడియట్ ?  మెంటల్ ఆస్పత్రి నుంచి వస్తున్నావా?’ సీరియస్ గా అడిగాడు విరాట్.

స్పీకర్  ఫోన్ లో  అవతలి గొంతు వింటూనే అలర్టయింది సహస్ర.  ఆ గొంతు తనకి గుర్తే……….. అది మధురై ఎ యస్ పి ప్రకాష్  గొంతు.

“ఏయ్  మిస్టర్  నాలుక దగ్గరుంచుకో.  ఇవతల మాట్లాడుతోంది మధురై ఎ యస్ పి ప్రకాష్” …….. ప్రకాష్ హెచ్చరికను మధ్య లోనే ఖండించాడు విరాట్.

“అయితే ఏమంటావ్రా?  ఎ యస్ పి వైతే కొమ్ములొచ్చాయా?  పబ్లిక్ తో ఎలా బిహేవ్  చేయాలో తెలీదు?  ఫోన్  చేసే  ముందు  నాలుక దగ్గరెట్టుకొని మాట్లాడాలని తెలీదా?”

“రేయ్….. నా గురించి నీకు తెలీదు……………”

“అరవక.  నా గురించి నీకు తెలీదు.  ఫోన్  చేసిన వాడివి నువ్వు.  మర్యాదగా మాట్లాడు.  లేదంటే నీకు మర్యాద నేర్పాల్సి వస్తుంది.”

విరాట్  మాటలకి అవతల ఎ యస్ పి ప్రకాష్  ఎలా స్పందిస్తున్నాడో గాని ఇవతల ఆ మాటలు వింటున్న సహస్ర ఆశ్చర్యంతో ఫ్రోన్ పడి పోయింది. ఏంటి వీడి ధైర్యం?  ఇంత నిర్భయంగా నిలదీస్తున్నాడు.  పైగా ఎక్కడ మధురైలో వున్న ఎ యస్ పికి మర్యాద నేర్పిస్తాడా? ………

ఆసక్తిగా వారి సంభాషణ వింటోంది.

"అంత గొప్ప వాడివా? శభాష్ రా, నీ పేరేమిటి?"

"చెప్తే నీకు అర్థం కాదా? ఫోన్ లో నా చేత తిట్టించుకొనే కార్యక్రమం పెట్టుకోకు. నువ్వెందుకు ఫోన్ చేసావో చెప్పు."

"లహరి ఫోటో ప్రకటించి పెద్ద తప్పు చేసావ్ రా. అది చెప్పాలనే ఫోన్ చేసాను."

"ఏయ్ మెంటల్, లహరి ఎవర్రా?"

"లహరి ఎవరా? ఏరా ఆ పిల్ల ఎవరో తెలీకుండానే ప్రేమించేసావా? సహస్ర లహరి ఒకరే. తన పూర్తి పేరేమిటో అదన్నా తెలుసా?......... లక్ష్మీ సహస్ర. మధురై మహదేవనాయకర్ ఏకైక సంతానం. రచయిత్రి సహస్ర. తనే దిగ్రేట్ జర్నలిస్ట్........... త్యాగరాజన్ భూకుంభకోణాల్ని తవ్వి తీసి కోర్టుకెక్కిన జర్నలిస్టు లహరి తనే.........."

ఫోన్లో ప్రకాష్ మాటలు వింటూ నమ్మలేనట్టు సహస్ర వంక చూసాడు.

ఆమె ముఖంలో కోపం ఛాయలింకా అలాగే వున్నాయి. ఆవేశంగా చూస్తూ నిలబడుంది. లహరి అభిమానుల్లో తనూ ఒకడు. త్యాగరాజన్ మీది భూకుంభ కోణాల వ్యవహారం, దాని చరిత్ర పత్రిక మూలంగా తెలిసిందే కాని తను ప్రేమించింది లహరినంటే నమ్మలేకపోతున్నాడు. తాత్కాలికంగా తన ఆలోచనల్ని అదుపుచేసుకుంటూ ప్రకాష్ మాటలు వినసాగాడు.

"రేయ్......... నీ పేరేమిటో నాకు తెలీదు. ఇష్టం లేకపోతే చెప్పకు. కాని సహస్రను మర్చిపో. లహరి నాది. నాకాబోయే భార్య."

"వ్వాట్?" అరిచాడు విరాట్.

‘‘షాకయ్యావా?’’ అంటూ నవ్వాడు ప్రకాష్.



విరాట్ సహస్ర వంక చూసాడు

ఆమె అచేతనంగా స్పందించటం లేదు

‘‘నీకింకో షాకింగ్ న్యూస్ చెప్పనా?	త్యాగరాజన్ లహరికి మరణదండన విధించి చాలా రోజులయింది.	ఆమె కోసం అతని మనుషులు గాలిస్తున్నారు. వాళ్ళ కంటబడితే లహరి ప్రాణాలకే ప్రమాదం.	ఆమెను కాపాడే వారెవన్నా ఉంటే అది నేనే. సహస్ర ఎక్కడ తప్పిపోయిందో చెప్పు.	దాన్ని నేను కాపాడుకుంటాను.’’

‘‘ఏయ్	ఏ యస్ పి,	నువ్వు చెప్పిన విషయాలు మహదేవనాయకర్	గారికి తెలుసా?’’	‘‘ఆయనో అమాయకుడు. ఆయనకేం తెలీదు. ఇప్పటికే తను చూసిన సంబంధం ఇష్టం లేకే సహస్ర ఇల్లొదిలి వెళ్ళిపోయిందనుకుంటున్నాడు’’

‘‘ఆయన చూసిన సంబంధం తాలూకు పెళ్ళికొడుకు నువ్వేనా?’’

‘‘నువ్వు చాలా తెలివైనవాడివిరా.	అన్నీ నాచేతే చెప్పిస్తున్నావ్. ఆ పెళ్ళికొడుకు నేను కాదు.	కాని నా పెళ్ళికూతురు మాత్రం లహరి. దాన్ని చావు నుంచి తప్పించి నేను పెళ్ళి చేసుకుంటాను.’’

‘‘నువ్వు జగన్మోహన్	పెంపుడు కుక్కవని అర్ధమవుతోంది. నెలనెలా ముడుపుల రూపంలో ఎంత పడేస్తున్నాడు నీకు?’’

‘‘రేయ్ ............’’	‘‘అరవక............. నిజాలు కాస్త చేదుగా వుంటాయి.	నీలా మొరిగే కుక్కల గురించి నాకు బాగా తెలుసు’’

‘‘ఎవడు............	ఎవడ్రా నువ్వు ఇంత పొగరుగా మాట్లాడుతున్నావ్,’’

‘‘నీలాంటి వెధవలకి కొరకరాని కొయ్యని. నన్ను కెలికితే నువ్వు తట్టుకోలేవు.	సహస్ర గురించి మర్చిపో.	తననెలా కాపాడుకోవాలో నాకు తెలుసు’’

‘‘అంత మగాడివా?	ఏదో రోజు నాకు దొరక్కపోవురా.	అప్పుడు నీ మగతనం ఏంటో చూస్తాను.	నీ జాయింట్లు తప్పించి నేనేంటో తెలిసేలా చేస్తాను. నాకు మర్యాద నేర్పుతానన్నావ్ గా. రారా మధురైకి రా చూద్దాం.’’

''నీకంత కోరిగ్గా ఉంటే ఎందుక్కాదంటాను? రేపు తెల్లారే సరికి నీకు మర్యాద నేర్పిస్తాను. కానీ నా కోసం చూడక. నేను రాక్కర్లేదు చాలా? ఫోన్ పెట్టెయ్''

''నాతోనే సవాలా?........ రేయ్ యూ బ్లడీ........ నిన్నూ..........''

''ఏం చేస్తావ్? ఎక్కడో చెన్నైలో ఉండే వాడికి మధురై గురించేం తెలుసనుకుంటున్నావా? నాకు మధురై కొత్త కాదు. అక్కడి మనుషులూ కొత్త కాదు. నీకు ముందు మూడేళ్ళ కిందట అయ్యా సామి అని ఎ యస్ పిగా ఉండేవాడు. నీ కన్నా మూర్ఖుడు. పొగరుబోతు. లంచగొండి. తిరుగుబోతు. ఓ రోజు అర్ధరాత్రి తాగిన మత్తులో నడిరోడ్డు మీద ఓ అమ్మాయిని రేప్ చేయబోతూ నా కంటబడ్డాడు. వాడికే గతి పట్టిందో మీ పోలీస్ కంట్రోల్ రూంలో ఏ పోలీసునడిగినా చెప్తాడు. ఓకే ఈ నెంబరు నీదే కదా? రేపు ఉదయం ఇదే టైంకి ఫోన్ చేస్తాను'' అంటూ లైన్ కట్ చేసాడు విరాట్.

అక్కడ ప్రకాష్ సంగతెలా వున్నా.....

పక్కన సహస్రకి మతి పోయినట్టు.....

విస్మయంతో అతడ్నే చూస్తోంది.....

ఆమెకు మాట్లాడే అవకాశం యివ్వలేదు విరాట్. వెంటనే మధురైలోని ఒక నెంబర్ కి ఫోన్ కొట్టాడు. పది సెకన్ల తర్వాత ఫోన్ లిఫ్టయింది.''ఏరా ధర్మా బాగున్నావా?'' పలకరించాడు.

అవతలి ధర్మ అనే మధురైకి చెందిన మిత్రుడు విరాట్ గొంతును వెంటనే గుర్తు పట్టేసాడు

''అయ్యా బాబోయ్ విరాట్ ఏరా నువ్వేనా? ఇది కల గాదు గదా?'' అంటూ పెద్దగా అరిచాడు

''నేనేలేరా. ఆశ్చర్యపోయింది చాలు. మన వాళ్ళంతా ఎలా వున్నారు?'' అడిగాడు విరాట్.

“అంతా బాగానే వున్నాం గాని ఎన్నిరోజులైందిరా నువ్వు ఫోన్ చేసి. ఇన్ని రోజులూ ఏమైపోయావ్ ఎక్కడున్నావ్? కోయంబత్తూర్ లో ఉండటం లేదని తెలిసింది. నీ ఫోన్ నంబర్లు మార్చేసావ్, ఏమైందిరా?”

“అదంతా ఫోన్ లో చెప్పే టైమ్ లేదు గాని మన వాళ్ళందర్నీ అడిగినట్టు చెప్పు”

“చెప్తా గాని మధురై ఎప్పుడొస్తున్నావ్?”

“టైమ్ పడుతుందిలే. ఈ లోపల ఓ పని చేయాలి.”

“ఒకటేంటి, పదయినా చేసేద్దాం. ఏం చేయాలి?”

“మధురై ఎ యస్ పి ప్రకాష్ తెలుసుగదా?”

“వాడా......... వాడెందుకు తెలీదు. మెంటల్ వెధవా. ఇంతకీ విషయం ఏమిటి?”

“ఆ మెంటల్ గాడికి కాస్త మర్యాద నేర్పాలి. ఈ రాత్రికే పనైపోవాలి.”

“మన మర్యాద ఎలా ఉండాలి? స్ట్రాంగా లైటా?”

“మీడియం. వారం రోజులు ఆస్పత్రి బెడ్ మీద పడుండాలి”

“నాకొదిలెయ్. పని పూర్తవగానే నీకు ఫోన్ చేస్తాను. ఇదే నంబర్ గదా”

“అవున్రా ఇదే నంబరు”

“ఇంతకీ వాడితో నీకు గొడవేంటిరా? ఇప్పుడు నువ్వెక్కడ ఉన్నావు”

“ముందు పని చూడరా. వివరాలు తర్వాత చెప్తాను” అంటూ లైన్ కట్ చేసాడు విరాట్.

అంత వరకూ సహస్ర చిత్తరువులా నిలబడి విరాట్ నే చూస్తోంది

క్షణక్షణానికీ తన ముందు అతడు చాలా ఎత్తుకు ఎదిగిపోతున్నట్టనిపించింది. తనకు తెలిని విలక్షణమైన అంశాలు విరాట్ లో చాలా ఉన్నాయనిపిస్తోంది. లేకపోతే.....

ఎక్కడి కోయంబత్తూర్ ? ఎక్కడి చెన్నై? ఎక్కడి మధురై? వీడికి మధురైలో మిత్రవర్గం ఉందా? భయమంటే ఎలా ఉంటుందో వీడికి తెలీదా? విరాట్ మాటలకి అక్కడ ఎయస్ పి ప్రకాష్ ఖచ్చితంగా మంచి నీళ్ళు తాగుంటాడు. ఇంత తెగింపున్న విరాట్ అవసరమైతే తనను కాపాడగలడా? పరిపరివిధాలా ఆలోచిస్తున్న సహస్ర విరాట్ పిలుపుతో గాని ఆలోచనల నుంచి బయటికి రాలేకపోయింది.

సీరియస్ గా చూస్తున్నాడు విరాట్

“సో....... నీ అసలు పేరు లక్ష్మీ సహస్ర. వెల్, నాకేసే. మేనరికం చేసుకోవటం ఇష్టం లేక నేను చెన్నై పారిపోయి వచ్చాను. ఇష్టంలేని పెళ్ళి తప్పించుకోడానికి నువ్వు పారిపోయివచ్చావ్. త్యాగరాజన్ మనుషుల నుండి ప్రాణాలు కాపాడుకోడానికి అజ్ఞాతవాసం గడుపుతున్నావ్. ఎవరూ నిన్ను గుర్తు పట్టకుండా చున్నీతో ముఖం చుట్టుకొని తిరుగుతున్నావు. వచ్చిన అవకాశాన్ను పయోగించుకొని నిన్ను కార్నర్ చేసి తను పెళ్ళి చేసుకోవాలని ఆశపడుతున్నాడు ఏ యస్ పి ప్రకాష్. యామై కరెక్ట్? బట్ నాకింకా కొన్ని సందేహలున్నాయి. అవి కూడ నువ్వు తీర్చేస్తే బాగుంటుంది” అన్నాడు.

''ఇప్పుడర్ధమైందిగా నేనెంత ప్రమాదంలో వున్నానో? ఇదంతా నువ్వు చేసిన రచ్చ. నా ఫోటోతో సహా ప్రకటించి అందరికీ నేను చెన్నైలో ఉన్నట్టు తెలిసిపోయేలా చేసావ్. నిన్నేం చేస్తానో చూడు'' అంటూ మెరుపు వేగంతో పిడికిలి విసిరింది సహస్ర.

కంటి కొస నుండి ప్రమాదం గ్రహించి వెనక్కి దూకాడు గాని లేకపోతే విరాట్ ముఖం పేలిపోయి ఉండేది.

''ఓ మైగాడ్........... నన్ను కొట్టి చంపేయాలనే ?'' అరిచాడు.

''నిన్ను చంపినా నా కోపం తీరదు. నిన్ను కొట్టకుండా వదలను'' అంటూ మరోసారి పిడికిలి విసిరింది, ఈసారి కూడ తప్పించుకుంటూ''ఆగాగు''.... అనరిచాడు

''నీ వరస చూస్తే కరాటేలో కాస్త కాలు చెయ్యి ఆడించడం నేర్చుకున్నట్టుంది. పందెంలేకుండా మనం కొట్టుకుంటే బాగుండదు''

''ఒరేయ్............. మళ్ళీ నన్నిరిటేట్ చేస్తున్నావ్. నన్ను చూస్తే కాలు చెయ్యి ఆడిస్తున్నట్టుందా? కరాటే కుంఫూ రెంటిలోనూ మాస్టర్ని. బ్లాక్ బెల్ట్ హోల్డర్ని. దెబ్బ తగిలితే మంచి నీళ్ళడగవ్?''

''అబ్బో......... .అయితే ఇంకేం పందెం కాయొచ్చు. ఎంతయినా నువ్వు నా లవర్ వి. కాబట్టి నిన్ను నేను కొట్టలేను. కాని ఛాన్సిస్తాను తీసుకో. నువ్వు నన్ను టచ్ చేయగలిగితే నేను ప్రకటించిన కోటి రూపాయలతో బాటు అదనంగా మరో కోటి అంటే రెండు కోట్లరూపాయలు ఇవాళే ఇచ్చేస్తాను. ఒకవేళ నన్ను టచ్ చేయలేకపోయావనుకో..... ఓడిపోయావనుకో.....''

''ఓడిపోతే''

''ఒక్క ముద్దివ్వు చాలు''

''ముద్దు.........''

“యస్ ఒక్క ముద్దివ్వు చాలు, నీ ముద్దు నాకు కోట్ల విలువ చేస్తుంది.”

“నాకు నిన్ను చూస్తుంటే ముళ్ళ కంపలో ఇరుక్కున్నట్టుంది. నన్ను జలగలా తగులుకున్నావేంట్రా? ముద్దు కావాలా! ......... చంపేస్తాను. నిజంగానే నిన్ను చంపేస్తాను” అంటూ ముందుకు దూకింది.

“ఏయ్......... ఆగవే రాక్షసి. పందెం ఒకే నా కాదా చెప్పు” పక్కకు తప్పుకొంటూ అరిచాడు.

“చెప్తాను” అంటూ విరాట్ మీదకు దూకింది.

ఆమె కన్నా వేగంగా వెనక్కి దూకాడు విరాట్

ఇక ఇద్దరి మధ్య ఆరంభమైంది పోరాటం

నిజానికి దీన్ని పోరాటం అనలేం

సహస్ర ఆఫెన్స్ లో ఉండి అతడ్ని దెబ్బకొట్టాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. విరాట్ డిఫెన్స్ లో ఉండి ఆమె కదలికల్ని పరికిస్తూ ఆమె చేతిగ్గాని కాలిగ్గాని అందకుండా మెరుపు వేగంలో తప్పించుకొంటున్నాడు.సహస్ర మార్షల్ ఆర్ట్స్ లో నిజంగానే మాస్టరని ఆమె కదలికలు నిరూపిస్తున్నాయి. అదే సమయంలో విరాట్ మాటల మనిషి కాదు చేతల మనిషని, సాధారణ యువకుడు కాదు, మార్షలార్ట్స్ లో గొప్ప యోధుడని సహస్రకి అర్థమైపోయింది. అతడు కరాటే కుంఫ్ లో మాస్టరే కాదు, నింజాఫైట్ లో ఖచ్చితంగా ప్రవేశం ఉండాలని వూహించింది. లేదంటే చేతికి అందనంత వేగంగా దూకటం సాధ్యం కాదు. అతడ్ని కొట్టి కోపం తీర్చుకోవటం సాధ్యంగాకపోయినా కనీసం అతడ్ని టచ్ చేసి తనేమిటో నిరూపించుకోవాలని సహస్ర తీవ్రంగా ప్రయత్నిస్తుండగా ఆ హాలు యిద్దరికీ ఒక తమాషా వేదికయిపోయింది. చూడ్డానికి వాళ్ళు చేస్తోంది పోరాటంలా లేదు. తమాషా గేమ్ షోలా ఉంది.

ఈ లోపల అటు కిచెన్ లో టిఫిన్ చేస్తున్న దీక్ష మధ్యలో ఆపేసి ఉన్నట్టుండి కన్నీళ్ళు పెట్టుకుంది అది చూసి చందూ కంగారుపడి

పోయాడు.

“దీక్షా! ఏమైంది? ఏంటా కన్నీళ్ళు.......... ఇటు చూడు, ఎందుకీ ఏడుపు?” అంటూ ఆమె కన్నీళ్ళు తుడిచాడు.

“విరాట్ మాటలు విన్నావ్ గా?”.

“వింటే?” చందూకి అర్థం కాలేదు.

“ఆ రోజు అర్ధరాత్రి మధురైలో ఎ యస్ పి అయ్యా సామి నుంచి విరాట్ కాపాడిన అమ్మాయి ఎవరో కాదు, అది నేనే” అంది దీక్ష.“నిజమా?” చందూ విస్తుపోయి అడిగాడు.

“అప్పటికే కోర్టులో కేసు వేసి, ఇంట్లో ఉండటం యిష్టం లేక హాస్టల్లో ఉంటున్నాను. మా అన్నయ్యల దగ్గర లంచం తీసుకొని నన్ను బెదిరించి కేసు వాపస్ తీసుకునేలా చేయలాని చూసాడు ఎయస్ పి అయ్యా సామి. ఎంక్వయిరీకి ఎయస్ పి గారు పిలుస్తున్నారంటూ ఆ రోజు సాయంకాలం యిద్దరు పోలీసులు వచ్చి నన్ను స్టేషన్ కు తీసుకెళ్ళి కూచోబెట్టారు. యిందులో ఏ మాత్రం సందేహించినా లాయర్ ని సంప్రదించకుండా వెళ్ళేదాన్ని కాదు. తీరా వెళ్ళాక ఎయస్ పి గారు రావాలంటూ నన్ను స్టేషన్ నుంచి పోలీసులు వెళ్ళనియ్యలేదు. రాత్రి పదకొండు తర్వాత వచ్చాడు అయ్యాసామి, తప్ప తాగున్నాడు అర్ధరాత్రి పన్నెండుగంటలకి నన్ను స్టేషన్ గదిలోకి లాక్కుపోతుంటే ప్రమాదం గ్రహించి వాడి చేతిని బలంగా కరిచి స్టేషన్ లోంచి తప్పించుకున్నాను. కాని ఆ ఎయస్ పి నన్నొదలకుండా మోటార్ సైకిలు మీద వెంటబడ్డాడు.|

గుడి రోడ్ లో అడ్డ వీధి పక్కన ప్లే గ్రౌండ్ దగ్గర నన్ను పట్టుకోబోయాడు. దిక్కు తోచక కేకలు వేసాను. ఆ సమయంలో దేవుడి లా తన బైక్ మీద అటుగా వచ్చాడొక యువ కుడు. చీకట్ల మాటున మూఖాలు సరిగా తెలిలేదు. అతను రావటమే ఎ యస్ పి ని కుక్కను కొట్టినట్టు కొట్టి వాని సర్వీస్ రివాల్వర్ లాక్కున్నాడు. నీ గురించి చాలా విన్నాన్ రా. ఇక నీకు ఉద్యోగంలో కొనసాగే అర్హత లేదు. అంటూ రివాల్వర్ తో వాడి కుడి మోకాలు మీద మూడు సార్లు షూట్ చేసి రివాల్వర్ ని తుడిచి దూరంగా విసిరేసాడు. నన్ను తన బైక్ మీద తీసుకెళ్ళి భద్రంగా హాస్టల్ దగ్గర దించాడు. జరిగింది చేప్తే కోర్టు చుట్టూ తిరగాలి. ఏమీ చెప్పకు. స్టేషన్ నుంచి హాస్టల్ కొచ్చేసానని తర్వాత ఏం జరిగిందో నీకు తెలీదని చెప్పమని హెచ్చరించి వెళ్ళిపోయాడు. చీకట్లో అతడ్ని గుర్తుపట్టలేకపోయాను, బహుశ నన్ను అతను గుర్తుపట్టుండడు.

ఆ సంఘటనలో అయ్యా సామి కుడి కాలు మోకాలు వరకు తీసేయటంతో వాడి ఉద్యోగం పోయింది. ఆ తర్వాత ఈ ఎ యస్ పి ప్రకాష్ వచ్చాడు, త్యాగరాజన్ తనకి అనుకూలంగా ఉండే ఎయస్ పి నేరప్పించుకుంటాడు, ఆ రోజు నన్ను కాపాడిన దేవుడు ఎవరని అప్పుడప్పుడూ ఆలోచిస్తుంటాను. అది ఎవరో కాదు విరాట్ అని ఇప్పుడు తెలిసింది." అంటూ కన్నీళ్ళుతుడుచుకుంది దీక్ష."ఊ అయితే విరాట్ గురించి తెలిసింది గదా. ఆ అమ్మాయి నువ్వేనని విరాట్ కి ఇప్పుడే చెప్తాను" అంటూ పోబోతుంటే చందూని వెనక్కిలాగింది దీక్ష."

ఇప్పుడే కాదు గాని ముందు వాళ్ళద్దిరూ రాజీపడని" అంది సరిగ్గా అదే సమయంలో....



భళ్ళున బయటి హాల్లో

ఏదో పగిలిన శబ్దం విన్పించి

ముఖ ముఖాలు చూసుకున్నారిద్దరూ.

హాల్లో సహస్ర విరాట్ల పోరాటం మొదలై క్షణాలు వేగంగా గడిచిపోతున్నాయి.

హాల్లో విలువైన వస్తువు డామేజ్ గాకుండా జాగ్రత్తగా పడుతూ రకరకాల ఫీట్లతో సహస్రకు చిక్కకుండా తప్పించుకోంటున్నాడు విరాట్. ముప్పుతిప్పలు పెడుతున్నాడు.

అతడు తప్పించుకునే కొద్దీ సహస్రలో పట్టుదల పెరిగింది. రోషం కోపం పెరిగిపోయి ఇంకా తీవ్రంగా వేగంగా ప్రయత్నిస్తోంది. అయిదు........ పది .......... పావుగంట సమయం ఇట్టే గడిచిపోతోంది గాని తను విరాట్ దుస్తుల్ని కూడా టచ్ చేయలేక పోయింది. దాంతో ఉడికిపోతూ కార్నర్లో ఉన్న ఇత్తడి ఫ్లవర్ వాజ్ నందుకొని అతని మీదకు విసరబోయింది.

‘‘ఏయ్ ఆగాగు....... ఇది మన ఒప్పందానికి విరుద్ధం. దాన్నక్కడ పెట్టు’’ అనరిచాడు విరాట్’’

‘‘ఒప్పందమా.......... చేతికి దొరకవా? నన్నే తిప్పలు పెడతావా.......... మనకి ఒప్పందం ఏంట్రా’’ ....... అంటూ చేతిలో ఫ్లవర్ వాజ్ ని బలంగా విరాట్ పైకి విసిరేసింది. విరాట్ తనకు తగలకుండా తప్పించుకున్నాడు గాని ఖరీదైన యల్ సిడి టీవిని కాపాడుకోలేక పోయాడు. ఫ్లవర్ వాజ్ టివి స్క్రీన్ ని తాకి భళ్ళున పగులగొట్టేసింది.

‘‘ఓ మైగాడ్’’ అనరిచాడు విరాట్.

ఈ సారి విరాట్ మీద దాడి చేయలేదు సహస్ర. హాల్లోని ఖరీదైన ఫర్నీచర్ మీద దాడి చేస్తూ తన కోపం ఉక్రోషం వాటి మీద తీర్చుకోనారంభించింది.

ఇక ఆమెను ఆపే ప్రయత్నం చేయలేదు విరాట్....

నవ్వుతూ వెళ్ళి మెట్ల మీద ఆయాసం తీర్చుకొంటూ రిలాక్స్ గా కూచుండి పోయాడు

ఇక సహస్రను చూడాలి

శివమెత్తి నాట్యం చేస్తూన్నట్టుందామె. దేన్నీ వదల్లేదు. టేబుల్ మీది టివి తో బాటు సౌండ్ సిస్టం మొత్తం ముక్కలు చెక్కలైంది.డైనింగ్ టేబుల్ రెండుగా విరగొట్టేసింది. కాళ్ళతో తన్ని కుర్చీలను విరగ్గొడుతూ ఫుట్ బాల్ ఆడుకుంది. సోఫాలను చించేసింది. ఫ్యాన్ రెక్కలు విరిచేసింది. బర్మా బజార్లో మోజుపడి కొనితెచ్చుకున్న ఖరీదైన జర్మనీ గోడ గడియారాన్ని నేలకు విసిరికొట్టి ధ్వంసం చేసింది. హాల్లో ఏదీ వదలకుండా నాశనం చేస్తే గాని సహస్ర కోపం చల్లారలేదు. చల్లారగానే ఉన్నట్టుండి ఏడ్చేస్తూ సహస్ర విరాట్ వంక చూసి చున్నీని ఎప్పటిలా ముఖానికి చుట్టుకొంటూ బయటకి పరుగెత్తింది.

ఆ వెనకే తనూ వెళ్ళేవాడే విరాట్.

కాని అంతలో....

అతడి సెల్ మోగింది...

ఏదో కొత్త నంబరు.

‘‘హలో......... ఎవరు ?’’ అడిగాడు.

‘‘బాబూ........ నా పేరు మూగాంబికై’’ ......... అవతలి నుంచి ఎవరో పెద్దావిడ గొంతు ఎంతో సాఫ్ట్ గా వినిపించింది.

‘‘చెప్పండి ఆన్టీ మీకు ఎవరు కావాలి?’’ అడిగాడు.

‘‘ఈ రోజు పేపర్లో ప్రకటనిచ్చింది నువ్వేనా?’’ అడిగిందావిడ.

‘‘అవును’’

‘‘నేను సహస్ర తల్లిని నాయనా. మధురై నుంచి మాట్లాడుతున్నాను. నా బిడ్డ సహస్ర ఇల్లొదిలి అయిదు మాసాలయి పోయింది. ఏమైందో ఎక్కడుందో తెలిలిక బెంగ పడుతుంటే ఇవాళ నీ ప్రకటన మరింత భయపెట్టింది. సహస్ర తప్పిపోయిందని ప్రకటనిచ్చావ్. నా బిడ్డకేమీ కాలేదు గదా’’........... అవతల బోరున ఏడవడానికి సిద్ధంగా ఉన్నట్టుంది ఆవిడ గొంతు. వెంటనే విరాట్ అలర్టయిపోతూ.

‘‘ఆన్టీ ఆన్టీ....... ప్లీజ్ మీరు సహస్ర గురించి కంగారు పడకండి. తను క్షేమంగా ఉంది. ప్రకటన చూడగానే వెనక్కి వచ్చేసింది’’ అన్నాడు.‘‘నిజంగానా బాబూ, నేను ఓ సారి దాంతో మాట్లాడొచ్చా’’

‘‘తప్పకుండా ఆన్టీ......... నా మీద అలిగి ఇప్పుడే లోనకెళ్ళింది. ఒక్క అయిదు నిముషాలాగండి. ఇదే నంబర్ కి ఫోన్ చేసి సహస్ర చేత మాట్లాడిస్తాను.’’

‘‘నీ పేరేమిటి ........... మా సహస్ర నువ్వు ప్రేమించుకున్నారా?’’

‘‘ఆన్టీ.......... ముందు మీరు మీ కూతురులో మాట్లాడితే మీ మనసు తేలిక పడుతుంది. మిగిలిన విషయాలు తర్వాత. అయిదు నిముషాల్లో ఫోన్ చేస్తాను’’. అంటూ లైన్ కట్ చేసాడు విరాట్. వెంటనే బయటికొచ్చి తన బైక్ స్టార్ట్ చేసి మూడో వీధి వైపు దూకించాడు.‘‘ఉన్నట్టుండి బయట నిశ్శబ్దమై పోయిందేమిటి?’’ చాలా సేపటికి దీక్ష అడిగింది అనుమానంగా.

‘‘అదే అర్ధం గావటం లేదు, బైక్ శబ్దం విన్పించింది విరాట్ బయటకెళ్ళినట్టున్నాడు’’

‘‘విరాట్ బయటికెళ్తే సహస్ర ఎక్కడ? పద చూద్దాం’’ అంటూ లేచింది దీక్ష. కిచెన్ తలుపు తెరుచుకొని అడుగు బయటపెడుతూనే కెవ్వున అరిచాడు చందూ. దీక్షయితే దెయ్యం పట్టినట్టు అలా చూస్తుండి పోయింది.తను లోనకొచ్చేసరికి ఖరీదైన ఫర్నీచర్ తో ఎంతో అందంగా ఉన్న హాలు మొత్తం ఇప్పుడు మారిపోయింది. ఏదీ వదల్లేదు. సోఫా సీట్లతో సహా మొత్తం ధ్వంసమై పోయాయి. ఎటుచూసినా పగిలిన పెంకులు, విరిగిన కుర్చీలు, ధ్వంసమైన టివి సెట్టు సౌండ్ సిస్టమ్ కాలు బయటపెట్ట లేనంతగా హాలు చెత్త కుప్పయి పోయింది.

‘‘ఓర్నాయనో........ .ఓరిదేవుడో........... ఇద్దరూ కలిసి హాలు మొత్తం నాశనం చేసి పడేసారు........ అంతా నాశనం’’ అరిచాడు చందూ.

‘‘ఇద్దరూ అనక. సహస్ర కోపంతో చేసిన విధ్వాంసమిది. ఇంతకీ సహస్ర ఎక్కడ? ఏయ్ సహస్ర’’......... అంటూ జాగ్రత్తగా అడుగులేస్తూ ముందుకెళ్ళింది దీక్ష.

‘‘స్కూటీ తాళాలు నీ దగ్గరే వున్నాయా?’’ ఆమెననుసరించి ముందుకొస్తూ అడిగాడు చందూ.

‘‘అవును, ఏం?’’ తిరిగి చూసింది దీక్ష.

‘‘ఇంకా ఏముంది కోపంతో అన్నీ ధ్వంసం చేసి సహస్ర నడుచుకొంటూ వెళ్ళిపోయుంటుంది సహస్ర. ఉంటే విరాట్ వెళ్ళేవాడు కాదు’’ అన్నాడు.

‘‘ఇప్పుడెలా.......... అక్కడేం గొడవ పడుతున్నారో ఏమిటో నేవెళ్తాను’’ అంటూ పోబోయింది దీక్ష.

ఆమెను వెనక్కులాగి

‘‘వెళ్ళి ఏం చేస్తావ్? గొడవపడనీ......... ఇప్పుడు మనం వెళ్లకూడదు’’ అన్నాడు.

‘‘అయితే ఏం చేద్దాం? ఈ చెత్తంతా క్లీన్ చేయటం నా వల్ల కాదు బాబూ’’ అంది బుంగ మూతిపెట్టి.

‘‘ఆ చెత్త గొడవెందుకు? మన పని మనిషి చూసుకుంటుంది. విరాట్ సహస్రలు తిరిగొచ్చే లోపు మనం బెడ్రూమ్ లో కూచొని కబుర్లు చెప్పుకుందాం పద’’

‘‘వూహు, నేను రాను,’’

‘‘వద్దులే నేనే తీసుకెళ్తాను’’ అంటూ దీక్షను ఎత్తుకొని తన బెడ్రూమ్ లోకి తీసుకుపోయి తలుపు మూసాడు చందూ.విరాట్ బైక్ ను వేగంగా పోనిస్తూ నడిచి పోతున్న సహస్ర వీధిలో కన్పిస్తోందేమోనని చూసాడు, కాని అప్పటికే సహస్ర ఇంటికెళ్ళిపోయింది. సరాసరి చివరి ఇంటికి చేరుకొని గేట్ లోంచి బైక్ ని పోర్టికోకి తెచ్చి ఆపాడు.

వీధి తలుపు మూసి ఉంది

బయట సహస్ర చెప్పులు కన్పిస్తున్నాయి

తలుపు తెరవాలని చూసాడు

తెరుచుకోలేదు

‘‘సహస్ర............... ప్లీజ్ తలుపు తియ్యి’’ తలుపు కొట్టి పిలిచాడు.

‘‘ఎందుకొచ్చావ్.......... పో .......... నేను నీకేంకాను వెళ్ళిపో’’ లోపల్నుంచి అరిచింది సహస్ర. ఆమె ఒంటరిగా కూచొని ఏడుస్తోందని గొంతు వింటేనే అర్ధమైపోతోంది.

‘‘తలుపు తెరుస్తావా లేదా?’’

‘‘తెరవను పో’’

‘‘అయితే విరగ్గొట్టు కొస్తాను’’

‘‘విరగ్గొట్టడానికి ఇది నా యిల్లు కాదు, దీక్షది’’

‘‘ఓహో, నా యిల్లంతా ధ్వంసం చేసి వచ్చి ఇక్కడ తీరిగ్గా నీతులు చెప్తున్నావా? మనం తర్వాత గొడవపడొచ్చు, ముందు మీ మమ్మీతో మాట్లాడు.’’

‘‘మమ్మీ? .............ఏయ్ కొత్త నాటకమా?’’

‘‘నాటకం కాదు నిజం. పేపరు ప్రకటన చూసి నువ్వేమయ్యావోనని కంగారు పడి నా నంబరుకి ఫోన్ చేసారు’’ అంటూ సెల్ అందుకుని ఫోన్ చేసాడు. ఆవిడ ఫోన్ కోసం వెయిట్ చేస్తున్నట్టుంది. వేంటనే లిఫ్ట్ చేసింది.

‘‘ఆన్టీ, సహస్ర ఇక్కడే వుంది మాట్లడండి’’ అన్నాడు స్పీకర్ ఫోన్ ఆన్ లోనే ఉంది.

‘‘సహస్ర....... ఏమిటే మాటాడవ్?’’ ఫోన్ లో తల్లి గొంతు వింటూనే చటుక్కున తలుపు తెరచింది సహస్ర. విరాట్ చేతిలోంచి ఫోన్ లాక్కొని ‘‘మమ్మీ’’ అంది ఆత్రంగా. ఇంతసేపు లోన కూచొని ఏడ్చినట్టుంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. కన్నీరు తుడుచుకొని స్పీకర్ ఫోన్ ఆఫ్ చేసింది.‘‘మమ్మీ నేను బాగానే ఉన్నాను. అక్కడంతా ఎలా ఉన్నారు. డాడీ ఎలా ఉన్నారు?’’ అడుగుతోంది.

తను పక్కనుండటం బాగుండదనీ వెనక్కి పోర్టికోలోకి వచ్చేసాడు విరాట్. సహస్ర డోర్ లోనే ఉండి మాట్లాడుతోంది మెల్లగా. సహస్ర మాటలు వినబడుతూనే ఉన్నాయి.

"ఏమిటి మమ్మీ, చిన్న పిల్లలా ఏడుస్తావ్? నేను బాగానే వున్నా గదా" అంటోంది సహస్ర.

"ఏం బాగుండటమే, ఇల్లొదిలి పరాయిచోట ఆడపిల్లవు ఒంటరిగా ఉండటం బాధగా ఉండదా? యిద్దరూ యిద్దరే నా ప్రాణానికి దొరికారు మొండి ఘటాలు. నీ మాట డాడీ వినరు, ఆయన మాట నువ్వు వినవు ఎంత కాలమిలా.........."?

"మమ్మీ ప్రాణంపోయినా నేను డాడీ చూసిన సంబంధం చేసుకోను. నా మాటకి నా యిష్టాలకి అస్సలు విలువ లేదా? డాడీ పట్టించుకోరే? ఒకె మమ్మీ, ఆయన కూతుర్నేగా, ఆయనకుండే తిక్క నాకు ఉంది. నువ్వు మాత్రం అనవసరంగా బెంగపడకు."

'బెంగపడకుండా ఎలా ఉంటానే? నిన్ను చూసి అప్పుడే ఏళ్ళు గడిచిపోయినట్టుంది. ఇంటికెప్పుడొస్తున్నావ్?""ఇప్పట్లో మధురై రావటం వీలు కాదు""పోనీ నీవిష్టపడిన అబ్బాయి గురించయినా వివరాలు చెప్తావా?"

"తర్వాత చెప్తాను"

"చెప్పవే తల్లీ, నీ మనసు కాస్త కుదుటపడుతుంది. పేపర్లో ప్రకటన చూసి ఫోన్ చేసే వరకు ప్రాణం నిలువ లేదు. చక్కగా మాట్లాడుతున్నాడు. అబ్బాయి గుణవంతుడేనా?"

"అబ్బో పెద్ద పోకిరి"

"నీ లాంటి పెంకిదానికి పోకిరి కరక్టేలే. ఇంతకీ అబ్బాయి చూడ్డానికెలా ఉంటాడు? బాగుంటాడా?"

"ఆహా....... పగలు చూస్తే రాత్రి కల్లోకొచ్చేంత బాగుంటాడు"

ఆ చివరి మాటలు తన గురించేనని గ్రహించి చిన్నగా నవ్వుకున్నాడు విరాట్

"ఏయ్..... తమాషాలొద్దు. నిజం చెప్పవే. అబ్బాయెలా ఉంటాడు?"

తల్లి మాటలు వింటూ

పోర్టికోలో అటూ యిటూ తిరుగుతున్న విరాట్ వంక చూసింది సహస్ర.

"నిజం చెప్పనా?" అంది చిన్నగా.

"చెప్పవే"

"చాలా... చాలా......... బాగుంటాడు. రాకుమారుడిలా"

"అతనెవరి తాలూకు ఏ వూరు? చెన్నై వాడేనా?"

"నువ్వు డాడీతో చెప్పనంటే చెప్తాను"

"నేనెందుకు చెప్తానే తల్లీ. నేను నీ పార్టీయే గదా. అస్సలు చెప్పను."

"కొయంబత్తూరు......... నూలు మిల్లు ఓనరు వెంటకరత్నానాయుడుగారి గురించి విన్నావా? ఆయన చిన్నకొడుకు. పేరు విరాట్."

‘నిజమా’’‘‘అబద్ధమనుకొంటున్నావా?’’


‘‘కొంప మునిగిందంటున్నాను’

‘‘అదేమిటమ్మా’’

‘‘ఆ నాయుడు గారికి మీ డాడీకి అస్సలు పడదుగదా’’

‘‘ఏమైంది’’

‘‘కోయంబత్తూరు దగ్గరలో మన పొలాల దగ్గరే నాయుడుగారి పొలాలున్నాయి. అక్కడ కెమికల్ ఫ్యాక్టరీ ఏదో పెట్టాలని నాయుడుగారు ప్లాన్ చేసారు. కెమికల్ ఫ్యాక్టరీ పొల్యూషన్ తో మా పొలాలు దెబ్బ తింటాయి గాబట్టి అక్కడ కట్టడానికి వీల్లేదన్నారు మీ డాడీ. ఈ విషయంలో గొడవలు పడి కోర్టు వరకు వెళ్ళారు.



చివరకు ఆ ఫ్యాక్టరీని మరోచోట ఏర్పాటు చేసుకున్నారాయన. కాని పాత గొడవలు అలాగే ఉండిపోయాయి. ఇద్దరికీ పడదు కాబట్టి ఒప్పుకోరు.''

''సరే మమ్మీ. పెళ్ళి వరకు వచ్చాక అప్పుడు చూద్దాంలే. విషయం చెప్పావ్ గా ఒకె. తర్వాత నా సెల్లోంచి ఫోన్ చేస్తాను. ఎప్పుడు చేసినా ఇక నానంబర్ కి చెయ్యి. ఫోన్ పెట్టెయ్''

''ఆగవే.........ముఖ్య విషయం చెప్పటం మర్చి పోయాను.''

''ఏంటది?''

“ప్రకటన చూడగానే మీ డాడీ అగ్గిలం మీద గుగ్గిలం లా మండి పడ్డారు. నువ్వు చెన్నై లో ఎక్కడున్నా పట్టి తీసుక రమ్మని కదిరేషన్, వడివేలు ఇంకో పదిమందిని తోడిచ్చి గంట క్రితమే జీప్ లో పంపించారు, నువ్వు జాగ్రత్తగా ఉండాలి.”తీవ్రంగా ఆలోచిస్తూ విరాట్ వంక చూసింది అతను దగ్గరకొచ్చాడు ఆమె చేతిలోంచి ఫోన్ తీసుకున్నాడు “ఒకె నిన్నిబ్బంది పెట్టను. వచ్చిన పనయిందిగా. ఇక వెళ్తాను” అంటూ వెనుతిరిగాడు.“ఇంత దూరం వచ్చిన వాడివి లోనకు రాకుండా వెళ్తావా?” గుమ్మానికి ఓపక్క జేరపడి అడిగింది.“నేను పెద్ద పోకిరి గదా...........వద్దులే”

“ఆహా!”

“పగలు చూస్తే రాత్రి కల్లోకొచ్చేంత వికారంగా వుంటాను”

“నా మాటలు వినేశావన్న మాట” నవ్వింది.

“నేనెక్కడ విన్నాలే, అవే నా చెవిలోకొచ్చి పడ్డాయి.”

“ముందు లోనకొస్తావా తలుపేసుకోనా”

“మాట తప్పే వాళ్ళింట్లోకి నేను రాను”

“నేను మాట తప్పానా?”

“కాదా........నన్ను టచ్ చేయలేక పోయావ్ గా? ఓడిపోయిందానివి ఒప్పందం ప్రకారం ముద్దిచ్చి రావాలా వద్దా? ఏడుస్తూ వచ్చేస్తే అర్థం ఏమిటి? వద్దులే వెళ్ళి పోతాను”

‘‘మళ్ళీ నన్ని రిటేట్ చేస్తున్నావ్ రా. వీధి గుమ్మంలో గొడవ పడితే అసహ్యంగా ఉంటుంది. మర్యాదగా లోనకొస్తున్నావా లేదా?’’ కోప్పడింది సహస్ర.

‘‘సరి సరి అరవక. అంతగా మర్యాద చేస్తానంటే నేను మాత్రం కాదంటానా’’ అంటూ అడుగు లోన పెట్టాడు విరాట్.ఆమె ముఖంలో యిప్పుడు విచారం గాని కోపం గాని వాటి ఛాయలేవీ లేవు. ఎప్పటి సహస్రలా ముఖం కళకళలాడుతోంది. బహుశ తల్లితో మాట్లాడాక ఆమెలో కొత్త ఉత్సాహం ఏర్పడి ఉండాలి.

ఇలా గడప దాటి లోన అడుగు పెట్టాడో లేదో అలా తిరిగి అతని సెల్ ఫోన్ మోగటం ఆరంభించింది.

I I I

కోయంబేడు స్లమ్ ఏరియా.....

అదే కాకా హోటలు

మురడన్ ముత్తూ బేచ్ అంతా ఇంకా అక్కడే ఉంది. న్యూస్ పేపర్ పక్కన పడేసి దీర్ఘాలోచనలో వున్నారంతా. అదృష్టం తలుపు తట్టినట్టే తట్టి వెనక్కి పోయినంత దిగాలుగా వున్నారంతా.

అప్పటికే అర డజను స్ట్రాంగ్ టీలు తాగి మరీ ఆలోచిస్తున్నాడు ముత్తూ. ఎంత ఆలోచించినా వాని బుర్రకి అంతు చిక్కటం లేదు. ఇవాళే ప్రకటన రావటం ఏమిటి? అంతలోనే ఆపిల్ల వెనక్కి వచ్చేయటం ఏమిటి? ఇది నిజమేనా? సంభవమేనా? లేక ప్రకటనిచ్చిన వాడు కావాలని తనతో అబద్ధం చెప్పాడా? అది కూడ కాదు. తననింత అవమానించటం కడుపు మంటగా వుంది. మళ్ళీ ఫోన్ చేస్తే ఏర్ పోర్ట్ రన్ వే మీద పడేసి విమానాలతో తొక్కిస్తానన్నాడు. అసలు ఎవడు వీడు? ఎలా ఉంటాడు?

‘‘ఇంకా ఏందన్నా ఆలోచన, వదిలేయ్. ఆ కోటి రూపాయలు లేదంతే మర్చిపో ’’ అంటూ ముత్తూ భుజం తట్టాడొకడు.

‘‘అవునన్నా మనకి ప్రాప్తం లేదు. ఇలా ప్రకటనివ్వగానే ఆ పిల్ల ఆలా వెనక్కి రావటం ఏంటి? ఓ వారం పది రోజులు ఆగొచ్చు గదా. అంతా మన బేడ్ లక్’’ అంటూనిట్టూర్చాడు మరొకడు.

‘‘పోనీ ఇంకో సారి ఫోన్ చేసి అడిగితే ఎలా ఉంటుంది?’’ మరొకడు ఆశ వదులుకోలేక సలహా యిచ్చాడు. అది విని మండి పడ్డాడు ముత్తూ.‘‘పళ్ళు రాలగొడతాను ఎధవ సలహా నువ్వూను. మళ్ళీ ఫోన్ చేసి ఇంకోసారి తిట్లు తినమంటావా? ఇప్పటికే వాడన్న మాటలకి గుండెలు మండిపోతున్నాయి. ఏదో ఒకటి చేయాలి. వాళ్ళనొదలకూడదు’’ అన్నాడు ఆవేశంగా ముత్తూ.

అతడి మాటలకు ముఖాముఖాలు చూసుకున్నారంతా

వాళ్ళుఎవరోతెలీదు. ఎక్కడుంటారోతెలీదు. ఏమీతెలీకుండావాళ్ళనిఏంచేద్దామని? మిత్ర బృందం అందరి బుర్రల్లోనూ ఇదే ప్రశ్న కుమ్మరి పురుగులా తొలుస్తోంది

‘‘అయితే ఏం చేద్దామంటావ్?’’ అడిగాడు ఒకడు.‘‘కిడ్నాప్ చేద్దాం’’ ఠకీమని బదులిచ్చాడు ముత్తూ.అతడి సమాధానం వినిషాక్ తిన్నారంతా.‘‘ఎలాగన్నా? అడ్రసు తెలీదుగా?’’ ముక్త కంఠంతో అరిచారంతా.

ఓసారి వాళ్ళందర్నీ కలియ జూసాడు ముత్తూ

‘‘అవున్రా కిడ్నాప్ చేద్దాం. ఇంతకు ముందు ఇదే మాట మీరంటే నేనే వద్దంటూ వచ్చా. ఇపుడు నేనే చెప్తున్నాను. వినండి ఆ ప్రకటనిచ్చిన వాడెవడో గాని కోటీశ్వరుడు. అందులో సందేహం లేదు. అవునా?’’ అడిగాడు.

‘‘మీ సందేహాలు నేను తీరుస్తాను వినండి, ఆ పిల్లను పట్టిస్తే కోటి రూపాయలన్నాడు, మనం ఆ పిల్లని కిడ్నాప్ చేసి మూడు కోట్లు డిమాండ్ చేసినా చచ్చినట్టిస్తాడు’’

‘‘అవుననుకో.......వాళ్ళ అడ్రసు తెలీదుగా’’ మరొకడు గొణిగాడు.

“తెలుసుకుంటాం. ఈ చెన్నై నగరంలో మనకు తెలీని గల్లీ ఉందా? వాడు నాతో మాట్లాడిరదాన్నిబట్టి వాడు ఏర్ పోర్టు ప్రాంతానికి సమీపంలో ఎక్కడో ఉండేవాడే...........”

“ఏఏర్ పోర్టన్నా? ఇంటర్నేషనల్ ఏర్ పోర్టా డొమెస్టిక్ ఏర్ పోర్టా లేక ట్రైనింగ్ సెంటర్ ఏర్ పోర్టా........అలా చూడకన్నా తెలుసుకుందామని.........” నసిగాడొకడు.

“ఏ ఏర్ పోర్టో ఈసారి ఫోన్ చేసి అడుగుతా లేరా. అది యిదనకుండా అన్ని ఏర్ పోర్టుల పరిసరాల్లో గాలించాలి. ఎక్కడో చోట ఈ సహస్రనే అమ్మాయి కన్పించకపోదు, ఆ పిల్లను బట్టి ఆమె ప్రియుడ్ని కనిపెట్టొచ్చు. ఫోన్ నంబర్ ఎలాగూ ప్రకటనలో ఉంది. అవునా? వివరించాడు ముత్తూ.

“అవును గాని అన్నా. అందరం కలిసే వెతుకుదామా?” తన డౌటు అడిగాడు మరొకడు.

“విడివిడిగా ముష్టెత్తుకుందాం.” అన్నాడు విసుగ్గా ముత్తూ.

“అదేంటన్నా తెలీకేగా అడిగాను?” నొచ్చుకున్నాడు అవతలి వాడు.

“నేను తెలిసే చెప్పాన్రా ! నిజమే చెప్పాను. మనమంతా రేపట్నుంచి ముష్టి వాళ్ళ అవతారం ఎత్తాలి. ఏర్ పోర్టు పరిసరాల్లో తిరిగాలి. ఇంటింటికీ పోయి బిచ్చమడగాలి, మన తిండి గడిచి పోతుంది. వీలయితే మన చేతివాటం ఎలాగు చూపిస్తాం. పోతే అందరం సెల్ ఫోన్లతో టచ్ లో ఉండాలి. మనం మొత్తం పన్నెండు మంది ఉన్నాం. మనలో ఎవడు ముందుగా ఈ పిల్లను చూసినా కంగారు పడకుండా మిగిలిన వాళ్ళకు ఫోన్లు కొట్టి ఎక్కడికి రావాలో చెప్పాలి. ముఖ్యంగా ఆ పిల్ల ఒంటరిగా కనబడ్డా వెంట తన లవర్ తో వున్నా వాళ్ళు కార్ లో వచ్చినా బైక్ మీద వచ్చినా.......ఆటోలో ఫాలో చేసి వాళ్ళుంటున్న యిల్లు ఎక్కడో తెలుసుకోవాలి. ఈ పేపర్ లో ప్రకటన వున్న సహస్ర ఫోటోను తలొకటి దగ్గరుంచుకోవాలి. వెళ్ళి ఓ డజను న్యూస్ పేపర్లు కొని పట్రండి. అన్నిఏర్పాట్ల తో మధ్యాహ్నం భోంచేసి మనమంతా ఏర్ పోర్టుకి వెళ్ళి పోతున్నాం. అర్ధమవుతుందా...?

వచ్చేటప్పుడు కొన్ని చినిగిన దుస్తులు ఓ గుడ్డ సంచిలో వేసి తెచ్చుకోండి. అడుక్కోడానికి ఓ సత్తు ప్లేటు మంచి నీళ్ళకి ఓ ప్లాస్టిక్ బాటిలు. ఇక వెళ్దాం. వారం తిరక్క ముందే వాళ్ళని పట్టాలి. కోట్లు పట్టేయాలి. విజయం మనదే” అంటూ లేచాడు ముత్తూ. అతడి మాటలతో ఒక్కసారిగా ఉత్సాహంతో లేచారంతా.

I I I

అక్కడ విరాట్ యింట్లో

చందూ బెడ్ రూమ్.....

అతడి ఛాతీ మీద తలాన్చుకొని పడుకునుంది దీక్ష. చందూ చేతులు ఆమె నడుంని తడుముతున్నాయి. కౌగిట్లో క్షణాలు తెలీటంలేదు యిద్దరికీ. ఇంతలో

గోడ మీద బల్లి కిచకిచలాడింది

"ఏయ్ దీక్షా!" పిలిచాడు.

"వూ" అంది.

"ఆ బల్లి అరిచింది. ఎందుకు?"

"పట్ట పగలు సరసాలేమిటి బుద్ధి లేకుండా అనరిచింది"

"కాదు ఎంత సేపూ ముద్దులూ సుద్దులేనా కాస్త మంచాన్ని కిరకిరలాడించొచ్చుగా అంటోంది."

ఆ మాటలతో గబుక్కున లేచి కూచుంది దీక్ష.



‘‘నిన్ను నాలుగుతన్నమనేమీ అనట్లేదా? పాడు బుద్ధులు, పాడు వేషాలు. పెళ్ళి కాకుండానే పిచ్చి వేషాలేయాలనుందా? చంపేస్తాను’’ అంటూ బెడ్ దిగిపోయింది.

‘‘ఏయ్ ఆగు తమాషాకన్నాను. సీరియస్సై పోతావేమిటి? కూచో ’’ అన్నాడు చందూ. కాని దీక్ష కూచోలేదు. వెళ్ళిన వాళ్ళలోఒక్కరూ యింకా తిరిగి రాలేదు. ఆమె కంగారు పడుతూ తలుపు తీసి హాల్లోకొచ్చింది. వెనకే చందూ కూడ వచ్చాడు.పగిలి పోయి హాల్లో చెల్లా చెదరుగా వున్న సామాన్లు చూస్తుంటే బాదేసింది. సుమారు పది నుండి పదిహేను లక్షల రూపాయలకు నష్టం జరగుంటుంది. కొత్త వాటికి మరో ఇరవై లక్షలు పెట్టాలి.

“దీక్షా” పిలిచాడు చందూ

“ఏమిటి?” అడిగింది

“నీ ఫ్రెండు లాగే నువ్వు కూడా కోపం వస్తే ఇంట్లో సామానంతా యిలాగే పగల గొట్టేస్తావా?”

“పిచ్చి పిచ్చిగా వుందా? నేనెందుకు పగుల గొడతాను?”

“మరి నీ ఫ్రెండేమిటి యిలా నాశనం చేసింది? తనకి కరాటే వచ్చని ముందే నీకు తెలుసా?”

“తెలుసు. నీ ఫ్రెండు మాత్రం తక్కువా. తనకీ కరాటే వచ్చుగా. ఎంతయితే మాత్రం యిలాగా నాశనం చేయటం! అసలు విరాట్ ని మెచ్చుకోవాలి. ఇంత చేసినా సహస్రని పల్లెత్తు మాటనకుండా తన కోసం పరుగెత్తాడు.” “ప్రేమలో ఉండే గొప్పదనం అదే. మావాడంటే పడిచచ్చే అమ్మాయిలు ఎంత మందున్నారో తెలుసా?’

“ఎంత మందున్నారు?”

“ఏయ్, ఏదో మాట వరసకన్నానోయ్. కోప్పడిపోతావేమిటి? మా వాడంటే పడిఛస్తారన్నాను గాని వాడు ఎవరికీ పడలేదు. ఇంతకీ విరాట్ ని ప్రేమించటానికి సహస్రకున్న అభ్యంతరాలేమిటి?”

“బాగుంది, అదేగా అర్థమై చావటం లేదు. అక్కడ వాళ్ళేం గొడవ పడుతున్నారో ఏమిటో.........ఓసారి చూసొద్దాం పద”

“పడనీ, మధ్యలో మనకేమిటి?”

“ఏమిటా........ఇక్కడంతా సహస్ర ధ్వంసం చేసిందన్న కోపంతో విరాట్ మా యింట్లో సామాను పగల గొడితే నా పరిస్థితేమిటి?”

“భయపడకు మా వాడంత బుద్ధి లేనోడేమీ కాదులే”

“అంటే........మా సహస్రకే బుద్ధి లేదంటావా.......”

“ఆ మాట నేనన్లేదు. ఓరి దేవుడా అవునంటే కాదని కాదంటే అవునని. ఏంటీ అమ్మాయిలు? ఆడాళ్ళకి తెలివి తేటలెక్కువ. మాకు భలే అన్యాయం చేసావయ్యా”

“నీ అన్యాయం గురించి తర్వాత తీరిగ్గా ఆలోచించుగాని, ఈ చెత్త సంగతేమిటి?” అంది దీక్ష.

“దాందేముంది క్లీన్ అండ్ స్వీప్ హోమ్ వాళ్ళకి ఫోన్ చేసాను. కాస్సేపట్లో వచ్చి మొత్తం తీసి లారీలో వేసుకొని హాలు క్లీన్ చేసి వెళ్ళిపోతారు. ఈ లోపల స్ట్రాంగ్ కాఫీ తాగుదాం పద” అంటూ అతడ్ని అనుసరించింది దీక్ష. ఇంతలో క్లీన్ అండ్ స్వీప్ హోమ్ వాళ్ళ లారీ వచ్చి గేటు ముందు ఆగింది. బిలబిలా నలుగురు పనివాళ్ళు కిందకు దిగారు.

************************************

సెల్ ఫోన్ నంబరు చూసిషాకయ్యారు విరాట్.

“ఓమైగాడ్!” అన్నాడు అప్రయత్నంగా

ఇది అతడు అస్సలు వూహించని ఫోన్ కాల్. ఎందుకంటే కోయంబత్తూరులో తమ యింటి లాండ్ లైన్ నంబర్ అది. ఇంటి నుండి ఫోనంటే...ఎవరు చేసుంటారు? డాడీ లైన్ లోవున్నారా? ఈ నంబరు తనదని అక్కడెవరికీ తెలిదే... లిఫ్ట్ చేయాలా వద్దా...”

“ఏమైంది? ఎవరు ఫోన్ చేసారు?” అతడ్ని గమనిస్తున్న సహస్ర కుతూహలంగా అడిగింది.

“అదే అర్ధం కావటం లేదు. ఇది కోయంబత్తూరు. మా ఇంటి లాండ్ లైన్ నంబరు, డాడీ అనుకుంటాను.”

“మాట్లాడు ఈ లోపల కాఫీ చేసి తెస్తాను.”

“ఈ నంబరు నాదని మావాళ్ళకు తెలీదు. అదే ఆశ్చర్యంగా వుంది”

“తర్వాత ఆశ్చర్య పోవచ్చు. లైన్ కట్టవుతుంది. ముందు మాట్లాడు” అంటూ కిచెన్ వైపు వెళ్ళింది సహస్ర.

తప్పదనుకుంటూ ఆన్ చేసాడు.

“హాలో” అన్నాడు గాభరాను అణుచుకుంటూ. ఫోన్ చేసింది వెంకట రత్నం నాయుడు గారయితే తనయిపోయాడే కాని అతడి అదృష్టం ఏం కానుందో గాని ఫోన్ చేసింది ఆయన కాదు తల్లి మంగ తాయారు.

“బాబూ విరాట్ ఒరే చిన్నోడా... ఈ నంబరు నీదేనా..?” అటు నుంచి తల్లి గొంతు వింటూనే కాస్త తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు విరాట్.

“మమ్మీ పక్కన డాడీ ఉన్నాడా?” వెంటనే అడిగాడు.

“లేరులే, ఇంత క్రితమే బయటికెళ్ళారు. ఏమిట్రా యిదంతా నాకంతా గందరగోళంగా ఉంది. వారానికి, పది రోజులకి ఫోన్ చేసే వాడివి. ఈ మధ్య అస్సలు చేయటం మానేసావ్. ఇవాళ చూస్తే పేపర్ లో ప్రకటన. ఎవరీ అమ్మాయి...? ఏమిటీ గోల?” అటు నుంచి తల్లి మంగ తాయారు సీరియస్ గా అడుగుతుంటే చిన్నగా నవ్వుతూ.

“ఆ విషయాలు చెప్తా గాని మమ్మీ నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇది నా పర్సనల్ నెంబర్. అక్కడ ఎవరికీ తెలీదు. ఇది నా ఫోన్ నంబరని నీకెలా తెలిసింది? డాడీకి తెలిసి పోయిందా?” అడిగాడు.“మీ డాడీ మూలంగానే నాకు తెలిసింది. అనవసరంగా ఆయనతో తిట్లు తిన్నాను. చిన్న కొడుకుకని నెత్తినెత్తుకున్నావ్ చూడు ఏం చేసాడో అంటూ మండిపడ్డారు.”

“డాడీకి ఎలా తెలిసింది?”

“మొదట ఆయనకీ తెలీదు, ఎవడో ప్రేమ పిచ్చోడు ఏకంగా ప్రకటనే యిచ్చాడు చూడు అంటూ చూపించి నవ్వుకున్నారు. అంతలో సాగరిక ఫోన్ చేసి చెప్పింది.”

“సాగరిక....?”

“అవున్రా, నీ మేన కోడలు సాగరికే. గతంలో నువ్వు దానికి ఈనంబర్ తో ఫోన్లు చేసినట్టున్నావు. అసలే దానికి గుర్తెక్కువ. ఏదీ మర్చిపోదు. నువ్వు చెన్నైలో ఉన్నావని ఈ నంబరు నీదని. ఫోటోలో పిల్లని ప్రేమించి ఉంటావని........మీ ఇద్దరికీ పెళ్ళి జరిపిస్తానంటే నేచెప్తానని మాట తీసుకొని మరీ చెప్పింది.”

“కొంప ముంచింది. డాడీ ఏమన్నాడు.”

“ఇక చెప్పాలా ఆయన కోపం గురించి. నీ మీద నా మీద కూడ మండిపడ్డారు. తను ఫోన్ చేస్తే చెన్నై నుంచి మళ్ళీ ఎటన్నా వెళ్ళి పోతావని ఫోన్ చేయలేదు. పెద్దోడు విక్రాంత్ కూడ అదే సలహా యిచ్చాట్ట. ఇంతకీ ఎవర్రా పిల్ల ? ఎందుకు నిన్ను ప్రేమించింది? ఎందుకెళ్ళి పోయింది?”కిచెన్ లోకి చూసాడు విరాట్.

లోన కాఫీ కలుపుతోంది సహస్ర.

కమ్మటి కాఫీ వాసన ముక్కు పుటాల్ని తాకుతోంది. మమ్మీ మాటలు తనూ వినాలని స్పీకర్ ఫోన్ ఆన్ చేసాడు.“తనో సత్యభామ అనుకుంటుంది. అలిగి వెళ్ళి పోయింది. ప్రకటన చూడగానే ఇంత క్రితమే వెనక్కి వచ్చేసింది” అన్నాడు.

ట్రే తో వస్తున్న సహస్ర అతడి మాటలకి...

చురచురా చూసింది.

"పేపర్లో ఫోటో చూసాను. పిల్ల చాలా బాగుంది. మహాలక్ష్మిలా వుంది. నాకు నచ్చింది" అవతలి నుంచి తల్లి గొంతు.

"థ్యాంక్యూ మమ్మీ" అన్నాడు

సహస్ర వచ్చి ట్రే టీ పాయి మీద వుంచింది. ఒక కప్పు అతడి ముందుంచి ఒకటి తన ముందుంచుకుంది. తల్లీ కొడుకుల సంభాషణను ఆసక్తిగా వింటోంది. తనను సత్యభామతో పోల్చటం కించిత్తు గర్వంగానూ కించిత్తు కోపంగానూ ఉందామెకు.

"అవునూ మీరిద్దరూ నిజంగానే ఒకర్నొకరు ఇష్టపడుతున్నారా? అంతగా ప్రేమిస్తే ఎందుకెళ్ళిపోయింది? ఏదన్నా సమస్యా?" ఆరా తీస్తోంది మంగ తాయారు.

"అదేం లేదు మమ్మీ. సమస్యేం లేదు. ఇంతకీ మన వాళ్ళంతా ఎలా వున్నారు? మమ్మీ, అన్నయ్య వదిన వాళ్ళ పిల్లలు?""అంతా బాగున్నారు గాని నువ్వు మాట మార్చకు. అడిగిందానికి సూటిగా సమాధానం చెప్పు. పెళ్ళి చేసుకొని కాపురం పెట్టేసినట్టున్నావ్. నిజం చెప్పు నీ పెళ్ళయిపోయిందా?" నిలదీసింది.

"అయ్యో అదేం లేదు. మా ప్రేమ పెళ్ళి వరకు ఇంకా రాలేదు మమ్మీ. నన్ను నమ్ము. మీతో చెప్పకుండా మీరెవరూ లేకుండానే నా పెళ్ళి జరగదు. సరేనా"

"ఏమో, మీ డాడీకి భయపడి చెప్పకుండా పెళ్ళి చేసేసుకున్నావనుకుంటున్నాను."

‘‘లేదంటున్నా గా’’

‘‘అయితే పెళ్ళిగా కుండా ఆ పిల్ల నీతో ఎందుకుంటోంది? ఎందుకెళ్ళింది? ఎందుకొచ్చింది?’’

తల్లి అలా నిలదీస్తుంటే...

విరాట్ కి గుక్క తిప్పుకోవటం కష్టంగా వుంది.

ఏం చెప్పాలి? ఎలా మేనేజ్ చేయాలి?

కాఫీ సిప్ చేస్తూ సహస్ర అతడి అవస్థ చూసి ముసిముసిగా నవ్వుతోంది.

‘‘ఏంటి మమ్మీ నువ్వు కూడ అనుమానిస్తున్నావ్. అలాంటిదేమీ లేదంటున్నా గా. నాలాగే తనూ తన వాళ్ళకు దూరంగా ఇక్కడ తన

స్నేహితురాలితో కలిసి ఉంటూ జాబ్ చేస్తోంది. పక్క పక్క వీధుల్లోనే ఉంటున్నాం. నాతో గొడవ పడి తన ఫ్రెండ్ కీ చెప్పకుండా వెళ్ళి పోయి హాస్టల్లో ఉందట. ఆ సంగతి తెలీక నేను పేపర్లో ప్రకటించాను. అది చూసి వెనక్కి వచ్చేసింది అంతే...’’ ఎలాగో మేనేజ్ చేసాడు.

‘‘వూ... బాగుందిరా వరస. ఇంతకీ అమ్మాయి పేరేమిటన్నావ్? సహస్రానా...’’ అడుగుతోంది తల్లి. ‘‘పూర్తి పేరు లక్ష్మీ సహస్ర...’’ చెప్పాడు.‘‘అలాగా... పేరు చాలా బాగుందిరా. ఇప్పుడు నువ్వెక్కడున్నావ్...?

‘‘ఇక్కడే.....సహస్రవాళ్ళింట్లో.........ఇంత క్రితమే వచ్చాను.’’

‘‘అమ్మాయి గుణవంతురాలేనా? ఏం చదువుకుంది’’

''మమ్మీ, గుణం గురించి చెప్పాలంటే అబ్బో, మహా శంకిణి. లోకంలో తిక్కంతా తనకే ఉంది. ఇక చదువంటావా? ఎదుటి వాళ్ళని చితగ్గొట్టేంత చదువుకుంది.''

ఆ మాటలు వింటున్న సహస్ర ఉడికి పోతూ ''ఆపు..... ఆపుతావా? అదే నిజమనుకుంటారావిడ'' అంటూ ఫోన్ లాక్కుంది.

''ఆన్టీ..... నమ్మకండి. మీ అబ్బాయి మాటలు అస్సలు నమ్మకండి. కావాలని నన్నేడిపిస్తున్నాడు. మహామొండి. ఇలా ఉడికిస్తుంటేనే నేను కోపమొచ్చి వెళ్ళిపోయాను. అతని మాటలు నమ్మి నన్ను అపార్థం చేసుకోవద్దు. ప్లీజ్'' అంది. విరాట్ కట్టుకథని తనూ బలపర్చింది సహస్ర.అటు నుంచి మంగ తాయారు నవ్వటం విన్పించింది.

''నా మాటలు నమ్మండి. ఆన్టీ నేను చాలా మంచి దాన్ని. విరాట్ కావాలని.......''

''అర్థమైందిలేమ్మా. నా కొడుకు సెలక్షన్ ఎన్నడూ రాంగ్ కాదని నాకు తెలుసు. ఫోటోలో చూస్తుంటే నా దిష్టే తగిలేంత అందంగా ఉన్నావ్. బంగారు బొమ్మలా ఉండుంటావ్. నీ మనసు కూడ బంగారం లాంటిదే అయి వుంటుంది. చెప్పమ్మా ఇంతకీ నీది ఏ వూరు? ఎవరి తాలూకు?''మంగ తాయారు గారి చివరి ప్రశ్నలు వినగానే సహస్రకు గొంతులో ఏదో అడ్డం పడినట్టయింది. ఏం చెప్పాలి? గతం తన తల్లికి తెలిసినట్టే ఈవిడకు తెలియకుండా ఉంటుందా? తన తండ్రి మహాదేవ నాయకర్ పేరు చెప్పగానే ఈవిడ పెళ్ళి జరగదంటుంది. తన కన్నా విరాటయితేనే ఏదో ఒకటి చెప్పి మేనేజ్ చేస్తాడనుకుంటూ

''ఆ విషయాలు తను చెప్తాడులే ఆన్టీ ఫోన్ విరాట్ కిస్తున్నాను. మాటాడండి'' అంటూ మరో మాటకి అవకాశం యివ్వకుండా ఫోన్ విరాట్ చేతిలో పెట్టింది.

''నా గురించేమీ చెప్పకు'' అంటూ లోగొంతులో హెచ్చరించింది.

కాని ఆ హెచ్చరిక విరాట్ కి అర్థంగాక ''మమ్మీ తనేమీ ఆషామాషీ అమ్మాయేమీ కాదు, తనది మధురై. ఆమె తండ్రి మహాదేవ నాయకర్. నాలాగే తనూ తండ్రి చూసిన సంబంధం యిష్టం లేక చెన్నై వచ్చేసుంటోంది.......''

విరాట్ మాటలువింటూ

“అయ్యో అయ్యో........” అనుకుంటూ నుదురు కొట్టుకుంది సహస్ర. తను వద్దన్నా అర్ధం చేసుకోకుండా చెప్పేసాడే అని కళవర పడింది. ఆమె అనుకున్నట్టే అయింది.

“ఏరా నువ్వు నిజమే చెప్తున్నావా?” అవతల నుంచి అడుగుతోంది తల్లి.

“నిజం మమ్మీ డౌటెందుకు?”

“మధురై లిక్కర్     సిండికేట్ మహాదేవ నాయకరేనా?”

“అవును”

“అలాగా”

“అయితే నువ్వు మా గురించి చూడక్కర్లేదు. పెళ్ళి చేసుకొని చెన్నైలోనే ఉండిపో”



ఆ మాట వినగానే పక్కన బాంబు పేలినట్టు ఉలికిపడ్డాడు విరాట్.

సహస్ర అయ్యయ్యో........అంటూ

నుదురు ఎందుకు కొట్టుకుందో

అప్పటిగ్గాని బోధ పడలేదు.

“ఏమిటి మమ్మీ అలాగంటావ్....” అన్నాడు నొచ్చుకుంటూ.

“ఇంకెలా అనాల్రా.......... ఆ మహాదేవనాయకర్ కి మీ డాడీకి అస్సలు పడదు. నీకు తెలీదా? ” కసురుకుంది మంగ తాయారు.ఈసారి నిజంగానే నిర్ఘాంత పోయాడు విరాట్. వాళ్ళిద్దరికీ గత పరిచయం వుందా? ఇద్దరికీ పడదా! పాత పగలేమన్నా వున్నాయా? ఎందుకు? ఇదేం కొత్త మెలికరా బాబూ అనుకుంటూ...

“నాకేం తెలీదు మమ్మీ, ఏమైందసలు?” అనడిగాడు.

అప్పుడు మూగాంబిగై తన కూతురు సహస్రకు ఎలా కెమికల్ ఫ్యాక్టరీ గొడవ చెప్పుకొచ్చిందో అలాగే యిప్పుడు మంగతాయారు తన కొడుకు విరాట్ కి జరిగింది విన్పించింది.

“ఆయనసలే నీ పెళ్ళి సాగరికతోనే జరగాలని పట్టుదలగా వున్నారు. పోనీ ఎలాగో నచ్చచెప్పొచ్చనుకున్నా నువు లవ్ చేసింది మీ డాడీకి గిట్టని వ్యక్తి కూతుర్ని. బహుశ మీ పెళ్ళికి మహాదేవనాయకర్ గారు కూడ ఒప్పుకోరు. కాబట్టి మీ పెళ్ళి మీ యిష్టం ”

“ ఏంటి మమ్మీ... నువ్వు కూడా మమ్మల్ని వదిలేస్తానంటే ఎలా...? ఆ గొడవ జరిగినప్పుడు నేను ఫారెన్ లో వున్నాను కాబట్టి నాకు తెలీదనుకో. ఇప్పుడు నేనేం చేయాలి? పోనీ సహస్రని వదిలేయనా?” అనడిగాడు సహస్ర వంక చూస్తూ. క్షణాల్లోఅతడు కోరుకున్న ఎఫెక్ట్ వచ్చేసింది. నిటారుగా కూచుంటూ కోపంగా చూసింది సహస్ర. ఆమె ముఖం కుంకుమ పువ్వులా ఎర్రబడింది. విరాట్ పెదవుల మీద చిరునవ్వు ఆమెకు ఒళ్ళు మండేలా చేస్తోంది.

“ఇంత వరకు వచ్చాక వదిలేస్తావా....? నేన్నీవెంట పడ్డానా? రైల్వే స్టేషన్ లో పోస్టర్లు వేసి పేపర్ లో ప్రకటనిచ్చి, నేనెక్కడుందీ అందరికీ తెలిసి పోయేలా చేసి ఇప్పుడొదిలేస్తావా....? నువ్వు వదిలినా నేను నిన్నొదలుతాననుకున్నావా....... ఆగరా నీ పని చెప్తా....” సహస్ర పిడికిళ్ళు కోపంతో బిగుసుకున్నాయి. అవతల మంగతాయారు గారి మాటలు వినిపించక పోతే నిజంగా విరాట్ తో వార్ డిక్లేర్ చేసేదే. అవిడ కొడుకు మీద కోప్పడుతోంది.

“ఏరా నీకు బుద్ధుందా? ఆ పిల్లని వదిలేస్తావా? అదీ సహస్ర ఎదురుగా నాతో అంటున్నావంటే కావాలని ఆ పిల్లని

ఉడికించటానికేగా? నువ్విలా పిచ్చి వేషాలేస్తే తను మళ్ళీ వెళ్ళి పోతుంది. మళ్ళీ ప్రకటనిస్తావా...?''

''అది కాదు మమ్మీ''

''ఏది కాదు ? మీ పెళ్ళికి పెద్దాళ్ళిష్టపడరన్నాను గాని ఆ పిల్లని వద్దన్నానా? మీ ప్రేమ పెళ్ళి వరకు రావాలంటే మీరు చాలా కష్టపడాలనిపిస్తోంది. అసలు విషయం చెప్తాను విను. ఎలాగయినా సరే కూతురు కిచ్చిన మాట నిలబెట్టుకుని సాగరికతోనే నీ పెళ్ళి జరిపించాలని మీ డాడీ పట్టుదలగా ఉన్నాడు. నువ్వు చెన్నైలో ఎక్కడ కన్పించినా కాళ్ళు చేతులు కట్టి కోయంబత్తూరు తీసుకు రమ్మని మీ డాడీ మననూలు మిల్లులో పని చేసే మునుస్వామికి పదిమందిని సాయమిచ్చి చెన్నై పంపించారు. వాళ్ళిప్పుడు దారిలో ఉంటారు. కాబట్టి నిన్ను హెచ్చరిద్దామనే ఫోన్ చేసాను. కోరింది దక్కించుకోవాలంటే పోరాడక తప్పదు. వీలయితే మీరు పెళ్ళి చేసేసుకోండి. అప్పుడు మీరు కావాలనుకున్న వాళ్ళు వెదుక్కుంటూ మీ దగ్గరకే వస్తారు.''

''మమ్మీ.......''

''మమ్మీనే చెప్తున్నాగా.........లక్ష్మీ సహస్ర నా కోడలు. మీరుగా పెళ్ళి చేసుకున్నా పెద్దల అంగీకారంతో పెళ్ళి జరిగినా సంతోషమే. ఆలోచించి నిర్ణయం తీసుకోండి. జాగ్రత్తగా ఉండండి. అమ్మాయి సహస్ర....... ఫోన్ అమ్మాయికివ్వరా''

విరాట్ చేతిలోంచి ఫోన్ అందుకొంది సహస్ర.

''చెప్పండి ఆన్టీ'' అంది.

''ఇంకా ఆన్టీ ఏంటమ్మాయ్! అత్తయ్యని పిలు, మీ సంతోషమే నాక్కావాలి. మా వాడు కాస్త అల్లరోడే కాని అంతకన్నా మంచి వాడుండడు. ఇక మీద ఏ కోప తాపాలున్న సర్దుకు పోవాలి గాని వెళ్ళి పోకూడదు. జాగ్రత్తగా ఉండండి. ఇదిగో విరాట్ ''

''చెప్పు మమ్మీ''

‘‘ఓసారి అన్నయ్య విక్రాంత్ కి ఫోన్ చేసి మాట్లాడు. మీ డాడీ వాడి మాటే వింటారు. బయట మీ డాడీ వస్తున్నాట్టున్నారు. ఉంటాను’’ అంటూ అవతల లైన్ కట్ చేసింది మంగ తాయారు.

మధురై...

పోలీస్ కంట్రోల్ రూమ్...

అక్కడ ఎంట్రన్స్ కాంపౌండ్ గేట్ ఎదురుగా రోడ్ అవతల చిన్న హోటల్ ఒకటి ఉంది. చూడ్డానికి చిన్నదయినా టీ టిఫిన్లు చాలా నీట్ గాను రుచిగా ఉంటాయని పేరుంది. పోలీస్ అధికారులు కూడ అక్కడ్నుంచి టిఫిన్ తెప్పించుకుంటారు. కాబట్టి ఎప్పుడూ బిజి గానే ఉంటుంది. బయట బల్లల మీద పది మంది టీ తాగుతూనో టిఫిన్ చేస్తూనో కన్పిస్తుంటారు ఎప్పుడూ. ఇంతలో ఒక కానిస్టేబుల్ హడావుడిగా వెదుక్కొంటూ వన్నాట్ ఫోర్ కోసం వచ్చాడు.

‘‘నువిక్కడున్నావా? త్వరగా వెళ్ళు. ఎక్కడున్నా సరే వెంటనే రమ్మని ఎ యస్ పి గారి ఆర్డర్ ’’ అన్నాడు.‘‘ఇంతకు ముందేగా బయట కొచ్చాను. ఇంతలో ఏమైంది? తేలు కుట్టిందా దోమ పొడిచిందా?’’

‘‘ఏమోరా బాబు నాకేం తెలుసు. పోయి అడుగు. ఆయనకీ నీకూ సరి పోయింది’’ అంటూ నవ్వాడతను.

‘‘వెళ్ళొస్తాలే’’ అంటూ అక్కడ్నుంచి బయలు దేరాడు వన్నాట్ ఫోర్.

వన్నాట్ ఫోర్ వెళ్ళేసరికి తన ఛాంబర్ లో కాలు గాలిన పిల్లిలా అటు యిటు పచార్లు చేస్తున్నాడు ఎ యస్ పి. మనిషి కోపంగానూ చాలా సీరియస్ గానూ వున్నాడు. వన్నాట్ ఫోర్ ని చూడగానే ఎ యస్ పి ప్రకాష్ అతని చేయి పట్టుకొని లోపలి గది లోకి లాక్కెళ్ళి తలుపు మూసాడు. తమ మాటలు ఎవరూ వినకూడదని ఆయన ఉద్దేశం గావచ్చు. కాని తనను కొట్టడం కోసం లాక్కొచ్చాడనుకొని వన్నాట్ ఫోర్ తారెత్తి పోయాడు. అర చేతులు చెమటలు పట్టి గొంతు పూడుకు పోయి మాట పెగల్లేదు. కాని ఎయస్ పి అతని అవస్తను గమనించకుండా చెప్పుకు పోతున్నాడు.

‘‘అసలేమిట్రా వాడి ఉద్దేశం...? నాకే సవాల్ విసురుతున్నాడు? ఎవడు వాడు? వాడి బ్యాగ్రౌండ్ ఏమిటి? చెప్పరా........ ఇక్కడ

మోస్ట్ సీనియర్ వి నువ్వే. నీకు తెలీకుండా ఉండదు. నేనిక్కడికి రాక ముందు ఏం జరిగింది? వాడి మాట కత్తిలా ఉంది. మాటలో నదురు బదురు లేదు. భయమంటే ఏమిటో తెలీని వాడిలా వున్నాడు. చెప్పరా..... ఎవడు వాడు?"

ఎ యస్ పి అలా తలా తోక లేకుండా గడగడా మాట్లాడేస్తూ తనను అడుగుతుంటే విషయం ఏమిటో తెలీక బిత్తర పోవటం వన్నాట్ ఫోర్ వంతయింది. అయితే విషయం తన గురించి కాదనీ గ్రహించి గుండెను తేలిక పర్చుకున్నాడు.

"సార్! నాకు మీ మాట ఒక్కటీ అర్ధం గావటం లేదు. ఏం జరిగిందీ ఎవరితో మాట్లాడారు?" అనడిగాడు.

"వాడేరా........ఆ ప్రకటనిచ్చివాడు" చెప్పాడు ఎ యస్ పి ప్రకాష్.

ప్రకటన అనగానే విషయం కొంచెం బోధ పడింది వన్ నాట్ ఫోర్ కి. " సహస్ర ఫోటో పేపర్ కిచ్చిన వాడేనా? "

"ఆవున్రా... వాడే"

"ప్రకటనలో ఇచ్చిన నంబర్ కి ఫోన్ చేసారా? "

"చేసాను. వాడ్ని కాస్త భయపెట్టి చెన్నైలో ఆ పిల్ల ఎక్కడ ఉండేది ఎక్కడ మిస్సయిందో వివరాలు తెలుసుకుందామని ఫోన్ చేసాను. వాడు నాకే ధమ్కీ ఇస్తున్నాడ్రా. వాడి గురించి నాకు తెలియాలి"

"ఎలా తెలుస్తుంది సర్? వాడెవడో మనకి తెలీదుగా. ఆ నంబరు సిమ్ కార్డు ఎవరి పేరున ఉందో ఎంక్వరీ చేయిస్తే దొరికి పోతాడు. అది మీ చేతిలో పనే"

"గుడ్ అయిడియా. ఎంక్వైయిరీ చేయొచ్చు కాని ప్రస్తుతం వీలు కాదు. ఏదో ఒక కేసులో బుక్కయి పోయిన వాడి నంబరయితేనే నెట్ వర్క్ వాళ్ళు వివరాలు చెప్తారు. మామూలుగా అడిగితే పోలీసులతో చెప్పరు."

‘‘అయితే పెద్ద చిక్కే ఉంది. అయినా బెదిరించటంలో మీరే నెంబర్ వన్ అనుకుంటే మిమ్మల్ని ఒకడు బెదిరించటం ఏమిటి సార్. నిజంగానే వాడ్ని వదల కూడదు.’’

‘‘వదలన్రా. వాడి అంతు చూస్తాను. లహరి నాది. దాని కోసం ఏమైనా చేస్తాను.’’

‘‘కొంప దీసి వాడూ ఇదే మాటన్నాడా సార్? సహస్ర నాది మీరే డ్రాపయి పోండి అని బెదిరించాడా?’’

‘‘బెదిరి పోవడానికి నేనేమన్నా కుందేలునా? మీసాలున్న మగాడ్ని. నా చేతిలో అధికారం ఉంది.’’

‘‘ఈ మాట కరక్టే అనుకోండి. ఇంతకీ ఏమంటాడు సార్?’’

‘‘రేపు తెల్లవారే లోపల వాడు నాకు మర్యాద నేర్పిస్తాట్ట’’

‘‘మర్యాద.....అదెలా వుంటుందో కూడ మనకి తెలీదే ’’ అంటూ నవ్వాడు వన్ నాట్ ఫోర్.

‘‘అయినా సార్ వాడుండేది చెన్నైలో. మనం ఉండేది మధురైలో. మూడొందల కిలో మీటర్ల దూరంలో ఉన్న మీకు మర్యాద నేర్పిస్తాడంటే ఖచ్చితంగా వాడు బ్లఫ్ మాస్టరైనా అయ్యుండాలి లేదా మంత్రికుడయినా అయ్యుండాలి. బ్లఫ్ మాస్టరైతే వాడి మాటలన్నీ కోతలే. పట్టించుకోనక్కర్లేదు. కాని మంత్రగాడయితేనే ప్రమాదం. ఏ కాలో చెయ్యో పడి పోయేలా మంత్రం పెట్టాడనుకోండ. అంతే పులి లా ఉండే మీరు పిల్లియిపోతారు’’ అంటూ తను మరి కాస్త బెదర గొట్టాడు.

‘‘వాడి ధోరణి చూస్తే మాటల మనిషిలా లేడు. చేతల మనిషిలా ఉన్నాడు. వాడి గురించి నా దగ్గర క్లూ వుంది. అది చెప్తావనే నే పిలిచాను’’ అన్నాడు టేబుల్ మీద కూచుంటూ ఎ యస్ పి ప్రకాష్.

“క్లూ వుందా? ఇకనేం నాకు తెలిసుంటే యిప్పుడే వాడెవడో మీతో చెప్పేస్తాను. ఆ క్లూ ఏంటో ఇలా నా చెవిలో పడేయండి” అన్నాడు వన్ నాట్ ఫోర్.

“నాకు ముందు ఇక్కడ ఎ యస్ పి గా పని చేసిన అయ్యా సామి నీకు తెలుసు గదా?”

“అయ్య బాబోయ్ ఆయన తెలీక పోడం ఏమిటి సార్. మహా పొగరు బోతు. లంచాలు మెక్కి మెక్కి తెగ బలిసి కన్నూ మిన్నూ తెలియ కుండా ఉండేవాడు. చివరికేమైంది. దేవుడు ఆయన కాలు తీసేసి మదం అణిచేసాడు. మోకాలు వరకు కాలుపోడంతో ఉద్యోగం పోయింది. ఆసలు నన్నడిగితే అలాంటి వాళ్ళను చూసి అయ్యో పాపం అనుకోడం కూడ పాపమే సార్.” ఏదో ఫ్లోలో అనాల్సిన నాలుగు మాటలు అనేసి చివరికి నాలుక్కరుచుకున్నాడు వన్ నాట్ ఫోర్. ఎందుకంటే తన ఎదురుగా వున్న వాడు అయ్య సామి లాంటి ముఖ్యుడే నని అప్పటిగ్గాని గుర్తుకు రాలేదు. భుజాలు తడుముకుని తన భరతం పడతాడని భయ పడ్డాడు. కాని తీవ్రంగా ఆలోచనల్లో వున్న ఎయస్ పి ప్రకాష్ వన్ నాట్ ఫోర్ మాటల్ని పెద్దగా పట్టించుకో లేదు.

“అయితే వాడు ఫోన్ లో చెప్పింది వాస్తవమేనన్న మాట.

ఆ రోజు ఏం జరిగిందో వివరంగా చెప్పు ” అన్నాడు.

“వివరంగా అయితే చెప్పలేను సార్. ఎందుకంటే నేను అయ్య సామికి గిట్టను. మాసిలామణి అని ఓ కానిస్టేబుల్ ఉండేవాడు. వాడే ఆయనకి పర్సనల్ గా వ్యవహరించేవాడు. గత ఏడాదే వాడూ ట్రాన్స్ ఫరై వెళ్ళి పోయాడు. నేను విన్న విషయాలు చెప్పమంటే చెప్తాను.”



“చెప్పు”

“అర్ధ రాత్రి కళ్ళు మూసుకు పోయి ఓ ఆడపిల్లను రేప్ చేయబోతే ఎవడో యువకుడు అడ్డం పడి చితగొట్టి ఆయన సర్వీసు రివాల్వర్ తో ఆయన్నే మోకాలి మీద మూడు సార్లు షూట్ చేసి ఆడ పిల్లను కాపాడి తీసుకు వెళ్ళి పోయాట్ట. వాడెవడో గాని రివాల్వర్ షూటింగ్ లో ఎక్స్ పర్ట్ అయి ఉండాలి. దెబ్బకు సగం కాలు ఎగిరి పోయింది”.

“ఆ పిల్ల ఎవరు? ఏ వూరు? కాపాడిన ఆ కుర్రాడు ఎవరు?”

“రెండూ చెప్పటం కష్టమే సార్. ముఖ్యంగా ఆ కుర్రాడి గురించయితే అస్సలు తెలీదు. కేసు బుక్ చేసి ఆ కుర్రాడి కోసం మన డిపార్ట్ మెంట్ వెతికి వెతికి చివరకు చేతులెత్తేసింది.”

“ ఆ పిల్ల సంగతేమిటి”

“ఆ పిల్ల స్టేట్ మెంట్ విరుద్ధంగా ఉండి సార్. దాంతో ఏమీ చేయలేక పోయారు. అనుమానం మాత్రం ఉండి పోయింది. ఈ గొడవ జరిగింది ఇక్కడ కాదు. త్రి టౌన్ పోలీస్ స్టేషన్ లో. అందులోస్టాఫ్ అంతా ఎ యస్ పి అయ్య సామి కి తొత్తులుగా ఉండేవాళ్ళు. కాబట్టి వాళ్ళ ఉద్యోగాలు పోతాయని సైలెంట్ గా ఉండి పోయారు. ఇక అప్పట్లో నేను విన్నదేమంటే ఆ రోజు చీకటి పడుతుండగా దీక్ష అనే అమ్మాయిని విచారణ నిమిత్తం తీసుకెళ్ళి స్టేషన్ లో ఉంచారు.”

“దేనికి విచారణ? ఆ అమ్మాయి బ్రోతలా? దొంగా?”

“అయ్యో అదేం కాదు సార్. బాగా చదువుకుంది. మంచిపిల్ల. అయిదుగురన్నలకు ఒక్కతే చెల్లెలు. బాగా ఆస్థి ఉంది. తల్లిదండ్రులు ఆక్సిడెంట్ లో పోయారు. ఆడపిల్లకు ఆస్థి పంచకుండా తూతూ మంత్రంగా పెళ్ళి జరిపించి వదిలించేద్దామని చూసారు అన్నలు. దాంతో తనకూ సమాన వాటా కావాలంటూ ఆ అమ్మాయి కోర్టుకెళ్ళింది.” అంటూ చెప్పటం ఆపాడు వన్ నాట్ ఫోర్.

“వెరీ ఇంట్రస్టెంగ్ తర్వాత ఏమైంది?” కూతుహలంగా అడిగాడు ఎ యస్ పి ప్రకాష్.

“ఆ అన్నలు పెద్ద వెధవలు. తమ చెల్లెల్ని ఎలాగయినా కేసు విత్ డ్రాప్ చేసుకునేలా చూడమని అయ్య సామినాశ్రయించి లంచం కొట్టారు. కాబట్టి విచారణ పేరుతో దీక్షను స్టేషనుకు తెచ్చి కూచోబెట్టారు. ఎ యస్ పి రావాలంటూ అర్ధరాత్రి వరకు బలవంతంగా ఉంచేసారు. అయ్యాసామి తప్ప తాగి ఆ టైమ్ లో స్టేషన్ కెళ్ళి ఆ అమ్మాయిని రేప్ చేయాలని చూస్తే ఎలాగో తప్పించుకు పారిపోయింది. అయినా వదలకుండా బైక్ మీద తరుముకెళ్ళి ప్లే గ్రౌండ్ దగ్గర పట్టుకొని రేప్ చేయబోతే ఆ పిల్ల కేకలు విని అటుగా వచ్చిన ఆ కుర్రాడు కాపాడి తీసుకెళ్ళి హాస్టల్ దగ్గర వదిలేసాడు. అయ్య సామి మోకాలు బుల్లెట్ల దెబ్బకి నుజ్జు నుజ్జయింది. కాలు తీసేసారు.

దీక్షను విచారిస్తే తను ఏడు గంటల వరకు స్టేషన్ లో ఎదురు చూసినా ఎ యస్ పి గారు రాలేదని దాంతో హాస్టల్ కు వెళ్లి పోయానని తర్వాత ఏం జరిగిందో తనకు తెలీదంది. స్టేషన్ స్టాఫ్ కూడ అదే చెప్పారు. ఎ యస్ పి తమ స్టేషన్ కే రాలేదని ఇదెలా జరిగిందో తెలీదన్నారు. తెలుసుంటే తమ ఉద్యోగాలు పోతాయని వాళ్ళకి తెలుసు. కాబట్టి జరిగింది అది సార్. నిజా నిజాలు దేవునికి తెలియాలి” అన్నాడు వన్ నాట్ ఫోర్.

“దీక్ష ఇప్పుడెక్కడుంది?” టేబుల్ దిగుతూ అడిగాడు ఎ యస్ పి. వన్నాట్ ఫోర్ పిచ్చి నవ్వు నవ్వాడు.

“ప్రస్తుతం ఆ పిల్ల మధురైలో లేదు సార్. కోర్టు ద్వారా ఆస్థిలో తన వాటా తీసుకోగానే స్థిరాస్థులు అమ్ముకొని డబ్బు తీసుకొని ఎటో వెళ్ళి పోయిందట. పెళ్ళి కాని పిల్ల ఎక్కడుందో ఏమిటో ఆమె అన్నలకే ఎలాంటి సమాచారం లేదు. ఇంతకీ దీక్షకి ఆ ప్రకటనిచ్చిన వాడికీ ఏమిటి సార్ సంబంధం ? ఎందుకిదంతా అడిగారు?” సందేహ నివృత్తి కోసం అడిగాడు వన్ నాట్ ఫోర్.

“ఎందుకేమిటి ఫూల్ అయ్యా సామికి ఏ గతి పట్టిందో ఇక్కడ ఎవర్నడిగినా చెప్తారంటూ నన్నే బెదిరించాడు రాస్కెల్” అంటూ బయటికి నడిచాడు ఎ యస్ పి ప్రకాష్

ఆ మాటలు విని తెరిచిన నోరు మూయటం మర్చిపోయాడు వన్ నాట్ ఫోర్.

అతడి కళ్ళ ముందు ఎయస్ పి అయ్యా సామి స్థానంలో ఎ యస్ పి ప్రకాష్ ఓ కాలు పోగొట్టుకొని చంకలో కర్రతో కుంటుతూ నడుస్తున్న దృశ్యం కన్పించి గట్టిగా తల విదిలించాడు.

I I I

ఉదయం పదకొండు గంటల సమయం...

కోయంబత్తూరు నుంచి చెన్నైకు బయలు దేరిన ముని సామి బృందం చెన్నై మార్గంలో అప్పటికే వంద కిలో మీటర్ల దూరం వచ్చేసారు.

వెంకట రత్నం గారి నూలు మిల్లులో ఒక సెక్షన్ కి మేస్త్రీగా పని చేస్తున్నాడు ముని సామి.

ఆరడుగుల పొడవున కాస్త లావుగా బలంగా దృఢంగా నల్లగా చింత మొద్దులా ఉంటాడు మునిసామి. వెంకట రత్నం నాయుడు గారికి చాలా నమ్మకమైన వాడు. మనిషి కూడ మంచికి మంచి చెడుకు చెడుగావుంటాడు. కాబట్టి కార్మికుల్లో ఏ సమస్య వున్నా ముని సామిని ఆశ్రయించి పరిష్కరించుకొంటూ ఉంటారు.

ముని సామి కర్ర సాము కత్తి సాములో దిట్ట. ముని సామి గురించి తెలిసిన వాళ్ళెవరూ అతనితో గొడవ పెట్టుకోరు. ఆ పైన ముని సామి నిదానస్తుడు. న్యాయ ధర్మాన్ని అనుసరించే వాడని పేరుంది. కాబట్టి అందరూ అతనితో స్నేహంగానే ఉంటారు. అతని మాటకు కట్టుబడి ఉంటారు.

ముని సామి వెంట వస్తున్న పది మంది కూడ నూలు మిల్లులో వర్కర్లే. వాళ్ళంతా కాస్త రఫ్ గాను మొరటు గాను వుంటారు. అవసరమైతే కర్రో కత్తో పుచ్చుకొని గొడవకి దిగి పోయే మనుషులు. మును సామి మాటకి కట్టుబడి ఉండేవాళ్ళు. వ్యాన్ డ్రైవర్ కూడ అలాంటి వాడే కాబట్టి మునిసామితో కలిపి మొత్తం పన్నెండు మందున్న ఆ వ్యాన్ శర వేగంగా చెన్నై రూట్ లో పరుగు తీస్తోంది.

I I I

దీర్ఘాలోచనలో మునిగి పోయాడు విరాట్

ఇదంతా మంచికి జరిగిందో చెడుకు జరిగిందో అర్ధం గావటం లేదు. కోయం బత్తూరు నుంచి తన తండ్రి తన కోసం పంపిస్తున్న మనుషుల గురించి చింత లేదు. మునుసామి తన కన్నా పదేళ్ళు పెద్దాడయినా గురువు లాంటోడు. తను సాంప్రదాయ కర్ర సాము విద్య అతని దగ్గరే నేర్చుకున్నాడు. తనేమిటో అతనికి బాగా తెలుసు గాబట్టి తన ముందు మూర్ఖంగా ప్రవర్తించడు. కాని మధురై నుంచి వస్తున్న మహ దేవనాయకర్ మనుషుల గురించి ఆలోచించాలి. ఆ ఎ యస్ పి ప్రకాష్ సహస్ర తనదంటూ అంత పట్టుదలగా ఎందుకున్నాడో తెలీదు. వీళ్ళేనా ఇంకెవరన్నా రంగంలోకి దిగుతున్నారేమో తెలీదు. ముఖ్యంగా ఈ సహస్ర జర్నలిస్ట్ లహరి అనేది కొత్తగా తెలిసిన విషయం కాబట్టి. మధురై త్యాగరాజన్ అక్రమాస్తుల కుంభకోణాన్ని బయటకు లాగిన సహస్ర కోసం అతని మనుషులు గాలిస్తూ ఉంటారు. ఇప్పుడు తనిచ్చిన ప్రకటన చూసి అతడు సహస్ర కోసం తన మనుషుల్ని చెన్నై పంపించవచ్చు. తన వరకు సహస్ర కన్పించటంలో మంచే జరిగినా సహస్రకి ఈ ప్రకటన చెడు చేసిందనే చెప్పాలి. అనాలోచితంగా అజ్ఞాత వాసం చేస్తున్న సహస్రని తను బయట పెట్టేసాడు. బయట పెట్టినంత ఈజీ కాదు సహస్రను కాపాడటం. చాల జాగ్రత్తగా ఉండాలి.

''ఏమిటాలోచిస్తున్నావ్?'' చల్లారిపోయిన కాఫీని తిరిగి వేడి చేసి కప్పులో తెచ్చి ఎదురుగా ఉంచుతూ అడిగింది సహస్ర.

''ఏం లేదు ఉన్నట్టుండి పరిస్థితులింతగా గందరగోళమై పోయాయేమిటాని ఆలోచిస్తున్నాను.'' అంటూ కాఫీ కప్పు అందుకున్నాడు విరాట్.

‘‘మీ మమ్మీ ఫోన్ చేసే వరకు ఆ విషయం అర్థం కాలేదా? కోయంబత్తూర్ నుంచి వస్తున్న మీ మనుషులు నిన్ను లాక్కు పోతారని భయంగా వుందా?’’ జుత్తు లాగి వెనక ముడివేసుకొంటూ నవ్వింది సహస్ర.

‘‘భయం నా గురించి కాదు. నీ గురించి’’ అన్నాడు.

‘‘భయం దేనికి? నిండా మునిగిన వాడికి చలేమిటన్నట్టు ఆ త్యాగరాజన్ అంతు చూడకుండా వదలను. ఒకవేళ ఈ లోపలే నేను పోతే ఒ కె. ప్రజా ప్రయోజనాల కోసం ప్రాణాలు బలి పెట్టిన తృప్తి ఉంటుంది’’ అంది పొడిగా.

ఆమె అందాల శరీరం నుంచి వీస్తున్న జాస్మిన్ సువాసన విరాట్ ను గిలిగింతలు పెడుతోంది.

తల తిప్పి ఆమెను చూసాడు.

‘‘అలాంటి తృప్తిని నేనంగీకరించను అన్నాడు’’ స్థిరంగా

‘‘పోటీ అంటూ వచ్చాక గెలవటం ముఖ్యం. ఓటమి కాదు. గెలవటంలో ప్రాణం పోయినా మనతో పది మందిని తీసుకు పోతూ వీరమరణం చెందాలి గాని చావుకు భయపడుతూ చావకూడదు’’. అంటూ కాళీ కాఫీకప్ టీపాయి మీద ఉంచాడు.

విరాట్ భుజం మీద తలానుకుంది సహస్ర

అతడి చేతిని తన చేతిలోకి తీసుకుంది

పొడవాటి అందమైన సహస్ర చేతి వేళ్ళు తన చేతి వేళ్ళ సందుల్లోకి జొరబడి బిగించి పట్టు కొంటుంటే ఇక ఈ చేతిని ఎన్నటికీ వదలవుగా? అని అడుగుతున్నట్టుంది. విరాట్ మాటలు చేతలు సహస్రలో కొత్త ఆశలు నింపుతున్నాయి. నూతన ధైర్యోత్సాహాలు ఏర్పడుతున్నాయి. నేను ఒంటరి దాన్ని కాను అనే ఒక భరోసా మనసులో ఏర్పడుతోంది. ప్రశాంతంగా కళ్ళు మూసుకుంది.

మిగతా విషయాలు ఎలా వున్నా జీవితంలో తిరిగి చూడగలనో లేనో అనుకున్న సహస్ర ఒక్క పేపరు ప్రకటనతో తన పక్కన వాలిపోయింది. అరవిచ్చిన మందారంలా వున్న సహస్ర ముఖంలోకి ముగ్ధుడై అలా చూస్తూండి పోయాడు.

‘‘విరాట్’’ కళ్ళు తెరవకుండానే పిలిచింది.

‘‘చెప్పు’’ అన్నాడు.

‘‘నిజంగానే నన్ను ప్రేమిస్తున్నావా?’’

‘‘ఇంకా డౌటేనా? ప్రేమిస్తున్నాను గాబట్టే నీ పక్కనున్నాను. నాకు తెలియాల్సింది నీ మనసు’’

కళ్ళు తెరిచింది సహస్ర.

‘‘నా మనసు తెలియాలంటే నీ మనసులో నా మీద ఎంత ప్రేమ ఉందో తెలియాలి’’ అంది

‘‘ఎంతంటే?’’

“ఎంతో చెప్పు”

“చెప్పాలంటే నీ అంత.........నీ తర్వాతే అంతా అన్నంత”

“కాని నేనెంత ప్రేమిస్తున్నానో తెలుసా?”

“ఎంత?”

“నేనంటూ ఏమీ లేదు. సర్వం నీవే అన్నంత”

“నేన్నమ్మను”

“కాని ఇది నిజం”

“ఎలా?”

“ఆ రోజు రైల్లో తొలి చూపులోనే నిన్ను వలచిన మాట నిజం. కాని అది సమయం సందర్భం కాదు గాబట్టి పట్టించుకోకుండా వెళ్ళి పోయాను. తర్వాత నా కోసం నువ్వు చేస్తున్న ప్రయత్నాలు తెలిసి సంతోషించాను. కాని నేనున్న పరిస్థితులకి భయపడ్డాను నా సమస్యల్లోకి నిన్ను లాగటం ఇష్టం లేక మౌనంగా ఉండి పోయాను.”

“మౌనంగా ఉండాల్సిన అవసరం లేదులే. ఇక నుంచి నీ సమస్యలు నావి.”

“ఒక వేళ నేను చచ్చిపోతే ఏం జేస్తావ్?”

“మృత్యువైనా నన్ను దాటే నీ వద్దకు రావాలి”

“అయితే నాతో రా”. అంటూ లేచింది సహస్ర.

“ఎక్కడికి? అడిగాడు.

“హేపీగా ఉండటానికి”

“స్వర్గానికి తీసుకెళ్తావా”

“ఆశ చూడు. అక్కడికింకా పర్మిషన్ లేదులే”

“అయితే నేను రాను. ఇక్కడే బాగుంది”

“నాతో వస్తావా లేదా?”

చేయి పట్టి లాగింది. ముసిముసిగా నవ్వుతూ లేచి సహస్రననుసరించాడు విరాట్. ఇద్దరూ సహస్ర బెడ్రూమ్ లో ప్రవేశించారు. అక్కడ చందూ పక్క గదిలో తనుంటున్నట్టు ఇక్కడ దీక్ష పక్క గదిలో సహస్ర ఉంటోంది. సేమ్ టు సేమ్ విశాలమైనగది. ఆటాచ్డ్ బాత్రూం. ఎటు చూసినా ఖరీదైన ఫర్నిచర్. ఎదురుగా సహస్ర తల్లి దండ్రులతో దిగిన క్యాబినెట్ సైజు ఫోటో ఫ్రేం గోడకు

వేలాడుతోంది. గుబురు మీసాలతో చాలా గంభీరంగా ఉన్నాడు తండ్రి మహాదేవ నాయకర్. తల్లి ముగాంబిగై సాంప్రదాయంగా హుందాగా ఉంది. సహస్రలో తల్లి కన్నా తండ్రి పోలికలే ఎక్కువ కన్పిస్తున్నాయి.

“ఇదే నా బెడ్రూం. నీకు చూపించటానికి పిలిచాను” అంది

“చూసానుగా. బాగుంది. ఇక వెళ్తాను” వెను తిరిగాడు

“ఆగు నువ్వు చూడాల్సింది ఇంకోటుంది”

“ఏంటది”

“ఆ టేబుల్      సొరుగు లాగి చూడు”

చూసాడు

లోన విరాట్ ఫోటో వుంది

తన ఫోటో చూసి ఒకింత ఆశ్చర్య పోయాడు విరాట్. తనంటే ముందుగా ప్రేమించాడు గాబట్టి తన వద్ద సహస్ర ఫోటోలున్నాయి. సహస్ర బెడ్రూంలోకి తన ఫోటో ఎలా వచ్చింది?

“ఎలా వచ్చిందని ఆశ్చర్య పోతున్నావా?” ముసి ముసిగా నవ్వుతూ అడిగింది

“అదేగా...ఎలా వచ్చింది?” అడిగాడు

“నీ ఫ్రెండు చందు ఆ రోజు ఫోటో తీసినట్టే మా దీక్ష నీ ఫోటో తీసింది. అదే యిది. ఈ ఫోటో పగలు మాత్రమే సొరుగులో ఉంటుంది. రాత్రిళ్ళు నా గుండెల మీద ఉంటుంది. నా ప్రేమను నమ్మనన్నావ్ గా. అందుకే చూపించాను” అంటూ పక్కనకొచ్చింది.



‘‘అయినా సరే నేన్నమ్మను’’ అన్నాడు బింకంగా

‘‘ఎందుకు నమ్మవు? నీ గదిలో నా ఫోటోలు చూసి నీ ప్రేమను నేను నమ్మాను. నా గదిలో నీ ఫోటో చూస్తే నమ్మవా? నాలో ప్రేమ లేదనా? ప్రేమంటే నాకు తెలిదా?’’ నిలదీసింది సహస్ర.

‘‘రెండూ కాదు’’ అన్నాడు విరాట్

‘‘మరేమిటి?.’’

‘‘నీ ప్రేమని ఎలా నమ్మమంటావ్? నా ముద్దు బాకీ అలాగే ఉండి పోయిందిగా’’ అంటూ భుజాల మీద చేతులేసాడు. అంతే ఒక్కసారిగా నవ్వేసింది సహస్ర.

‘‘నీ బాకీయే కదా చెల్లు వేస్తున్నాను. తీసుకో’’ అంటూ కౌగిట ఒదిగి పోయింది. తొలి కౌగిలి తొలి ముద్దుల పరవశంలో చాలాసేపు అలాగే ఉండి పోయారిద్దరూ.

I I I

సహస్రను వెనక్కు తీసుకెళ్ళే నిమిత్తం

మహ దేవ నాయకర్ ఆదేశం మేరకు

మధురై నుంచి బయలు దేరిన కదిరేశన్ బృందం వాళ్ళంతా ప్రయాణిస్తున్న జీపు శరవేగంతో చెన్నై రోడ్ మార్గంలో పరుగులు తీస్తోంది.కదిరేషన్ ముఖంలో ఎప్పుడూ కందులు వేగుతున్నట్టు సీరియస్గా ఉంటాడు. బహుశ అతడు నవ్వగా చూసిన వాళ్ళు ఇంత వరకూ ఎవరూ లేరు.

ఒక విశ్వాసం గల కుక్కలా యజమాని చెప్పింది చేసుకు పోవటం అతని అలవాటు. అనవసరమైన గొడవలకి పోడు. గొడవంటూ వస్తే వదలడు. అతడితో పని ముక్కు సూటి వ్యవహారంలా ఉంటుంది. లౌక్యం బొత్తిగా తెలీదు. కాస్త మూర్ఖత్వం కూడ ఉంది. ఇంత వరకు అప్పగించిన పనిలో అపజయమంటూ లేదు. అందుకే మహ దేవ నాయకర్ కదిరేషన్ నాయకత్వంలో తన మనుషుల్ని చెన్నై పంపించాడు.ఇక రెండో వాడు వడివేలు

వీడు కాస్త పొట్టిగా లావుగా వుంటాడు. అయిదడుగుల అయిదంగుళాల ఎత్తుమించడు. కోరమీసం, జులపాల జుత్తు, మెళ్ళో గుప్పెడు లావుండే తాయెత్తు బిళ్ళతో నుదుట సింధూరం బొట్టు ధరించి విచిత్రంగా కన్పిస్తాడు.

మనస్తత్వాల్లో వీళ్ళిద్దరూ తూర్పు పడమర లాంటి వాళ్ళు. కదిరేషన్ ఎంత సీరియస్గా ఉంటాడో అంత కంత బోళా శంకరుడిలా ఉంటాడు వడివేలు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తుంటాడు. ఆ పైన బాగా లౌక్యం తెలిసిన వాడు. నక్క జిత్తులన్నీ విడి దగ్గరున్నాయి. కదిరేషన్ ఏదైనా పొరబాటు చేసినా వీడు సరి చేస్తుంటాడన్న నమ్మకంతో మహ దేవ నాయర్ కదిరేషన్ ఏ పని మీద పంపించినా వెంట వడివేలును పంపిస్తుంటాడు.

ఇక ఈ కదిరేషన్ బృందానికి సంబంధించినంత వరకూ చెన్నై వెళ్ళేది శత్రువుల జాడ తెలుసుకోడానికి. దాడి చేయటానికి కాదు. తమ యజమాని వ్యాపార సామ్రాజ్యానికి యువరాణి లాంటి లక్ష్మీ సహస్రను చెన్నైలో గాలించి పట్టుకొని మధురై తీసుకెళ్ళటం కోసం వెళ్తున్నారు.మధురై నుండి సహస్ర కోసం చెన్నైకు బయలు దేరిన బ్యాచ్ మరొకటుంది. అది త్యాగరాజన్ ఆర్డర్తో అతడి కుడి భుజం ఎట్టయప్ప నియమించిన క్రిమినల్ బ్యాచ్.

వీళ్ళు డ్రయివరుతో కలిపి

మొత్తం పది మంది.

వీళ్ళందరిదీ నేర చరిత్రే...

ప్రతి ఒక్కడు క్రిమినల్ కేసుల్లో అనేక సార్లు జైలు కెళ్ళొచ్చిన వాడే. ఒకరిద్దరు ప్రస్తుతం బెయిలు మీద బయట వున్న వాళ్ళు వున్నారు.వీళ్ళకి మాటలు తక్కువ చేతలెక్కువ.

చూడ్డానికి చాలా నెమ్మదస్తుల్లా అమాయంగా కన్పిస్తారు. కాని పథకం ప్రకారం ప్రత్యర్థిని స్పాట్లో ఫినిష్ చేసి కామ్గా వెళ్ళి పోతారు.ఈ హంతక ముఠా నాయకుడి పేరు అళగిరి. మనిషి మహా ఉంటే అయిదడుగుల ఎత్తు మించడు. పొట్టిగా కాస్త లావుగా కన్పిస్తాడు. చింపిరి జుత్తు మాసిన గడ్డం సాదా లుంగీ షర్టు భుజాన ఓ గుడ్డ సంచితో చూడ్డానికి బికారిలా కన్పిస్తుంటాడు. చాలా ప్రశాంతంగా అమాయకంగా నవ్వుతుంటాడు. తెలిని వాళ్ళు ఇంత అమాయకుడు లోకంలో ఉంటాడా అనుకుంటారు.

బాగా చదువుకొని ఉద్యోగం రాక దారి తప్పి క్రిమినల్గా మారిన వాడు అళగిరి. అలాగని అతనేమీ క్రైమ్ చేయడు. అంతా అతడి

మనుషుల చూసుకుంటారు. ఎట్టయప్పన్ ఇచ్చినపథకాన్ని తు.చ. తప్పకుండా తన మనుషులతో అమలు చేయించటమే అళగిరి పని.అళగిరి బృందం ప్రయాణం చేస్తోన్న వేన్లోని రహస్య అరల్లో పొడవాటి కత్తులు ఇనుపరాడ్లు, రెండు రివాల్వర్లు, ఒక షాట్ గన్ కూడ ఉన్నాయి. అళిగిరి బృందంలోఇపుడు విక్కీ డైమండ్ అనే యిద్దరు బెస్ట్ షూటర్స్కూడ వున్నారు. వీళ్ళు రివాల్వర్ గాని షాట్ గన్ గాని గురి చూస్తే తప్పే ప్రసక్తే లేదు.

ఎట్టి పరిస్థితి లోనూ సహస్రలో డైరక్ట్ ఫైటింగ్కు పోవద్దనేది త్యాగరాజన్ స్ట్రిక్ట్ ఆర్డరు. వీళ్ళు బయలు దేరే ముందు ఒకటికి పది సార్లు హెచ్చరించి పంపించాడు. ఎంతో అవసరమైతే తప్ప కత్తులు ఇనుపరాడ్లు తీయొద్దు సహస్ర (లహరి) కనబడగానే తొందరపడి ముందుకు పోవద్దు. ఫాలో చేసే ముందు ఆమె వుంటున్న ఇల్లెక్కడ తెలుసుకోండి. వీలు చూసి ఆమె ఇంట్లోంచి బయటికొస్తుండగా కాల్పులు జరపండి. స్పాట్లో ప్రాణం పోవాలి. పని ముగిసిన గంటలోపే మీరంతా చెన్నై పొలిమేరలు దాటి ఇవతలికి వచ్చేయాలి. అంటూ చిలక్కి చెప్పినట్టు చెప్పి మరీ సాగనంపాడు కాబట్టి.

ఈ హంతక ముఠా

లహరిని అంతం చేయటం కోసమే

చెన్నైకు బయలుదేరింది

I I I

తెల్లవారే సరికి నీకు మర్యాద నేర్పిస్తానంటూ సవాల్ విసిరిన విరాట్ వెంటనే మధురై లోని తన మిత్రుడు ధర్మకు ఫోన్ చేసివిషయం చెప్పాడు. ఇటు ఎ యస్ పి ప్రకాశ్ తన పర్సనల్ అసిస్టెంట్ వన్ నాట్ ఫోర్ ని పిలిచి విచారించినా అవతలి వ్యక్తి ఎవరనేది అంతు చిక్క లేదు.విరాట్కున్న బెస్ట్ ఫ్రెండ్స్లో ఈ ధర్మ ఒకడు. ఇతనితో బాటు అక్కడ మిత్ర వర్గం చాలానే ఉంది. అంతా ముప్పై లోపు వయసు యువకులు. గతంలో రెండేళ్ళ పాటు విరాట్ మధురైలోఉండి కరాటే నేర్చుకున్నప్పుడు ఏర్పడిన మిత్ర బృందం అది. ఇరవై మందికి పైగా ఉంటారు. ప్రస్తుతం అంతా వివిధ వృత్తుల్లో స్థిర పడినా స్నేహం అలానే కొనసాగుతోంది. ఎవరికే సమస్య వచ్చినా అంతా షేర్ చేసుకుంటారు.అటువంటి ధర్మ `

విరాట్ ఫోన్లో చెప్పిన విషయం వినగానే `

వెంటనే ఫోన్లు కొట్టి పిలిచి`

మిత్ర వర్గంతో సమావేశమయ్యాడు.

తగిన కారణం లేందే విరాట్ చర్య తీసుకోడని తెలుసు. ఎ యస్ పి ప్రకాశ్ దుశ్చర్యలు లంచగొండితనం గురించి చాలా వింటూనే వస్తున్నారు. అ పైన జగన్మోహన్ తొత్తు అనీ తెలుసు. కాబట్టి ప్రకాశ్ను దెబ్బ కొట్టి బుద్ధి చెప్పాలని నిర్ణయం తీసుకున్నారంతా. పిమ్మట రెండు గంటల్లోనే ఇద్దరు యువకులు వెళ్ళి ఎ యస్ పి దినచర్యలకు సంబంధించి ఖచ్చితమైన సమాచారంతో తిరిగొచ్చారు.ఎ యస్ పి ప్రకాష్ ఉంటున్నది మధురై వన్ టౌన్ ఏరియాలో. అతనింకా అవివాహితుడు గాబట్టి ఒంటరిగానే ఉంటున్నాడు. వంట ఇల్లు వాకిలి శుభ్రం చేసే వాళ్ళు , ఇద్దరు నమ్మకమైన నౌకర్లు ఇంటిని కనిపెట్టుకొని ఉంటారు.

ఎ ఎస్ పి ప్రకాష్కి ఒక గర్ల్ ఫ్రెండుంది. ఆమె పేరు అముదవల్లి. రాత్రి సుమారు ఎనిమిది తొమ్మిది గంటల మధ్య ప్రాంతంలో అముదవల్లి ఇంటికొస్తాడు. అంతటితో తమ డ్యూటీ ముగించుకొని ఎస్కార్టా జీప్ లో వచ్చిన పోలీసులు వెనక్కి వెళ్ళి పోతారు. రాత్రికి ప్రకాష్ అముదవల్లి చెంతనే.

అయితే రాత్రంతా అక్కడ ఉండే అలవాటు లేదు. సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటలకి బయలుదేరి దారిలో బీట్ కానిస్టేబుల్స్ని పలకరిస్తు ఇంటికెళ్ళిపోతాడు. తిరిగి మరునాడు రాత్రే అముదవల్లి యింటికొచ్చేది.

ఈ పక్కా ఇన్ఫర్మేషన్ ఆధారంగా రాత్రికి పథకం సిద్ధం చేసాడు ధర్మ. దాని ప్రకారం రాత్రి ఎనిమిది గంటలకి ముందుగా ఇద్దరు యువకులు వెళ్ళి అముదవల్లి ఇంటి సమీపంలో మాటు వేసారు. రాత్రి సరిగ్గా తొమ్మిది పది నిముషాలకు వాళ్ళ నుంచి ధర్మాకు ఫోన్ కాల్ వచ్చింది. అంత క్రితమే ప్రకాష్ వచ్చాడని. ఎస్కార్టా వచ్చిన పోలీసులు వెనక్కి వెళ్ళి పోయిన విషయం కూడా చెప్పారు.

'ఒకే ఇక మీరక్కడ్నుంచి వచ్చేయండి. మనం పదిన్నరకి ఇక్కడి నుండి స్పాట్కి బయలుదేరుతున్నాం'' అంటూ ఆ యిద్దర్ని వెనక్కి పిలిచాడు ధర్మ.

ఇటాంటి పనులకి స్పాట్ నిర్ణయం చాలా కీలకం. ప్రత్యర్థి తమకి ఒంటరిగా చిక్కేలా` అన్ని విధాల అనుకూలమైన జన సమర్థం

లేని ప్రాంతాన్ని చూసి` తగిన స్పాట్గా ఎంచుకుంటారు. స్పాట్ ఎంపిక జరిగాక ఒరిజినల్ నేరస్తులయితే రెక్కీ నిర్వహించి ఏర్పాట్లు సరి చూసుకుంటారు. అయితే ఇక్కడ రెక్కీ నిర్వహించాల్సిన అవసరం లేదు. ఇవన్నీ ఆలోచించాకే ధర్మ పార్క్ ఏరియాని ఎంపిక చేసాడు.

అముదల్లి ఇంటి నుంచి ఎ యస్ పి ప్రకాష్ తన ఇంటికెళ్ళే దారిలో అర కిలో మీటరు దూరంలోనే ఉందా పార్కు. విశాలమైన రోడ్ కి ఎడం పక్కగా పార్కు గోడ, కుడి పక్కగా ఏదో పెద్ద గోడౌన్ కి చెందిన ఎత్తయిన ప్రహరీ గోడ ఉండగా రోడ్ కి అటు యిటు శాఖోపశాఖలుగా విస్తరించిన చెట్ల మూలంగా పగలే అటు వెళ్తుంటే ఏదో గుహలోకి పోతున్నట్టుంటుంది.

వీధి లైట్ల కాంతి కూడా సరిగా ప్రసరించక అక్కడికొచ్చే సరికి రోడ్డంతా చీకటి గాను నిర్మానుష్యం గాను ఉంటుంది. అరిచినా కూడా అటు చివర ఇటు చివర ఇళ్ళ వరకూ వినబడదు. అటువంటి పార్కు ప్రాంతానికి రాత్రి పదిన్నర గంటలకు చేరుకుంది ధర్మా స్నేహ బృందం.తమ బైక్లు కనబడకుండా పార్క్ గోడ వెంట చెట్ల వెనక ఉంచి వచ్చారు. ఎ యస్ పి ప్రకాష్ బైక్ ఎగువన మలుపు తిరగ్గానే తమను హెచ్చరించటం కోసం ఇద్దర్ని అక్కడ వదిలి వచ్చాడు ధర్మ. అంతా మంకీ కేప్ లతో ముఖాలు తెలికుండా జాగ్రత్త పడ్డారు. చేతుల్లో దృఢమైన క్రికెట్ బేట్లున్నాయి. క్రమంగా సమయం అర్ధరాత్రికి దగ్గర పడిరది ఈ లోపల`

ఎ యస్ పి ప్రకాష్కి పగలంతా ఫోన్లో విరాట్ మాటలే చెవిలోమరు మోగుతూ వచ్చాయి.

ఫోన్లో తనకు సవాల్ విసిరిన వాడెవడో అసలు వాడెలా ఉంటాడో కూడా తెలీదు. ప్రత్యర్థి ఎవడో తెలిస్తే పరిస్థితి వేరుగా ఉంటుంది. ఇక్కడా పరిస్థితి లేదు. ఆ పైన మధురైలోవాడి తాలూకు మనుషులెవరన్నా ఉన్నారా అంటే అదీ తెలీదు. ఇక తనపైన దాడి చేయగల దమ్ము ఎవడికుంది? మర్యాద నేర్పిస్తాట్ట మర్యాద. ఏ విధమైన మర్యాద అది? నలుగురు పెద్ద మనుషుల్ని పంపించి బుద్ధి మతి చెప్పిస్తాడా లేక కిరాయి మనుషులతో కొట్టిస్తాడా? సాయంకాలమవుతున్నా అటువంటి సూచనలేమీ లేక పోవటంతో ఆ రెండూ వట్టి మాటలే అన్పించింది. వాడి మాటలు వట్టి బెదిరింపులు తప్ప వేరేమీ కాదనే నిర్ణయానికొచ్చేసాడు ప్రకాష్.

దాంతో రాత్రికి అముదవల్లి ఇంటికెళ్ళే సమయానికి ఆ విషయమే మర్చి పోయాడు. మందు కొట్టి చక్కగా భోజనం చేసి అముదవల్లితో అర్ధరాత్రి వరకు గడిపాడు. బయలుదేరుతుంటే ఆముదవల్లి హెచ్చరించింది. ‘‘ఇవాళ కాస్త మందు ఎక్కువైనట్టుంది. ఇక్కడే ఉండిపోయి ఉదయం వెళ్ళొచ్చుగా’’ అంది.

‘‘నోనో... ఎక్కువేం కాలేదు. స్టడీగానే ఉన్నాను. జాగ్రత్తగా తలుపేసుకో’’ అంటూ అముదవల్లి చెక్కిలి మీద చిటికే వేసి బైక్ స్టార్ట్ చేసాడు. అలా అతడు బయలు దేరేసరికి అర్ధరాత్రి పన్నెండు గంటలు.

పది నిమిషాల్లోనే బుల్లెట్ బైక్ పార్క్ రోడ్ లోకి ఎంటరయింది. పార్క్కు సమీపిస్తుండగా హెడ్లైట్ కాంతిలోఒక ఘోర దృశ్యం ఎ యస్ పి ప్రకాష్ కంటబడిరది. చూడగానే ఉలికి పాటు చెందాడు. అటే గమనిస్తు బైక్ను స్లో చేసాడు.

సరిగ్గా పార్కు గేటు ఎదురుగా`

రోడ్ కి అడ్డంగా పడున్నాడో యువకుడు.

అతడి పక్కన నెత్తురు మడుగు కట్టింది. ముఖానికి మంకీ కేప్ ఉన్నందున అతడెవరో తెలీటం లేదు. ఎవరన్నా వాడ్ని కొట్టి చంపి పడేసారా లేక ఏ లారీనో తొక్కి చంపిందా అర్థం కాలేదు. అంత నెత్తురు పోయిందంటే బ్రతికుండే ఛాన్సేలేదు. సహజంగానే పోలీస్ అధికారి గాబట్టి ఎం జరింగిందో తెలుసుకోవాలనే కుతూహలం కొద్ది డెడ్ బాడీకి అయిదు గజాల ఇవతలగా బైక్ ఆపాడు. హెడ్ లైటు ఆన్లోనే ఉంచి స్టాండ్ వేసాడు. ఏదన్నా క్లూ దొరుకుతుందని శవం చుట్టూ ఒక రౌండ్ కొట్టాడు. ఎలాంటి ఆధారం పక్కన కన్పించ లేదు. నెత్తురింకా గడ్డ కట్టని కారణంగా సంఘటన జరిగి కూడా ఎక్కువ సేపు కాలేదనిపించింది. ఎవరో వాడ్ని కొట్టి లేదా కత్తులతో దాడి చేసి హత మార్చి వుండాలి.



ఆలోచిస్తూ సిగరెట్ దమ్ములాగి అవతల పడేసాడు. శవంతల దగ్గర గొంతు కూచొని ముఖం చూసే ఉద్దేశంతో మంకీ కేప్ ని తొలగించ బోయాడు సరిగ్గా అప్పుడు `సడెన్ గా కదిలింది శవం.

నిజానికది శవం కాదు. శవంలా అంతవరకూ నటించిన యువకుడు. ఎ యస్ పి ప్రకాష్ అదిరి పడి లేచే లోపు ఆ యువకుడు స్ప్రింగ్ లా లేస్తూ ప్రకాష్ నడుం బెల్టు నుండి సర్వీస్ రివాల్వర్ ని లాగేసుకున్నాడు. దాన్ని ప్రకాష్ కి గురి చేస్తూ పెద్దగా నవ్వాడు.

వూహించని ఈ సంఘటనకి షాక్ తిన్నాడు ప్రకాష్.

“రేయ్ ఎవడ్రా నువ్వు? పిచ్చోడివా, మతి లేని వెధవా. అది బొమ్మ తుపాకి కాదు. సర్వీస్ రివాల్వర్. దాన్నిలా ఇచ్చెయ్” అనరిచాడు.

“ఇవ్వనుగా... ఇది నాది” అన్నాడు వాడు.“మర్యాదగా ఇస్తావా లేదా?” రెండడుగులు ముందుకేసాడు ప్రకాష్.

“నీకు మర్యాదేమిట్రా? అసలు మర్యాదంటే ఏంటో నీకు తెలుసా? నేర్పిస్తా చూడు. రండ్రోయ్ రండి. దొంగ దొరికి పోయాడు. రండి రండి” అనరుస్తూ రివాల్వర్ ని ప్రయోగించాడా యువకుడు.కాళ్ళ దగ్గర బుల్లెట్లు దుమ్ము రేపుతుంటే ఓ మైగాడ్ అంటూ భయంతో ఎగిరెగిరిగంతులేసాడు ఎ యస్ పి ప్రకాష్. తాగిన మత్తు మోకాళ్ళలోకి దిగి పోగా ఫోన్లో తనకు మర్యాద నేర్పిస్తానన్న హెచ్చరిక తిరిగి చెవుల్లో మారు మోగింది. వీళ్ళెవరో పథకం ప్రకారం తనను అటాక్ చేయటం లేదు గదా అనుమానంతో చుట్టూ చూసాడు.

అప్పటికే ధర్మ బృందం నిశ్శబ్దంగా చుట్టు ముట్టేసింది. ఒక్కొక్కరే బైక్ వెలుగులోకి ముందుకొస్తుంటే ఎ యస్ పి కి కళ్ళు తిరిగినంత పనైంది. ఒకరు కాదు యిద్దరు కాదు ఇరవై మందికి పైగా వున్నారు. ముఖాలు తెలీకుండా అంతా మంకీ కేప్ లు ధరించారు. చేతుల్లో క్రికెట్ బేట్లు “ఎవరు? ఎవర్రా మీరంతా నేనెవరో తెలిసే వచ్చారా? మీ అందర్నీ లోన పడేసి కాళ్ళు చేతులు పనికి రాకుండా చేయిస్తా” కోపంతో పెద్దగా అరిచాడు.

అతడి అరుపులు తమకు వినబడనట్టే నిశ్శబ్దంగా మరో మూడడుగులు ముందుకొచ్చారంతా. ఒక్కడూ ముఖం తెలీటం లేదు. గోడ కట్టినట్టు రౌండప్ చేసారు. అర్ధరాత్రి ఆ దారిన ఎవరూ వచ్చే అవకాశం కూడా లేదు. ఆ నిశ్శబ్దం మరింత భయనకంగా ఉంది. మొదటి సారిగా వెన్ను జలదరించింది ఎ యస్ పి ప్రకాష్ కి.

“ఎవడ్రా... మీకేం కావాలి?’ మరోసారి అరిచాడు.

“మర్యాద... మర్యాద కావాలి ఇస్తావా?” మరి కాస్త ముందు కొస్తు గొంతు మార్చి అడిగాడు ధర్మ.

“అంటే... ఆ ఫోన్లో మాటాడిన వాడి తాలూకా మీరంతా? ”

“అర్థమైందిగా? జగన్మోహన్ పెంపుడు కుక్కగా మారి వూరి జనాన్ని కరుస్తావ్ రా పిచ్చి కుక్క. నీకు పొగరెక్కువై మర్యాద మర్చి పోయి మా వాడితో పెట్టుకున్నావ్. మా మర్యాద ఎలా వుంటుందో చూడరా!” అంటూ క్రికెట్ బేట్ తో లాగి పెట్టి ముఖం మీద కొట్టాడు ధర్మ .మొదటి దెబ్బతో చేతులు అడ్డం పెట్టి తప్పించుకున్నాడు కాని చేతులు విరిగినంత బాధతో కెవ్వు మన్నాడు. ఆ తర్వాత అరవటానికో ఆలోచించడానికో అవకాశం యివ్వలేదు ధర్మ బృందం. కంది కంపను దులిపినట్టు అయిదు నిమిషాలు దులిపి వదిలేసారు. నేల మీద పడేసి పొర్లుగింతలు పెట్టించారు. తల చిట్లింది. ఒళ్ళంతా హూనమై తెలిలి తప్పిపడి పోయాడు.

అంతలో ఎగువ నుండి బీట్ కానిస్టేబుల్స్ విజిల్స్ విన్పించాయి అంతే`

ఎంత నిశ్శబ్దంగా వచ్చారో అంతే నిశ్శబ్దంగా చీకట్లోకి తప్పుకున్నారంతా. శవంలా నటించిన యువకుడు రివాల్వర్ని వేలి ముద్రలు లేకుండా తుడిచి ప్రకాష్ పక్కన పడేసి వెళ్ళి పోయాడు.

ఎగువన దూరంలోఉండగానే బీటు కానిస్టేబుళ్ళు యిద్దరూ పార్క్ గేటు దగ్గర మోటార్ బైక్ లైట్ కాంతిని గమనించారు. అక్కడేదో జరిగిందనే సందేహంతో సైకిళ్ళను వేగంగా తొక్కుకుంటూ అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో అంత దూరంలో పార్క్ గోడ అవతల నుంచి రివ్వు రివ్వున కొన్ని బైకులు రోడ్ మీదకు దూసుకొచ్చి ఎగువకు దూసుకు పోవటం కన్పించింది.

అక్కడ రోడ్డు మీద పడున్నది ఎవరో కాదు తమ ఎ యస్ పి ప్రకాష్. ఈ టైమ్ కి దారిలో తమను పలకరించి వెళ్ళేవాడు ఇంకా రలేదేమిటా అనుకుంటున్నారు. ఇంతలో ఈ ఘోరం జరిగి పోయింది. ఎవరో దారి కాచి తాట తీసి పారి పోయారు.

వెంటనే పోలీసులు అంబులెన్స్ కి ఫోన్ చేసారు. అలాగే తమ పై అధికారుల కి ఫోన్లు కొట్టి పరిస్థితి వివరించారు. ఈ లోపల ధర్మ బృందం ఎగువకు వెళ్ళగానే గుంపుగా పోకుండా తలో రూట్ కి చీలి పోయి తమ దారిన యిళ్ళకు వెళ్ళి పోయారు. వాళ్ళను కనిపెట్టడం ఇక ఎవరివల్లా కాదు.

రాత్రికి రాత్రి అస్పత్రిలో చేర్పించిన ఎ యస్ పి ప్రకాష్ కి ఉదయం అరు గంటలకి గాని స్పృహ రాలేదు. తలకు రెండు కుట్లు పడ్డాయి. ఒంటి మీద బాండేజ్ లు. అదృష్టం ఏమంటే ఎముకలు ఒక్కటీ విరక్క పోవటం.

ఉదయం సరిగ్గా ఎనిమిదిన్నర గంటలకి ఎ యస్ పి ప్రకాష్ ఫోన్ రింగయింది. ఆ సమయంలో కానిస్టేబుల్ వన్నాట్ ఫోర్ మరో యిద్దరు పోలీసులు మాత్రమే అక్కడున్నారు. అంత క్రితమే కొందరు అధికారులు వచ్చి పరామార్శించి వెళ్ళారు. త్రిటౌన్ పోలీస్ స్టేషన్ లోకేసు బుక్ చేసి దుండగుల ఆచూకీ కోసం తమ ప్రయత్నాలు ఆరంభించారు అక్కడి పోలీసులు.

''అరే... ఆ ఫోన్ ఎవరిదో చూడరా'' అన్నాడు. ప్రకాష్ వన్నాట్ ఫోర్ తో.''ఎవరిదో ఏంటి సార్. ఈ ఫోన్ మీదేగా'' అన్నాడు వన్నాట్ ఫోర్.''ఫోన్ చేసింది ఎవరో చూడరా మూర్ఖా'' విసుక్కున్నాడు ఎ యస్ పి. బెడ్ మీద కట్టెలా పడున్నాడు. కాస్త కదిలినా ఒళ్ళంతా భరించరాని నొప్పి.''హలో.. ఎవరండీ? ఎవరు కావాలి?'' ఫోన్ లో అరుస్తున్నాడు వన్నాట్ ఫోర్.

''నేనెవరైతే నీకెందుకురా? ఫోన్ ప్రకాష్ గాడికివ్వు'' అటునుంచి విరాట్ గొంతు గరగరలాడిరది.

''ఎవర్రా?'' అంత బాధ లోనూ గొంతు పెకిల్చిఅడిగాడు ఎ యస్ పి.

''పేరు చెప్పటం లేదు సార్. ఫోన్ మీకిమ్మంటున్నాడు'' ఫోన్ యివ్వబోయాడు వన్ నాట్ ఫోర్ వెంటనే`

''వద్దు వద్దు'' అన్నాడు కంగారుగా ప్రకాష్.

''వాడే... వాడే అయి వుంటాడు ఏదోటి మాటాడి లేట్ చెయ్'' అన్నాడు.

''ఎవడు సార్ వీడు? ఇప్పుడే నన్ను చెంచా అన్నాడు. ఇంకా మాటాడితే కూజా అనేట్టున్నాడు. మీరే మాట్లాడండి'' అంటూ ఫోన్ చెవి దగ్గరుంచాడు వన్ నాట్ ఫోర్. ఇంక తప్పదని`

''హలో!'' అన్నాడు నీరసంగా ఎ యస్ పి ప్రకాష్.

''సార్... ఎ యస్ పి ప్రకాష్ గారేనా?'' అటు నుండి ప్రశ్న.

“అవున్రా ఇంతకీ ఎవడ్రా నువ్వు?” అరిచాడు విసుగ్గా.వెంటనే అటు నుండి నవ్వు విన్పించింది.“ఏరా కరిచే కుక్కకి నీకు తేడా లేదనుకుంటానే. మర్యాదగా నేను సార్ అంటే ఎవడ్రా నువ్వు అంటున్నావ్. మూర్ఖుడా. నీకింకా మావాళ్ళు పూర్తిగా మర్యాద నేర్పినట్టు లేదు. ఇంకో కోటా ఇప్పించమంటావా?” అటు నుంచి అడిగాడు విరాట్.

“రేయ్ నవ్వులాటగా ఉందా నీకు? నా గురించి నీకు తెలీదు. నిన్ను వదను నీ మనుషుల్ని వదలను...” కటువుగా హెచ్చరించాడు.“వదలక. అదే మాట మీద వుండు. అప్పుడేగా నేనూ నిన్ను వదను. నా చేతిలోనే ఛస్తావ్. అయినా నేను ముందే హెచ్చరించినా అంత అజాగ్రత్తగా వున్నావంటే నీకన్నా చవట మరొకడుండడు. ఈ సారన్న జాగ్రత్త పడు. తొందరలోనే నీకు మరో కోటా పడుతుంది” అంటూ అవతల లైన్ కట్ చేసాడు విరాట్.

విరాట్ చివరి మాటలు వినగానే`

ఎ యస్ పి ప్రకాష్ ముఖంనెత్తురు లేనట్టు పాలి పోయింది.

I I I

ఉదయం ఎనిమిది గంటలకే దీక్ష స్కూటీ వచ్చి గేటు ముందు ఆగింది. సహస్ర దీక్ష యిద్దరూ లోన కొచ్చారు.

అప్పటికింకా విరాట్ చందూలు రెడీ కాలేదు.

స్నానాలు చేసి కాఫి తాగారు.

నిన్న సాయంకాలనికే ఇంటికి కొత్త ఫర్నిచర్ రప్పించటంతో ఇల్లు ముందు కన్న మరింత శోభాయమానంగా ఉంది.

పొద్దునే వచ్చిన అమ్మాయిలద్దరూ చక్కటి డిజైన్ తో కూడిన చుడీదార్లు ధరించి ఎగిరే సీతాకోకచిలుకల్లా వున్నారు. ఎప్పటిలాగే సహస్ర చున్నితో ముఖం తెలీకుండా కవర్ చేసుకొని వచ్చినా లోనకు రాగానే తీసేసింది. కడిగిన ముత్యంలా ఇవాళ మరింత అందంగా వుంది.''ఎక్కడికి పొద్దుటే బయలు దేరారు?'' అడిగాడు చందూ.

''డ్యూటీకి వెళ్ళాలిగా!'' వెంటనే బదులిచ్చింది సహస్ర.

''అవును మీ మూలంగా నిన్న షాపింగ్ మాల్ కి పోకుండా శలవు పెట్టాల్సొచ్చింది. ఇవాళయినా వెళ్ళాలిగా, మామూలుగా అయితే ఎనిమిదిన్నరకు బయలుదేరేవాళ్ళం. మీ కోసం కాస్త ముందుగా వచ్చాం!'' అంది దీక్ష.

''మా కోసం అంటే నేన్నమ్మను'' అన్నాడు విరాట్.

''అవున్లే నిజాలు నువ్వెప్పుడు నమ్మావు గనక. ఇవాళ రాఖీ పండగ. మీకు రాఖీ కట్టడం కోసం ముందుగా వచ్చాం'' అంటూ విరాట్ పక్కన కూచొని చేతిలో ప్లాస్టిక్ బుట్టని టీ పాయ్ మీద ఉంచింది సహస్ర. బుట్టలోరెండు స్టీలు బాక్స్ లున్నాయి.

విరాట్ చందూలు ముఖముఖాలు చూసుకున్నారు. సహస్ర పైనున్న బాక్స్ తెరిచింది. లోన స్వీట్లు పక్కనే అందమైన రెండు రాఖీలు ఉన్నాయి.

వాటిని చూడగానే అదిరి పడి.

వెనక్కి జరిగాడు విరాట్.

''ఎయ్... ఏంటిది?'' అనడిగాడు.

''తెలీటం లేదా? రాఖీలు'' అంది సహస్ర.

“అది తెలుస్తోంది. నిజంగానే తెచ్చావేంటి? కొంప దీసి నాకు కట్టేస్తావా ఏమిటి? వరసలు మారి పోతాయి.”

“ఏం ఫరవా లేదు. వరసలు కలుపుకుందామనే ఇవి తెచ్చాం” అంటూ కొంటెగా నవ్వుతూ ఒక రాఖీ దీసింది. అంతే.

సోఫాలోంచి ఎగిరి అవతలకు దూకాడు విరాట్.

“ఒరేయ్ చందూ ఏమిట్రా పొద్దుటే చమటలు పట్టిస్తున్నారు. కష్టపడి లవ్ చేస్తే ఇప్పుడు రాఖీలు కట్టేస్తామంటున్నారు. ఇదేమన్నా బాగుందా?” అనరిచాడు. చందూ భుజాలెగరేసాడు.

“నాకు బాగానే వుంది. నువ్వే అనవసరంగా కంగారు పడుతున్నావ్” అంది సహస్ర రాఖీతో ముందుకొస్తూ

“ఏయ్... తమాషాగా ఉందా? రాకు చెప్తున్నాను” అనరుస్తూ చందూ వెనక్కి దూకాడు విరాట్.అయితే సహస్ర విరాట్ ని పట్టించుకోకుండా చందూ కుడి చేయి అందుకుంది.

“నేను రాఖీకట్టడానికి అన్నదమ్ములెవరూ లేరు. మా డాడీకి ఒకే కూతుర్నయిపోయాను. ఈ రోజు నుంచి నీకు చెల్లెలిగా ఈ రాఖీ కడుతున్నాను. మీ స్నేహం లాగే మన అనుబంధం కూడా కల కాలం ఉండాలి” అంటూ రాఖీ కట్టింది సహస్ర.

“నన్నాశీర్వదించు అన్నయ్యా” అంటూ పాదాలకు నమస్కరించింది.

దీక్ష చందూ చేతిలో అక్షింతలు ఉంచింది.

చందూ కళ్ళలో గిర్రున నీరు తిరిగింది.

“కల కాలం సుఖ సంతోషాలతో వర్ధిల్లు తల్లి!” అంటూ సహస్ర శిరస్సున అక్షితలు వేసి భుజాలు పట్టి లేపాడు.

|

“ఇంటి దగ్గరుంటే నా చెల్లెళ్ళిద్దరూ రాఖీలు కట్టే వాళ్ళు ప్రతి సంవత్సరం. ఈ పండక్కి ఇంటి కెళ్ళాలనున్నా వెళ్ళ లేక పోతున్నాను. ఆ లోటు నువ్వు తీర్చావ్. ఈ రోజు నుంచి నాకు చెల్లెళ్ళు ఇద్దరు కాదు నీతో కలిపి ముగ్గురు.” అంటూ జేబు లోంచి అయిదు వందల నోటు తీసి సహస్ర చేతిలో ఉంచాడు.

సహస్ర అతడి నోటికి లడ్డూ అందించి నోరు తీపి చేసింది. విషయం అర్థమై ఇవతలకొచ్చిన విరాట్ నవ్వుతూ “ఈ మాట ముందే చెప్పొచ్చుగా. క్లారిటీ వుండేది. అనవసరంగా నన్ను కంగారు పెట్టావ్” అన్నాడు.

ఇంతలో దీక్ష రెండో రాఖీతో ముందుకొచ్చింది. సహస్ర అందించిన అక్షింతలు తీసుకొని దీక్ష శిరస్సున చల్లి “కల కాలం చల్లగా ఉండమ్మా”లే అంటూ భుజాలు పట్టి లేపాడు విరాట్.

“అయిదుగురన్నలకు చెల్లెలివై ఉండి ఇక్కడ అనాధల ఒంటరిగా బతుకుతున్నాను. అలాంటి నాకు మీరంతా తోడు నీడ గాదొరికారు. ఇక నుంచి నువ్వే నా అన్నగా భావిస్తాను”. అంటూ విరాట్ నోటి ని లడ్డూ తో తీపి చేసింది. వెంటనే వెయ్యి రూపాయల నోటు ఆమె చేతిలో ఉంచాడు విరాట్.

“ఉంచమ్మా. అన్నగా ఇక మీదట నీకు ఏమిచ్చినా కాదనకూడదు” అన్నాడు.

“ఒరే విరాట్ ఇప్పుడేమిట్రా ఎప్పుడో నువ్వు తనకు అన్నవయ్యావ్. కాని ఆ సంగతి నీకు తెలీదు” అన్నాడు చందూ. అర్థం కానట్టు చూసాడు విరాట్.|

“దీక్ష ఎవరో ఇంకా తెలీలేదా?” నవ్వుతూ అడిగాడు చందూ.“ఏమిట్రా తమాషా చేస్తున్నావ్? నాకేం తెలుసు?” అన్నాడు విరాట్.“మధురైలో కొంత కాలం కిందట అప్పటి ఎ యస్ పి అయ్యా సామి నుంచి అర్ధరాత్రి ఓ అమ్మాయిని కాపాడి క్షేమంగా తనుంటున్న హాస్టల్ దగ్గర విడిచి వెళ్ళావ్ అవునా?”

“అవును... అయితే...?”

“ఆ అమ్మాయి ఎవరో కాదు ఈ దీక్ష. నిన్న నువ్వు ఎ యస్ పి ప్రకాష్ తో మాట్లాడ్డం విన్నాక తనూ నిన్ను గుర్తు పట్టి నాతో చెప్పింది.” అంటూ అసలు విషయం చెప్పే సరికి నమ్మ లేనట్టు దీక్ష వంక చూసాడు విరాట్

“అవునన్నయ్యా. ఆ రాత్రి నువ్వు కాపాడిన అమ్మాయి నేనే. అయిదుగురన్నలూ ఆస్థి కోసం దుర్మార్గులుగా మారి ఆ ఎ యస్ పి కి లంచం యిచ్చి నన్ను భయపెట్టమని నా తలరాతను మార్చాలని చూసారు. ఆ క్షణంలో ఎంత అరిచినా ఏ దైవం రాలేదు, నువ్వొచ్చావ్. అన్నలా నాన్నలా నన్ను కాపాడావ్. చీకట్లో నీ ముఖం తెలిదేదు. ఇంత కాలానికి నిన్నిలా కలుసుకోవటం అదృష్టం.” అంటూ చెమర్చిన కళ్ళు తుడుచుకుంది దీక్ష.

“అదృష్టం నీది కాదమ్మా, నాది. నాకు పైన అక్క అన్నయ్య ఉన్నారు. చెల్లెళ్ళు లేరు. ప్రతి సంవత్సరం మా అక్క మహాలక్ష్మి మా అన్నదమ్ములిద్దరికీ రాకీ కట్టేది. సాగరికను చేసుకోనన్నప్పట్నుంచి ఆ అలవాటు తప్పి పోయింది. ఆ కోరిక నీ మూలంగా తీరింది. నీ సొంత అన్నలు నీకు ద్రోహం చేయాలని చూసుండొచ్చు, ఆ విషయం మరిచిపో. నీకు పుట్టింటి లాంఛనాలకు ఏ కొరతా లేకుండా నేను చూసుకుంటాను” అన్నాడు విరాట్.

“ఒకె ఒకె ఈ శుభ సందర్భంలో మనందరి కోసం అటుకుల పాయసం చేసి తెచ్చాం. త్వరగా కానిస్తే బయలు దేరుతాం” అంటూ సహస్ర రెండో స్టీల్ బాక్స్ తెరిచింది.

దీక్ష వెళ్ళి నాలుగు గ్లాసులు తెచ్చింది.ఈ లోపల విరాట్ ఎ యస్ పి ప్రకాష్ నంబర్ కి ఫోన్ చేసి మాట్లాడాడు. హాస్పిటల్ పాలయినా వాడి పొగరు ఇంకా తగ్గనందుకు నవ్వుకున్నాడు. ఎ యస్ పి ప్రకాష్ మీద రాత్రి మధురైలో దాడి జరిగిందని అతడు ప్రస్తుతం ఆస్పత్రి బెడ్ మీద వున్నాడని తెలిగానే సహస్ర ఆనందం పట్టలేక విరాట్ బుగ్గ మీద ముద్దు పెట్టేసింది.

“ఇప్పుడు మరింత నచ్చావ్ విరాట్. చెన్నై నుంచి కదలకుండానే బుద్ధి చెప్పావంటే యుఆర్ గ్రేట్ ”అంది మెచ్చుకుంటూ.“హలో........... అప్పుడే ఏమైందని సంబరం? అసలు కథ ముందుంది. నీ మూలంగా నాకెంత మంది శతృవులవుతారో? ఎలాంటి రిస్క్ లు ఫేస్ చేయాలోఅర్ధం గావటం లేదు. ఏరా చందూ. నువ్వయినా ఓ మాట నన్ను హెచ్చరించుండొచ్చుగా. ఇప్పుడు చూడు ఖర్మ. లవ్ చేసి అనవసరంగా చిక్కుల్లో పడ్డాను” అన్నాడు.

సహస్రను ఉడికించటం కోసం విరాట్ ప్రయోగించిన మాటలు వెంటనే వర్కవుటయ్యాయి. కోపంతో చివ్వున లేచింది.



ఈ లోపల చందూ కల్పించుకుంటూ

"ఏరా సహస్ర ఇప్పుడు నా చెల్లెలని మర్చి పోయావా? ఈ వరసన మన ఫ్రెండ్షిప్ కాస్తా బంధుత్వంగా మారిపోయి నువ్వు నా బావ అయిపోయావ్. ఇక నువ్వేమన్నా వూరుకోను. నువ్వేమి అన కూడదు. అంతే" అన్నాడు నవ్వుతూ.

"నువ్వాగన్నయ్య" అంది కోపంగా సహస్ర.

‘‘ఏయ్ విరాట్ ఏదీ నా ముఖం చూసి చెప్పు. చిక్కుల్లో పడిరది నువ్వా నేనా?    పేపరు ప్రకటనిచ్చి చిక్కుల్లో పడేసింది నువ్వే కదా? అందుకు బాధ్యత వహించి నన్నూ కాపాడాలా వద్దా?’’ అంటూ నిలదీస్తుంటే విరాట్    నవ్వేసాడు.

‘‘ఒకె ఒకె తమాషాకన్నాను గాని పాయసం చల్లారి పోతుంది. త్వరగా యివ్వు’’ అన్నాడు.

ఉత్సాహంగా కబుర్లు చెప్పుకొంటూ

నలుగురూ పాయసం తాగారు

సహస్ర దీక్షలు ఇక బయలు దేరుతుండగా ఒక్క నిముషం అంటూ ఆపాడు విరాట్.

‘‘చందూ... రాత్రి మనం తెచ్చిన కేరీ బ్యాగ్ తీసుకురా’’ అన్నాడు. చందూ బేగ్ తెచ్చి సహస్ర కిచ్చాడు. ఆ బేగ్ లో ముస్లిం యువతులు తల నుంచి పాదాల వరకు ధరించే నల్ల బురఖాలు రెండు జతలున్నాయి. విరాట్ లేచి ముందుకొచ్చాడు.

‘‘ఇవెందుకు?’’ అంది సహస్ర.

‘‘ఎందుకా! చందూ ఒకటి నేనొకటి వేసుకొని తిరుగుదామని. ముఖం చూడు, ఇవి మీ కోసం. నీ సేఫ్ కోసం. నువ్విలా ముఖానికి చున్నీ చుట్టుకుంటే చాలదు. శత్రువుల కంట బడితే ఈజీగా గుర్తు పడతారు. ఇక నుంచి ప్రతిక్షణం జాగ్రత్తగా వుండాలి మనం. ఈ క్షణం నుంచే బురఖా లోకి మారి పోతున్నామ్’’ అన్నాడు విరాట్.

‘‘లేదు లేదు’’. అనరిచింది వెంటనే సహస్ర

‘‘నాకిలాగే బాగుంది. బురఖా వేసుకుంటే వూపిరాడనట్టుంటుంది. ప్లీజ్ విరాట్.’’

‘‘నథింగ్ డూయింగ్. దీక్ష నువ్వు కూడ బురఖా ధరించాలి. మీ యిద్దరూ క్లోజ్ ఫ్రండ్స్. నిన్ను గుర్తు పట్టినా వాళ్ళు నీ పక్కనుంది సహస్రని

గుర్తించే ప్రమాదం ఉంది’’ హెచ్చరించాడు.

‘‘వద్దంటున్నాగా నాకిష్టం లేదంతే’’ మొండిగా అరిచింది సహస్ర.

‘‘వేసుకుంటున్నావ్. తప్పదు’’

‘‘ఒకె దార్లో తీసేస్తాను’’

‘‘దీక్ష వెంటనే నాకు ఫోన్ చేస్తుంది.’’

‘‘ఓ మై గాడ్! ఈ బలవంతం ఏమిట్రా దేవుడా? పొరపాటున ముస్లిం లేడీస్ ఎవరన్నా మమ్మల్ని పలకరిస్తే ఉర్దూ గాని హిందీ గాని ఒక్క ముక్క మాకు రాదు.’’

‘‘అదెంత పని? నాలుగు ముక్కల్లో మీకు ఉర్దూ హిందీ అంతా నేర్పేస్తాను.’’

‘‘నాలుగు ముక్కల్లో...ఎలా బాబూ?’’ అంది పరిహాసంగా సహస్ర.

‘‘వేరీ సింపుల్ డియర్. ఎవరన్నా ముస్లిం మిమ్మల్ని పలకించారనుకో. వెంటనే ఆదాబ్, లేదా ఆదా బర్సే అను. అంటే మనం నమస్తే చెప్పినట్టన్న మాట. రెండోది మాట్లాడి వచ్చేటప్పుడు ఖుదా ఆఫీస్ అను చాలు. అంటే ఇక సెలవు అనర్థం. ఇక మధ్యలో క్యాహై? నహి నహీ, జీహా, మాలూమ్ నై ఈ నాలుగు మాటలు సందర్భాన్ని బట్టి ప్రయోగించండి అంటే ‘ ఏమిటి?........లేదు లేదు......... అవును....... తెలీదు’ అని ఆ మాటల అర్థం మిగిలిందంతా తెలుగులో చెప్పండి ఫినిష్. మీకు అద్భుతంగా హిందీ వచ్చేసినట్టే’’ అంటూ బోధించాడు విరాట్.అంతా విని ఆముదం తాగినట్టు ముఖం పెట్టింది సహస్ర

‘‘ఏడ్చినట్టుంది. నీ నాలుగు ముక్కల హిందీ. బీచ్ మే ఓలోగ్ క్యా పూచేగా యే? హమ్ కో కైసే మాలూమ్ పడేగా?’’ అంది.అంతేతెరిచిన నోరు మూయటం మర్చిపోయి ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూస్తూ బాప్రే అంటే సోఫాలో కూలబడ్డాడు విరాట్.

ఇక ఆపుకో లేక

దీక్ష చందూలు పడి పడి నవ్వారు. వాళ్ళతో శృతి కలిపింది సహస్ర.

‘‘ఒరే విరాట్ తనకు హిందీ రాదంటే నమ్మేసావా? తనేమీ తక్కువ కాదురా బాబూ. తెలుగు, తమిళం ఇంగ్లీషు, హిందీ, జర్మన్ అయిదు భాషల్లో మాస్టర్ సహస్ర. నీలాగే. అఫ్ కోర్స్ నీకు అదనంగా స్పానిష్ బాష వచ్చనుకో’’ అన్నాడు నవ్వాపు కొంటూ చందూ.

‘‘ఆశ్యర్య పోయింది చాలు లే’’ అంటూ చేయి అందించి విరాట్ని లేపింది సహస్ర.

‘‘ఎదుట వాళ్ళని ఫూల్ని చేయటం నీకే కాదు మాకు వచ్చు. వద్దు మొర్రో అంటున్నా బురఖా వేసుకోమని విసిగిస్తావా? సరి. నీ మాట కాదనలేక వేసుకుంటాను. కాని ఎక్కడ చిరాకేస్తే అక్కడ తీసేస్తాను’’ అంది బురఖా అందుకుంటూ.

‘‘తీయ కూడదు’’ సీరియస్ గా హెచ్చరించాడు విరాట్.

‘‘ఇంటి దగ్గర వేసుకున్న బురఖా తిరిగి ఇంటికొచ్చే వరకు తీయ కూడదు. ఎందుకు చెప్తున్నానో అర్ధం చేసుకో’’ అన్నాడు.‘‘ఒకె ఒకె’’ అంది సహస్ర.

సహస్రతో బాటు దీక్ష కూడ బురఖాల్లోకి మారి పోయారు, కళ్ళుమాత్రం కనబడేలా వున్న ముఖం మీది క్లాత్ను దించగానే ఇక వాళ్ళనిఎవరూ గుర్తించ లేరనిపించింది. ఒక జత ఇంకా కేరీ బాగ్లో ఉంది. సాయంత్రం వాటిని పట్టుకెళ్తామంటూ వాటిని అక్కడే వదిలేసి ఇద్దరూ స్కూటీ మీద బయలు దేరి వెళ్ళి పోయారు.

“ఏరా ...మనం ఆఫీస్ కు వెళ్తున్నాంగా?” సందేహ నివృత్తి కోసం అడిగాడు చందూ.

“వెళ్తున్నాం. కాని మధ్యాహ్నం నేను లీవు పెట్టి పని మీద బయటి కెళ్తాను. ఆఫీసు వదిలే టైముకొచ్చి నిన్ను పికప్ చేసుకుంటాలే అన్నాడు విరాట్.

“ఏం పనిరా? వేరే ఏ పనుందని?” అర్థం గాక అడిగాడు చందూ.

“ఎందుకు లేదు? అసలు పని ఇప్పుడే మొదలవుతోంది. నా అనుమానం కరక్టయితే నా గురించో సహస్ర గురించో రాత్రికే చాలా మంది చెన్నై చేరుకునుండాలి. వీళ్ళు ఎవరికీ అనుమానం రాకుండా సాదా హోటళ్ళలో బస చేస్తారు. వాళ్ళ కదలిక లేమన్నా తెలుస్తాయేమో ఓ రౌండు చుట్టి వస్తాను. నువ్వు త్వరగా టిఫిన్ సంగతి చూడు. టైం కి బయలు దేరాలి. ఈ లోపల నేను ఓ సారి ధర్మాకి ఫోన్ చేసి మాట్లాడతాను” అంటూ ఫోన్ అందుకున్నాడు విరాట్.

ఏదో అడగాలనుకొని కూడ విరమించుకొని కిచెన్లోకి వెళ్ళి పోయాడు చందూ ఫోన్ చేయగానే లైన్ లో కొచ్చాడు ధర్మా.

“ఏరా ఎక్కడున్నావ్?” అడిగాడు విరాట్.

“ఇప్పుడే బయటకి బయలు దేరుతున్నాను. నువ్వు ఫోన్ చేశావ్. చెప్పరా. ఏమంటాడు మీ ఎ యస్ పి?” నవ్వాడు ధర్మ.

“వాడి సంగతి కాసేపు పక్కన పెట్టరా. మేటర్ సీరియస్. చెప్పేది జాగ్రత్తగా విను. మధురై త్యాగరాజన్ మనుషులు మన సర్కిల్ లో ఎవరికన్నా తెలుసా?”

విరాట్ ప్రశ్న వినగానే అవతల ధర్మ షాకై ఉండాలి పదిహేను సెకన్ల తర్వాత గాని తిరిగి అతడి గొంతు విన్పించ లేదు.“ఏమిట్రా! ఎ యస్ పి లాంటి సొర చేప గురించి అడిగావంటే ఏదో అనుకున్నాను. ఇప్పుడు ఏకంగా త్యాగరాజన్ లాంటి తిమింగలం గురించే అడుగుతున్నావ్. ఏమైందసలు?” ఆందోళన నిండిన స్వరంతో అడిగాడు ధర్మ.

‘‘అదంతా ఫోన్లో చెప్పటం మంచిది కాదురా....’’

‘‘ఎందుక్కాదు? నీ సెల్ నంబర్ మీద నిఘా వుందని అనుమానమా?’’

‘‘అదేం లేదు. అప్పుడే ఆ నంబర్ మీద నిఘా ఉంటుందని అనుకోను....’’

‘‘అయితే చెప్పటానికేమైంది? ఏం జరిగింది? నువ్వు చెన్నైలోనే ఉంటున్నావా?’’

‘‘ఆ డౌటు అక్కర్లేదు. ఇప్పట్లో బయటికొచ్చే ఉద్దేశం లేదు.’’

విరాట్ మాటలకు ధర్మ మరింత ఆశ్చర్య పోతూ ‘‘నిజం చెప్పు విరాట్? నువ్వు రిస్కులో ఉన్నావా?’’ అనడిగాడు.

‘‘కంగారు పడకు. క్లుప్తంగా చెప్తాను. నిన్న పేపర్లో సహస్రనే అమ్మాయిని పట్టిస్తే కోటి అనే ప్రకటన ఫోటోతో సహా వచ్చింది. చూసావా?’’ గుర్తు జేసాడు విరాట్.

‘‘చూసాను. ఆ అమ్మాయి ఎవరో కాదు. ఇక్కడ మహా దేవ నాయకర్ కూతురు సహస్ర. తండ్రి చూసిన సంబంధం ఇష్టం లేక ఎక్కడికో వెళ్ళి పోయిందనుకున్నారు. ఈ ప్రకటనతో ఆమె చెన్నైలోఉందని ఎవరినో ప్రేమించిందని జనం అనుకుంటున్నారు.’’

‘‘ఆ ప్రేమించింది ఎవరినో కాదు నన్నే. ఆ ప్రకటన ఇచ్చిందీ నేనే’’ అంటూ రైల్లో సహస్రను చూసిం తర్వాత జరిగిందంతా సింపుల్గా వివరించాడు విరాట్.

‘‘సహస్ర రచయిత్రి మాత్రమే కాదు. ప్రముఖ జర్నలిస్టు లహరి కూడ తనే. ఇది చాలనుకుంటాను. జగన్మోహన్ సహస్రకి గొడవకి కారణం గ్రహించటానికి’’ అన్నాడు.

“అర్థమైందిరా బాబూ. చాలు. ఏరా, ఇన్ని రిస్కుల్లో వున్న ఆమెను లవ్ చేయటం అవసరమంటావా?” అనడిగాడు అంతా విన్న ధర్మా. “ప్రేమించాకే రిస్కుల గురించి తెలిసింది. వదిలేయ మంటావా? నేనిచ్చిన ప్రకటన వల్లే తను చెన్నైలో వున్నట్టు అందరికీ తెలిసిపోయింది కాబట్టి తనను రక్షించుకోవాల్సిన బాధ్యత కూడ నా మీదే ఉంది. ఇంతకీ నేనడిగింది నీ వల్ల అవుతుందా లేదా?” “నా గురించి మనవాళ్ళ గురించి తెలిసి కూడ అలా తొందర పడతావేంటిరా? త్యాగరాజన్ మనుషుల్లోచాలా మంది మనకి తెలిసిన వాళ్ళేరా. వాళ్ళందరికీ కేరాఫ్ అడ్రస్ టేకు తోటలోవున్న జగన్ మోహన్ గెస్ట్ హౌస్. త్యాగరాజన్ కి ఎట్టియప్పని ఒక రైట్ హ్యాండ్ వున్నాడు. వాడి చేతి కింద పని చేస్తారంతా.”

“ఒకె. ఎట్టియప్ప మనుషులంతా మధురైలోనే వున్నారా లేక కొందరయినా మధురై వదిలి వెళ్ళారా? ఎప్పుడు వెళ్ళారు, వాళ్ళ వివరాలు కావాలి.”

“అంటే లహరిని అంతం చేయటం కోసం ఒక బేచ్ చెన్నైకి బయలు దేరి వుంటుందని నీ అనుమానం. అంతేగా?”

“యస్...అదొక్కటే కాదు. లహరిని పట్టి ఇంటికి తీసుకు రావటానికి మహ దేవనాయకర్ కూడ మనుషుల్ని పంపించి ఉంటాడని నా అనుమానం. ఆ వివరాలు కూడ తెలుసు కోవాలి.”

“ఒకె ఇక నాకు వదిలేయ్. మధ్యాహ్నం లోపే నీకు అన్ని వివరాలతో ఫోన్ చేస్తాను. ఇక విషయం చెప్పు. మీరు ఒంటరిగా ఉన్నారా అక్కడ? ఎందుకైనా మంచిది. నన్ను బేచ్తో చెన్నైలో దిగి పొమ్మంటావా?”

“వద్దు వద్దు, అవసరమనుకుంటే అప్పుడు చెప్తా”

“పోనీ చెన్నైలో ఎక్కడున్నారు? అదన్నా చెప్తావా?”

“ఏర్ పోర్ట్ సమీపంలో ఉత్తరంగా గోస్వామి కాలనీ అని చిన్న కాలనీ ఒకటుంది. అక్కడ మొదటి వీధి మూడో ఇంట్లో నేను మూడో వీధి చివరి యింట్లో సహస్ర ఉంటున్నాం. బట్ తొందర పడి మీరు రావద్దు.”

“ఒకె మీరు మాత్రం జాగ్రత్తగా ఉండండి. నేను మధ్యాన్నం లోపే ఫోన్ చేస్తాను”. అంటూ లైన్ కట్ చేసాడు ధర్మ.

మరో గంటలో విరాట్      చందూలు తమ బైక్ మీద ఆఫీసుకు బయలు దేరారు.

I                              I                                             I

అది తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయం

ఉదయం పది గంటలకు కార్యాలయానికొచ్చిన సి యం శెల్వి చెందామరై రెండు గంటల పాటు ముఖ్యమైన ఫైళ్ళు చూస్తూ, చీఫ్ సెక్రటరీ ఇతర సిబ్బందితో ముఖ్యమైన విషయాలు చర్చిస్తూ బిజీగా గడిపారు. సుమారు పన్నెండున్నర సమయంలో ఇంటికి బయలుదేరుతూ ఏదో గుర్తుకొచ్చి ఆగిందామె. అటెండర్ను పిలిచి కొన్ని రోజుల క్రితం న్యూస్ పేపర్స్ తెప్పించుకుని అందులో ప్రకటనని ఆసక్తిగా మరోసారి చదివిందామె.

నా ప్రియురాల్ని పట్టిస్తే కోటి అంటూ సహస్ర ఫోటోతో సహ వచ్చిన ప్రకటన. కొన్ని రోజుల క్రితమే ఆ ప్రకటన కన్నా అందులోని యువతి ఫోటో సి యం ని విశేషంగా ఆకర్షించింది. ఎందుకంటే ఫోటో లోని సహస్రను ఎక్కడో చూసిన గుర్తు. కాని ఎంత ఆలోచించినా ఎక్కడో గుర్తు రావటం లేదు. తర్వాత చూద్దామని పక్కన ఉంచి ఆ సంగతి మర్చి పోయింది. పనుల ఒత్తిడిలో ఆ విషయం గుర్తు రాలేదు. ఇప్పుడు సడెన్ గా గుర్తొచ్చి తిరిగి పేపరు మీద దృష్టి సారించిందామె.

ఎవరీ సహస్ర?

ఈమె సాధారణ యువతి కాదు

తను ఈ అమ్మాయిని చూసింది

ఎక్కడ? ఎప్పుడు?

సెక్రటరీని ఇతర సిబ్బందిని పిలిచి ఫోటో చూపించి అడిగినా ఎవరూ ఏమీ చెప్ప లేక పోయారు. అంతలో తమ అధికార పార్టీ ప్రచార సారధిగా వ్యవహరిస్తున్న దేవయాని అనే ఆమె ముఖ్యమంత్రిని కలవటం కోసం వచ్చింది. దేవయానికి జ్ఞాపక శక్తి ఎక్కువ. ప్రకటనలోని సహస్రను చూడగానే ఆమె నవ్వుతూ.

"ఏంటి మేడమ్ ఈ అమ్మాయి ఎవరో గుర్తుకు రాలేదా?" అంది ఎదురుగా కూచుంటూ.

"లేదు ఎవరీ అమ్మాయి? నీకు తెలుసా?"

"తెలుసు. నిజానికి ఈ విషయం తెలుసుకుందామనే నేను మీ వద్ద కొచ్చాను. ఈ సహస్రను పట్టుకోమని హోం మినిస్టర్ గాని మీరు గాని చెన్నై పోలీసులకు ఆర్డర్స్ ఏమన్నా ఇష్యూ చేసారా?"

"నో నో...అసలి అమ్మాయి ఎవరో గుర్తు రాక నేను బుర్ర చించుకొంటుంటే మధ్యలో ఈ ఆర్డర్సేమిటి. అరెస్ట్ లేమిటి నాన్సెన్స్. ఏమైంది దేవయాని...నాకు తెలికుండా ఏం జరుగుతోందిక్కడ?"

"అది మీకే తెలియాలి. ఈ అమ్మాయి ఎక్కడ కన్పించినా వెంటనే అరెస్ట్ చేసి సమీప పోలీస్ స్టేషన్లో అప్పగించమని చెన్నై సిటి పోలీస్ కమీషనర్ ఆర్డర్స్ ఇష్యూ చేసారు. ఇప్పుడు ఈ అమ్మాయి ఫోటో దగ్గరుంచుకొని గాలిస్తున్నారు పోలీసులు."

"ఒకె ఒకె....... కారణం అడిగి తెలుసు కుందాం. ఇంతకీ ఈ సహస్ర ఎవరు? నీకయినా తెలుసా?" ఆసక్తిగా అడిగారు సియం""మధురై మహ దేవ నాయకర్ గుర్తున్నారా?" అడిగింది దేవయాని.

"యస్...యస్...ఆయన గుర్తు లేక పోవటం ఏమిటి? ప్రతిపక్ష పార్టీకి కంచు కోట లాంటి మధురై ప్రాంతంలో త్యాగరాజన్ ఉండగా మనం ఒక్క సీటు సాధించ లేమనుకున్నాంకానిమహదేవనాయకర్ కృషితోమనపార్టీబలోపేతమైఅక్కడఅధికసీట్లుసాధించుకోగలిగింది."

"అవును గదా. అప్పట్లో పార్టీ టికెటిస్తాంఎం పి గానో ఎమ్మెల్యే గానో పోటీ చేయమని మనం కోరినా మహ దేవ నాయకర్ ఒప్పుకోలేదు. నాక పదవులక్కర్లేదు మీరు అధికారంలోకి వచ్చి తమిళ ప్రజలకు సుస్థిరమైన మంచి పరిపాలన అందించండి అది

చాలు అంటూ సున్నితంగా మన అభ్యర్ధనను తిరస్కరించిన పెద్ద మనసు ఆయనది. మన పార్టీకి వీరాభిమాని. అటువంటి మహా దేవ నాయకర్ ఏకైక కుమార్తె ఈ సహస్ర. పూర్తి పేరు లక్ష్మీ సహస్ర.''

''ఓ మైగాడ్.............అంటే..........''

''యస్ మీ డౌటు కరక్టే మేడం. రచయిత్రి సహస్రగా ఈమె అందరికీ తెలుసు. కాని ప్రముఖ జర్నలిస్టు లహరి తనే అని తెలీదు.''

''డామిట్'' అంటూ నుదురు రుద్దుకుంది సి యం చెందామరై.

''నా డౌటు వేస్ట్ కాలేదు. వెరీ ఫెమిలియర్ ఫేస్. అందమైన ఈ ముఖాన్ని ఎక్కడో చూసిన గుర్తు. కాని నువ్వు చెప్పే వరకు గుర్తు రాలేదు. ఆ జగన్మోహన్ భూ కుంభకోణాల్ని పునాదులలతో సహా తవ్వి పేపర్లకెక్కించి సెంట్రల్ గవర్నమెంటుకే దడ పుట్టించిన డాషింగ్ లేడీ. జర్నలిస్టు లహరి....''

''కరెక్టా వూహించారు మేడమ్. ఆమెను మీరు స్వయంగా కలిసారు కూడ. గుర్తుందా? గత ఎన్నికల్లో మనం మధురైకు ప్రచార నిమిత్తం వెళ్ళినప్పుడు ప్రత్యేకంగా మిమ్మల్ని కలిసి మీ ఇంటర్వ్యూ తీసుకుంది. కీలకమైన ఎన్నో ప్రశ్నలకు ఓపిగ్గా మీరు బదులిచ్చారు. లహరిని అభినందించారు. ఆ ఇంటర్వ్యూ విశేషాలు అన్ని పత్రికల్లోను వచ్చాయి. మీ మనో భావాల్ని సూటిగా ప్రజల మధ్యకు తీసుకు పోడానికి ఆ ఇంటర్వ్యు ఎంతో దోహద పడిరది. మన పార్టీ ఘన విజయానికి ఆ ఇంటర్వ్యు కూడ ఒక కారణం.''

''అవును దేవయాని ఆ విషయం నాకు బాగానే గుర్తుంది. ఇంతకీ ఈ అమ్మాయికి పెళ్ళయిందా? చెన్నైలో ఎందుకుంటోంది? పేపరు ప్రకటనిచ్చిన ఈ ప్రియుడు ఎవరు? మహ దేవ నాయకర్ కి ఈ విషయం తెలుసా? ఒక వేళ ఆ రోజు మధురైలో కోర్టు బయట తన మీద జరిగిన హత్యా ప్రయత్నానికి భయపడి చెన్నైలో అజ్ఞాతంగా ఉంటోందా...నీ దగ్గర వేరే ఇన్ ఫర్మేషనేమన్నా వుందా.?''''మేడం ఇక్కడికొచ్చే ముందే మధురై లోని మన పార్టీ కార్యాలయానికి ఫోన్ చేసి మాట్లాడాను. తన కూతురే జర్నలిస్టు లహరి యని మహా దేవ నాయకర్ కు తెలీదు. తను చూసిన సంబంధం నచ్చక తన కూతురు ఇల్లొదిలి వెళ్ళిపోయిందనుకుంటున్నారు. చెన్నై రాక ముందు ఆమెకు లవ్ ఎఫైర్స్ ఏమీ లేవు. ఇక్కడే ఈ ప్రకటనిచ్చినవాడ్ని లవ్ చేసుండాలి'' అంటూ తనక తెలిసిన సమాచారం అంతా వివరించింది దేవయాని.ఒక్క క్షణం ఆలోచించింది సి యం సెల్వి చెందామరై...

‘‘ఒకె ప్రకటనలో ఇచ్చిన ఈ నంబర్ కి ఫోన్ చేసి ఆ కుర్రాడ్ని అడిగితే ఏం జరిగిందో చెప్తాడుగా! ఫోన్ చెయ్యి నేను మాట్లాడుతాను’’ అంది.‘‘ముందు కమీషనర్ కి ఫోన్ చేసి సహస్ర మీద అరెస్ట్ వారంట్ ఇష్యూ చేయటానికి కారణం ఏమిటో తెలుసుకుంటే మంచిదేమో.’’‘‘డోన్ట్వర్రీ. కమీషనర్ ని ఇక్కడికే పిలిపిద్దాం’’ అంటూ సెక్రటరీని పిలిచి కమీషనర్ గార్ని వెంటనే రమ్మని ఫోన్ చేయమని చెప్పింది. ఈ లోపల దేవయాని పేపరు ప్రకటన లోని నంబర్ కి ఫోన్ చేసింది.

ఆఫీస్ లో కంప్యూటర్ ముందు బిజీగా ఉండగా విరాట్ సెల్ మోగింది. చూస్తే కొత్త నంబరు అది. తన పర్సనల్ నంబర్కి ఎవరో ఫోన్ చేసారు. తీయాలా వద్దాని పది క్షణాలు సందేహించి చివరకు ఆన్ చేసాడు.

‘‘హలో..... ఎవరు? ఎవరు కావాలి?’’ అడిగాడు.

‘‘బాబూ నీ పేరేమిటో తెలీదు. నా పేరు దేవయాని. అధికార పార్టీ ప్రచార కార్య దర్శిని. సహస్ర కోసం పేపర్లో ప్రకట నిచ్చింది నువ్వే కదూ?’’ అంటూ శాంత గంభీర స్వరంతో లేడీ వాయిస్ అటు నుంచి విన్పించింది.

విరాట్ కి చెప్ప రాని షాక్

అధికార పార్టీ తాలూకు అనగానే అప్రమత్తమయ్యాడు. ఈమె ఇంట్రస్టేమిటి? ఎందుకు ఫోన్ చేసిందీ? అర్థం కాలేదు.

‘‘చెప్పండి మేడం. ప్రకటనిచ్చింది నేనే’’ అన్నాడు పొడిగా.

‘‘సి యం గారు నీతో మాట్లాడాలంటున్నారు. మాట్లాడతారా?’’

సి యం అనగానే

మరో సారి ఉలికి పాటు చెందాడు విరాట్

ఏమిటది? స్టేట్ చీఫ్ మినిస్టర్ సెల్వీచెందామరై కి ఈ విషయంలోఇంట్రస్టేమిటి? ఏం మాట్లాడాలనుకుంటోందావిడ. ఇదో కొత్త సమస్య కాదు గదా? పరి పరి విధిలా ఆలోచిస్తూనే

"ఇవ్వండి మేడం"... మాట్లాడతాను అన్నాడు.

అయిదు సెకన్ల తర్వాత 'హలో' అంటూ అటు నుంచి సి యం మృధు మధురమైన గొంతు విన్పించింది పార్టీ సభల్లో ఆమె మాట్లాడటం రెండు మూడు సార్లు విన్నాడు. తన వాగ్ధాటితో సభికుల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తుందామె. మంచి వక్త.



“నమస్తే మేడం... చెప్పండి నాతో మాట్లాడాలన్నారట” అడిగాడు.

“అవును. సహస్ర గురించి తెలుసుకోవాలని ఫోన్ చేయమన్నాను. ఆ అమ్మాయి ఏమైంది? ఎలా తప్పిపోయింది? మీ యిద్దరూ లవ్ చేసుకున్నారా?” అడిగింది సియం.

“మేడం. సహస్ర నేనూ లవ్లో ఉన్న మాట నిజం. నా మీద అలిగి తను వెళ్ళిపోయింది. నేనిచ్చిన ప్రకటన చూడగానే తిరిగి వచ్చేసింది. సో... సహస్ర గురించి కంగారుపడాల్సిందేమి లేదు” చెప్పాడు

“బాబూ.... నీ పేరేమిటి?” అడిగిందామె.

“సారీ మేడం మీక్కావలసిన ఇన్ఫర్మేషన్ చెప్పాను. ఇక నా పేరుతో పనేముంది? సహస్ర నేనూ ఉంటున్న అడ్రసు తెలుసుకోవాలని మీ ఉద్దేశం కావచ్చు. బట్ మా సేఫ్టీ మేం చేసుకోవాలిగా, సో..... అవేం అడక్కండి. చెప్పను. అంతేకాదు సహస్ర గురించి మీరింతగా ఆరాతీస్తున్నారంటే జర్నలిస్టు లహరి రచయిత్రి సహస్ర ఇద్దరూ ఒకరేనని మీకు తెలిసేఉంటుంది. యామ్ మై కరక్ట్?”

“యస్ యు ఆర్ కరక్ట్” అంటూ చిన్నగా నవ్వింది సీఎం.

“నువ్వెవరో గాని చాలా ఇంటెలిజెంట్వని అర్థమవుతుంది. కాదంటే సహస్రకు మా నుంచి అపకారం జరగవచ్చని నువ్వు సందేహిస్తున్నట్టుంది. ఆమెను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే నీకు ఫోన్ చేసాను. మధురై మహదేవనాయకర్ మాకు మా పార్టీకి చాలా ముఖ్యమైన వ్యక్తి. ఆయన కూతురు సహస్ర క్షేమం మాకు ముఖ్యం. నువ్వు సందేహించాల్సిన పనిలేదు.

నీకు తెలుసో తెలీదో సహస్ర కన్పిస్తే అరెస్ట్ చేసి పోలీస్టేషన్లో వుంచి కేసుబుక్ చేయమని చెన్నై పోలీస్ కమీషనర్ నుండి పోలీసులకు ఆర్డర్స్ ఇష్యూ అయినట్టు ఇంత క్రితమే తెలిసింది. కారణం తెలుసుకోడానికి కమీషనర్ని పిలిపిస్తున్నాను. మీరు ఒంటరిగా సిటీలో తిరగటం క్షేమం కాదు. కారణాలు నీకు ప్రత్యేకించి చెప్పక్కర్లేదనుకుంటాను.”

“అక్కర్లేదు మేడం. అంతా నాకు తెలుసు”. అంటూ మాటలకు అడ్డం వచ్చాడు విరాట్.

“మా మీద చూపిస్తున్న అభిమానానికి ఆదరణకి కృతజ్ఞుడ్ని. మీరు మీ ప్రభుత్వం. పోలీసులు ఆ కోణం నుంచే మా గురించి ఆలోచిస్తున్నారు. నా అభిప్రాయం కరక్టయితే కంటబడిన మరుక్షణం త్యాగరాజన్ మనుషులు లహరిని చంపేస్తారని మీరు గ్రహించి ఉండాలి. అయితే ఇవి గాక మాకింకా చాలా సమస్యలున్నాయి మేడం. వాటి నుండి బయటపడేవరకు మా వివరాలు చెప్పలేను. సారీ..... మేడం బట్ రక్షణ విషయంలో మా జాగ్రత్తలో మేమున్నాం. కంగారు పడాల్సింది లేదు” అన్నాడు.

“ఒకె... నీ పేరు అడ్రసు చెప్పొద్దు. సహస్రతో ఒకసారి మాట్లాడ్డం వీలవుతుందా?”

“వీలుకాదు మేడం. తను వేరే చోట వుంది. తన వద్ద సెల్ఫోన్ లేదు.”

“ఒకె మిస్టర్ నువ్వింతగా చెప్పాక ఇక నిన్ను వత్తిడి చేయను కాని... నా నుంచి మీకు ఏ సాయం కావాలన్నా అర్ధరాత్రి ఫోన్చేసినా మీకు తక్షణ సాయం అందే ఏర్పాటుచేస్తాను. నన్ను నమ్ము. నా పర్సనల్ నంబరిస్తాను నోట్ చేసుకో....”

కాదనలేక సియం చెప్పిన నంబర్ను

తన సెల్ ఫోన్లో ఫీడ్ చేసుకున్నాడు విరాట్

సెల్ లైన్ కట్ చేసి దేవయానికి తిరిగిస్తూ చిన్నగా నవ్వింది సియం.

“ఏమంటున్నాడు మేడం, వాళ్ళు ఎక్కడున్నారట?” ఆసక్తిగా అడిగింది దేవయాని.

“చెప్పటానికి నిరాకరించాడు.”

“వ్వాట్......... మీతో చెప్పటానికేమిటి?” తెల్లబోయింది దేవయాని.

“ఏమిటి అంటే?   ఇప్పుడున్న పరిస్థితిలో వాళ్ళు ఎవరిని నమ్మేట్టులేరు.   అంతే.   బట్   ఈ కుర్రాడు ఎవడో గాని అతని వాయిస్ ఫ్రీక్వెన్సీని బట్టి చూస్తే ఇతను అన్నిటికీ సమర్ధుడనిపిస్తోంది.   స్థిరమైన అభిప్రాయాలు గలవాడు.   భయమంటే తెలినివాడు.   శతృవు మీద వ్యూహ ప్రతి వ్యూహాలు చేయటంలో సమర్ధుడు. ప్రేమకోసం ప్రపంచాన్ని ఎదిరించే సాహసి అన్పిస్తోంది.   సహస్రను కాపాడుకోడానికి తమ రక్షణలో తామున్నారట.   కంగారుపడాల్సిందేమీ లేదంటున్నాడు. ఎందుకైనా మంచిదని నా పర్సనల్ నెంబరిచ్చాను.   ఈ అబ్బాయి చాలా తెలివైన వాడు.   ఇక వాళ్ళ గురించి వదిలేసి కమిసనర్ గారు ఏం చెప్తారో విని దాన్ని బట్టి ఒక నిర్ణయం తీసుకుందాం” అంటూ వివరించింది.ఇంతలో చెన్నై సిటీ కమీషనర్   ఆఫ్ పోలీస్   వచ్చి బయట వెయిట్   చేస్తున్నారని సెక్రటరీ వచ్చి చెప్పగానే వెంటనే లోనికి రప్పించమన్నారు సి యం.వస్తూనే ఫార్మాలిటీగా సి యం కు సెల్యూట్   చేసాడు.   ఆరుగుల పొడవున చాలా హుందాగానూ గంభీరంగా నూ వున్న నడివయసు వ్యక్తి కమీషనర్.

“రండి కమీషనర్   గారూ మీతో ముఖ్యమైన విషయం ఒకటి మాట్లాడాలి,   కూచోండి” అంది చెందామరై.

“ఫరవాలేదు మేడం.   విషయం ఏమిటో చెప్పండి”   అన్నాడు ఎదురుగా నిలబడుతూ కమీషనర్.

“నాకో విషయం తెలియాలి. ఈ ప్రకటనలో యువతి?... ఈ ప్రకటన మీరు చూసారుగా?”

“చూసాను మేడం”

“ఈ అమ్మాయి ఎక్కడ కన్పించినా వెంటనే అరెస్ట్ చేసి కేసుబుక్   చేయమని మీరు ఆర్డర్స్   ఇష్యూ చేసారని విన్నాను. అందుక్కారణం తెలుసుకోవాలనుకుంటున్నాను. చెప్పండి కమీషనర్ గారూ ఆ కుర్రాడెవరో తన ప్రియురాల్ని పట్టిస్తే కోటి అంటూ ప్రకటనిస్తే మీరు అమ్మాయి మీద అరెస్ట్ వారంట్   ఇష్యూ చేసారు ఎందుకు?”   సీరియస్గా ప్రశ్నించింది   సియం.

“అందుకు రెండు ప్రధాన కారణాలున్నాయి మేడం. ఈ అమ్మాయి తండ్రి మహదేవనాయకర్. తన కూతురు లక్ష్మీ సహస్ర ఆరు మాసాలయినా కన్పించటం లేదు ఆమె చెన్నైలో ఉన్నట్టు ఈ ప్రకటన మూలంగా తెలిసింది గాబట్టి ఆమె చెన్నైలో ఎక్కడ వున్నా పట్టుకొని మధురై తన ఇంటికి పంపించవలసిందిగా మధురై పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్   ఇవ్వటంతో బాటు మా కార్యాలయాని క్కూడ అభ్యర్ధిస్తూ లెటరు వ్రాసాడు.   ఇది మొదటి కారణం.

రెండో కారణం ఈ అమ్మాయి మధురైలో పది మందిని దారుణంగా కొట్టిపారిపోయిందనీ, వాళ్ళలో ముగ్గురింకా ఆస్పత్రిలో కోమాలో ఉన్నారని, ఈ అమ్మాయి మీద మధురై పోలీస్ స్టేషన్ లో అరెస్ట్ వారంట్ ఉందని కాబట్టి చెన్నైలో ఈ అమ్మాయిని అరెస్ట్ చేసి కేసుబుక్ చేసి మధురై పోలీసులకు అప్పగించమని అక్కడి ఎ యస్ పి ప్రకాష్ స్పెషల్ గా రిక్వెస్ట్ చేయటం జరిగింది. ఈ రెండు కారణాల దృష్ట్యా ఈ ఆర్డర్స్ ఇష్యూ చేయాల్సొచ్చింది మేడం" . అంటూ వివరించాడు గుహనాథన్.

'ఆ అమ్మాయి చేతిలో దెబ్బతిన్నవాళ్ళు ఎవరో మీకు తెలుసా?" సూటిగా అడిగింది సి యం చెందామరై. "తెలీదు మేడం""ప్రముఖ జర్నలిస్టు లహరి ఈ అమ్మాయేనని మీకు తెలుసా ? అది కూడ తెలీదా?"

"తెలీదు మేడం!"

"ఆ ఎ యస్ పి ప్రకాష్ మీద దాడి జరిగి ప్రస్తుతం హాస్పిటల్లో వున్న సంగతి తెలుసా?"

"తెలుసు మేడం"

"అతడు మీ మేనల్లుడు గాబట్టి అతని మాటలకి ప్రాధాన్యత నిచ్చారా?"

"మేడం..." కమీషనర్ షాక్ తింటూ గొణిగాడు.

"ఇంకేం చెప్పకండి. ఏమీ తెలుసుకోకుండా అరెస్ట్ వారెంట్ ఎలా ఇష్యూ చేసారు? మీ మేనల్లుడు అక్కడ కుంభకోణాల పుట్ట. జగన్మోహన్ కి ఫర్ గా పనిచేస్తున్న సంగతి కూడ మీకు తెలీదు. కోర్టు బయటే తనను చంపాలని ప్రయత్నించిన జగన్మోహన్ మనుషుల్ని ఆత్మ రక్షణ కోసం ఆ అమ్మాయి కొట్టి తప్పించుకు పారిపోతే, క్రిమినల్ మీద కేసుపెట్టినట్టు ఆ అమ్మాయి మీదే కేసు పెట్టడానికి మీ డిపార్ట్మెంట్ సిగ్గుపడాలి. కనీసం హోం మినిస్టర్తో కూడ సంప్రదించకుండా మీరీ నిర్ణయం ఎలా తీసుకున్నారు అర్థంగావటం లేదు."సి యం మాటలు కమీషనర్కు చమటలు పుట్టించాయి. అసలీ సహస్ర విషయంలో సి యం కింత ఇంట్రస్టున్న సంగతే తనకు తెలీదు. తెలిసుంటే మేనల్లుడు ఎ యస్ పి ప్రకాష్

మాటలు నమ్మి తను బుక్కయిపోయేవాడు కాదు. లోతుకు వెళ్తే తను చాలా ఇబ్బందుల్లో పడతాడు. తనకింత వరకు మధురై నుండి డిపార్ట్మెంట్ పరంగా ఆ కేసుల తాలూకు పేపర్స్ ఏవీ చేరలేదు. తప్పు ఒప్పేసుకోవటం మంచిది.

''సారీ .... అయం సారీ మేడం. పొరబాటు జరిగింది. వెంటనే ఆర్డర్స్ కాన్సిల్ చేయిస్తాను''. ఎలాగో గొంతు పెకల్చి సమాధానం చెప్పాడు.''ఇది మీరు కావాలని చేసారా పొరబాటున చేసారా అనేది నాకనవసరం అరెస్ట్ జరక్కూడదు. ఈ అమ్మాయి వెంట ఆమె ప్రియుడు ఉంటాడు. వాళ్ళిద్దరూ ఎక్కడ కన్పించినా సగౌరవంగా నా వద్దకు తీసుకురావాలి. అవసరమైతే మీ డిపార్ట్మెంట్ ఆ యిద్దరికీ రక్షణ కల్పించాలి. మరో విషయం.

వీళ్ళ కోసం మధురై నుంచి గాని ఇతర ప్రాంతాల నుంచి గాని కొన్ని అరాచక శక్తులు నగరంలో ప్రవేశంచే ప్రమాదం వుంది. నగర ప్రశాంతతకి ఎలాంటి భంగం జరక్కూడదు. సిటీకి వచ్చే అన్ని మార్గాల్లోను చెక్పోస్టుల్ని అలర్ట్ చేయండి. నగరంలోని లాడ్జిలు, హోటళ్ళను అలర్టా ఉండేలా చూడండి''.

''ఒకె మేడం. వెంటనే ఆ ఏర్పాట్లు చేయిస్తాను. వస్తాను మేడం'' అంటూ ఫార్మలిటీ ప్రకారం తిరిగి సెల్యూట్ చేసి చాలురా బాబు అనుకుంటూ వచ్చినంత హడావుడిగానూ వెళ్ళిపోయాడు కమీషనర్ .

అయితే ఇప్పటికే లేటయిందని రావలసిన వాళ్ళంతా సిటీకి వచ్చేసి అక్కడక్కడా సెటిలయి సహస్ర కోసం విరాట్ కోసం గాలిస్తున్నారని ఎవరికీతెలీదు.

ఆ రోజు మధురై నుంచి బయలుదేరిన రెండు బేచీల్లోను ఎట్టయప్పన్ పంపించిన ధనగిరి బేచ్ ముందుగా చెన్నై చేరుకుంది. ధనగిరి చాలా తెలివైన వాడు. ముందు చూపు ఎక్కువ. అంతా గ్రూప్గా ఒకే లాడ్జిలో దిగటం క్షేమం కాదని వాడికి తెలుసు. తన మనుషుల్ని ఇద్దరిద్దరుగా విడగొట్టి వడపళని, కోడంబాక్కం, నుంగంబాక్కం లాడ్జిల్లో ఉండేలా పంపించి తను పాండీబజార్లో సెటిలయ్యాడు. ప్రతి ఉదయం తనే వచ్చి పికప్ చేసుకునేలా ఏర్పాటుచేసి తమ వెహికిల్ని తన వెంటే ఉంచుకున్నాడు.

వాళ్ళ వెనకే కాస్త ఆలస్యంగా సిటీ కి వచ్చిన వాళ్ళు కోయంబత్తూర్ నుంచి విరాట్ కోసం వచ్చిన మునుసామి బేచ్. వాళ్ళంతా రెండు గ్రూపులుగా విడిపోయి సెయింట్ థామస్ మౌంట్ లో ఎదురు బొదురుగా వుండే రెండు హొటళ్ళలో రూమ్లు తీసుకొని సెటిలయ్యారు.ఒక మహదేవనాయకర్ సహస్ర కోసం పంపించిన కదిరేషన్ బృందం అడయారులోని ఒక లాడ్జిలో సెటిలయ్యారు.

కోయంబత్తూర్కు చెందిన పిక్పాకెట్ బేచ్ మురడన్ ముత్తూ నేతృత్వంలో బిచ్చగాళ్ళు గా మారి అప్పటికేమి నంబాక్కం ఏర్ పోర్ట్ పరిసరాల్లో కాలనీలు బస్టాండ్లు అంతటా సహస్ర కోసం గాలించటం మొదలు పెట్టారు. నాలుగు రోజులు గడిచి పోయాయి కాని సహస్ర కనబలేదు వాళ్ళకు. అలాగే చెన్నై చేరుకున్న మూడు బేచ్లూ కూడా తమ వాహనాల్లో సిటీ వీధుల్లో తిరిగుతూ గాలింపు ఆరంభించారు. ఇదిలా వుంటే మరోపక్క పోలీసులు సిటీకి వచ్చే అన్ని మార్గాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేసారు.

రాత్రి వేళ లాడ్జిల కొచ్చి బసచేసిన వాళ్ళని విచారించి పోతున్నారు. ఈ పరిస్థితుల్లో మరో నాలుగు రోజులు ప్రశాంతంగా గడిచి పోయాయి.ఈ లోపల దీక్ష పుట్టిన రోజు వచ్చింది.ముగ్గురికీ ఈ సందర్భంగా ట్రీట్ ఇవ్వాలనుకుంది దీక్ష. మధ్యాహ్నం లంచ్కు ఏర్ పోర్టు సమీపంలోని ఖరీధైన ఒక రెస్టారెంట్కు బయలుదేరారు.ఏర్పోర్ట్ పరిసరాల్లో మురడన్ ముత్తూబేచ్ అంతా ముష్టి వాళ్ళ వేషంలో సంచరిస్తూ వారం రోజులు పైగా సహస్ర ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

I I I

అప్పటికి పావుగంట క్రితమే విరాట్ బైక్ రెస్టారెంట్ పార్కింగ్లో ఆగింది. అతడి వెనక బురఖా ధరించిన సహస్ర కూచునుంది. ఆ వెనకే చందూ నడుపుతున్న స్కూటీ వచ్చి బైక్ పక్కనే ఆగింది. అతడి వెనక దీక్ష వుంది. ఆమె కూడా బురఖాలోనే వుంది.నలుగురూ రెస్టారెంట్ ఎంట్రన్స్ వైపు నడిచారు. సరిగ్గా వాళ్ళ పక్కనుంచే ముష్టి వాడి వేషంలోని మురడన్ ముత్తు ఎగువన సాదా హోటల్లో భోం చేయడానికి వెళ్ళాడు. కాని తామంతా వెదుకుతున్న సహస్ర పక్కనే ఉందని వాడికి తెలీదు.

కాసేపట్లో ఆర్డర్ చేసిన అయిటమ్స్ అన్నీ టేబుల్ మీది కొచ్చాయి. వెజ్ నాన్వెజ్తో కూడిన అద్భుతమైన వంటకాలు. కబుర్లు చెప్పుకుంటూ భోం చేసారంతా.

సుమారు రెండు గంటల ప్రాంతానికి బిల్లు పే చేసి బయటకొచ్చారు. అప్పటికింకా అటు భోజనానికి వెళ్ళిన ముత్తు వెనక్కి రాలేదు. ఇటు ఆ ప్రాంతంలోనే వేన్ పెట్టుకొన్న మునుసామి మందు కొట్టి బిర్యానీ తినగానే మత్తుగా గురకతీసి నిద్రపోతున్నాడు. బార్లో వున్న అతడి మనుషులింకా వెనక్కి రాలేదు. వస్తే పార్కింగ్ లోని విరాట్ని ఖచ్చితంగా గుర్తుపట్టేవాళ్ళు. ఈ లోపల `

‘‘ఏయ్ దీక్షా అటు చూడవే. అక్కడేదో పెద్ద ఫాన్సీ స్టోరుంది వెళ్దామా?’’ అంది సహస్ర.

‘‘ఏం కావాలి?’’ అడిగాడు విరాట్.

‘‘నచ్చినవి ఏముంటే అవి తెచ్చుకొంటాం. ఇక్కడే ఉండండి. త్వరగా వచ్చేస్తాం.’’ అంటూ దీక్షతో అటు కదిలింది సహస్ర. ఎందుకయినా మంచిదని చందూని వాళ్ళ వెంట పంపించి తను బైక్ దగ్గర ఉండిపోయాడు విరాట్. వెళ్ళిన ముగ్గురూ స్టోర్లోకి పోవటం చూస్తూనే వున్నాడు. ఇంతలో`

విలాసవంతమైన కారొకటి హంసలా దూసుకొొచ్చి విరాట్ సమీపంలో ఆగింది.

యధాలాపంగా అటు చూసిన విరాట్`

సడెన్గా సునామీ వచ్చి మీద పడుతున్నట్టుగా... అదిపడ్డాడు.

ఆ కారులో వచ్చింది వేరెవరో కాదు.

విశాల!

డ్రైవింగ్ సీట్లోంచి దిగి`

సుడిగాలిలా తన వైపే వచ్చేస్తోంది.

చీర జాకెట్ లో షోకేసులో బొమ్మలా ఈ రోజు మరింత అందంగా ఉంది. చివరిగా ఆ రోజు ఎగ్మోర్ రైల్వేస్టేషన్ కలవడమే. తర్వాత బైక్ సర్వీసు నుంచి రావటంతో ట్రైన్కి వెళ్ళాల్సిన అవసరం లేకపోయింది. సడెన్గా తిరిగి ఇప్పుడు ప్రత్యక్షమైంది. అదీ టైమ్ గాని టైమ్లో.ఓరి దేవుడా! ఈ టైమ్లో దీన్ని పంపించావేంటయ్యా బాబు. దీన్ని నా పక్కన సహస్ర చూసిందంటే వూహించని ఉత్పాతాలు జరిగిపోతాయి. ఏం చేయాలి?’’ అనుకుంటూ ముఖం పక్కకు తిప్పుకోబోయి కూడా ఆగిపోయాడు.సందేహం లేదు.తన్నిక్కడ పార్కింగ్లో నిలబడటం చూసే కారునిటు మళ్ళించింది విశాల. తప్పించుకొనే ఛాన్సేలేదు.‘దేవుడా దేవుడా. సహస్ర వచ్చేలోన

విశాలను పంపించేయి స్వామీ. నీకు నూరు కొబ్బరికాయలు కొడతాను' అని మనసులోనే దేవుడికి మొక్కుకొంటూ విశాలను చూసి విష్ చేసాడు.అతి సమీపంగా`ఎదురుగా వచ్చి నిలబడిరది విశాల.''హలో విశాల... ఎలా వున్నావ్? ఏమిటి అనుకోకుండా ఇటుపక్క?'' పొడి పొడిగా పలకరించాడు.ఆమె బదులు చెప్పలేదు.

అతడ్నే చూస్తోంది.

ఆమె కళ్ళల్లో జలపాతంలా`

దూకడానికి సిద్ధంగా ఉంది కన్నీరు.

అందంలో మార్పు రాలేదు గాని`

ఏదో బెంగతో వున్నట్టు మనిషి కాస్త చిక్కింది.

''అంతేనా? నాతో మాట్లాడ్డానికి నికింకేం మాటలు లేవా?'' అంది రుద్ధ కంఠంతో. విరాట్ నిశ్చేష్టుడయ్యాడు.

''విశాల.. ప్లీజ్... నేను చెప్పేది విను..'' అన్నాడు.

''ఏం వినమంటావ్? నా మనసు వినటం లేదే. ఏం చేయను? , నీకు చెప్పాల్సిందంతా సిగ్గు విడిచి అప్పుడే చెప్పాను. నువ్వు పెళ్ళి చేసుకున్న ఉంచుకున్నా ఏం చేసుకున్నా నేను నీ దాన్ని. నా పిల్లలకి నువ్వు తండ్రి కావాలి. నిన్ను ప్రేమించిన మనసు మరో మగాడ్ని అంగీకరించదన్నాను. నా అభ్యర్థనల్లో ఒక్కటీ తీర్చలేవా? మాట్లాడు విరాట్. నీవు కన్పిస్తావన్న ఆశతో పిచ్చిదానిలా ప్రతి రోజు గాలిస్తున్నాను. అదే ఎగ్మోర్ స్టేషన్కొచ్చి నీ కోసం ఎన్ని రోజులు నిరీక్షించానో తెలుసా. నీ ఫోన్ తెలిదు. అడ్రస్ తెలిదు. ఇక కనబడవేమో చచ్చిపోవాలనుకున్నాను తెలుసా?'' అంటూ ఇక దుఃఖాన్ని ఆపుకోలేక సడెన్గా అతడి ఛాతిని చుట్టుకుపోతూ గుండెల్లో ముఖం దాచుకొని ఏడ్చేసింది.

కొద్ది క్షణాల పాటు`

అచేతనుడైపోయాడు విరాట్.ఆమెను వారించలేక పోగా అప్రయత్నంగా అతడి చేతులు ఆమెను బంధించి వీపు నిమిరి ఓదార్చాయి. అతడి కళ్ళలోనూ నీరు చేరాయి.

విశాలను తేలిగ్గా తీసుకున్నాడు. మనం ప్రేమించే వాళ్ళ కోసం ఎంతగా ఆరాటపడతామో మనల్ని ప్రేమించే వాళ్ళు అంతగా ఆరాటపడతారని తెలుసుకోలేక పోయాడు. విశాల ఇంత డీప్గా తనను లవ్ చేస్తుందనుకోలేదు. మనసు బాధతో విలవిల్లాడిరది.

సరిగ్గా ఇదే సమయంలో`

అక్కడ బార్లో కెళ్ళిన మునుసామి మనుషులు వేన్ వద్ద కొచ్చారు. వాళ్ళలో ముందుగా బండశివ ఇటు పక్క పార్కింగ్లో ఒకమ్మాయి కౌగిట వున్న విరాట్ని చూసి గుర్తించాడు. వెంటనే మిగతా వాళ్ళని అలర్ట్ చేస్తూ వేన్లో మత్తుగా నిద్రపోతున్న మునుసామిని లేపాడు.విరాట్ కన్పించాడనగానే`

మునుసామి మత్తు మంచులా కరిగిపోయింది.

కళ్ళు నులుముకుంటూ దిగ్గున లేచి కూచున్నాడు. విరాట్ను గుర్తుపట్టి వేన్ దిగాడు.

‘‘వచ్చిన పనయిపోయింది. పదండి చినబాబుతో మాటాడి వెంటనే కోయంబత్తూరు తీసుకెళ్ళిపోదాం’’ అన్నాడు ఉత్సాహంగా బండశివ.‘‘బుద్ధి లేకుండా మాట్లాడకు. నువ్వో నేనో పిలిస్తే వచ్చేస్తాడనుకొన్నావా? ముందా అమ్మాయి ఎవరో చూడండి. పేపర్లో ప్రకటనిచ్చిన అమ్మాయి తనేనా?’’ అన్నాడు మునుసామి.

‘‘ఆ పిల్లగాకుంటే కౌగిలించుకుంటాడా ఏంటి? తనే అయియుంటుంది’’ అన్నాడు డ్రయివర్.‘‘లేదు లేదు ఈ అమ్మాయి ప్రకటనలో ఉన్న పిల్ల కాదు’’ అన్నాడు కంగారుగా బండశివ. మునుసామి ఆలోచించాడు.

‘‘ఒరే... ఇప్పుడే మనం చినబాబు ఎదుట పడ్డం మంచిది కాదు. ప్రకటనలో పిల్ల ఎవరు, ఈ అమ్మాయి ఎవరు? చినబాబు పరిస్థితి ఏంటో తెలుసుకోవాలి. అంతా వేనెక్కండి. రెడీగా ఉందాం. చినబాబుని ఫాలో చేసి ముందు అడ్రసేంటో తెలుసుకుందాం. గెట్ రెడీ’’ అన్నాడు.

అంతే.

క్షణాల్లో అంతా వేన్ లోకి చేరిపోయారు. డ్రయివరు వేన్ ని దూకించటానికి రెడీగా కూచున్నాడు.

ఈ లోపల`

‘‘మాట్లాడు విరాట్. ఇంకా మౌనం వహిస్తావా? నేను నీ ఆస్థి నాశించానా, సొత్తు నాశించానా... నా ఆస్థి మొత్తం నీకే ఇస్తానన్నాను. నిన్ను దక్కించుకోవాలంటే ఇంకేమివ్వగలను’’ అంది కౌగిలి వదిలి పైట చెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ విశాల.

‘‘విశాలా.. నీకెలా చెప్పాలో అర్థం గావటం లేదు. నీతో పరిచయానికి ముందే నేను లవ్లో వున్నాను’’

‘‘అబద్ధం. అప్పటికి నువ్వెవరినీ ప్రేమించ లేదు’’

‘‘ఒకే. ఆ తర్వాతే అనుకో. ఇప్పుడా అమ్మాయి ఇక్కడే వుంది. కాస్సేపట్లో వాళ్ళు వచ్చేస్తారు. మనల్నిలా చూస్తే బాగుండదు. ఫోన్లో వివరంగా చెప్తాను. ఈ విజిటింగ్ కార్డ్ తీసుకొని వెళ్ళిపో. విశాలా ప్లీజ్.’’ విషయం చెప్పేసాడు. విజిటింగ్ కార్డ్ కూడా ఇచ్చాడు. దాన్ని భద్రంగా దాచుకుంది విశాల. కాని వెళ్ళిపోలేదు. ‘‘నేనా అమ్మాయిని చూడాలి. ఇక్కడే వుంటాను’’ అంది.

తల మీద పిడుగుపడ్డట్టుగా కంగారు పడిపోయాడు విరాట్.

‘‘వద్దు విశాల. నా మాట విను. వెళ్ళిపో’’ బ్రతిమాలాడు.

‘‘కంగారుపడకు విరాట్. నేను నీ ఫ్రెండ్ని చెప్పు. నేనేమీ తన మీద అసూయపడను. నీ ప్రేమను పొందిన అదృష్టవంతురాల్ని నాకు మాత్రం చూడాలనుండదా?’’ అంటూ అతడి భుజం మీద చెయ్యేసి కళ్ళలోకి చూసింది.

సరిగ్గా అప్పుడే ఫ్యాన్సీ స్టోర్లోంచి సహస్ర దీక్షలు చెరో కేరీబేగ్ తో బయటికొస్తున్నారు. వాళ్ళ వెనకే చందూ వస్తున్నాడు. ఫ్యాన్సీ స్టోర్ మెట్లు దిగుతుండగానే ముందుగా విరాట్ పక్కన యువతిని సహస్ర చూసేసింది.

‘‘అన్నయ్యా అటు చూడు. విరాట్ భుజం మీద చెయ్యేసి మరీ అంత క్లోజ్ గా మాట్లాడుతోంది ఎవరా అమ్మాయి?’’ అంటూ వున్న చోటే ఆగిపోతూ చందూని పిలిచి అడిగింది.

చూడగానే షాకయి పోయాడు చందూ.

ఏం చెప్పాలో అర్థం కాలేదు.

ఓర్నాయనో. ఈ టైం లో విశాల ఇక్కడుందేమిటి? ఒరే విరాట్ నిప్పును పక్కన పెట్టుకున్నావేంట్రా బాబూ. చేతులు కాలుతాయో వీపు కాలుతుందో తెలీటం లేదే. సహస్రకి ఏం చెప్పాలి మనుసులోనే అతలాకుతలమై పోయాడు.

‘‘సహస్ర అడుగుతుందిగా చెప్పు చందూ ఎవరామె?’’ అంది దీక్ష.

‘‘అదే ఆలోచిస్తున్నాను. నాకు తెలీదు’’ తప్పించుకోడానికి మరో దారిలేక అడ్డంగా బొంకాడు.

సహస్ర ముఖంలో రంగులు మారిపోయాయి.

‘‘పదండి. ఎవరో తెలుసుకుందాం’’ అంటూ విసవిసా దీక్షను తీసుకొని ముందుకెళ్ళి పోయింది. ఎందుకైనా మంచిదని కాస్త వెనగ్గా

అనుసరించాడు చందూ.

“నీ ఫ్రెండు చందూ వస్తున్నాడు. నీ లవర్ ఎక్కడ?” విరాట్ని అడిగింది విశాల.

“అదో బురఖాల్లో వస్తున్న యిద్దరిలో ఒకరు చందూ లవర్. ఒకరు నా లవర్” చెప్పాడు విరాట్.

“మీరు ముస్లిం యువతుల్ని లవ్ చేసారా!”

“లేదు లేదు. కొన్ని కారణాల వలన వాళ్ళు బురఖాల్లో వస్తున్నారు. నీకు వివరంగా తర్వాత చెప్తాను” అంటూ బదులిచ్చాడు విరాట్.అప్పటికే విశాలకు ఎడంగా జరిగాడు విరాట్.

“ఎవరీ అమ్మాయి?” వస్తూనే సీరియస్గా అడిగింది సహస్ర.

“తను విశాల అని నా ఫ్రెండు. అనుకోకుండా ఇక్కడ కలిసింది. నిన్ను చూడాలని ఆగింది” తడబడకుండా బదులిచ్చాడు విరాట్. సహస్ర కళ్ళలో అనుమానం ఛాయలు తొంగి చూస్తున్నాయి.

“నిజంగా ఫ్రెండేనా? లేక అంతకుమించి...!”

“ఛ ఛ నిజంగా ఫ్రెండే. అరే చందూ నీకు తెలుసుగా. చెప్పవేంట్రా?”

“అవునవును నాకు తెలుసు. ఫ్రెండే. టైమవుతోంది. వెళ్దాం పదండి” అన్నాడు హడావిడిపడుతూ చందూ.“అన్నయ్యా ఇందాక అడిగితే తెలీదన్నావ్?” నిలదీసింది సహస్ర.

“ఏం లేదమ్మ అప్పుడు దూరంలో వున్నాంగదా గుర్తు తెలీలేదు” అంటూ సమర్ధించుకున్నాడు. దీక్ష వాళ్ళ మధ్యన

ప్రేక్షకురాలిగా ఉండిపోయింది. సహస్ర ముఖం చూడాలని విశాల చూస్తోంది. ముఖం మీద క్లాత్ మూలంగా కళ్ళు మాత్రమే కన్పిస్తున్నాయి.''విరాట్ చెప్పాకే గుర్తొచ్చిందా?'' అంది సహస్ర. అనటమే కాదు ముఖానికి అడ్డంగా వున్న క్లాత్ని లేపి తలమీద కు వేసుకొని విశాల వంక చూసింది. ముఖం చూడాలనుకున్న విశాల కోరికయితే దీరింది గాని ఆ వెనకే ఆ ముఖాన్ని ప్రకటనలో చూసిన విషయం గుర్తొచ్చి విస్తుపోయింది.''హలో..... నీ పేరేమేటి?'' అడిగింది సహస్ర.

''నా పేరు విశాల... నేను విరాట్ ఫ్రండ్ని'' అంది విశాల.

''పెళ్ళి కాని అబ్బాయి అమ్మాయిల ఫ్రండ్ షిప్ని అర్థం చేసుకోలేనంత పిచ్చిదాన్ని కాను. తనకి కేవలం ఫ్రండు మాత్రమేనని నా మీద ఒట్టేసి చెప్పు''''ఒట్టు? యూ సిల్లీ..... నాకయితే వాటి మీద నమ్మకం లేదు. కాని నీ తృప్తి కోసం వేస్తాను. కాని విరాట్ నా ఫ్రండు గాబట్టి అతని మీదో` అతని లవర్ గానీ మీదో ఒట్టేయలేను. కాబట్టి అదో... ఆ విమానాశ్రయం మీద ఒట్టు. చెన్నై సెంట్రల్ స్టేషన్ మీదొట్టు. నుంగం బాకంలోని వళ్ళువర్ కొట్టం మీదొట్టు, మెరీనా బీచ్ మీదొట్టు, కావాలంటే అడయారు మర్రిచెట్టు మీద కూడా ఒట్టేసి చెప్తున్నాను. నేను విరాట్కి ఫ్రండ్ని మాత్రమే. చాలా?'' అంది విశాల.

అయినా సహస్ర ముఖంలో సందేహచ్ఛాయలు పోలేదు.విరాట్ భయం విరాట్ది.సహస్ర ముఖం నలుగురికీ కన్పించటం మంచిది కాదు.''సహస్ర ప్లీజ్ . ఏమిటా సందేహం? ముందు ముఖం మీది కి క్లాత్ వేసుకో'' అంటూ హెచ్చరించాడు.

క్లాత్ ముఖం మీదికి లాక్కుంది సహస్ర. కాని` ''లేదు మీరు నిజం చెప్పటం లేదు నేను వెళ్తున్నాను'' అంటూ గిరుక్కున తిరిగి వడివడిగా రోడ్ వైపు అడుగులేసింది.

''సహస్ర ఆగు చెప్పేది విను'' అంటూ వెనక నుంచి విరాట్ పిలుస్తున్నా విన్పించుకోలేదు. వెనకే పరుగెత్తుకొచ్చిన దీక్ష తనను చేరే లోపలే అటుగా వచ్చిన ఆటో ఎక్కేసింది.

అతంకుముందే భోంచేసి వెనక్కి వస్తున్న బిచ్చగాడి వేషంలోని మురడన్ ముత్తు ఏంటా గొడవనుకొంటూ ఆగి చూస్తున్నాడు. సహస్ర ముఖం మీది క్లాత్ తీయగానే వాడు గుర్తుపట్టేసాడు. సహస్ర తమ కంటపడకపోడాని కారణం ఏమిటో అప్పటికి అర్థమైంది వాడికి. విరాట్ ఆమె లవరని, పేపర్ ప్రకటనిచ్చింది అతడేననీ గ్రహించాడు. సహస్ర కన్పించినందుకు ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయాడు.

ఎప్పుడైతే విశాల ఆటోలో బయలుదేరిందో ఆ వెనకే తనూ ఒక ఆటో పట్టుకుని ఫాలో చేస్తూ చక చకా తన కుర్రాళ్ళకి ఫోన్లు కొట్టనారంభించాడు. ఈ లోపల`

''చందూ.. సహస్ర అలిగి వెళ్లిపోతోంది. మీ యిద్దరూ ఆ ఆటోని ఫాలో చేసి ఆపండి. నేను వచ్చేస్తున్నాను'' అన్నాడు విరాట్.వెంటనే స్కూటీ మీద...

చందూ దీక్షలు బయలుదేరారు.

''సారీ విరాట్ అయాం సారీ. తను మరీ ఇంత సెన్సిటివ్ అనుకోలేదు'' అంది జరిగిందానికి నొచ్చుకుంటూ విశాల.

''ఇట్సాల్ రైట్. నేను బయలుదేరతాను'' అన్నాడు విరాట్.

''అంటే పేపర్లో ఆ ప్రకటనిచ్చింది నువ్వేనా?'' ఉండబట్టలేక అడిగేసింది విశాల.

వినిచిన్నగా నవ్వాడు విరాట్.

''యా.... ఆ ప్రకటనిచ్చింది నేనే, బట్ దటీజ్ లాంగ్ స్టోరీ. ఇప్పుడు చెప్పటం కుదరదు. తర్వాత చెప్తాను'' అన్నాడు.''ఫోన్ చేస్తావ్గా?''''హూ..... ''

''ఎలా చేస్తావ్ నా ఫోన్ నంబర్ నీ దగ్గర లేదుగా?'' అంటూ తనవేనిటీ బ్యాగ్ లోంచి తన విజిటింగ్ కార్డు తీసి విరాట్ కిచ్చింది విశాల. కాదనకుండా తీసుకొని తన వేలెట్లో భద్రం చేసాడు విరాట్.

''ఒకె ఇప్పుడ్రు నువ్వున్న పరిస్థితిలో కాఫీకి కూడరమ్మన లేను. ముందు త్వరగా వెళ్ళి తన అలకతీర్చు. త్వరగా బయలుదేరు'' అంది.''ఒకె సీ యు'' అంటూ బైక్ స్టార్ట్ చేసుకొని బయలు దేరాడు విరాట్. అతడి బైక్ అటె వెళ్ళగానే తన కారులో అక్కడ్నుంచి వెళ్ళిపోయింది విశాల.

ఇదే టైంలో...

అంతవరకు అవతల వేన్లో వెయిట్ చేస్తున్న మునిసామి బృందం విరాట్ బైక్ బయలుదేరగానే తమ వేన్ ని ముందుకు పోనిచ్చారు. కాస్త ఎడంగా విరాట్ బైక్ని ఫాలో చేయనారంభించారు.

అలిగి ఆటోలో వెళ్ళిపోతున్న సహస్రకి...

చాలా బాధగా వుంది.

మాట మాటకీ...

ఉబికివస్తున్న కన్నీళ్ళని తుడుచుకుంటోంది.

కళ్ళ ముందు...

విరాట్ భుజం మీద చనువుగా చెయ్యేసి మాటాడుతున్న అందమైన విశాల రూపమే కనబడుతోంది. అది కేవలం స్నేహమైతే అంత చనువెలా వస్తుంది? పైగా అందమైన అమ్మాయి. తన జీవితంలో మరో అమ్మాయి కూడ వుందని, విరాట్ ఇంతవరకు తనతో చెప్పనే లేదు. విరాట్ పక్కన మరో అమ్మాయిని వూహించుకోలేకపోతోంది. బిగ్గరగా ఏడవాలనుంది కాని ఏడవలేకపోతోంది. ఆటోలో పోతూ ఏడిస్తే చూసే వాళ్ళు తనను కిడ్నాప్ చేస్తున్నారని ఆటోవాడ్ని సందేహించే ప్రమాదం వుంది. ఇక విరాట్తో మాట్లాడకూడదు. అయిందేదో అయింది. ఇక తను జాగ్రత్తలో తనుండటం మంచిది.

మనసులోనే పరిపరివిధాలా ఆలోచిస్తూ...

దుఖ్ఖాన్ని దిగమింగుతోంది సహస్ర...

ఇంతలో ఆటో ఒక జంక్షన్ దాటింది. అది అలా దాటిందో లేదో ఇలా రెడ్ సిగ్నల్ పడిరది. ట్రాఫిక్ ఆగింది. వెనకే మరో ఆటోలో ఫాలో అవుతున్న ముత్తు ''పోనీ... ఆటో వెళ్ళిపోతోంది''

''ఎక్కడికి పోయేది... సిగ్నల్ పడిరది. పచ్చలైటు పడేవరకు పడుండాల్సిందే'' అన్నాడు విసుగ్గా డ్రయివరు.''ఛ... అదృష్టంఇంతలోనేముఖంచాటేయాలా? అమ్మాకరుమారియమ్మాత్వరగాసిగ్నల్ పడేలాచూడు తల్లీ'' అనరిచాడు ముత్తు.ఎక్కడి ట్రాఫిక్ అక్కడ నిలిచి పోయింది. ఇంజన్ల మోత హారన్ల గోల మధ్య ఎవరేం మాట్లాడుతున్నారో వినిపించటం లేదు. అంతలో గ్రీన్ సిగ్నల్ పడిట్రాఫిక్ మూవ్ అయింది. మురడన్ ముత్తు వున్న ఆటో పక్క నుంచే చందూ నడుపుతున్న స్కూటీ రివ్వున ముందుకెళ్ళిపోవటం ముత్తుకు తెలీదు. చూసుంటే చందూ వెంటపడేవాడే.

సిగ్నల్ దాటి చాల సేపు వీధుల్లో గాలించినా ఎక్కడా సహస్ర ఎక్కిన ఆటో జాడ తెలిలేదు. దాంతో విసుగుచెంది ఒక కాకా హోటల్ దగ్గర ఆటో దిగిపోయి పంపించేసాడు ముత్తూ. ఈ లోపల అతడ్ని వెతుక్కుంటూ తలో ఆటో ఎక్కి అక్కడికి వచ్చి చేరుకున్నారు మిగిలిన కుర్రాళ్ళు. అందరికీ టీ ఆర్డర్ చేసాడు ముత్తూ.

''ఏమైందన్నా ఆ అమ్మాయి ఆచూకి తెలిసిందా?'' ఆత్రంగా అడిగాడొకడు.''సిగ్నల్ దగ్గర ఆటో మిస్సయింది. ఇక అడ్రసేం తెలుస్తుంది. కొంచెంలో మిస్సయింది. కాని.... ఆమె దూరంలో లేదు. ఈ ప్రాంతంలోనే ఎక్కడో ఉంది. బురఖాలో తిరుగుతోంది. గుర్తు పట్టడం కష్టం. జాగ్రత్తగా వెతకాలి. ఇవాల్టి నుండి ఈ పరిసరాల్లోనే మన డ్యూటీ. అరేలింగుస్వామి, నువ్వు ఎగువన సిగ్నల్స్ దగ్గర ఉండరా. అరే మారియప్పా నువ్వు ఆ కన్పించే మార్కెట్ దగ్గర అడుక్కో'' అంటూ అందరికీ ఎవరెక్కడ వుండి సహస్రను గాలించాలో వివరించాడు ముత్తు.టీ తాగి అంతా తమ తమ చోటుకి బయలుదేరారు. వాళ్ళను పంపించి తను కాలి నడకన పక్క కాలనీ వైపు బయలు దేరాడు ముత్తూ.''ఆపు.......... ఆటో ఆపు................'' సహస్ర వెళ్తున్న ఆటో పక్కగా తన స్కూటీని పోనిస్తూ పెద్దగా అరిచాడు చందూ.చందూని దీక్షను చూడగానే ఆటో ఆపవయ్యా అంది సహస్ర. వెంటనే ఆటోని పక్కకు తీసి ఆపాడు ఆటోవాలా. వెంటనే స్కూటీ దిగిపోయి ఆటో లోకి వచ్చేసింది దీక్ష.

''ఏయ్ దీక్షా ఇదన్యాయం, నువ్వటెళ్ళిపోయావేంటి'' అరిచాడు చందూ.

''నా పుట్టినరోజు నాడు నా ఫ్రండుని ఏడిపించారు. నిన్ను నీ ఫ్రెండూని క్షమించను.''

‘‘ఓర్నాయనో, ఇదేమిటి.... మధ్య నేనేం చేసాను.’’

‘‘ఏం చేశావని అడుగుతున్నావా....... ఆ పిల్ల గురించి నీకు తెలికుండా వుంటుందా? ఎందుకు చెప్పలేదు? మీ ముఖం మాకు చూపించకండ. ఆటో పోనీ’’ అంది.

‘‘ఇదన్యాయం... అక్రమం... నా మాటవిను....’’

‘‘గోటు హెల్’’

ఆటో బయలుదేరింది.

ఇక దుఖం ఆపుకోలేక...

దీక్షను కౌగిలించుకొని చిన్నగా ఏడ్చేసింది సహస్ర.

‘‘వూరుకోవే. ఇప్పుడేమైందని. ఈ మగాళ్ళింతే. మాయగాళ్ళని సరిపెట్టుకోడమే. బాధపడకు’’ అంటూ ఓదార్చింది దీక్ష.

ఆటోని ఫాలో అవుతూ... అరుస్తూనే వున్నాడు చందూ.

అతడి మాటల్ని అమ్మాయిలు పట్టించుకోలేదు.

ఆటో గోస్వామి కాలనీ లో ప్రవేశించింది.

ఆటోకి డబ్బులిచ్చి పంపించేసి తాళం తీసి ఇంట్లోకి నడిచారు సహస్ర దీక్షలు. స్కూటీని లోనకు తెచ్చి చందూ వచ్చే లోపు వీధి తలుపు మూసేసింది దీక్ష.

"దీక్షా ప్లీజ్ తలుపు తెరువ్" అరిచాడు చందూ.

"నో" అంది లోపట్నుంచి దీక్ష.

"ఇక ఈ ఇంటి తలుపులు మీకు శాశ్వతంగా మూసుకు పోయాయి. ఇంకెప్పుడూ ఇటు రావద్దు. వెళ్ళిపో" అంది కటువుగా."స్కూటీ తాళాలు?"

"కిటికీ లోంచి లోనపడెయ్"

కోపంగా తాళాలను కిటికీలోకి విసిరేసాడు చందూ.

"ఇంతగా బ్రతిమాలుతున్నా పట్టించుకోవడం లేదంటే మీరు ఆడోళ్ళా? కాదు. బండరాళ్ళు. ఏం జరిగిందో తెలుసుకోకుండానే నన్ను నా ఫ్రెండ్ని అనుమానించారు. సందేహించారు. దీనికి ఓ రోజు మీరు బాధ పడక తప్పదు. ఈ క్షణం నుంచి నేనే మిమ్మల్ని బహిష్కరిస్తున్నాను. విరాట్ ఇటు వస్తానన్నా రానివ్వను. ఇంతగా మమ్మల్ని అవమానించాక ఇంకా మీతో మాకు పనేమిటి? గుడ్ బై."

బయట నుంచే ఆవేశంతో అరిచి... కోపంగా వీధిలోకొచ్చి తమ ఇంటి దిశగా నడక ఆరంభించాడు చందూ.

చివరిగా విశాల వద్ద నుండి బైక్ మీద బయలు దేరిన విరాట్ క్రమంగా సిగ్నల్స్ని దాటాడు. ఒక వేన్ తనను ఫాలో అవుతోందని అతడికి తెలీదు. అలిగి వెళ్ళిపోతున్న సహస్ర మీద ఆలోచనల్తో పరిసరాల్ని గమనించే స్థితిలో లేడు విరాట్.

సిగ్నల్స్ దాటగానే త్వరగా గోస్వామి కాలనీకి చేరుకోవాలని బైక్ని లెఫ్ట్ లోని ఒక వీధిలోకి పోనిచ్చాడు. అది కాస్త ఇరుకు వీధి...అయినా కూడ వదల్లేదు మునుసామి.

"పోనీ... ఆ బైక్ ఎటు పోతే అటుపోనీ" అనరిచాడు.

డ్రయివరు పోనిచ్చాడు.

ఎలాగో మూడు ఫర్లాంగుల దూరం పోగలిగారు. అక్కడ నుండి విరాట్ పక్కనున్న సన్నటి సందు గుండా బైక్ మీద రివ్వున లోనకెళ్ళిపోయాడు. బైక్ గాబట్టి వెళ్ళిపోయింది అంత పెద్ద వేన్ ఆ సందులోకి ఎలా పోతుంది...?

"ఏం చేద్దాం?" అడిగాడు డ్రయివరు.

"నువ్వాగు చెప్తాను" అంటూ తల బయట పెట్టి అటుగా పోతున్న ఒక యువకుడ్ని దగ్గరకు పిలిచాడు మునుసామి.

"బాబూ ఈ సందులో పోతే ఎక్కడికి పోతుంది?" అడిగాడు.

ఆ యువకుడు ఆ సందుని వేన్ని లోపలున్న వాళ్ళని విచిత్రంగా చూసాడు.

"మీకేమన్నా పిచ్చా? ఇంత వేన్ ఆ సందులోకి ఎలా పోతుంది?" అనడిగాడు.

"వెళ్ళదు గాబట్టే నిన్నడుగుతున్నానోయ్.

‘‘గోస్వామి కాలనీకి పోడానికి ఇదే దగ్గర దారి.’’

వేన్ ముందుకు కదిలింది.

ఆ క్షణంలో తామంతా విరాట్ను సమీపిస్తున్నట్టుగా వేన్లో ఎవరికీ తెలిదు. క్రమంగా కాలనీ గేటు ను సమీపించింది వేన్.‘‘ఏమిట్రా ఇళ్ళన్నీ ఒకే డిజైన్లో భలే అందంగా వున్నాయిక్కడ? ’’ అన్నాడు చుట్టూ చూస్తూ మునుసామి.

‘‘అవును. కాలనీ మొత్తం ఇళ్ళన్నీ ఫారెన్ స్టయిల్లో కట్టారు’’ అన్నాడు డ్రయివరు. వేన్ లెఫ్టికి తిరిగి మొదటి వీధిలోకి ఎంటరయింది. తిరిగీ తిరగ్గానే మూడో నంబరు ఇంటి గేటు ముందు ఆగున్న బైక్ వాళ్ళ కంటబడిరది. అదే నంబరు. అదే ఫారెన్ బైక్.

‘‘దొరికి పోయాడన్నా! చినబాబు దొరికిపోయాడు’’ ఆనందం పట్టలేక పెద్దగా అరిచాడు బండశివ.

విరాట్ బైక్ కాలనీ గేటులోకి వస్తుండగా కోపంగా నడుచుకుంటూ వస్తున్న చందూ కన్పించి బైక్ ఆపాడు.

‘‘ఏమైంది? నడిచొస్తున్నావేంటీ? వాళ్ళద్దరూ ఇంట్లో వున్నారా’’ అడిగాడు.

‘‘ఊ వాళ్ళు క్షేమంగానే ఇంటికి చేరుకున్నారు. మనం కూడ ఇంటికి పోదాం పద’’ అన్నాడు చందూ.‘‘నువ్వు పద. నేనోసారి వెళ్ళి మాట్లాడి వస్తాను’’ అన్నాడు విరాట్.

‘‘వద్దు. వెళ్ళొద్దు. ముందు ఇంటికి పద’’ అంటూ బైక్ వెనక కూచున్నాడు చందూ.వాడింత సీరియస్గా ఉండటాన్ని...విరాట్ ఎప్పుడూ చూళ్ళేదు. వీధిలో ఎందుకులే అని బైక్ని ఇంటికి పోనిచ్చాడు.‘ఇప్పుడైనా చెప్పరా. నిన్నేమన్నా అన్నారా? ఎందుకంత కోపం?’’ లోనకు రాగానే అడిగాడు.

‘‘కోపం కాదు కడుపు మంట. నన్నేమన్నా బాధ పడే వాడ్నికాదు. నిన్ను నీ ప్రేమని శంకించారు.’’

‘‘సహస్ర ఏమన్నా అందా?’’

‘‘తనేమీ మాట్లాడలేదు. కాని దీక్ష. దానికేమైంది? నా పుట్టినరోజు నా ఫ్రండుని ఏడిపించారు నిన్ను నీ ఫ్రండును క్షమించను అంది. మీ ముఖం మాకు చూపించొద్దు అంది. అయినా సిగ్గు లేకుండా ఇంటిదాకా వెళ్ళాను. తలుపులు మూసేసింది దీక్ష. ఈ ఇంటి తలుపులు శాశ్వతంగా మీకు మూసుకుపోయాయి. ఇంకెప్పుడూ ఇటు రావద్దు అంది. స్కూటీ తాళాలు కిటికీలోకి విసిరేసి వచ్చాను. ఇక మీదట నువ్వు ఆ యింటికెళ్తానన్నా వెళ్ళనివ్వనని సవాల్ విసిరి నాలుగు మాటలు దులిపి మరీ వచ్చేసాను. ఇక నువ్వటు వెళ్ళకు.’’ ‘‘ఏమిట్రా చందూ ఇది. సహస్ర బాధ పడుతుందని తనేదో తొందర పడి ఉంటుంది. నువ్వు కూడ ఏమిటి? ఇప్పుడున్న పరిస్థితిలో సహస్రను ఒంటరిగా వదిలేస్తామా? ఎంత ప్రమాదమో తెలుసా? తనను చంపాలని మధురై నుంచి అళగిరి బేచ్ చెన్నై వచ్చినట్టుగా ధర్మ ఫోన్ చేసి చెప్పాడు, వాళ్ళలో యిద్దరు బెస్ట్ షూటర్స్ కూడ వున్నారట…’’

‘‘నిజమేరా. ఆ బుద్ధి వాళ్ళకుండాలి గదా? విశాల నీతో కాస్త చనువుగా వున్నందుకే ఇంతగా అనుమానిస్తుందే. నువ్వు సహస్రని లవ్ చేస్తున్నావని తెలిసినా విశాల ఎంత నిబ్బరంగా వుంది? ఎంత ప్రశాంతంగా వుంది? నువ్వు కాదన్నా నీ చుట్టూ తిరుగుతోంది. కాని సహస్ర… తన కోసం ఎంత చేస్తున్నావ్? ఎంత రిస్క్? అయినా ఎదిరించడానికి సిద్ధంగా వున్నావ్. అలాంటి నిన్ను, నీ ఫ్రెండ్గా నన్నూ వాళ్ళంత దారుణంగా అవమానించాల్సిన పని లేదు.



కనీసం ఏం జరిగిందో చెప్పే అవకాశం కూడ యివ్వనప్పుడు వదిలేయటమే. అంతే. నేను దీక్షను మర్చిపోతాను. నువ్వు సహస్రను మర్చిపో. ఇంత కన్నా మార్గం లేదు'' అన్నాడు ఆవేశంగా చందూ.

అతడి భుజం తట్టాడు విరాట్.

''ఒకె నీ కోపాన్ని అర్థం చేసుకోగలను. దీక్ష మాటల్ని పట్టించుకోకు. సహస్ర ఏమీ అనలేదు గదా నేనోసారి వెళ్ళి సహస్రతో మాట్లాడి వస్తాను'' అన్నాడు.

''వద్దంటున్నా గదా'' కోప్పడ్డాడు చందూ.

‘‘ఆవేశాన్ని తగ్గించరా. వాళ్ళు శత్రువులు కాదు. పంతాలు పట్టింపులు కాదు కావలసింది వాళ్ళ క్షేమం ముఖ్యం. ఇప్పుడే వచ్చేస్తాను’’ అంటూ చందూ హెచ్చరికని పక్కన పెట్టి బయట కొచ్చాడు విరాట్. బైక్ని అక్కడే వదిలి కాలి నడకన దీక్ష ఇంటికి బయలుదేరాడు. అతడు అటు మూడో వీధిలోకి మలుపు తిరిగిన మూడో నిముషంలో మునిసామి బృందం వేన్ ఇటు కాలనీలోకి వచ్చింది.

నడుచుకొంటూనే విరాట్ దీక్ష ఇంటికి చేరుకునే సరికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. వీధి గుమ్మం మూసి వుంది. బయట ఎవరూ తిరుగుతున్న జాడ లేదు.

‘‘సహస్రా...’’ పిలిచాడు.

సమాధానం లేదు.

తలుపు గట్టిగా తట్టి మూడు సార్లు పిలిచాక.

అప్పుడు దీక్ష గొంతు విన్పించింది.

‘‘తను ఎవరినీ కలవనంటోంది. విరాట్ ప్లీజ్ వెళ్ళిపోండి’’ అంది తలుపు వెనక నుంచి.

‘‘దీక్షా. తనంటే పొరబాటు పడింది. నీకేమైంది? ఎందుకిలా మాట్లాడతావ్? ఓ సారి తలుపు తియ్యి. తనతో మాట్లాడాలి’’ అభ్యర్ధించాడు. ఈసారి సహస్ర గొంతు ‘‘ఏం మాట్లాడతావ్?’’ అంటూ వినవచ్చింది. బాగా ఏడ్చినట్టుంది గొంతు మారింది.

‘‘నీ మాయ మాటలు నమ్మి ఇంకా నేను మోసపోడానికి సిద్ధంగా లేను. విశాల అంతటి విశాల హృదయం కాదు నాది. నువ్వు నా వాడివి. నాకే సొంతం అనుకున్నాను. కాదని తెలిసి పోయింది. మాట్లాడ్డానికింకేమీ లేదు. వెళ్ళిపో. ఇంకెప్పుడూ నా కోసం రావద్దు’’ అంది కటువుగా.‘‘ఇదేనా చివరి మాటా?’’ అడిగాడు.

"అవును"

"తలుపు తియ్యి. నా ముఖం చూసి చెప్పు"

"నీ ముఖం చూస్తే చెప్పలేను. మాయ జేస్తావ్? అందుకే తలుపు తియ్యను. ప్లీజ్ వెళ్ళి పో.విరాట్. గెట్ లాస్ట్!" అంటూ ఇక ఆపుకోలేక ఏడ్చేసింది సహస్ర.

తలుపు వెనక నుంచి...

సహస్ర ఏడుపు స్పష్టంగా విన్పిపిస్తోంది.

విరాట్ మనసు బాధ పడింది.

అలాగని ఎంత సేపు బయట నిలబడతాడు?

"ఒకె నీ అనుమానమే నిన్ను ఏడిపిస్తోంది. నేను గాని విశాల గాని కాదు. నిజం తెలుసుకుని నీవుగా నా వద్ద కొచ్చే వరకు నేన్నీ ముఖం చూడను. ఈ ఇంటి తలుపుల్లా నా యింటి తలుపులెన్నడూ ముసుకోవు. అని ఎప్పుడూ నీ కోసం తెరిచే వుంటాయి. వెళ్ళి పోతున్నాను" అని చెప్పి అక్కడ్నుంచి వెను తిరిగాడు విరాట్.

తను అంత చెప్పినా వినకుండా విరాట్ సహస్ర కోసం దీక్ష ఇంటికెళ్ళటం చందూకి నచ్చలేదు. చాలా కోపంగా వుంది. అవమానం తప్ప వెళ్ళినందు వలన ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలుసు. విరాట్ మీద కోపంతో కాలు కాలిన పిల్లిలా హాల్లో అటు యిటు పచార్లు చేయసాగాడు. ఎవరి మీద కోపం చూపించాలో తెలిటం లేదు. అంతలో బయట ఏదో...

ఒక వేన్ ఆగిన ఇంజన్ శబ్దం విన్పించింది.

ఎవరా అనుకుంటూ వీధిలోకి తొంగి చూసాడు. బిలా బిలా వేన్ దిగుతూ పది మంది కన్పించే సరికి కంగారు పడుతూ గబగబా వీధి గుమ్మంలోకొచ్చాడు.

"పట్టేసాం. చినబాబుని పట్టేసాం. వచ్చేసాం. చినబాబు ఇంటికొచ్చేసాం" అంటూ వాళ్ళంతా ఆనందంతో చిందులేస్తుంటే అర్థం గాక ముఖం చిట్లించాడు చందూ. పరుగులెత్తుకుంటూ పోర్టికోలోకి వచ్చేసారు వాళ్ళంతా.

"ఆపండ్రా మీ గోల. ఎవర్రా మీరంతా? చిన బాబెవరు? ఇక్కడా పేరు గలవాళ్ళెవరూ లేరు. వెళ్ళండి వెళ్ళండి" అనరిచాడు.

"ఏంటీ చిన బాబు లేడా... అక్కడున్న బైక్ ఎవరిది?" అరిచాడు బండ శివ.

"నీ తాతది. బండ వెధవా ఎవడ్రా నువ్వు? ఆ బైక్ మా విరాట్ది. ఎవరనుకొని ఎక్కడి కొచ్చారో కాస్త అడ్రస్ చూసుకు ఏడవండి. వెళ్ళండి వెళ్ళండి" అసలే కోపంలో వున్న చందూ చిర్రెత్తుకొచ్చి పెద్దగా అరిచేసాడు.

ఇంతలో చివరిగా తాగిన మత్తులో కాస్త లేటుగా వేన్ దిగిన మునుసామి ఒళ్ళు విరుచుకొని గేటు దాటి లోనకొస్తూ "ఇదిగో అల్లుడూ తొందర పడి నోరు జారక. వీళ్ళంతా మనోళ్ళే. చినబాబు ఎవరో కాదు. మీ విరాట్ మా చినబాబు" అనరిచాడు.

ఆ మాట విని చందూ తెల్లబోయాడు.

"అంటే..... మీరంతా వెంకట రత్నం నాయుడు గారి మనుషులా?"

"డౌటా అల్లుడూ?" అన్నాడు ఇంట్లోకొచ్చి సోఫాలో కూచుంటూ మునుసామి'.

“మీరంతా విరాట్ కోసం మధురై నుంచి బయలు దేరినట్టు మాకు ముందే తెలుసు”

“ఏమీ అనుకోకు నాయుడు గారిని పెద్దయ్యా గారని, పెద్దబ్బాయి విక్రాంత్ని పెదబాబు అని, ఈ విరాట్ని చినబాబు అని పిలుచుకోవటం మా అలవాటు. మేమంతా నూలు మిల్లు కార్మికులం. అంతే కాదు కర్ర సాము కత్తి సాము నా దగ్గరే నేర్చుకున్నాడు చినబాబు. నాకు శిష్యుడు కూడా. కాబట్టి మొత్తం స్టోరీ నీకు తెలుసు. పెద్దయ్య గారి మాట కాదనలేక వచ్చాం. కాని చినబాబుని బలవంతంగా లాక్కెళ్ళి పోవాలని రాలేదు. ఆ మాటకొస్తే చినబాబుని కట్టి లాక్కెళ్ళే మొనగాడెవున్నాడని. అంచేత మేం వచ్చామని నువ్వేం కంగారు పడక్కర్లేదు. ఇంతకీ చినబాబు ఎక్కడ? బైక్ బయట వదిలేసి ఎక్కడికెళ్ళాడు?”

మునుసామి మాటలు, అడక్కుండానే చందూ డౌట్స్ ని క్షణాల్లో క్లియర్ చేసాయి.

“వచ్చేస్తాడు. ఏం తాగుతారు. వీళ్ళందర్నీ కూచోమనండి” అన్నాడు.

“నువ్వు నాకు నచ్చావ్. మనలో మనకి మర్యాదేమిటి.” అన్నాడు హుషారుగా మునుసామి.

“ఇంతకీ ఎక్కడుంటున్నారు మీరంతా?”

“హోటళ్ళలో ఉంటున్నాంలే గాని, నాకో విషయం అర్ధం గావటం లేదు”

“ఏ విషయం?”

“అక్కడ రెస్టారెంటు పార్కింగ్లో సంగతి. మేం చినబాబుని గుర్తు పట్టి చూస్తుండగా అతని కౌగిట ఓ అమ్మాయుంది. ఆ పిల్ల పేపరు ప్రకటన ఫోటోలో పిల్ల కాదు. కాస్సేపటికి బురఖాలు ధరించిన యిద్దరు ముస్లిం అమ్మాయిల వెంట అక్కడికి నువ్వొచ్చావ్. ఆ ఇద్దరిలో ఒకమ్మాయి ముఖం మీది ముసుగు తీసినప్పుడు చూస్తే ప్రకటనలోని అమ్మాయి సహస్ర.

అసలేంటి గోల? నాకు అర్ధమై చావట్లేదు. అసలు చిన బాబు లవ్ చేసింది ఒకర్నా ఇద్దర్నా? సహస్ర ముస్లిం అమ్మాయెలా

అవుతుంది? చిన బాబు మీద ఏదో గొడవ పడి కోపంగా ఎందుకెళ్ళి పోయింది?''

''ఆగు ఆగు. నాకు కాస్త క్లారిటీ కావాలి. తర్వాత అంతా చెప్తాను. పార్కింగ్ లో విరాట్ కౌగిల్లో ఆ అమ్మాయుందా? లేదు, నువ్వు పొరబాటున చూసుంటావ్. ఆ అమ్మాయి పేరు విశాల. తను విరాట్ ని ప్రేమిస్తుంది. గాని విరాట్ ప్రేమించటం లేదు''

''మరదే... ఎంత తాగితే మాత్రం నా కళ్ళు నన్ను మోసం చేస్తాయా? ముందు ఆ పిల్ల కౌగిలించుకొని ఏడ్చింది. తర్వాత తనూ కౌగిలి బిగించి ఓదార్చాడు. మా వాళ్ళంతా చూసారుగా. చెప్పండ్రా '' అన్నాడు, మునుసామి.

''అవును అన్న చెప్పింది కరక్టే. కౌగిలించుకున్నాడు'' అన్నాడు బండ శివ.

వాళ్ళంతా అవునంటుంటే..

చందూ ఆలోచనలో పడి పోయాడు...

అనుకోకుండా విశాల అటు వచ్చి విరాట్ను చూసి ఆగి ఉంటుందనుకున్నాడు. కాని వీళ్ళ మాటలు వింటూంటే ఆమె విరాట్ని వెతుక్కుంటూనే వచ్చుంటుందని, ఆమె వైపు క్రమంగా విరాట్ మనసూ మొగ్గుతోందనీ తనకే సందేహం వస్తోంది. ఇక సహస్ర సందేహించటంలో ఆశ్చర్యంఏముంది?

''ఇప్పుడన్నా నమ్ముతావా? చిన బాబు రెండు పడవల మీద కాలేస్తున్నాడు. సహస్ర, విశాలను సందేహించి అలిగి కోపంగా వెళ్ళి పోయింది. అంతేనా?'' అనడిగాడు మునుసామి.

అవునన్నట్టు తలూపాడు చందూ..

''చిన బాబు నెత్తి మీద రెండు సుడులున్నాయి. అవి చూసినప్పుడే సందేహించాను. మేన కోడలు సాగరికను పెళ్ళిచేసుకున్నా రెండో పెళ్ళాం కూడ తప్పదని. కాని సాగరిక తప్పిపోయి సహస్ర, విశాల యిద్దరూ వచ్చారు. బాగుంది. మరి బురఖాలో వచ్చిన ఆ

రెండో అమ్మాయి ఎవరు?''

''తను నా లవర్. పేరు దీక్ష. సహస్రకి ఫ్రెండు''

''ఆహా..... అయితే నువ్వు లైన్లోనే వున్నావన్న మాట. బాగుంది. చాలా బాగుంది. మరి ఆ బికారి వెధవ ఎవడు?''

''బికారా? ......... వాడెవడు'' ఉలిక్కి పడి అడిగాడు చందూ. అలా ఉలికి పాటు చెందటానిక్కారణం వుంది. విరాట్ ఒకటికి పది సార్లు సహస్రను హెచ్చరించాడు. ముఖం మీద క్లాత్ తీయొద్దని. కాని విశాలను చూసిన కోపంలో సహస్ర కొద్ది సేపు తీసింది. అది చాలు శత్రువు ఎవడన్నా ఆమెను గుర్తించడానికి.

''అక్కడ జరిగిందంతా చూసాను. మీ గొడవలో మీరుండగా అక్కడికి రావటం బాగుండదని ఆగాము. అలాగే అటుగా పోతూ ఓ బికారి ఆగి మిమ్మల్ని చూస్తూ నిలబడ్డాడు. ఓ చేతిలో చిప్ప ఇంకో చేతిలో కర్ర. మాసిన బట్టలు బిచ్చగాడి లాగే వున్నాడు.

సహస్ర ఆటో ఎక్కగానే కంగారుగా వెళ్ళి తనూ మరో ఆటో ఎక్కి ఫాలో అయ్యాడు. వాడేంటి ఆ అమ్మాయిని ఫాలో చేయటం ఏంటి నాకేమీ అర్ధం గాలేదు. అయితే వాడ్ని మీరు గమనించ లేదన్న మాట. వాడు ఎవడై ఉంటాడు?''

''ఇప్పుడు నువ్వు చెప్పే వరకు వాడి గురించే మాకు తెలీదు. వాడు నిజంగా సహస్ర వెనకే ఫాలో అయితే ఆ వెనకే వెళ్ళిన నాకు గాని దీక్షకు గాని వాడు కన్పించాలిగా.''

''ఏ సగ్నల్స్ దగ్గరో వాడు మిస్సయి ఉండొచ్చు. ఇంతకీ ఇక్కడ ఏం జరుగుతోంది. కాస్త వివరంగా చెప్పు. బుర్రకెక్కించుకుంటాను. అరే బండ శివా కాసిని మంచి నీళ్ళు పట్రా'' అంటూ సోఫాలో రిలాక్స్ గా జేర బడ్డాడు మునుసామి. బండ శివా కిచెన్ లో కెళ్ళాడు. చందూ సంక్షిప్తంగా చెప్పటం ఆరంభించాడు.

ఇంటికి తిరిగివస్తున్న విరాట్ కి...మనసు చాలా బాధ గానే వుంది....

విశాల వచ్చినప్పుడే ఇలాంటి పరిస్థితి ముందే వూహించి కంగారు పడ్డాడు. అదే నిజమైంది. తను వెళ్ళినా తలుపు తీయక పోవటం, లోన సహస్ర ఏడుస్తూ ఉండి పోవటం, మనసుకు వేదన కలిగించినా ప్రస్తుతానికి చేయగలిగింది ఏమీ లేదు. అయినా విధి రాత గాకపోతే అందురూ సంతోషంగా వున్న ఆ సమయంలోనే విశాల రావాలా!... ఇందులో ఎవర్ని తప్పు పట్టాలో కూడ తెలీటం లేదు. పరి పరి విధాలా ఆలోచిస్తూ తమ వీధి మలుపు తిరిగాడు విరాట్ అంతే

ఎదురుగా దృశ్యం చూసి తృళ్ళి పడుతూ...

ఎక్కడి వాడక్కడే ఆగి పోయాడు.

ఆశ్చర్యంతో అతడి కళ్ళు విశాలమయ్యాయి.

తమ గేటు ముందు తన బైక్ మాత్రమే ఉండాలి కాని ఇప్పుడా బైక్ పక్కన ఒక పెద్ద వేన్ కూడ నిలబడుంది. చూస్తుంటే అది తమ వేన్ లాగే వుంది. అవును. అదే నంబరు. తమ నూలు ఫ్యాక్టరీ ఆఫీసు వ్యాన్ అది. ఎవరు వచ్చుంటారు?

బయట ఎవరూ తిరుగుతున్న జాడ లేదు

మునిసామి బృందం చెన్నైలో వున్నా ఇంత త్వరగా అడ్రసు తెలుసుకోలేరు. మరి కోయంబత్తూర్ నుంచి వేన్లో వచ్చింది ఎవరు? అన్న విక్రాంత్ గాని డాడీ వెంకట రత్నం నాయుడు గారు గాని వచ్చుండాలి. వాళ్ళయితే తను చాలా చిక్కుల్లో పడతాడు. ఎలాగైనా వాళ్ళు తనను కోయంబత్తూరు తీసుకు పోవాలని చూస్తారు. ఎందుకైనా మంచిది. వచ్చింది ఎవరో తెలీకుండా లోనకు పోకూడదు.కంగారు అణచుకొంటూ...వేగంగా మలుపు లోని చెట్ల వెనక్కి వెళ్ళి పోయాడు విరాట్. తన సెల్ ఫోన్ అందుకుని చందూ నంబర్కి ఫోన్ చేసాడు.‘‘ఏరా, ఎక్కడున్నావ్? సహస్రతో మాట్లాడుతూ అక్కడే వున్నావా?’’ వెంటనే అడిగాడు చందూ.

‘‘అంత సీన్ లేదు గాని ఎవర్రా వచ్చింది? మనింటి ముందు మా వేన్ ఆగుంది?’’ అడిగాడు విరాట్.

‘‘అయితే వెనక్కి వచ్చేసావా? కంగారు పడాల్సిందేం లేదు. వచ్చెయ్. వేన్లో వచ్చింది మునుసామి మిగిలిన వాళ్ళను. వచ్చెయ్’’ బదులిచ్చాడు చందూ.

“థాంక్ గాడ్ డాడీ వచ్చారేమోనని కంగారు పడ్డాను. వస్తున్నా” అంటూ లైన్ కట్ చేసి చకచకా గేటు వైపు అడుగులేసాడు విరాట్.అతను వెళ్ళే సరికి లోన అందరూ విశ్రాంతిగా కూచునున్నారు. మునుసామి చిరునవ్వులో లేచి ఎదురు వచ్చాడు.

“నన్నాశీర్వదించండి గురువు గారూ” అంటూ వినయంగా విరాట్ మునుసామి పాదాలకు నమస్కరించాడు.

“అభిష్ట సిద్ధిరస్తూ. లే చిన బాబు” అంటూ భుజాలు పట్టి లేపి శిష్యుడి ముఖంలోకి చూస్తూ గుబురు మీసం దువ్వుతూ గర్వంగా చూసాడు మునుసామి.

“ఈ రోజుకీ గురువు గానే భావిస్తూ సాము గారడీలు నేర్చుకున్నప్పటి ఆచారాల్ని ఇంకా పాటిస్తున్నావంటే నిన్నెలా అభినందించాలో తెలీటం లేదు. ఓ పక్క నాకు యజమాని తర్వాత యజమాని అంతటి వాడివి. మరో పక్క నా శిష్యుడివి. నిన్ను పేరు పెట్టి పిలిచే అదృష్టం నాది. ఇంతకన్నా ఏం కావాలి?” అన్నాడు మురిసి పోతూ.

“గురువు గారు కొడుకు ఎంత గొప్ప వాడైనా తల్లిదండ్రులకు కొడుకే. అలాగే శిష్యుడెంత గొప్పవాడైనా గురువుకి ఎప్పుడూ శిష్యుడే. మన అనుబంధం ఎప్పుడూ యిలాగే ఉంటుంది. ఇంతకీ వూళ్ళో అంతా కులాసాగా వున్నారా? ఏరా బండ శివా…” అంటూ డ్రయివరుతో సహా అందర్నీ పేరు పేరున విరాట్ పరామర్శిస్తుంటే అంతా సంతోషంతో తల మునకలయ్యారు.

“మేం వచ్చామని మా గురించి నువ్వేమీ కంగారు పడకు చిన బాబు. ఓ వారం రోజులు చెన్నై అంతా తిరిగి చూసి వెళ్ళి పోతాం. నువ్వు కనబడలేదని పెద్దయ్య గారికి పెద బాబు గారికి చెప్పేస్తాం. కేవలం నిన్ను చూడాలనే వచ్చాం” అంటూ తన అభిప్రాయం చెప్పేసాడు మునుసామి.

“లేదు లేదు గురువు గారూ” అన్నాడు వెంటనే విరాట్.

“మీరు సరైన సమయానికొచ్చారు. మీరు కూడ మాతో ఇక్కడుంటే మాకు కొండంత బలంగా వుంటుంది. కూచొండి చెప్తాను” అంటూ కూచోబెట్టి పరిస్థితి అంతా వివరించాడు విరాట్.

“ఇదీ జరిగిన విషయం. కాకతాళీయంగా ఏర్పడ్డ పరిచయం. సహస్ర కన్నా ముందే విశాల పరిచయం. నన్ను ప్రేమిస్తున్నానంది. పెళ్ళి చేసుకో లేదా రెండో పెళ్ళాంగా చేసుకో. అదీ కాదంటే నా పిల్లలకి నువ్వే తండ్రి కావాలి అంటూ మనసు విప్పి ఎప్పుడో చెప్పింది. నేను పట్టించుకో లేదు. నన్నెంత గాడంగా ప్రేమిస్తుందో ఇప్పుడు చూసాక గాని అర్ధం కాలేదు. కౌగిలించుకుని ఏడ్చింది. నేనూ ఓదార్చాను. చనువు కొద్ది భుజం మీద చెయ్యేసి మాట్లాడిందే అనుకుందాం. ఆ మాత్రానికే మమ్మల్ని అనుమానించి ఏడుస్తూ వచ్చి ఇంట్లో కూచుంది సహస్ర.పాపం ఇప్పుడు చందూ కూడ దోషి అయ్యాడు. తన ముఖం చూడనంటోంది దీక్ష. ఇదిలా వుంటే అసలు ప్రమాదం ఏమిటో వాళ్ళకింకా తెలిసినట్టు లేదు. సహస్ర కన్పిస్తే పట్టి మధురై ఇంటికి తీసుకు పోడానికి మహ దేవ నాయకర్ మనుషులు కదిరేషన్ అనే వాడి ఆధ్వర్యంలో సిటీ కొచ్చి గాలిస్తున్నారు. మరో పక్క త్యాగరాజన్ మనుషులు సిటీలోకి దిగి సహస్ర కన్పిస్తే కాల్చి చంపాలని చూస్తున్నారు.

అందుకే సహస్ర దీక్షలు గుర్తు తెలీకుండా ఉండాలని బురఖాలు ధరించేలా చేసాను. ఇప్పుడు సమస్య వాళ్ళ రక్షణకు తగిన ఏర్పాటు చేయటం. వాళ్ళకి తెలికుండా మన వాళ్ళు ఫాలో అవుతూ ఏదన్నా గడబిడ జరిగితే వెంటనే మనకి ఫోన్ చేసేలా ఏదన్నా ఏర్పాటు చేయాలి...”

“చాలు చిన బాబు. నాకంతా అర్ధమైంది. ఇక చెప్పనక్కర్లేదు” అంటూ నిట్టూర్చాడు మునుసామి.

“నువ్వు చెప్పిన వాళ్ళే గాక, ఇంకెవరో సహస్ర కోసం ప్రయత్నిస్తున్నారనీ నా అనుమానం” అంటూ బిచ్చగాడు సహస్ర ఆటోను వెంబడించిన విషయం చెప్పాడు మునుసామి.

ఆశ్చర్య పోయాడు విరాట్.

“ఇక ఆవిషయం వదిలేయండి. ఆ ఏర్పాటు నేను చేస్తాను.” అంటూ మాటిచ్చాడు మునుసామి.

“కాని అన్నా, పెద్దయ్య గారితో మాటొస్తుందేమో ఓ సారి ఆలోచించు” అన్నాడు వెంటవున్న వాళ్ళలో ఒకడు.

“రానీరా. వస్తే అప్పుడు చూద్దాం. చినబాబు ఇంత రిస్కులో వుండగా వదిలేసి వెళ్తామా? వాళ్ళ లవ్ ని సక్సెస్ చేసే వెళ్దాం. ఏమంటారు?” అనడిగాడు అందర్నీ చూస్తూ.

“ఇక మేం అనేదేముంది నీ మాటే మా మాట. ఉంటున్నాం” అన్నాడు బండశివ.

“అవును ఉందాం” అన్నారు మిగిలిన వాళ్ళంతా.

“అయితే ఆలస్యం ఎందుకు? హోటల్ గదులు కాళీ చేసి వచ్చేయండి. మీ కోసం గెస్ట్ రూమ్ ఉంది. మీరంతా ఇక్కడ హాల్లోనే పడుకోవచ్చు. ఇది మనిల్లు ఏ సమస్యా ఉండదు” అన్నాడు వెంటనే విరాట్.

“చినబాబు తొందరొద్దు. నిన్ను తీసుకెళ్ళాలనొచ్చి నీకు సాయంగా ఉండి పోతున్నాం. అలాగని అంతా ఇక్కడికొచ్చేస్తే మాకు రెండు విధాలా నష్టం ఉంది. డబ్బు పంపించమని అప్పుడప్పుడూ అడక్కపోతే పెద్దయ్యగారు అనుమానించే ప్రమాదం వుంది. హోటల్ బిల్లులు ఖర్చంతా రేపు మేం లెక్క చెప్పాలంటే ఖర్చులు మామూలుగా జరగాల్సిందే. అంచేత ఓ పని చేద్దాం. నేను నాకు తోడుగా బండ శివ ఇక్కడుంటాం. మిగిలిన వాళ్ళంతా ఎప్పటిలాగే హోటల్ గదుల్లోఉంటారు. చేతిలో వేన్ వుంది గాబట్టి ట్రాన్స్పోర్టేషన్ సమస్య లేదు. ఉదయం వచ్చి రాత్రికి వెళ్ళి పోతుంటారు. వంతుల వారిగా సహస్ర దీక్షలను ఇద్దరు చొప్పున ఫాలో అవుతూ ఏ సమస్య వచ్చినా వెంటనే మనకి ఫోన్ చేస్తారు.”ఆ రోజు మొదలు...

సహస్ర, దీక్ష లు డ్యూటీకి వెళ్ళేప్పుడు వచ్చేప్పుడు. మునుసామి మనుషులిద్దరు ఆటోలో అనుసరిస్తూ ఎప్పుడూ గమనిస్తు వస్తున్నారు.మునుసామి విరాట్ ఇంట్లో ఉంటూ అవసరమైతే వేన్లో బయట కెళ్ళొస్తున్నాడు. పగలు హోటల్ నుంచి అతని మనుషులంతా విరాట్ ఇంటికొచ్చేసి రాత్రికి వెళ్తున్నారు. ఇంటిని మునుసామి అజమాయిషీకి వదిలేసి విరాట్ చందూలు ఎప్పటిలా బైక్ మీద ఆఫీస్కు వెళ్ళొస్తున్నారు.

I I I

నాలుగు రోజులు ప్రశాంతంగా గడిచి పోయింది.



సహస్ర గురించి విరాట్, దీక్ష గురించి చందూ

మనసులో బాధపడుతూనే వున్నారు. వాళ్ళు తమతో మాట్లాడక పోవటం చాలా బాధ కలిగించే విషయం.

నాలుగో రోజు రాత్రి పది గంటలకి పడుకున్నాడే గాని నిద్రకు దూరమయ్యాడు విరాట్. ఎంత కాదనుకున్నా తనను మర్చి పోలేక పోతున్నాడు. కోపం తగ్గిందో ఇంకా అలాగే ఉందో తెలీదు. ఓ సారి ఫోన్లో ట్రయ్ చేద్దామనే ఉద్దేశం తో ఫోన్ అందుకొని సహస్ర సెల్కి ఫోన్ చేసాడు.

అటు సెల్ రింగవుతోంది...

సహస్ర ఎత్తటం లేదు...

ఒకసారి... రెండోసారి.... మూడో సారి కూడ ఫోన్ తీయ లేదు. సహస్ర కోపం తగ్గలేదని అర్ధమవుతోంది. అయినా వదలకుండా కాసేపాగి తిరిగి ఫోన్ అందుకున్నాడు. సహస్ర కు ఫోన్ చేయక ముందే అతడి ఫోన్ మోగింది.

అటు నుంచి సహస్ర చేసుంటుందనుకొని ఉత్సాహంగా ఫోన్ డిస్ప్లే వంక చూసాడు. అది సహస్ర నంబర్ కాదు. విశాల నంబరు. ఓరి దేవుడా... ఇదేమిటి ఇప్పుడు ఫోన్ చేసింది? అనుకుంటూ చట్టున లేచి కూచున్నాడు. ఫోన్ లిఫ్ట్ చేద్దామా వద్దా అనుకునే లోపలే ఆగిపోయింది.

ఆ రోజు రెస్టారెంట్ పార్కింగ్లో కలిసాక తర్వాత తనూ ఫోన్ చేయలేదు. విశాలా ఫోన్ చేయలేదు. తను చేస్తాడని ఎదురు చూస్తుండాలి. ఉన్నట్టుండి ఈ టైమ్లో ఇప్పుడు ఫోన్ చేసింది. ఆలోచించే లోపలే మరోసారి ఫోన్ మోగింది.

ఈ సారి లిఫ్ట్ చేసాడు.

"హలోఈ టైం లో ఫోన్ చేసావ్, ఇంకా నిద్ర పోలేదా?" మృదువుగా అడిగాడు.

"నిన్ను చూసాక నిద్ర మర్చి పోయి చాలా రోజులైంది. అయినా నీకు తెలీదా? ఇది లవర్స్ టైమ్. రాత్రిళ్ళు ఫోన్లు చేసుకుంటారు" అంది అటు నుంచి విశాల.

"ఏయ్........మాటలతోనే సైలెంట్గా చంపేస్తావ్ నువ్వు" అంటూ నవ్వాడు.

"ఫోన్ చేయకుండా నువ్వు నన్ను చంపుతున్నావ్గా!"

"అది కాదు విశాలా........."

‘‘ఇంకేం చెప్పొద్దు. ఫోన్ చేస్తానన్నావ్ చేయ లేదు’’

‘‘వీలు కాలేదు. సారీ’’

‘‘పోనీ రేపయినా వీలవుతుందా? ఫోన్ కాదు నువ్వు మా ఇంటికి రావాలి.’’

‘‘వస్తాలే.... కాని రేపు కాదు.’’

‘‘రావాలి... రేపు నా పుట్టిన రోజు’’

పుట్టిన రోజనగానే ఉలికి పడ్డాడు విరాట్.

దీక్ష పుట్టిన రోజు రసాభాసై సహస్ర తనతో మాట్లాడ్డం మానేసింది. ఇప్పుడు విశాల పుట్టిన రోజంటోంది. ఇదే సమస్య కు దారి తీస్తుందో........‘‘ఏయ్........నువ్వు నిజమే చెపతున్నావా?’’ అనుమానంగా అడిగాడు.

‘‘నీతో అబద్ధం చెప్తానా? నువ్వు వస్తానంటేనే పుట్టిన రోజు జరుపుకుంటాను. లేదంటే అంతే.’’

‘‘ఏమిటిది? మరీ ఇరుకున పెట్టేస్తున్నావ్. అటు చూస్తే సహస్ర పీకల దాకా కోపంతో నాతో మాట్లాడ్డం మానేసింది. నువ్వు చూస్తే పుట్టిన రోజంటున్నావ్...’’

ఉన్నట్టుండి ఏడ్చేసింది విశాల.

“విశాల ప్లీజ్ వూరుకో. ఇప్పుడేమైందని ఏడుస్తున్నావ్?” బుజ్జగించ బోయాడు.

“ఏడవక ఏం చేయను విరాట్? నా సంతోషం కోసం ఈ చిన్న కోరిక్కూడ తీర్చలేవా?” అని అడుగుతుంటే ఇంకేం చెప్తాడు. కాదనలేక పోయాడు.

“ఒకె ఒకె తెల్లవారితే పుట్టిన రోజు. ఇలా ఏడవ కూడదు. వస్తాను. సరేనా” అన్నాడు.

“నిజంగా వస్తున్నావా?” వస్తాననగానే ఆనందంతో విశాల గొంతులోమార్పు వచ్చేసింది.

“ప్రామిస్గా వస్తాను. సరేనా? ఎప్పుడు రమ్మంటావ్ ఉదయమా, సాయంత్రమా?”

“సాయంత్రం నాలుగంటలకి. అడ్రసు నీ కిచ్చిన విజిటింగ్ కార్డు మీద వుంది. ఓల్డ్ మాంబళంలోమాయిల్లు.”

“ఒకె..........టైమ్కి వచ్చేస్తాలే”

“థాంక్యూ విరాట్. ఇప్పుడు నాకెంత సంతోషంగా ఉందో తెలుసా?”

“ఒకె విశాలా సీయు.... రేపు సాయంత్రం కలుద్దాం” అంటూ లైన్ కట్ చేసాడు.

తర్వాత మరోసారి ప్రయత్నించి చూద్దామని సహస్ర సెల్ కి ఫోన్ చేసాడు

సెల్ స్విచ్చాఫ్లో వుంది.

సహస్రకి విశాలకి ఎంత తేడా వుంది? ఒకరు ప్రశాంతంగా వుండే పార్వతి అయితే, ఒకరు తల మీద చిందు లేసే గంగమ్మ. సెల్ పక్కన పడేసి నిద్రకుపక్రమించాడు.

విరాట్ పరిస్థితి యిలా వుంటే.

పక్క గదిలో చందూ పరిస్థితి మరోలా వుంది.

చందూ కి మాగన్నుగా నిద్ర పడుతుండగా.

అతడి సెల్ మోగింది.

ఎవర్రా బాబు ఈ టైమ్లో అనుకూంటూ సెల్ అందుకొని చూసాడు... దీక్ష.

చందూ నిద్ర మత్తు చట్టున ఎగిరి పోయింది. దీక్ష ఫోన్ కాల్ గమనించగానే లాటరీలో కోటి రూపాయలు తగిలినంత సంతోషం వేసింది. గబుక్కున లేచి కూచొని సెల్ ఆన్ చేసాడు. చాలా బెట్టుగా బుద్ధి చెప్పేలా మాట్లాడాలనికుని మనసు దృఢం చేసుకుంటూ ‘‘హలో..........ఎవరూ?’’ అనడిగాడు కావాలని.

‘‘ఏంటీ? అప్పుడే నా పేరు కూడ మర్చి పోయావా?’’ అటు నుంచి దీక్ష కోపంగా నిలదీసింది.

‘‘అవును మర్చి పోయాను. నీ పేరేంటి?’’ అన్నాడు బింకంగా.

అంతే!

ఉన్నట్టుండి వా అంటూ.

ఫోన్లోనే ఏడ్చేసింది దీక్ష.

ఆ ఏడుపు వినగానే చందూ కోపం దూదిపింజలా ఎగిరి పోయింది.

"ఓ మై గాడ్ దీక్షా........ఏమైంది?" కంగారుగా అడిగాడు.

దీక్ష ఏడుపు ఆప లేదు.

"సహస్ర........ తను క్షేమంగానే ఉంది గదా?" ఆందోళన రెట్టింపు అవుతుండగా అడిగాడు.

"తనకేం? హాయిగా గదిలో నిద్ర పోతోంది" అంది వెక్కి వెక్కి పడుతూ దీక్ష.

"మరింకేమిటి..... ఎందుకా ఏడుపు?"

"ఏంటా.... ఎదురుగా వుంటే నిన్ను కొట్టాలనుందిరా. తన్నాలనుంది. కోపం తీరా తిట్టాలనుంది."

"అదే ఎందుకంటున్నాను. కారణం చెప్పి తిట్టు"

"కారణం వేరే చెప్పాలా? ప్రాణంలా ప్రేమించిన పిల్ల అలిగింది. కనీసం ఓ ఫోన్ చేద్దామన్న బుద్ధి ఉండక్కర్లా?"

"ఎలా ఉంటుంది? నా ముఖం చూపించొద్దని ఒక అమ్మాయి చెప్పాక బుద్ధున్న ఏ మగాడయినా ఫోన్ చేస్తాడా?"

‘‘అవును. నీముఖం చూపించొద్దన్నాను. నా ముఖం చూడొద్దన్నానా?’’

‘‘ఇంటి తలుపులు శాశ్వతంగా మూసుకు పోయాయన్నావ్గా?’’

‘‘గుండె తలుపులు మూసుకు పోయాయని చెప్పలేదుగా’’

‘‘అయ్యా బాబోయ్ పిచ్చెక్కిస్తున్నావ్. నీ మాటల్లో ఇన్ని అర్ధాలు వెదుక్కునేంత తెలివి తేటలు నాకు లేవు గాని ఇప్పుడేమంటావ్?’’

‘‘నా వల్ల కావట్లేదు. అర్జంటుగా నిన్ను చూడాలి.’’

‘‘రేపు చూద్దాంలే’’

‘‘రేపు కాదు. ఇప్పుడే ... ఈ క్షణమే. సహస్ర లోపల నిద్ర పోతోంది. నేను నిద్ర పట్టక బయట అటు యిటు తిరుగుతున్నాను. నువ్వు వచ్చేయ్.’’

‘‘ఇప్పుడా...........వూహూ నేను రాను’’

‘‘నువ్వొస్తావా? గోడ దూకి నన్ను రమ్మంటావా?’’

‘‘ఇదెక్కడి గోలరా బాబు. నువ్వు రాకు. రాక చస్తానా నేనే వస్తా ఆగు’’ అంటూ లైన్ కట్ చేసి బెడ్ దిగాడు.

దీక్షకు కలవబోతున్నందుకు చాలా ఆనందంగా వుంది. షర్టు వేసుకొని గది తలుపు ఓరగా తెరిచి హాల్లోకి చూసాడు. హాల్లోని సోఫాలో బండ శివ గురక పెట్టి నిద్ర పోతున్నాడు. అవతల మునుసామి ఉంటున్న గెస్ట్ రూమ్ తలుపు ఓరగా తెరిచి వుంది. ఇటు విరాట్

గది తలుపు మూసి వుంది. ఎవరూ తనను గమనించటం లేదని నిర్ధారణ కొచ్చాక పిల్లిలా గదిలోంచి బయటకొచ్చి తలుపు దగ్గరగా మూసాడు.

చప్పుడు గాకుండా వీధి తలుపు తీసి ...

తిరిగి మూసి తాళం వేసి తాళాలు జేబులో వేసుకున్నాడు, కాంపౌండ్ గేటు తాళం తీయకుండా గేటు దూకి వీధిలోకొచ్చాడు. అప్పటికి సమయం పదకొండు గంటలు. అమావాస్య చీకట్లు నగరమంతా వ్యాపించినట్లున్నాయి. వీధిలైట్లు కునిపాట్లు పడుతున్నాయి. గబగబా దీక్ష ఇంటి వైపు నడక ఆరంభించాడు.

కాలనీ అంతా నిశబ్దంగా వుంది.

ఇళ్ళలో లైట్లు ఎక్కడా వెలగటం లేదు.

చందూ మలుపు తిరిగి కాలనీ గేటును సమీపిస్తున్నాడు. సరిగ్గా ఆ గేటు దగ్గరే గ్రామ సింహాల్లా మూడు కాలనీ సింహాలు తీరిగ్గా పడుకునున్నాయి. గ్రామ పొలిమేరల్లో గ్రామ దేవతలు కాపలా వున్నట్టు ఆ మూడు వీధి శునకాలు కాలనీ కి కాపలాన్న మాట. అవి ఒంటరిగా వస్తున్న చందుని చూడగానే అనుమానంతో తోకలు నిటారుగా చేస్తూ లేచి నిలబడి గుర్రుమన్నాయి.

వాటి అలికిడిని గమనించగానే

ఉలికిపడి ఆగిపోయాడు చందూ

అతడు ఆగటం చూడగానే అవి మూడు ఒకే సారి కోరస్గా భౌ...భౌ మంటూ ముందుకొచ్చాయి.

చందూకి ఏం చేయాలో తోచలేదు

అక్కడ దీక్ష తన కోసం వేయిట్ చేస్తుంటే

వెధవది కుక్కలకి భయపడి ఆగి పోవటమా…?

అటు యిటు చూసి పొడవాటి ఒక కర్రముక్క అందుకున్నాడు. ఎందుకైనా మంచిదని రెండు పలుకురాళ్ళు కూడా అందుకొని వాటి వైపు విసిరాడు. కుక్కలు కాస్త వెనక్కి తగ్గాయి. కాని మొరగటం ఆపలేదు. వాటికి కర్ర చూపించి బెదిరిస్తూ గేటు దాటి మూడో వీధిలోకి మలుపు తిరిగాడు. అలాగని కుక్కలేమీ అతడ్ని వదల్లేదు. మొరుగుతూ వెంట పడ్డాయి. వాటి గోల కి కాలనీ యిళ్ళలో లైట్లు వెలగటం మొదలైంది. చందూకి కంగారు పట్టుకుంది. పెళ్ళికి పోతూ పిల్లిని చంక పెట్టుకెళ్తూన్నట్టుంది తన పరిస్థితి. ఈ కుక్కల గోల ఏంటిరా దేవుడా, లాభం లేదనుకొంటూ ఒక్కసారిగా పరుగు ఆరభించాడు.

పోలోమని వీధంతా గోల చేస్తూ చందూ వెంట పడ్డాయి కుక్కలు. అయితే వాటికి అంద కుండా ఎక్కడా ఆగకుండా ఏక బిగిన పరుగెత్తి చివర వున్న దీక్ష ఇంటికి చేరుకున్నాడు. ఎగిరి గోడ దూకి కాంపౌండ్లో పడ్డాడు.

చందూ కోసం ఎదురు చూస్తూ…

పోర్టికోలో చీకట్లలో నే అటు యిటు తిరుగుతోంది దీక్ష. చందు గోడ దూకటం చూసి గబగబ గేటు వద్ద కొచ్చింది. మొక్కల మధ్య వున్న చందూ ని చూస్తూ ‘‘రాకు అక్కడే ఉండు’’ అంటూ నాలుగు పలుకు రాళ్ళు తీసి కుక్కల మీదికి విసిరింది. దాంతో అవి తోక ముడిచి వెను తిరిగాయి. అదృష్టం కొద్ది ఎవరూ వీధిలోకి రాలేదు చందూ లేచి దగ్గర కొచ్చాడు.

‘‘వచ్చే వాడివి ఒక్కడివి రావచ్చుగా. వెంట అవెందుకు?’’ అంది చిన్నగా దీక్ష.

‘‘నువ్వు రమ్మన్నావుగా బాజా బజంత్రీలు ఈ టైంలో ఎలాగూ దొరకవు. అందుకని వాటిని వెంట తెచ్చాను. ముఖం చూడు. అర్ధరాత్రీ గాని పిలవటానికి వేరే టైం దొరకలేదా నీకు? వచ్చేటప్పుడు ఎలాగో వచ్చేసాను. వెళ్ళేటప్పుడు ఎలాగో తెలిటం లేదు. దొరికితే పీకేసేవి’’ అంటుంటే చిన్నగా నవ్వేస్తూ అతడ్ని కౌగిలించుకుంది దీక్ష. అంతే.

పది నిముషాల పాటు ఇద్దరికీ సమయం తెలిలేదు. విరహం తీరా కౌగిలింతలు ముద్దులు ముంచెత్తాయి.

“దీక్షా” పిలిచాడు.

“వూ” అంది చిన్నగా.

“ఏమిటిదంతా నాకే మాత్రం నచ్చలేదు. వాళ్ళిద్దరూ గొడవ పడ్డం ఏమిటి? మధ్యలో మనం విడిపోవటం ఏమిటి? ఇప్పటిగ్గాని నీకు బుద్ధి రాలేదా?” అడిగాడు.

“ష్........నెమ్మదిగా మాట్లాడు. సహస్ర లేస్తుంది. నా బుద్ధి బాగానే వుంది. నీకే అర్థం కాలేదు. నేను మిమ్మల్ని సమర్థిస్తే సహస్ర ఒంటరిదై పోయినట్టు మరింత బాధ పడుతుంది. అందుకే అలా మాట్లాడాను. తర్వాతయినా నువ్వు ఫోన్ చేస్తావు చెప్పొచ్చులే అనుకున్నాను.”“అదీ కరక్టే అనుకో”

“అనుకోవటం కాదు గాని నిజం చెప్పు. విశాలని కూడ విరాట్ ప్రేమిస్తున్నాడా?”

“అంటే ఏంటి నీ ఉద్దేశం ఈ ఎంక్వయిరీ కోసమే నన్ను పిలిచావా?”

“అదేం కాదు. మనలో మనం నిజాలు చెప్పుకుంటే ఓ క్లారిటీ వస్తుంది గదా!”

ఇద్దరూ పోర్టికోలోని బల్ల మీద కొచ్చారు.

“ఓకె సహస్రతో చెప్పనంటే జరిగిందంతా చెప్తాను”

“ప్రామిస్గా చెప్పను, సరేనా!”

జరిగిన విషయాలన్నీ...

క్లుప్తంగా దీక్షకు వివరించాడు చందూ.

విచిత్రమైన విషయం సహస్ర, విశాల ఇద్దరూ ఒకే రోజు విరాట్ లైఫ్లోకి రావటం.

ఆ రోజు ఎగ్మోర్ రైల్వే స్టేషన్ బయట చందూ చేసిన అల్లరితో విశాల పరిచయమైంది. స్టేషన్కొచ్చి రైలెక్కగానే రైల్లో సహస్ర దీక్షలు పరిచయమయ్యారు. ప్రస్తుతం విరాట్ కోసం వచ్చిన మునుసామి అతడి మనుషుల గురించి కూడ చెప్పేసాడు.

సుమారు గంట పైగా దీక్ష వద్ద వున్నాడు. అప్పటికి పన్నెండు దాటుతోంది. అర్ధరాత్రి.

''కుక్కలు తరుముతాయి వెళ్ళొద్దు. ఉదయంవెళ్ళు'' అంది చందూని వారిస్తూ.

''ఫరవా లేదు. ఇక్కడుంటే సహస్రకి తెలిసి పోతుంది. రేపు ఫోన్ చేస్తాలే'' అన్నాడు చందూ.

''రేపు కాదు. ఇప్పుడు ఇంటి కెళ్ళగానే ఫోన్ చెయ్యి. లేదంటే ఎలా వెళ్ళావో తెలీక కంగారు పడతాను.''

''ఓకే''అంటూ మనసారా దీక్షను కౌగిలించుకొని ముద్దు పెట్టుకున్నాడు. అప్పుడు ఒక చెక్కు తీసి అతడి జేబులో ఉంచింది దీక్ష.''బ్లాంక్ చెక్ ఇస్తున్నాను. ఎంత కావాలో రేపే బ్యాంక్ కెళ్ళి తెచ్చుకో. వెంటనే నువ్వు బైక్ తీసుకోవాలి'' అంది.

''వద్దని ఇంతకు ముందే చెప్పాగా'' అంటూ చెక్కు రిటనివ్వబోతే కోప్పడింది దీక్ష.

“ఎంత కాలం ఫ్రెండు బైక్ మీద తిరుగుతావు? నా కోసం నువ్వు కొనాల్సిందే” అంది పట్టుదలగా. “ఒకె బైక్ తీయగానే నేరుగా షాపింగ్ మాల్ కొచ్చి పిలుస్తాను. వెంటనే నువ్వు రావాలి. వస్తేనే కొత్త బైక్ మీద గుడికెళ్ళి పూజ చేయించట.”

గేటు దూకి వీధిలోకొచ్చేసాడు చందూ…

I I I

మరునాడు విరాట్ చందూలు ఆఫీస్కు వెళ్ళకుండా ఫోన్ చేసి లీవ్ చెప్పేసారు. ఉదయం లేవగానే చందూ, ఈ రోజు నేను కొత్త బైక్ కొంటున్నాను. నువ్వు రావాలి, అంటూ గొడవ చేయటంతో ఇక లీవు పెట్టక తప్ప లేదు విరాట్ కి.

“అయినా ఇప్పుడు నీకు బైక్ ఎందుకురా? నా బైక్ మీద తిరుగుతున్నాంగా” అంటూ కోపడ్డాడు విరాట్.

“ఇది నా నిర్ణయం కాదు, దీక్ష నిర్ణయం, తనే డబ్బిచ్చింది.”

“వ్వాట్ అబద్ధాలు వేరేనా?”

“అబద్ధం కాదు రా బాబు నిజం. అర్ధరాత్రి ఫోన్ చేసి గోల చేస్తుంటే వెళ్ళాను. కుక్కలు వెంట పడ్డాయి” అంటూ చందూ జరిగింది చెప్తుంటే పగల పడి నవ్వాడు విరాట్.

“బాగుందిరా నీ అడ్వంచరు. ఒకె సహస్ర ఎలా ఉందట?” అడిగాడు.

“బాగానే వుందట. మేం కలుసుకున్నట్టు తనకు తెలీదు” చెప్పాడు చందూ.

ఆ ఉదయమే బ్యాంకు కెళ్ళి చెక్కు మార్చి లక్ష రూపాయలు తీసుకున్నాడు చందూ. విరాట్ని వెంట బెట్టుకొని షోరూమ్కెళ్ళి

తొంభై వేలకి మంచి బైక్ కొన్నాడు. మధ్యాహ్న సమయానికల్లా కొత్త బైక్ ఇంటి ముందు ఉంది. ఫస్ట్ రైడ్ గా ఫ్రండు విరాట్ నే బైక్ నుఇంటికి తీసుకు రమ్మని చెప్పి తను విరాట్ బైక్ మీద వచ్చాడు. సరిగ్గా మూడు గంటలకి కొత్త బైక్ స్టార్ట్ చేసుకొని లజ్ కార్నర్ ని షాపింగ్ మాల్ కు వెళ్ళాడు చందూ. ఫోన్ చేయగానే దీక్ష వచ్చేసింది. బైక్ ను చూసి మెచ్చుకుంది. బండికి ప్రత్యేక పూజ చేయించడానికి ఇద్దరూ బైక్ మీద ట్రిపిల్ కేన్ లోని పార్థసారధి గుడికి బయలు దేరి వెళ్ళారు. ఈ విషయం సహస్రకు తెలీదు.

అక్కడ విరాట్ సరిగ్గా మూడున్నర గంటలకి...

విశాల ఇంటికి బయలు దేరి...

బైక్ని ఓల్డ్ మంబళం దిశగా పోనిచ్చాడు.

I I I

ఓల్డ్ మాంబళంలో

ముదలియార్ స్ట్రీట్ లోకి ఎంటర్ కాగానే...

ఎదురుగానే కుడి పక్క ఉంది విశాల నివాసం. సువిశాలమైన ఆవరణ, చుట్టూ ఎత్తయిన కాంపౌండ్ వాల్. మధ్యలో రెండంతస్థుల భవంతి.విరాట్ వెళ్ళే సరికి విశాల అతడి కోసం ఎదురు చూస్తూ ఆవరణలోనే ఉంది. పోర్టికోలో విశాల కారు దాని పక్కనే ఒక జీపు ఉన్నాయి. ఇద్దరు పని వాళ్ళు మొక్కలకు నీరు పోస్తూ ఆవరణలో బిజీగా వున్నారు.విశాల తలార స్నానం చేసి వదులుగా జడవేసుకొని జడలో గులాబి తురిమింది. పుట్టిన రోజు గదా, కంచి పట్టు చీర జాకెట్లో పుత్తడి బొమ్మలా మెరిసి పోతోంది.

సరాసరి పోర్టికో లో కొచ్చి బైక్ దిగాడు విరాట్. వెనకే వచ్చి అతడి చేయి అందుకుంది విశాల. ఆమె కళ్ళలో ఆనందం తొణికిసలాడుతోంది. "మమ్మీని పరిచయం చేస్తాను. నాతోరా" అంటూ చేయి వదల కుండా లోనకు తీసుకెళ్ళింది.

"మమ్మీ.... మమ్మీ.... ఎక్కడ?" అనరిచింది విశాల.

"ఆ... వస్తున్నా" అంటూ కిచెన్లోంచివిశాల తల్లి గొంతు వినిపించింది.

"రా మమ్మీ. ఎవరొచ్చారో చూడు" మళ్ళీ పిలిచింది.



ఇంతలో కిచెన్ లోంచి ఒక నడి వయస్సు స్త్రీ బయటికొచ్చింది. ముఖాన బొట్టు లేదు. విభూది వుంది. చూడగానే నమస్కరించాలన్పించేంత పొందికైన రూపం. ఆమెలో విశాల పోలికలు కన్పిస్తున్నాయి. "మా అమ్మగారు" పరిచయం చేసింది

విశాల. ‘‘నమస్తే ఆన్టీ’’ అంటూ నమస్కరించాడు విరాట్.

‘‘నమస్తే బాబూ... అర్ధమై పోయింది. విరాట్... నువ్వే కదూ?’’ అంది నవ్వుతూ ఆమె.

‘‘కరక్ట్ గా వూహించావ్ మమ్మీ’’ అంది ఉత్సాహంగా విశాల.

‘‘ఇందులో వూహించటానికేముంది? నువ్వు చేయి పట్టి తీసుకొస్తున్నావంటే విరాట్ గాక ఎవరై ఉంటారు. ఆ పైన నువ్వు నా ముందు పొగిడిదాని కన్నా అబ్బాయి చాలా రెట్లు బాగున్నాడు. పదండి. కాస్సేపట్లో వస్తాను’’ అందావిడ.

విశాల తన గురించి తల్లితో కూడ చెప్పేసిందని విరాట్ కి అర్ధమైంది. విరాట్ ని మెట్ల మీదుగా మేడ మీది తన బెడ్ రూమ్ కి తీసుకెళ్తూ ` ‘‘డాడీ లేరు. నాకు మా మమ్మీకి నేను తప్ప మా కెవ్వరూ లేరు. బంధువులు చాలా మంది ఉన్నారట. కాని ఎవరూ రారు. ఎవరెక్కడున్నారో కూడా మాకు తెలీదు. ఎందుకంటే మా మమ్మీ డాడీలది లవ్ మేరేజ్. ఇరు తరుపు వాళ్ళు అంగీకరించక పోవటంతో ఒంటరిగా చెన్నై వచ్చి ఇక్కడ సెటలయ్యారు’’ అంది.

విరాట్ కు తమ ఇల్లంతా తిప్పి చూపించింది విశాల. ఎక్కడ చూసినా ఖరీదైన ఫర్నిచర్ తో నీట్ గా అందంగా వుంది ఇల్లు.

వచ్చే ముందు..

ఎలాగయినా విశాలకు నచ్చ చెప్పి తనను మర్చి పొమ్మని మనుసు మార్చాలని వచ్చాడు.

విశాలకు తండ్రి లేడు.

తల్లి కాంచన మాల తను యిద్దరే ఒకరి కొకరు తోడుగా వుంటున్నారు. ఇప్పుడు తను కాదంటే ఆ బాధలో విశాల అఘాయిత్యం చేసుకుంటే... ‘‘ఏమిటాలోచిస్తున్నావ్?’’ అడిగింది విశాల.

“ఏం లేదు”

“నేను అందంగా లేనా?” అడిగింది.

“ఎవరన్నారు? చాలా అందంగా వున్నావ్”

“చాలా అంటే.... ”

“నీ పుట్టిన రోజుకి వేరే ఎవరినీ పిలవ లేదా? మీ స్టాఫ్ ని గా ని ఫ్రెండ్స్ ని గానీ’ ’అడిగాడు.

“లేదు” అంది విశాల.

“చెప్పాగా. నువ్వొస్తానంటే నే పుట్టిన రోజు లేదంటే లేదు. నువ్వొస్తే అంతా వచ్చినట్టే. స్టాఫ్ ని కూడ ఎవరినీ పిలవ లేదు. కాని ఉదయం అందరికీ స్వీట్లు పంచి ఒక నెల జీతం బోనస్ గా ఇచ్చాను.

“మంచి పని చేసావ్, ఓకె కేక్ కట్ చేస్తే ఓ పనయి పోతుందిగా. మీ మమ్మీని పిలు” అన్నాడు విరాట్.

“ఏంటి? అప్పుడే వెళ్ళి పోదామనా?” అంది నిష్టూరంగా విశాల.

“ఈ పూట నాతో ఉంటున్నావ్. మనం బయటి కెళ్తున్నాం”

“ ఎక్కడికి ”

‘‘ చెప్తాగా. ఇప్పుడే వస్తాను’’ అంటూ వెళ్ళింది విశాల.      కాస్సేపటికి విశాల వెంట తల్లి కాంచన మాల, ఇంటి నౌకర్లు పని వాళ్ళు ఓ ఆరుగురు అంతా వచ్చారు.

టేబుల్ ని గది మధ్యకు లాగి. కేక్ బాక్స్ మీద మూత తీసి టేబుల్      మధ్య ఉంచారు. కేకు మధ్యన లోటస్ కొవ్వొత్తి ఉంచ బడిన్ది. విరాట్ కొవ్వొత్తి వెలిగించాడు. క్షణాల్లో స్లో గా పద్మం వికసిస్తున్నట్టు లోటస్ రేకులు విచ్చుకున్నాయి. కొవ్వొత్తి ప్రకాశంగా వెలగ సాగింది.‘‘ఏంటీ అంతా సైలంట్ గా వున్నారు? హేపీ బర్త్ డే చెప్పరా?’ అని నవ్వుతూ ముందుగా విరాట్      ‘‘హేపీ బర్త్ డే టూ యూ....’’అన్నాడు. అతడిలో శృతి కలిపారంతా.

‘‘హేపీ బర్త్ డే టూ యూ విశాలా!’’ అనగానే హాలు చప్పట్లతో మారు మోగింది. ఆ ఆనందం మధ్య విశాల ముఖం పువ్వులా వెలిగిపోతుండగా కొవ్వొత్తి ఊది. చాకుతో కేక్ ని ముక్కలుగా కట్ చేసింది. ఒక ముక్కను తీసి విశాల నోటికి అందించాడు విరాట్. విశాల మరో ముక్కను తీసి విరాట్ నోటికి అందించబోతుంటే వారించాడు విరాట్. ‘‘ప్రత్యక్ష దైవం మమ్మీ. ముందు మమ్మీ’’ అన్నాడు. ఆ మాటలో పెద్దావిడ ముఖం మరింత ప్రసన్నమైంది. విశాల తన తల్లికి కేక్ తినిపించాక విరాట్ కి అందించింది. తర్వాత మిగిలిన కేక్ ను పని వాళ్ళకు పంచింది.

‘‘త్వరగా మీరు వస్తే పాయసం తీసుకుందురు గాని’’ అని చెప్పి ముందుగా ఆవిడ, వెనకే పని వాళ్ళు అంతా వెళ్ళి పోయారు. ఇప్పుడక్కడ విరాట్ విశాల యిద్దరే మిగిలారు. విరాట్ జేబులోంచి చిన్న ప్లాస్టిక్ బాక్స్ ను తీసి విశాల చేతిలో వుంచాడు. ‘‘ఏంటది?’’ అడిగింది విశాల.‘‘నీ      పుట్టిన రోజుకి నా స్మాల్ గిఫ్ట్’’ అన్నాడు.

బాక్స్ తెరిచి చూసింది విశాల. లోన అందమైన గోల్డ్ డైమండ్ రింగ్ వుంది.

విశాల సంతోషంగా చూసింది.

‘‘చేతికివ్వటం కాదు నువ్వే వేలికి తొడుగు’’ అంది.

ముచ్చట పడుతోందని బాక్స్ లోంచి రింగ్ తీసి ఆమె ఉంగరం వేలికి తొడిగాడు. పొడవుగా అందంగా వుండే ఆమె చేతి వేళ్ళకు

మరింత కళ వచ్చింది. వెంటనే తన మద్య వేలు గోల్డ్ రింగ్ తీసి విరాట్ చేయి అందుకుని అతడి ఉంగరం వేలికి తొడిగింది విశాల.''విశాల నాకు నగలంటే ఇష్టం వుండదు'' అంటూ విరాట్ తీసేయ బోతే వారించింది విశాల.

''నీకు ఇష్టం లేక పోయినా ఇది నువ్వు తీయ కూడదు. ఎందుకో తెలుసా? మనకి సగం పెళ్ళి అయి పోయినట్టే'' అంటూ అందంగా నవ్వింది.ఉలికి పడ్డాడు విరాట్.

''విశాలా జోక్ చేయకు. వెళ్ళేమిటి?'' అన్నాడు.

''ఏమిటో ఇంకా అర్థం కాలేదా? నిశ్చితార్థం నాడు వధూ వరుల చేత ఉంగరాలు మార్పిస్తారు ఎందుకు? సగం పెళ్ళి అయినట్టే అని. అలాగే క్రిస్టియన్లు ఉంగరాలు మార్చుకొని పెళ్ళి చేసుకుంటారు. ఇప్పుడు మనం చేసిందేమిటి? ఉంగరాలు మార్చుకున్నాం. దీన్నేమంటారు? పెళ్ళి కాదా?'' అంటూ విశాల తన భుజం మీద వాలి పోతుంటే అప్పటిగ్గాని లాజిక్కు విరాట్ కి అర్థం కాలేదు.

తనేదో సింపుల్ గా ఉంటుందని గిఫ్ట్ గా ఉంగరం తెస్తే తెలివిగా ఉంగరాలు మార్పించి తనను బంధీ చేసింది విశాల. ''నువ్వు చాలా తెలివైన దానివి'' అంటూ నవ్వాడు.

''నీ కన్నా కాదులే. ఈ ఉంగరాలు ఎప్పుడూ చేతినుండాల్సిందే. తీయకూడదు. ప్రామిస్ చెయ్?''

''ఒకె తీయన్లే. పద కిందకు వెళ్దాం'' అన్నాడు.

ఇద్దరూ కిందకు వచ్చే సరికి వేడి గారెలు వేడి వేడి పాయసం సిద్ధంగా ఉంచింది కాంచన మాల. చెరో రెండు గారెలు తిని పాయసం తాగారు.''మనిద్దరం కలిసి నా పుట్టిన రోజున గుడికి వస్తానని వడపళని మురుగన్ కి మొక్కుకున్నాను. కాదంటే కుదరదు. బైక్ ఇక్కడే ఉంచు. నా కార్లో వెళ్తున్నాం'' అంది విశాల.

ఇష్టం లేక పోయినా.తప్పదనుకొంటూ...కారు స్టార్ట్ చేసాడు విరాట్.అప్పటికి టైం సాయంత్రం ఆరు గంటలు దాటింది.

* * * * * * * * * * * * * *

* * * * * * * * * * * * * *

షాపింగ్ మాల్ లో పర్మిషన్ తీసు కొని ఆరు గంటలకే డ్యూటీ దిగి బయటకొచ్చేసింది సహస్ర. చాలా రోజులయింది మనసు బాగుండటం లేదు. సాయంత్రం గుడికి వెళ్ళాలని ఉదయమే అనుకుంది. సరిగ్గా సమయానికి దీక్ష ఎక్కడికో వెళ్ళింది. మూడు గంటలకి వెళ్ళే ముందు ఫోన్ చేసి చెప్పింది. నా కోసం చూడొద్దు. లేటవచ్చు. ఇంటి కొచ్చేస్తాను. నువ్వు స్కూటీ మీద వచ్చేయ్ అంది. ఎక్కడికో ఎందుకో చెప్పలేదు.తన అనుమానం కరక్టయితే...

ఇది చందూ వద్దకి వెళ్ళుండాలి. అయితే మాత్రం తనకి భయమా? ఒక్కతే గుడికి వెళ్ళి రాలేదా? దీక్ష పక్కన లేదని...గుడికెళ్ళటం వాయిదా వేసుకోవాలా? స్కూటీ స్టార్ట్ చేసుకొని బయలు దేరింది సహస్ర. కాని ఎంత వద్దనుకున్నా మనసు విరాట్ వైపు పరుగులు తీస్తుంది.విరాట్ ఎందుకిలా చేసాడు?

విశాల ఎవరు?

ఆమెతో నిజంగా స్నేహమా?

లేక విశాలనూ ప్రేమిస్తున్నాడా?

వయసులోని ఆడ మగ సాన్నిహిత్యాన్ని

కేవలం స్నేహమంటే ఎలా నమ్మటం?

ఇంత జరిగినా విరాట్ మీది ఆలోచనలతో రాత్రిళ్ళు సరిగ్గా నిద్ర పట్టడం లేదు. తనే అనవసరంగా తొందర పడిందా? తన కోసం చాలా సార్లు ఫోన్ చేసాడు. తనే అహం అడ్డొచ్చి ఫోనెత్తలేదు. ఈ సమస్యకి త్వరగా ఓ పరిష్కారం చూడకపోతే పిచ్చెక్కేలా వుంది. గుడికెళ్ళొస్తే మనసు కాస్త ప్రశాంతమవుతుందేమో?

అర్కాట్ రోడ్ లోకి సహస్ర స్కూటీ ఎంటరయ్యే సరికే చీకటి పడి వీధి దీపాలు వెలిగాయి. సరాసరి వడపళని చేరుకొని స్కూటిని గుడి వీధిలోకి పోనిచ్చింది.

వీధిలోకి ఎంటర్ కాగానే...

అంత దూరంలో అద్భుతమైన షణ్ముఖుని ఆలయ గోపురం దర్శనమిచ్చింది. గోపురంపైన ఓం శరవణ భవ అనే అక్షరాలతో బాటు కుమారస్వామి వేలాయుధం గుర్తు విద్యుద్దీపాలతో వెలిగి ఆరి పోతూ కను విందు చేస్తున్నాయి.విద్యుద్దీప కాంతులతో...గుడి వీధి అంతా పట్ట పగల్లా వుంది.వీధికి అటు యిటు అనేక పూల అంగళ్ళు, అరటి పళ్ళు కొబ్బరి కాయలు అంగళ్ళు ఉన్నాయి. పూల పరిమళాలతో బాటు గంధం పన్నీరు అగరు వాసనలు వీధిలో షికారు చేస్తున్న భక్తుల మనసుల్ని పవరశింప చేస్తున్నాయి.భక్తుల రద్దీ సాధారణంగా వుందినెమ్మదిగా స్కూటీని గుడి దరిదాపుల వరకు పోనిచ్చింది సహస్ర. పార్కింగ్ ఇంకాస్త దూరంలో వుందనగా అంతలో వూహించని ఒక దృశ్యం కంట బడిన్ది.అంతేబ్రేక్ వేసి ఉన్న చోటే స్కూటీని ఆపేసింది.విశాల పుట్టిన రోజు సందర్భంగా గుడికి వచ్చిన విశాల విరాట్ లు సరిగ్గా అప్పుడే బయటి కొస్తున్నారు. నూతన వధూ వరుల్లా బయటి కొస్తున్న ఆ జంటను చూడగానే సహస్రకు వళ్ళంతా భగ్గుమన్నట్టయింది. కోపం దుఖం నిస్సహాయత అన్నీ ముప్పేట దాడి చేస్తుండగా అలా చూస్తూండి పోయింది.

విశాల చేతి మీద స్వామికి వేసి తీసిన పూమాల వుంది. రెండో చేతిలో ప్రసాదం పూజా ద్రవ్యాలతో కూడిన వెండి సజ్జ ఉంది. ఇద్దరూ కబుర్లు చెప్పుకొంటూ నవ్వుకొంటూ తమ కారు వద్ద కొచ్చారు. విశాల కారు డోర్ తెరిచి పూల సజ్జను లోన సీట్లో ఉంచింది. పూల మాలను తీసుకెళ్ళి కారు ముందు భాగంలో అలంకరించింది. విరాట్ డ్రైవింగ్ సీట్లో కూచోబోతూ ఆగాడు.

తనకు అత్యంత సన్నిహితులైన ఎవరో తమను గమనిస్తున్న ఫీలింగ్... తనకు తెలీకుండానే మనసు కలత చెందుతోంది. ఏమైంది అనుకుంటూ యధాలాపంగా ఎదురుగా రోడ్ అవతలకు చూసి షాకయ్యాడు.

అంత దూరంలో స్కూటీ ఆగుంది...

అది దీక్ష స్కూటీ...

దాని మీద బురఖాలో ఓ అమ్మాయి ఇటే చూస్తోంది. కళ్ళు మాత్రం కన్పిస్తున్నాయి. ఎంత దూరంలో ఉన్నా ఆ సోగ కనులు తనకు గుర్తే. ఆమె సహస్ర. వెంట దీక్ష వచ్చిందో లేదో తెలిదు. బహుశ సహస్ర కూడ గుడికి వచ్చుండాలి. ఖర్మ గాక పోతే తనూ ఇప్పుడే రావాలా?''ఏమైంది?'' అచేతనంగా నిలబడి ఎటో చూస్తున్న విరాట్ భుజం తట్టి అడిగింది విశాల.

''నువ్విక్కడే ఉండు. ఇప్పుడే వస్తాను'' అంటూ అడ్డు వస్తున్న వెహికిల్స్ ను జనాన్ని తప్పించుకొంటూ సహస్ర స్కూటీ వైపు కదిలాడు.సహస్రకు దుఖ్ఖం ముంచుకొస్తోంది.

ప్రాణాధికమైన తన సొత్తును...

బలవంతంగా ఎవరో లాగేసుకున్న ఫీలింగ్.

విశాల మీద అసూయతో

గుండెలు మండి పోతున్నాయి...

కళ్ళు జల పాతాల్లా వర్షిస్తున్నాయి...

విరాట్ తన వైపు రావటం చూడగానే సహస్ర గుడికి వెళ్ళే ఆలోచన విరమించుకుంది. స్కూటీ ని వెనక్కి తిప్పింది. వెనక నుంచి విరాట్ పిలుస్తున్నా పట్టించు కోకుండా వెళ్ళిపోయింది వేగంగా.

హతాశుడై అటే చూస్తూ...

అక్కడే నిలబడిపోయాడు విరాట్...

వూహకు అందని సంఘటన ఇది…

అసలే విశాల విషయంలో మండి పోతుందంటే సరిగ్గా సరైన చోట తన కంట్లోనే పడాలా యిద్దరూ? అసలీం టైమ్ కి సహస్ర అక్కడి కెలా వచ్చిందో అర్ధం కాలేదు. పోనీ తమ కారుని ఫాలో చేసి వచ్చిందా అంటే…….. ఛాన్సే లేదు. ఓల్డ్ మంబళం నుండి వడపళని రూట్ వేరు, లజ్ కార్నర్ నుంచి రూట్ వేరు, దారిలో తమ కారుని చూసే అవకాశం లేదు, అనుకోకుండానే తనూ గుడికి వచ్చుంటుంది తనని చూడగానే కోపంతో వెనక్కి వెళ్ళిపోయింది. అయితే విశాల సహస్రను గమనించ లేదు. అందుకే పక్కకొచ్చి “ఏమైంది?” అంటూ భుజం మీద చెయ్యేసింది.

విరాట్ కి కోపం నవ్వు అసహనం కాస్సేపు ఉక్కిరి బిక్కిరి చేసాయి.

“పద వెళ్దాం” అంటూ వెను తిరిగాడు.

“ఏమైందంటున్నాగా” కారు వద్ద కొస్తూ అడిగింది.

“సహస్ర మనల్ని చూసేసింది” కారు డోర్ తెరుస్తూ చెప్పాడు.

ఆ మాటతో ఉలికి పడి చుట్టూ చూస్తూ…

“ఎక్కడ?” అంది.

“మనల్ని చూసి కోపంతో పిలుస్తున్నా వినకుండా వెళ్ళిపోయింది. డ్రైవింగ్ సీట్లో కూచొని డోర్ మూసాడు. వచ్చి అతని పక్కన కూచుంది విశాల.

“సారీ విరాట్” అంది బాధ పడుతూ.

‘‘ఏయ్ నువ్వెందుకు బాధ పడతావ్? తను అర్థం చేసుకోడానికి ఇంకా కొంత టైమ్ పడుతుంది’’ అంటూ కారు స్టార్ట్ చేసాడు.నెమ్మదిగా ముందుకు కదిలింది కారు.

‘‘పోనీ నేనోసారి వచ్చి సహస్రతో మాట్లాడనా?’’ అంది.

‘‘వద్దు, అలాంటి పిచ్చి పని చేయకు. ఈ సమస్యకు నువ్వు దూరంగా వుండు. సహస్ర ఎవరో నీకింకా తెలీదు’’ అంటూ తన సెల్ అందుకుని చందూకి ఫోన్ చేసాడు.

పది సెకన్ల తర్వాత.

అవతల ఫోన్ లిఫ్ట్ చేసాడు చందూ.

‘‘ఏరా.... ఎక్కడున్నావ్?’’ అడిగాడు.

‘‘ఇప్పుడే, దీక్షనింటి దగ్గర దించి మనింటి కొస్తున్నాను. పార్థ సారధి గుడిలో కొత్త బైక్ కి పూజలు చేయించి అటు నుంచి అటే మెరీనా బీచ్ కెళ్ళి కాస్సేపు కూచొని వచ్చేసాం. ఇంతకీ నువ్వెక్కడున్నావ్?’’

‘‘పడపళని కోవెల దగ్గర్నుంచి ఇప్పుడే బయలుదేరాం, విశాల పుట్టిన రోజని గుడికి వచ్చాం. అనుకోకుండా ఇక్కడ మా యిద్దర్నీ సహస్ర చూసేసింది. పిలుస్తున్నా విన్పించు కోకుండా గుడిలోకి వెళ్ళకుండా వెనక్కి వెళ్ళి పోయింది’’

‘‘పడక పడక మళ్ళీ తన కంటపడ్డారా! ఏమిట్రా మీ పరిస్థితి ఏమీ అర్థం గావటం లేదు.’’

‘‘అవన్నీ తర్వాత. కోపంలో స్కూటీ మీద వస్తోంది క్షేమంగా ఇంటికి చేరిందా లేదా నాకు తెలియాలి. నువ్వు కాలనీ గేటు దగ్గరుండి

కాస్త గమనించు, నేను విశాలను దించేసి వస్తాను. దీక్షకు ఫోన్ చేసి ఓ సారి సహస్రకి ఫోన్ చేయమని చెప్పు.''

''సరి నువ్వు త్వరగా రా'' అంటూ అవతల లైన్ కట్ చేసాడు చందూ.

''సహస్ర ఎవరు?'' విరాట్ ఫోన్ పక్కన పెట్టగానే అడిగింది విశాల.

''నువ్వు కథా రచయిత్రి సహస్ర కథలు ఎప్పుడన్నా చదివావా?''

''చదివాను. ఆమె కథలు చాలా బాగుంటాయి.''

''జర్నలిస్టు లహరి రాజకీయ వ్యాసాలు గాని విశ్లేషణలు గాని....''

''ఆహా.... నేనామె అభిమానిని కూడ. ఆ మధ్య మధురై జగన్మోహన్ భూ కుంభకోణాల్ని ఎంతో సాహసంతో వెలుగులోకి తెచ్చింది తనే గదా? ఇంతకీ....''

''ఆ యిద్దరూ వేరు వేరు కాదు. ఒక్కరే. ఆ ఒక్కరే నేను ప్రేమించిన సహస్ర.''

విశాల విస్తు పోయి చూసింది.

''మరీ ఆశ్చర్య పోకు!'' అంటూ క్లుప్తంగా జరిగిందంతా వివరించాడు.

''తనకు నేనంటే ప్రాణం. నాకూ అంతే. ఇప్పుడు ముఖ్యంగా నువ్వు నా లైఫ్ లోకి ఎంటయ్యావ్...''

“ఇప్పుడు అనక ఎప్పుడో...”

“ఒకె ఎంటరయ్యావ్ గదా. ఇక్కడ ప్రధాన సమస్య మన మధ్య ఎన్ని గొడవలున్నా సహస్రను కాపాడుకోవటం ముఖ్యం. బురఖాలో తిరుగుతోంది కాని లేదంటే శత్రువులు ఎప్పుడో సహస్రను గుర్తు పట్టేవారు. సహస్రకు తెలికుండా మా మనుషులిద్దరూ ఎప్పుడూ ఫాలో అవుతూ ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని గమనిస్తున్నారు.

ఎంక్వయిరీ కమీషన్ గడువు ఆరు మాసాలు పూర్తి కావస్తోంది. ప్రభుత్వం మరో మూడు మాసాలు పొడిగించేట్టుంది. కోర్టు తిరిగి విచారణ చేపట్టే లోపలే సహస్రను అంతం చేయాలని జగన్మోహన్ పంపించిన మనుషులు చెన్నైలో తిష్టవేసి కూచున్నారు. మరో పక్క సహస్రను వెనక్కు తీసుక పోవాలని మధురై నుండి ఆమె తండ్రి పంపించిన మనుషులు సిటీలో వెదుకుతున్నారు. ఇటు నా కోసం కోయం బత్తూర్ నుంచి వచ్చిన మా వాళ్ళు ప్రస్తుతం నా దగ్గరే నాకు సాయంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితిలో సహస్ర జాబ్ మానేసి ఇంటికి పరిమితమైతే చాలా బాగుండేది. కాని వినటం లేదు, అర్ధమైందిగా నా ఆందోళన ఎందుకో. చిన్న పొరబాటు జరిగినా సహస్ర ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తుంది” అంటూ విరాట్ వివరిస్తుంటే విశాల దిగ్భ్రమ చెందింది. అప్పటిగ్గాని పూర్తి విషయాలు ఆమెకు అర్ధం కాలేదు.



“విరాట్ ఈ క్షణం నుంచి అక్కను కాపాడుకునే బాధ్యత నీకే కాదు నాకు ఉంది. ఏ అవసరం వచ్చినా నీవెంట నేనూ వున్నానని మర్చిపోకు” అంటూ భరోసా ఇచ్చింది విశాల.

అంతలో కారు విశాల ఇంటికి చేరుకుంది. కారు దిగి విశాల వద్ద ఆమె తల్లి కాంచనమాల వద్ద శలవు తీసుకొని తన బైక్ మీద ఇంటికి బయలుదేరుతుండగా చందూ ఫోన్ చేసాడు. సహస్ర క్షేమంగా ఇంటికి చేరుకుందని. ఆమెను ఫాలో చేస్తున్న యిద్దరూ కూడా వచ్చేసారని చెప్పాడు. అప్పటిగ్గాని విరాట్ మనసు కుదుట పడలేదు. బైక్ స్టార్ట్ చేసి బయలుదేరాడు.ఇంటికి తిరిగి వస్తూనే దీక్షను కౌగిలించుకొని చిన్నపిల్లలా బావురుమని ఏడ్చేసింది సహస్ర.

ఇద్దరూ సహస్ర బెడ్రూంలోవున్నారు.సహస్రను ఎలా ఓదార్చాలో తెలీక కాస్సేపు మౌనంగా వుండిపోయింది దీక్ష. సహస్రను అలా చూస్తుంటే గుండె తరుక్కు పోతోంది.

“ఏమిటే యిది చిన్న పిల్లలా? ఎంతో ధైర్య సాహసాలు కలిగిన నువ్వేనా ఇలా డీలా పడిపోయి ఏడుస్తున్నావ్ వూరుకో” అంటూ ఓదార్చింది.

“ఎన్ని వున్నా నేనూ ఆడపిల్లనే గదా! మర్చిపోలేకపోతున్నాను” అంది రుద్ద కంఠంతో.“ఇంటికొచ్చి ఏడుస్తు కూచున్నావ్? అసలేం జరిగిందే?” ఏమి తెలీనట్టు అడిగింది దీక్ష, కాని అప్పటికే చందూ ఫోన్ చేయటం వలన దీక్షకు అంతా తెలుసు.

“ఎక్కడికి పోయావో నువ్వు రాలేదు. మనసు ప్రశాంతంగా ఉంటుందని వడపళని గుడికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికే విశాలతో విరాట్ గుడికి వచ్చి ఇద్దరూ బయట కారు వద్దకొస్తూ కన్పించారు” అంటూ కళ్ళు తుడుచుకొని జరిగిందంతా చెప్పింది సహస్ర.

“నిన్ను చూసిన విరాట్ దగ్గరకు రాబోయాడంటున్నావ్. వాళ్ళని చూసి కూడ వెనక్కి రావటం వల్ల ప్రయోజనం ఏమిటి? ఇద్దర్నీ అక్కడే నిలదీయక పోయావా?” అంది దీక్ష.

“అందువల్ల నలుగురిలో గుడి ముందు అల్లరి గావటం తప్ప లాభం ఏమీ ఉండదు. ఆపైన దుఖాన్ని ఆపుకోలేక వచ్చేసాను.”“వాళ్ళను చూసి నువ్వు పారిపోయి రావటం ఏమిటి? ఇలా అయితే ఆ విశాల ఎవరో తన వివరాలు ఏమిటో ఎలా తెలుస్తాయి? అసలా అమ్మాయి ఎలాంటిది? మంచిదేనా? ఏ ఉద్దేశంతో విరాట్ వెంట తిరుగుతోంది? అసలు విరాట్ మనసులో ఏముంది? ఇవన్నీ తెలియాలంటే వాళ్ళతో మాట్లాడాలి గదా? ”

“ఏమో? నాకా క్షణంలో మాట్లాడాలనిపించలేదు” అంటూ చెమరుస్తున్న కళ్ళు తుడుచుకుంది సహస్ర.

ఒక్క క్షణం ఆలోచించింది దీక్ష.

“ఒకె నాకో విషయం స్పష్టంగా చెప్పవే. నువ్వు విరాట్ ని మనసారా ప్రేమిస్తున్నావా లేదా?” అడిగింది.

అవునన్నట్టు తలూపింది సహస్ర

"విరాట్ విశాలకు దగ్గరైపోయాడని నీ బాధ. అంతేగా? "

"అవును"

"అలాగని విరాట్ కి దూరంగా వుండ గలవా? "

"అంత శక్తి నాకు లేదు"

"మరెందుకు బాధ పడతావ్? విశాల వెంట వున్నందున విరాట్ కు నీ మీద ప్రేమ తగ్గిందని ఎలా అనుకుంటావ్? నీకు చాలా సార్లు ఫోన్ చేసాడు. నువ్వు లిఫ్ట్ చేయలేదు. గుడి దగ్గర పక్కన విశాల వున్నా పట్టించుకోకుండా నిన్ను చూడగానే ఆత్రంగా నీ కోసం వచ్చాడు. నువ్వే మాట్లాడకుండా వచ్చావ్. నా ఉద్దేశం ప్రకారమైతే నువ్వు విరాట్ ప్రేమను శంకించాల్సిన పని లేదు"

"ఎందుకు లేదు? విశాల సంగతేమిటి? వాళ్ళది స్నేహం కాదు. ప్రేమ"

"ఒకె విశాలనూ ప్రేమిస్తున్నాడనుకుందాం. ఆ అమ్మాయి మంచిదయిఉండి తనకీ కాస్త ప్రేమ పంచితే నీకొచ్చే నష్టం ఏమిటి? వేరేగా అనుకోకు వాస్తవం మాట్లాడుకుందాం.

మనం మొక్కే దేవుళ్ళనే చూడు మురుగన్ గుడికి వెళ్ళావ్. ఆయనకు శ్రీవళ్ళి దేవసేన అని యిద్దరు భార్యలు. శివుడ్ని తీసుకో ఆయనకి ఇద్దరు భార్యలు, వెంకటేశ్వరస్వామికి ఇద్దరు. ఇక ఆ గోపాల కృష్ణుడికయితే ఎనమండుగురు భార్యలు. ఇలా ఇద్దరు భార్యలున్న దేవతల్ని మాత్రం పడి పడి మొక్కుతాం. మన కళ్ళ ముందు ఎవరన్నా ఇద్దరు భార్యల్ని చేసుకుంటే ఇష్ట పడం.

ఇలాగని నేను ఇద్దరు భార్యల్ని చేసుకోడాన్నో లేక బహు భార్యత్వాన్నో సమర్థిస్తున్నానని కాదు. సందర్భాన్ని బట్టి ఒక్కో సారి తప్పని పరిస్థితి ఏర్పడ వచ్చు. అది న్యాయమైందైతే మనమూ ఆమోదించక తప్పదు కదా?విరాట్ విశాల మోజులో పడి నిన్న శ్రద్ధ చేస్తున్నాడని నువ్వు ఫీలవుతున్నావ్. కాని అనుక్షణం నిన్నెలా కాపాడుకోవాలని విరాట్ తపిస్తున్నాడు. తన తండ్రి వెంకట రత్నం నాయుడు గారు తనను పట్టి వెనక్కి తీసుకు రమ్మని పంపించిన వాళ్ళని ప్రస్తుతం తన వద్దే ఉంచుకున్నాడు. నీ కోసం... నీకు తెలుసో లేదో మనం బయట కెళ్ళి ఇంటికొచ్చే వరకు విరాట్ మనుషులిద్దరు మనల్ని ముఖ్యంగా నిన్ను ఫాలో అవుతూ ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని గమనిస్తున్నారు. నాకెలా తెలుసనకు, చందూ చెప్పాడు. ఈ రోజు కూడ సాయంకాలం నేను బయట కెళ్ళింది చందూ తోనే. అలాగే నిన్ను తీసుకెళ్ళాలని వచ్చిన కదిరేషన్ వాడి మనుషుల కోసం, నిన్ను చంపాలని గాలిస్తున్న ధనగిరి వాడి మనుషుల జాడ తెలుసుకోడానికి మునుసామి మనుషులు ఓ పక్క సిటీలో గాలిస్తున్నారు. ఇదంతా నీ మీద ప్రేమ లేకుండానే చేస్తున్నాడంటావా? ఇవేమి తెలుసుకోకుండా నువ్విలా ఏడుస్తూ కూచోవడం ఏం బాగలేదు. తెలుసా? '' అంటూ దీక్ష మందలిస్తుంటే సహస్ర కాస్సేపు మౌనంగా ఉండి పోయింది.

ఆమె మనసులో అంతర్మథనం జరుగుతోంది.

ఆలోచిస్తోంది...

తీవ్రంగా ఆలోచిస్తోంది....

దీక్ష మాటలు వాస్తవాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

విరాట్ తన కోసం తీసుకుంటున్న జాగ్రత్తలు వింటుంటే గర్వంగానూ ధైర్యంగానూ ఉంది. కాని పరిష్కారం ఏమిటనేది తోచటం లేదు.

''అయితే నన్నేం చేయమంటావే? నాతో బాటు విశాలనూ పెళ్ళి చేసుకుంటానంటే సరే అనాలా?'' అంది లేచి బురఖా తీసి పక్కన పడేస్తూ.''ఆ మాట నేననటం లేదు'' అంది వెంటనే దీక్ష.

''ప్రతి సమస్యకో ఓ పరిష్కారం ఉంటుంది. అందుకు ప్రయత్నించకుండా ఇలా నువ్వు బేలగా ఏడుస్తు నీలో నువ్వు కుమిలి పోవటం మంచిది కాదంటాను. ఈ సమస్య పరిష్కారం కావాలంటే అది మీ ముగ్గురి అవగాహన మీద ఆధార పడి ఉంది. మీ ముగ్గురు

కూచుని చర్చించుకుంటే చిక్కు ముడి తొలగి పోతుందంటాను. అప్పుడు మీరు కాస్సేపు తిట్టుకున్నా అరుచుకున్నా మనసు తేలికై ప్రశాంతంగా వుంటుంది. నువ్వు సరే నంటే ఆ ఏర్పాటు నేను చేస్తాను. రేపే విశాలను తీసుకొని ఇక్కడికి రమ్మని విరాట్ కి చెప్తాను'' అంటూ వివరించింది.''రేపు అంటే మళ్ళీ డ్యూటికి లీవ్ పెట్టాలి. వద్దులే. నీ మాట కాదనలేక సరే అంటున్నాను. కాని రేపు కాదు. వచ్చే మంగళ వారం మనకి సెలవు గదా. ఆ రోజు కూచుందాం'' అంది సహస్ర.

''అంటే ఏమిటే? నీ కోసం వాళ్ళు సెలవు పెట్టాలి. నువ్వు మాత్రం సెలవు పెట్టనంటావ్. ఎంతయినా నీకు స్వార్ధం ఎక్కువే '' అంటూ దీక్ష నవ్వుతుంటే సహస్ర కూడ తేలిక పడ్డ మనసుతో తనూ నవ్వింది.

సరైన సమయంలో సరైన సలహా యిచ్చి ధైర్యం చెప్పే ఫ్రెండు పక్కనుండటం కూడ అదృష్టమనే చెప్పాలి. దీక్ష ఓదార్పు సలహా సహస్రకు బాధను దూరం చేసి కొత్త ఉత్సాహాల్నిచ్చాయి. త్వరలోనే విరాట్ విశాల యిద్దర్నీ దీక్ష ఇంటికి రప్పించి తాడో పేడో తేల్చేయాలని నిర్ణయించుకుంది. కాని...

అంత వరకు గాకుండా...

ఈ లోపలే అలాంటి ఒక సందర్భం వస్తుందని...

ఆ క్షణంలో సహస్రకుగాని దీక్షకు గాని తెలీదు...

ఆవిడ పేరు సుకుమారి...

వయసు నలభై సంవత్సరాలు...

మనిషి కాస్త పొడవు సరిపడా లావుతో ఎర్రగా అందంగా వుంటుంది. పొందికైన రూపం. కొద్దిగా చదువు సంస్కారం కలిగిన స్త్రీ. సుకుమారి, చక్కని మాటకారి, అణకువ విధేయత ఆమె స్వభావం. ఆమెతో ఎవరు మాట్లాడినా మళ్ళీ మళ్ళీ మాట్లాడాలనుకుంటారు. అంతటి మంచితనం ఆమె సొంతం. ఈ సుకుమారి లజ్ కార్నర్ లోని షాపింగ్ మాల్ లో నే సేల్స్ వుమన్ గా పని చేస్తోంది. సహస్ర దీక్షల కన్నా సీనియర్.

సుకుమారికి ఇంటర్ చదువుతున్న ఒక కూతురు, తొమ్మిదో తరగతి చదువుకొంటున్న ఒక కొడుకు వున్నారు. ఆమె జి యన్ చెట్టి రోడ్డులోఉంటోంది.

అటువంటి సుకుమారిది ఓ విచిత్రమైన జీవితం...

ఆమె భర్త పేరు అరుణాచలం

అరుణాచలం కి తండ్రి సంపాదించి ఇచ్చిన రెండు ఇళ్ళున్నాయి. ఒకటి ఇక్కడ జి యన్ చెట్టి రోడ్ లో ఉంది. రెండో యిల్లు అయన వరంలో వుంది. ఆ యిల్లు అద్దె కిచ్చి భార్యా భర్త లిద్దరూ ఇక్కడ కాపురం ఉండే వారు.అరుణా చలం మంచి వాడే...

ఆర్టిసిలో సిటీ సర్వీస్ డ్రయివర్ గా చేసే వాడు. ఏ లోటులేని జీవితం. సంసారం సుఖంగా సాగి పోతోంది. ఇద్దరు పిల్లలు పుట్టారు. క్రమంగా వాళ్ళు పెద్ద వాళ్ళవుతూ బాగా చదువు కుంటున్నారు.

జీవితం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో చెప్పలేం. ఉన్నట్టుండి సుకుమారి జీవితం కష్టాల మలుపులో ప్రవేశించింది. చెడు సావాసాలు మొదలై ఆమె భర్తలో మార్పు వచ్చింది. అరుణా చలం తాగుడు కి అలవాటు పడ్డాడు. మరో స్త్రీకి దగ్గరయ్యాడు. ఇంటి ఖర్చులకి డబ్బులివ్వటం తగ్గి పోతోంది. తరచు గొడవలు. భార్యను కొట్టేవాడు. వేధించేవాడు. అందిన చోట అప్పులు చేసి కుటుంబాన్ని పట్టించుకోవటం మానేసాడు. దాంతో కుటుంబ బాధ్యత సుకుమారి మీద పడిన్ది.

ఈ పరిస్థితుల్లో వేరే దారి లేక షాపింగ్ మాల్లో ఉద్యోగానికి చేరింది. అరుణా చలం తాగి వచ్చి అర్ధరాత్రి పిల్లల్ని కూడ కొట్టే వాడు. డబ్బులిమ్మని వేధించే వాడు. ఇక ఆ బాధలు పడలేక గృహ హింస చట్టం కింద అరుణా చలం మీద పోలీస్ కేసు పెట్టి విడాకులు కోరుతూ కోర్టుకెక్కింది సుకుమారి. సంవత్సరం క్రితం కోర్టు అరుణా చలం సుకుమారి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ పిల్లల భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకొని వారుంటున్న ఇంటిని సుకుమారికి చెందేలా తీర్పు చెప్పింది.

ఆ తర్వాత అరుణా చలం రెండో ఇంటిని అమ్ముకొని తనకు నచ్చిన స్త్రీతో చెన్నై వదిలి వెళ్ళి పోయినట్టు తెలిసింది. ప్రస్తుతం అతనెక్కడ ఉండేది ఎవరికీ తెలిదు. కోర్టు తీర్పుకు ముందే తాగి బస్సు నడుపుతున్నాడనే అభియోగం మీద ఆర్టిసి అధికారులు

అతడ్ని విధుల నుంచి తొలగించారు.

ఆ తర్వాత అప్పులు వాళ్ళు కొందరు సుకుమారిని బెదిరించి ఎలాగైనా ఇల్లు రాయించుకోవాలని చూసారు. కాని సుకుమారి వాళ్ళెవరినీ లెక్క చేయకుండా నిలదొక్కుకుంది. ఇంటి మీద వచ్చే కొద్ది పాటి అద్దె డబ్బులు తన ఉద్యోగం వల్ల వచ్చే జీతం డబ్బుతో పిల్లల్ని పెంచుకొంటూ గుట్టుగా పరువుగా బతుకుతోంది సుకుమారి.

షాపింగ్ మాల్ లో సహస్ర, దీక్షలు సుకుమారిని ఆంటీ అని ఆప్యాయంగా పిలుస్తారు. ఆ చనువుతో తన ఇంటి విషయాలన్నీ వాళ్ళకు చెప్పేది. ఆ విధంగా సుకుమారి గురించి సహస్ర దీక్షలకు చాలా విషయాలు తెలుసు.

******** ******** ******** ********

అటువంటి జియన్ చెట్టి రోడ్ లో...

ఎప్పటి లాగే ఆ రోజు కూడ...

బస్ దిగి ఇంటికి త్వరగా చేరుకోవాలని వడి వడిగా నడుస్తోంది. అంతలో ఇద్దరు యువకులు ఆమె దారికి అడ్డం వచ్చారు. పాతికేళ్ళు మించని కుర్రాళ్ళు వాళ్ళు. రఫ్ గా వున్నారు.

“ ఏయ్...........అన్న పిలుస్తున్నాడు పద ” అన్నాడు మొరటుగా ఒకడు. సుకుమారికి అర్థం కాలేదు.

“ఎవర్రా మీరు? ఎవడ్రా మీ అన్నా పోకిరి వెధవల్లారా తప్పు కోండి” అంటూ తప్పించుకు పోబోయింది.

“ఏమిటి? అన్న పిలుస్తున్నాడంటే వినబళ్ళా?” అంటూ రెండో వాడు ఆమె జబ్బ పట్టి వెనక్కి లాగాడు. మరుక్షణం వాడి చెంప చెళ్ళు మనిపించింది సుకుమారి కోపంతో భగ్గుమంటూ.

“ఎవడ్రా నువ్వు నీ అమ్మ లాంటిదాన్ని. అమర్యాదగా మాట్లాడుతావా. పళ్ళు రాలి పోతాయ్. జాగ్రత్త” అనరిచింది.

ఇంతలో…

“దాంతో మాటలేమిట్రా ఇటు లాక్కురండి” అంటూ చీకట్లోంచి ఓ గొంతు గరగరలాడిన్ది.ఆ గొంతు వింటూనే అదిరి పడి…అటు చూసింది సుకుమారి…

వీధి లైటు కాంతి చాలా తక్కువ వుందక్కడ…

ఆ చిరు చీకట్లలో ఆగుంది జీప్ ఒకటి.

జీప్ మీద కూర్చున్నాడు బలిష్టమైన వ్యక్తి. జీప్ లో వేరే అర డజను మంది ఉన్నారు.   వాళ్ళు కూడా జీప్ దిగి వెళ్ళి పారిపోవాలని చూస్తున్న సుకుమారిని లాక్కొచ్చి అతడి ముందు నిలబెట్టారు.

ఆ దృఢకాయుడి పేరు శిఖామణి.

తేనాం పేటకు చెందిన పేరు మోసిన గుండా.

ఈ శిఖా మణి మనిషి నల్లగా ఆరడుగుల ఎత్తున పహిల్వాన్ లా వుంటాడు. బోడి గుండు, చెవులకు బంగారు రింగులు. మెడలో గోల్డ్ చైను ఉంటుంది. ఎప్పుడూ నలుపు రంగు ప్యాంటు షర్టుతో తిరుగుతుంటాడు. వీడి పేరు చెప్తే తేనాం పేట ఏరియాలో భయపడని వారుండరు. దాదాగిరీ చేయటం, దందా పనులు చేయటం వీడి పని. అవసరానికి అప్పులిచ్చి అధిక వడ్డీ గుంజుతాడు. చెప్పినంతా యివ్వక పోతే కాలో చెయ్యో తీసేస్తాడు. వాడి మీద అనేక కేసులున్నాయి.

అప్పట్లో సుకుమారి భర్త అరుణా చలం శిఖామణి వద్ద ఏభై వేలు తీసుకున్నాట్ట. వడ్డీతో సహా అది లక్ష రూపాయలైంది. ఆ డబ్బు తీర్చమని సుకుమారిని వేధిస్తున్నాడు. ఆ బాకీకి తనకు ఎలాంటి సబంధం లేదంటున్నా విన్పించుకోవటం లేదు.

ఆమెను చూసి వెకిలిగా నవ్వుతూ జీప్ దిగాడు శిఖామణి.

''ఏమిటి కంగారు పడుతున్నావ్? మీ బాకీ కోసం ఇంకా ఎన్ని రోజులు తిరగాలి నేను? మర్యాదగా బాకీ తీర్చమన్నాను. నువ్వు వినలేదు. కాబట్టి నేనో నిర్ణయానికొచ్చాను'' అంటూ భుజం మీద చెయ్యేసాడు.

ఆ చేతిని విదిల్చి కొట్టింది సుకుమారి.

''నీ నిర్ణయంతో నాకేం పని?'' అంటూ గద్దించింది.

''నా మొగుడికి సంవత్సరం క్రితమే విడాకులిచ్చాను. నేను నా పిల్లలు గుట్టుగా బతుకుతున్నాం. దయచేసి నన్ను అల్లరి చేయకు. నీకు దండం పెడతాను. నా మొగుడు చేసిన అప్పులకు నేను బాధ్యురాల్ని కాను. ఆడదాన్ని అంత బాకీ ఎలా తీర్చగలను'' అంది కన్నీళ్ళతో అర్థిస్తూ.

''నీ కన్నీళ్ళు నన్ను మార్చ లేవు. నాకు డబ్బు ముఖ్యం. నీ మొగుడికి నేను అప్పిచ్చే నాటికి మీరు కలిసే ఉన్నారు. కాబట్టి నా బాకీ తీర్చాల్సిన బాధ్యత నీకూ వుంది. నీ మొగుడు గుట్టు చప్పుడు గాకుండా ఇల్లమ్ముకొని చెన్నై వదిలి ఎటో వెళ్ళి పోయాడు. వాడ్నెలాగూ పట్టుకోలేం. అంచేత నువ్వే బాకీ తీర్చాలి. వయసులో మిసమిసలాడుతున్నావ్? డబ్బు రూపేణా గాకుండా మరోలా బాకీ తీర్చొచ్చు. పద ఓ సంవత్సరం పాటు నా అడ్డాలోనే పక్కనుండి బాకీ తీర్చిపో. దీన్ని జీప్ ఎక్కించండ్రా'' అన్నాడు శిఖామణి.

ఆ మాటతో సుకుమారికి.

ఒక్క సారిగా గుండె ఆగినంత పనయింది.

‘‘వద్దు వద్దు, అంత పని చేయకు. నీకు దండం పెడతాను. నా బిడ్డలు అనాధలయి పోతారు. నా జీవితం నాశనం చేయకు’’ అంటూ బావురు మంటూ కన్నీళ్ళతో అర్ధించింది.

‘‘ఈ బుద్ధి మర్యాద నా బాకీ తీర్చమని అడిగినప్పుడుండాలి. ఇప్పుడు కాదు. ఈ శిఖామణి ఒక నిర్ణయానికొస్తే దానికి తిరుగు లేదు. నువ్వు పైసా బాకీ తీర్చక్కర్లేదు. నాతో ఉండు. అంతే. చూస్తారేం రా… ఎత్తి జీప్ లో పడేయండి’’ అనరిచాడు.

తనను పట్టుకో బోయిన వాళ్ళని విదిల్చి కొట్టి పారిపోవాలని చూసింది సుకుమారి. వెంటనే ఆమె జుత్తు పట్టి వెనక్కి లాగాడు శిఖామణి. ఇంతలో…

‘‘ఆగు’’ అంటూ ఒక యువతి గొంతు చిరుత పులి ఘర్జనలా విన్పించి ఉలికి పడ్డారంతా.

ఆ రోజు ఉదయం..

‘‘పిల్లల స్కూలు ఫీజుకి చాలా ఇబ్బందిగా వుంది ఓ రెండు వేలు సర్ద గలవా? జీతం రాగానే ఇచ్చేస్తాను’’ అంటూ షాపింగ్ మాల్ లో సహస్రను అడిగింది సుకుమారి.

ఎంతో అవసరమైతే గాని సుకుమారి అడగదు.

‘‘అలాగే ఆన్టీ సాయంత్రం వెళ్ళేటప్పుడు అడగండి యిస్తాను’’ అంది సహస్ర.

షాపింగ్ మాల్ లో సహస్ర అంటే ఎవరికీ తెలిదు. అంతా ఆమెను సుసా అని పిలుస్తారు. ముందు జాగ్రత్తతో అక్కడ తన పేరును సుసాగా మార్చుకుంది. సుసా అనగానే తనను ముస్లిం అమ్మాయే అనుకుంటారని అందుకే ముఖానికి చున్నీ చుట్టుకొని వస్తోందని అనుకుంటారని అలా చేసింది. కాబట్టి ఇప్పుడు బురఖాలో తిరుగుతున్న సుసాగా ఆమెను ఎవరూ ఇంత వరకు అనుమానించలేదు. దీక్ష పేరు మార్చుకోలేదు గాని ఆమె బురఖా ధరించినా ఎవరూ పట్టించుకోరు.

ఇలా ఉండగా ఉదయం డబ్బులడిగిన సుకుమారి ఆ సంగతి మర్చిపోయి డ్యూటీ దిగి బస్ లో వెళ్ళిపోయింది. దాంతో డబ్బు ఎంత అవసరమో ఏమిటో దారిలో డబ్బులిచ్చి వెళ్ళి పోదామనే ఉద్దేశంతో స్కూటీని జియన్ చెట్టి రోడ్ కి పోనిచ్చింది సహస్ర.దూరంలో ఉండగానే వీధి లైట్ల కింద...

నడుచుకుంటూ పోతున్న సుకుమారిని చూసారిద్దరు..

ఇంకా ఇరవై సెకన్లలో సుకుమారిని చేరుకోవచ్చనగా సడెన్ గా స్కూటీని పక్కకు తీసి ఆపింది సహస్ర.

‘‘ఏమైంది ఇక్కడే ఆపేసావ్?’’ అడిగింది వెనక కూచున్న దీక్ష.

‘‘అటు చూడు. ఎవరో ఇద్దరు యువకులు ఆన్టీని ఆపి ి గొడవ చేస్తున్నారు’’ అంది సహస్ర.

అక్కడికి సుమారు రెండు వందల గజాల దూరంలోనే జరుగుతోందా సంఘటన. దీక్ష చూస్తుండగానే సుకుమారి ఒకడి చెంప మీద కొట్టింది. ఆమెను బలవంతంగా పక్కకు లాక్కు పోతున్నారు.

అక్కడ వీధిలైటు కాంతి...

రోడ్ వైపే ఎక్కువ ఫోకస్ అవుతోంది.


వెనక పక్క ఖాళీ స్థలంలో మసక చీకటిగా వుంది. ఆ చీకట్లలో ఒక జీపు, మరి కొందరు కన్పిస్తున్నారు. రోడ్ లో పోతున్న వెహికిల్స్ లైట్ల కాంతిలో ఆ జీప్ మీద కూచున్న తేనాంపేట మణిని చూసి ఉలికి పడింది దీక్ష.

‘‘మై గాడ్, వాళ్ళు తేనాం పేట శిఖామణి మనుషులు. శిఖామణి కూడ అక్కడే ఉన్నాడు. ఆన్టీని శిఖామణి అల్లరి చేస్తున్నాడు. బహుశ బాకీ కోసం బెదిరిస్తున్నట్టున్నారు’’ అంది కంగారు పడుతూ దీక్ష.

"బెదిరించటం లేదు. వాడేదో దుర్మార్గం ఆలోచనతోటే వచ్చినట్టుంది" అంటూ స్కూటీ దిగింది సహస్ర.

"నువ్వెక్కడికే?" అంది కంగారుగా దీక్ష.

"అక్కడికే, ఏం జరుగుతోందో చూస్తాను."



“వద్దు వద్దు. వాడసలే పెద్ద గుండా. నువ్వున్న పరిస్థితిలో ఇప్పుడిలాంటి గొడవల్లో తల దూర్చటం క్షేమం కాదు. నా మాట విను”

“వినను... ఆన్టీ అంటూ మనందరం ఎంతో ఆప్యాయంగా పిలుచుకునే ఆన్టీ అక్కడ ప్రమాదకర స్థితిలో వుంటే చూస్తూ ఎలా వెళ్ళటం? అంత మంచి ఆన్టీకి సాయపడక పోతే పాపం. ఇప్పుడే వచ్చేస్తాను” అంటూ బురఖా తీసి దీక్షకిచ్చేసింది.ఈ రోజు చూడీదార్ లో వుంది సహస్ర.

చున్నీ తీసి పూర్వం లాగే ముఖానికి చుట్టుకుంది. “ఇంకో సారి ఆలోచించవే ఇది రౌడీలతో వ్యవహారం ” ఎలాగైనా సహస్రనాపాలని చూసింది దీక్ష. కాని సహస్ర వినలేదు.

“ఒక వేళ గొడవ రైజయితే నువ్వు దగ్గరకు రాకు. సమస్యకు దూరంగా వుండు. లేదంటే ప్రమాదం” అంటూ హెచ్చరించి వడి వడి గా సుకుమారి వైపు నడిచింది.

అటే చూస్తున్న దీక్షకి...

సుకుమారి అరుపులు ఏడుపు విన వచ్చింది. సరిగా తెలిటం లేదు గాని పారిపోబోతుంటే ఆమెను జుత్తు పట్టి లాక్కొస్తున్నారు. పరిస్థితి చూస్తుంటే దీక్షకు భయం వేసింది. గొడవ పెరక్కుండా ఉండదనిపించింది. సహస్ర క్షేమం తనకు ముఖ్యం. తను ఎంత ఫైటరయినా ఎదురుగా ఉంది తేనాం పేట రౌడీ గుంపు. ఎందుకైనా మంచిదని సెల్ అందుకొని చందూ నంబర్ కి ఫోన్ చేసింది.

వెంటనే లైన్ లో కొచ్చాడు చందూ.

“ఎక్కడున్నావ్ చందూ?” అడిగింది.

“ఇప్పుడే నా బైక్ మీద నేను విరాట్ ఇంటికి వస్తూ దారిలో వున్నాం”

“విరాట్ నీతోనే ఉన్నాడా?”

‘‘అవును,’’

‘‘చెప్పేది జాగ్రత్తగా విను, ఇక్కడ సహస్ర ట్రబుల్లోకి ఎంటరయింది.’’ అంటూ జరిగిన విషయాన్ని చకచకా చెప్పేసింది.

‘‘ఎక్కడున్నారు మీరు?’’ కంగారుగా అడిగాడు విరాట్.

‘‘ జి యన్ చెట్టి రోడ్ లో ’’

‘‘ ఒకె కంగారు పడకు. పరిస్థితి గమనిస్తుండు. వచ్చేస్తున్నాం’’ అంటూ లైన్ కట్ చేసాడు విరాట్ .

ఇదే సమయంలో....

ఎప్పుడైతే సహస్ర స్కూటీ ఆపి దిగిందో ఆ వెంటనే అంత వరకూ వాళ్ళని ఫాలో చేసి వస్తున్న మును సామి మనుషులిద్దరూ ఆటో దిగి పంపించేసారు. వెంటనే మునుసామికి ఫోన్ చేసి పరిస్థితి రిపోర్ట్ చేసారు.

‘‘అవతలి వాళ్ళు ఎవర్రా? రౌడీలా?’’ అడిగాడు మునుసామి.‘‘తేనాం పేట పేరు మోసిన గుండా శిఖామణి వాడి మనుషులట’’ ఆటో వాడు చెప్పాడు.

‘‘ఎవరైనా గానీ సహస్ర జోలికొస్తే వదుల కూడదు. వెంటనే మనవాళ్ళని తీసుకొని వచ్చేస్తున్నాను. అవసరమైతే మీరు రంగం లోకి దిగి పోండి వచ్చేస్తున్నాం’’ అంటూ లైన్ కట్ చేసాడు మునుసామి.

ఈ లోపల మరో విశేషం జరిగింది...

చెన్నై వచ్చి లాడ్జిలో ఉంటూ సహస్ర కోసం గాలిస్తూన్న మధురై మహా దేవనాయకర్ మనుషులు కదిరేషన్ వడివేలు మిగిలిన వాళ్ళు రోజంతా ఇటు టి నగర్, ఓల్డ్ బళం, రంగ రాజ పురం పరిసరాల్ని గాలిస్తూ చీకటి పడే వరకూ ఇటే వస్తున్నారు.

ఆ పరిసరాల్లోకి వచ్చే సరికి అక్కడ చాలా మంది జనం గుంపు చేరి చూస్తుండగా మధ్యలో సినిమా షూటింగ్ లా పెద్ద ఫైట్ జరుగుతున్న దృశ్యం కంట బడిరది. కొందరు రౌడీల మధ్య ఒక అమ్మాయి అగ్ని శిఖలా మండి పడుతూ గుండాల దుమ్ము దులుపుతోంది. ఆ అమ్మాయి ఎవరో కాదు...

ఇన్ని రోజులూ తామంతా...

ఎవరి కోసం వెదుకున్నారో...

ఆ అమ్మాయి సహస్ర. అప్పటికే చున్నీ జారి పోవటంతో తిరిగి ముఖాన్ని కవర్ చేసుకునే అవకాశం లేకపోయిందామెకు.తామంతా ఆప్యాయంగా అమ్మాయి గారు అని పిలచుకునే తమ యజమాని గారాల పట్టి సహస్రను గుర్తించగానే జీప్ లోంచి దూకేసాడు కదిరేషన్.పరిస్థితి చూస్తుంటే...

చాలా ఉద్రిక్తంగా కన్పిస్తోంది...

ఎక్కడెక్కడి నుంచో రౌడీ మూకలు శర వేగంతో వచ్చి పడుతున్న సూచనలు కన్పిస్తున్నాయి.

ఆడపిల్ల ఒక్కదాన్ని చేసి అంతమంది దాడికి రావటం చూడగానే కదిరేషన్ కోపావేశంతో వీరభద్రుడిలా వూగిపోయాడు.‘‘రేయ్ ఇంకా చూస్తారేంటి! మన అమ్మాయి గార్ని ఒక్కదాన్ని చేసి వాళ్ళు తెగబడుతున్నారు. దెబ్బకి ఒకడ్ని పడగొట్టాలి. పదండి’’ అనరుస్తూ సర్రున జీప్ లోంచి ఇనుప రాడ్ ఒకటి అందుకొని శర వేగంతో సహస్రకు సాయంగా అటు పరుగెత్తాడు కదిరేషన్. వెనకే పూనకం వచ్చినట్టు బర బరా దిగి తలో ఆయుధం అందుకుని దూసుకెళ్ళి పోయారు మిగిలిన వాళ్ళు.

వడివేలు మాత్రం చివరిగా తన ఆయుధం అందుకొంటూ డ్రయివరు వంక చూసాడు.

‘‘పరిస్థితి చూస్తుంటే చాలా బీభత్సంగా మారేట్టుంది. ఏ క్షణంలోనయినా పోలీసులు రావచ్చు. ఎందుకైనా మంచిది. జీప్ ని ఆ సందులోకి పోనిచ్చి అలర్టు గా వుండు. నువ్వు రాకు. అవసరమైతే మనం పారిపోడానికి నువ్వు రెడీగా ఉంటే చాలు’’ అంటూ హెచ్చరించి బరిసె వూపుకొంటూ జనం మధ్యగా దూసుకెళ్ళి తనూ రంగంలోకి దూకేసాడు వడివేలు.

సహస్రకు సాయంగా…

ముందుగా ఫైటింగ్ లోకి ఎంటరైంది…

కదిరేషన్     గ్రూప్…

వాళ్ళ తర్వాతే సహస్ర దీక్షలను ఫాలో చేస్తూ వచ్చిన ముని సామి మనుషులిద్దరూ కూడ పోరాటంలోకి ఎంటరయ్యారు.మరో అయిదు నిముషాలకు పోరాటం తీవ్ర రూపం దాలుస్తోందనగా మునుసామి బృందం వస్తూన్న వేన్ సుడిగాలిలా సంఘటనా స్థలానికి దూసుకొచ్చేసంది.వస్తూనే అరుపులు కేకలతో వేన్ లోంచి దూకేసారంతా దొమ్మిలోకి జొరబడి పోయారు. వాళ్ళ కన్నా ముందే చేతిలోని బాణా కర్రను విష్ణు చక్రం లా రివ్వు రివ్వున తిప్పుతూ జై భజరంగ భళీ అనరుస్తూ ఎడాపెడా ప్రత్యర్థుల్ని విరగ బాది, సహస్ర సమీపంలోకి వెళ్ళిపోయాడు మునుసామి.

‘‘సహస్రమ్మా, నీకొచ్చిన భయం లేదు తల్లీ. నీకు అండగా మేమంతా వచ్చేసాం. విరగ దీసెయ్ నీతో పెట్టుకుంటే ఏం జరుతుందో తేనాం పేట రౌడీలకు తెలియాలి. చితగొట్టెయ్. తర్వాత చూసుకుందాం’’ అనరిచాడు.

తీవ్రమైన పోరాటంలో తల మునకలయి వున్న సహస్ర అప్పటికే తమ మనుషులు కదిరేషన్ మిగిలిన వాళ్ళు తనకు సాయంగా రావటం గమనించింది. ఇప్పుడొచ్చిన కొత్త బేచ్ తో పరిచయం లేదు గాని వాళ్ళంతా మునుసామి మనుషులని తనకి రక్షణగా తన వెనక్కి వచ్చి అరిచిన పెద్దాయనే మునిసామి అయి వుంటాడని వూహించింది.

తనకు అండగా వీళ్ళంతా రావటంతో సహస్ర ఉత్సాహం రెట్టింపయింది. దొరికిన రౌడీని దొరికినట్టు విరగొట్టేస్తోంది. అరుపులు కేకలు ఆర్తనాదాలతో ఆ ప్రాంతం భయానకంగాను గందరగోళంగాను మారిపోయింది.

సరిగ్గా అప్పుడే...

ఎగువ నుంచి చందూ నడుపుతున్న బైక్...

శర వేగంతో అక్కడికి చేరుకుంది.

జరుగుతున్న దొమ్మిని చూడగానే మతి పోయింది. రోడ్ లో ట్రాఫిక్ నిలిచి పోయింది. జనం దూరంగా పరుగులు తీసి భయం భయంగా చూస్తున్నారు. ఉరుకులు పరుగులతో గుంపులు గుంపులుగా ఇంకా రౌడీ మూకలు వచ్చి పడుతున్నాయి. ఇది సహస్ర పొరబాటా తేనాం పేట రౌడీలు తప్పిదమా అని ఆలోచించే సమయం లేదు ముందు సహస్రను కాపాడుకొని నిరపాయంగా అవతలికి తీసుకు పోవాలి. పోలీసులు రంగ ప్రవేశం చేస్తే పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారవుతుంది.

''పద నేనూ వస్తున్నాను'' అంటూ చందూ బైక్ దిగబోతుంటే విరాట్ వారించాడు.

''నీకిలాంటి ఫైటింగ్ లు దొమ్మీలు తెలీదు. పొరబాటున కూడ నువ్విందులో తల దూర్చకు. ఈ పరిసరాల్లోనే ఎక్కడో దీక్ష వుంటుంది. వెళ్ళి తననూ కూడ నీతో ఇంటికి తీసుకుపో. నేను సహస్రను మిగిలిన వాళ్ళని తీసుకొని వచ్చేస్తాను. మునుసామి మిగిలిన వాళ్ళు ఇక్కడే ఉన్నారు. భయం లేదు, ఇక్కడ్నుంచి వెంటనే దూరంగా వెళ్ళిపో క్విక్ '' అంటూ చందూని అక్కడ్నుంచి పంపించేసాడు విరాట్. బైక్ అటు వెళ్ళిన మరు క్షణం వేగంగా రౌడీల మధ్యకు దూసుకు పోయాడు.

సరిగ్గా ఇదే సమయంలో ఎగువ నుంచి బోగ్రోడ్ మీదుగా ధనగిరి బేచ్ ఇటే వస్తోంది. వేన్ లో ధనగిరితో బాటు షూటర్స్ విక్కీ, డైమండ్ లు కూడ వస్తున్నారు. వాళ్ళు క్కూడ సంఘటనా స్థలానికి చేరుకుంటే ఇక సందేహం లేదు అక్కడ జి యన్ చెట్టి రోడ్ లో ఒక అష్ట గ్రహకూటమి ఏర్పడినట్టే. ఇక ఆ కూటమిని చెదర గొట్టడానికి పోలీసులు ఎలాగూ రంగ ప్రవేశం తప్పదు.

ఈ ఈ ఈ

‘‘ఆగు!’’ అంటూ సహస్ర గొంతు వింటూనే శిఖామణితో బాటు అంతా ఉలికి పడ్డారు.

ఇంత ధైర్యంగా తమ ముందుకొచ్చింది ఎవరాని తిరిగి చూసారు. అప్పటికే శిఖామణి సుకుమారి జుత్తు పట్టి జీప్ వద్దకు లాకొచ్చేసాడు. దీనంగా అరుస్తూ ప్రార్ధిస్తూ కన్నీళ్ళతో అర్ధిస్తూ వాడి కబంధ హస్తాల నుంచి బయట పడ్డానికి గింజుకుంటోంది సుకుమారి.‘‘ఏమిట్రా, చిట్టెలుక సింహం ముందుకొచ్చి అరుస్తోంది? బ్రతకాలని లేదా? దాన్నవతలకు పొమ్మనండి’’ అన్నాడు శిఖామణి విసుగ్గా. అదో పెద్ద జోక్ లా పగలపడి నవ్వారు గుండాలు.

‘‘అమ్మా సుసా, నువ్వెందుకొచ్చావమ్మా ఈ రాక్షసుల ముందుకి. వీడు మనిషి కాదు మృగం. వెళ్ళిపోమ్మా. నా ఖర్మ ఎలా ఉంటే అలా జరుగుతుంది. వెంటనే ఇక్కడ్నుంచి వెళ్ళిపో’’ అనరిచింది సుకుమారి.

‘‘ఏం భయం లేదు’’ అంటూ మరి కాస్త ముందుకొచ్చింది సహస్ర.

‘‘ఏంటీ దౌర్జన్యం? ఆమెనెందుకు అల్లరి చేస్తున్నావ్? విడిచి పెట్టు’’ అంది కోపంగా శిఖామణి వంక చూస్తూ.వాడు ఒడిసి పట్టిన సుకుమారి జుత్తు వదల్లేదు సరి గదా తన కుర్రాళ్ళ వంక చూసి బండరాళ్ళు దొర్లిస్తున్నట్టు పగలపడి నవ్వాడు.

‘‘ఏంట్రా, నన్ను చూస్తే భయపడి ఛస్తారు జనం. అలాంటిది ముసుగు వీరుడిలా ముఖం దాచుకుని, ఓ కుర్ర పిల్ల నా ముందు కొచ్చి వదిలేయమని గద్దిస్తుంది. వదిలేద్దామా? కాస్సేపు దీన్ని పారి పోకుండా పట్టుకోండ్రా చెప్తాను’’ అంటూ జుత్తు వదిలి సుకుమారిని తన కుర్రాళ్ళ మీదకు తోసి ఇటు తిరిగాడు శిఖామణి. నలుగురు యువకులు సుకుమారి చేతుల్ని బలంగా పట్టుకొని నిలబెట్టారు. ఈ లోపల జీప్ లో వున్న మిగిలిన రౌడీలు కూడ దిగి వచ్చేసారు.

శిఖామణి ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి బోడ గుండు ఎడంచేత్తో తడుముకుంటూ సహస్రను నిశితంగా చూసాడు.

‘‘ఎవరే నువ్వు? నిజంగా ముస్లిం పిల్లవేనా? నీపేరు సుసానా? ఏం చూసుకుని నీకింత ధైర్యం? చిన్న పిల్లవి. నీలాంటోళ్ళ జోలికి మేం రాం గాని, వెళ్ళిపో. ఇది నీకు సబంధం లేని విసయం పో పో ’’ అన్నాడు.

‘‘వెళ్ళను.......నీ మంచి కోసమే చెప్తున్నాను. సుకుమారిని వదిలి వెళ్ళిపొండి’’ అంది స్థిరంగా సహస్ర.

‘‘పిట్ట కొంచెం కూత ఘనం. నా ముందుకు రాగలిగిన నీ ధైర్యాన్ని మెచ్చు కోవాలి.

‘‘చెప్తుంటే అర్ధం కాదా? చచ్చి పోతావ్. నా కుర్రాళ్ళస్సలు మంచోళ్ళు కాదు.........’’

‘‘నువ్వు మంచోడివా? కాదు. నేను నీ కుర్రాళ్ళ కన్నా నీ కన్నా కూడ మంచి దాన్ని కాదు. కారణం చెప్పకుండా మీరు వెళ్ళ లేరు. ’’‘‘ఒకె కారణం చెప్తాను. కాని నీకు భయపడి కాదు. ఇప్పుడు నీకేం కావాలి? దాన్ని మేం వదిలేయాలి అంతేగా? ఒకె........... వదిలేస్తాను. ఈ సుకుమారి నాకు లక్ష రూపాయలు బాకీ వుంది నువ్వు తీరుస్తావా? కమాన్, డబ్బిచ్చెయ్ వెంటనే వదిలేస్తాను. చెప్పు ఆ బాకీ ఇప్పుడే........ఇక్కడే...........నువ్వు తీరుస్తావా?’’ అరిచాడు. ‘‘ తీరుస్తాను. ’’

‘‘తీర్చు. ఇదీ సవాల్ అంటే ఇలా ఉండాలి ఒకే మన బాకీ ఈ పిల్ల తీర్చేస్తుందట్రా. కమాన్ యంగ్ లేడీ డబ్బువ్వు ’’

‘‘హలో శిఖామణి నువ్వు గుండు కొట్టించుకున్నంత సులువు కాదు డబ్బు వసూలంటే. నోటి మాటలతో పనులు కావు. నీ దగ్గర బాకీ పత్రం ఉంటే చూపించు. క్షణాల్లో నీ డబ్బుచ్చేస్తాను.’’

‘‘ఉంది. ఇప్పుడే చూపిస్తాను’’

‘‘తొందర పడకు. పత్రం ఎవరి పేరున ఉంది? ’’

‘‘దీని మొగుడు అరుణా చలం పేరున ’’

‘‘పత్రం మీద సుకుమారి సంతకం కూడ వుందా? ’’

‘‘ఏయ్ పిల్లా తెలివిగా అడుగుతున్నాననుకుంటున్నావా? మొగుళ్ళకి అప్పులిచ్చేప్పుడు పెళ్ళాల దగ్గర సంతకాలు తీసుకోరు.

"“తీసుకోవాలి. అలా తీసుకుంటేనే మొగుడు ఎగ్గొట్టినా పెళ్ళాన్ని అడిగే ఛాన్సుంది. నువ్వా పని చేయలేదు. పైగా సంవత్సరం క్రితమే ఎప్పుడో తను భర్తకి విడాకులిచ్చింది. నీ బాకీతో తనకి ఏ విధంగా సంబంధమో చెప్పగలవా? నీ దగ్గర సమాధానం ఉండదు. దౌర్జన్యంగా వసూలు చేయాలన్నా, సుకుమారిని కిడ్నాప్ చేసి నిర్బంధించాలన్నా వూరుకోను........"

“ఏయ్............ఎవరితో మాటాడుతున్నావో తెలుసా?" హూంకరించాడు శిఖామణి.

“నువ్వెవరో నాకు తెలుసు కాని నా గురించే నీకు తెలీదు. మర్యాదగా పత్రం మీద సుకుమారి సంతకం వుంటే చూపించు. ఈ క్షణమే మీరంతా ఆస్థిని వదలి పోవాలి " కరుగ్గా డిమాండ్ చేసింది సహస్ర.

శిఖామణి తొందర పడలేదు.

కాని వాడి కుర్రాళ్ళలో ఒకడు తొందర పడ్డాడు...

అసహనంగా చూసాడు...

“ఇంకా ఏందన్నా మాటలు?.......ఏయ్....వెళ్ళక పోతే ఏం చేస్తావ్ " అంటూ దురుసుగా ముందుకు దూకి పిడికిలి బిగించి సహస్ర ముఖం మీద కొట్ట బోయాడు.

వాడు చేసిన అతి పెద్ద తప్పు అది.

అంత వరకు మాటలతో నడుస్తున్న వ్యవహారాన్ని...

చేతల వరకు తెచ్చాడు...

ఇలాంటి సందర్భాల్లో సహనం సంయమనం చాలా ముఖ్యం. చాలా సందర్భాల్లో గొడవలకి కారణం ఇలాంటి ఆత్రగాళ్ళే. ఇప్పుడూ అదే జరిగింది. చివరి క్షణం వరకూ కదలకుండా స్టడీగా నిలబడున్న సహస్ర వాడి చేయి ముఖం మీదు వస్తుండగా ఒక్కసారిగా మెరుపులా కదిలింది. చూస్తున్న వాళ్ళకి సరిగా అర్ధం గాలేదు.ఎడం చేత్తో వాడి చేతిని బ్లాక్ చేస్తూ కుడి చేతి పిడికిలి బిగించి పంచ్ ప్రత్యర్ధి మెడను తాకింది. దాంతో కట్టెలా విరుచుకు పడ్డ వాడు తిరిగి లేవ లేదు.ఎవరూ వూహించని సంఘటనయిది…ఒక మనిషిని అంత సులువుగా పడగొట్టడం కేవలం సినిమాల్లోనే చూస్తాం. నిజ జీవితంలో చాలా అరుదు. శిఖామణి లాంటి పెద్ద గుండాకే కళ్ళు గిర్రున తిరిగినంత పనైంది. అతని కుర్రాళ్ళంతా దిగ్భ్రమ చెందారు. అదే క్షణంలో వాళ్ళలో మరొకడు తిరిగి తొందర పడ్డాడు. తమ వాడ్ని కొట్టిందన్న ఆవేశంలో వెనక ముందు ఆలోచించకుండా పొడవాటి ఇనప రాడ్ తో సహస్ర వైపు పరుగెత్తుకొచ్చాడు.కోపావేశంలో ఒక బ్లాక్ బెల్ట్ ఫైటర్ కితనే ఆయుధాన్నందిస్తున్నట్టు గుర్తించ లేదు వాడు.వాడ్ని చూడగానే వాడికి ఎదురు పరుగెత్తింది సహస్ర. ఒక్క సారిగా గాల్లోకి ఎగిరింది. వస్తున్నవాడ్ని వస్తున్నట్టే వాడి ఇనప రాడ్ పట్టిన చేతిని గాల్లోనే బ్లాక్ చేస్తూ మోకాళ్ళు మడిచి వాడి గుండెల్ని దారుణంగా తాకింది.అంతే…ఆమె దూకిన ఫోర్స్ కి తట్టుకోలేక…

కెవ్వున అరుస్తూ…

మొదలు నరికిన చెట్టులా వెల్లకిలా విరుచుకు పడి పోయాడు వాడు. ఆమె మోకాళ్ళ తాకిడికి గుండె రెండుగా చీలి పోతున్నంతగా బాధతో గావు కేక పెట్టాడు. వాడిపై నుంచి లేస్తూనే ఇనప రాడ్ ను సొంతం చేసుకుని ఈడ్చి కొట్టింది వాడ్ని. దెబ్బకు తల వాల్చేసాడు వాడు. ఇక వెనక ముందూ చూడకుండా…

సుకుమారిని బలవంతంగా పట్టి నిలబెట్టిన రౌడీల మీదకు దూసుకెళ్ళింది. ఎడాపెడా దొరికిన వాడ్ని దొరికినట్టు ఎక్కడ తగులుతుందో కూడ చూడకుండా విరగొట్టేసింది. వెర్రి కేకలు వేస్తూ వాళ్ళు సుకుమారిని వదిలి పక్కలకు పరుగులు తీసారు. వెంటనే సుకుమారిని కాస్త ముందుకు తీసుకెళ్తూ చుడీదార్ లోంచి ఒక నోట్ల కట్టను తీసి చేతిలో పెట్టింది సహస్ర.

''ఆన్టీ……… ఇందులో మూడు వేలున్నాయి. చెప్పేది జాగ్రత్తగా విను. ఇప్పుడు ఇంటికి వెళ్ళగానే పిల్లల్ని తీసుకొని ఇంటికి తాళం వేసి ఎట్టైనా కొద్ది రోజులు మీ బంధువుల ఇంటికి వెళ్ళిపో……. వీళ్ళు నీ వెంట పడకుండా కొంత సేపు నేనాపుతాను. నా గురించి భయం లేదు. వెళ్ళి పో త్వరగా'' అంటూ ముందుకు తోసింది.సుకుమారి సహస్రను గుండాలకు వదిలి వెళ్ళాలనిపించటం లేదు. అలాగని తను చేయగలిగిందీ లేదు. కన్నీళ్ళలో రెండు చేతులూ ఎత్తి నమస్కరిస్తుంటే వారించింది సహస్ర. ''ముందిక్కడ్నుంచి వెళ్ళిపో ఆన్టీ. త్వరగా '' అంటూ హెచ్చరించింది. దొరికిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ అక్కడ్నుంచి జనాన్ని తప్పించుకొంటూ తన ఇంటి దిశగా వేగంగా పరుగెత్తి వెళ్ళిపోయింది సుకుమారి.అప్పటికే శిఖామణి గంగ వెర్రులెత్తి పోతున్నాడు. ఒక ఆడపిల్లేమిటి తనను నిలదీసి తన కుర్రాళ్ళని కొట్టటమేంటి? వాటంగా తమ చేతికి చిక్కిన సుకుమారిని నలుగురూ గమనించక ముందే జీప్ లో పడేసి తీసుకు పోవచ్చనుకుంటే చివరి క్షణంలో వచ్చి అడ్డం పడి విడిపించి తీసుకు పోతుందే. ఈ విషయం తెలిస్తే తేనాం పేటలో వీధి కుక్కలు కూడ తనకి భయపడవు. ఎవరో సాధారణమైన అమ్మాయనుకున్నాడు గాని మార్షల్

ఆర్ట్స్ లో దిట్ట అని తెలీక మోసపోయాడు.''రేయ్ ఆపండ్రా....... పారిపోతున్నారు. వాళ్ళిద్దర్నీ ఆపండ్రా'' అని అరుస్తూ ఒక ఇనప రాడ్ అందుకుని దూసుకు రాసాగాడు. వాడి మనుషులు...

శిఖామణి కన్నా ముందే ఒకర్నొకరు హెచ్చరించుకొంటూ ఆయుధాలతో సమీపించారు. సుకుమారిని పంపించగానే ఆమె వెనక ఎవరూ పోకుండా వాళ్ళ దారికి అడ్డంగా నిలబడిరది సహస్ర.

''మీ అంతు చూడకుండా నేనెక్కడికి పోతాన్రా, రండి '' అనరిచింది సహస్ర.

ఈ లోపల గొడవ ఆరంభంలోనే అక్కడక్కడా కొందరు పౌరులు ఆగిపోయి గొడవ ఏమిటో అర్ధంగాక ఆసక్తిగా చూస్తున్నారు. వెహికిల్స్ లైట్ల కాంతిలో అక్కడుంది తెనాం పేట రౌడీలని గుర్తించగానే కొందరు భయంతో పరుగులు తీసారు. అయినా క్రమంగా దూరదూరంగా గుంపు చేరి పోతున్నారు. ఒక ఆడపిల్ల శిఖామణి లాంటి గుండాని ఎదిరించి దుమ్ము దులపటం ఆశ్చర్యంగా వుంది వాళ్ళకి.సుకుమారి వెంట ఎవరూ పడకుండా అడ్డంగా వున్న సహస్ర తిరిగి భద్రకాళిలా ప్రత్యర్ధుల మీద విజృంభించింది. కాళ్ళు విరుగుతున్నాయో చేతులు విరుగుతున్నాయో కూడ చూడకుండా దొరికిన వాడ్ని దొరికినట్టు చితగొట్టేస్తోంది. ఈ లోపల సమీప ప్రాంతాల్లో వున్న కొందరు గుండాలు శిఖామణి వాడి మనుషుల మీద ఎవరు దాడి చేస్తున్నారనీ వినగానే కర్రలు కత్తులతో శిఖామణికి అండగా పరుగులెత్తుకొచ్చారు. ఇదే సమయంలో మునుసామికి ఫోన్ చేసి చెప్పాక అతడి మనుషులిద్దరూ సహస్రకు సాయంగా తామూ పోరాటం లోకి ఎంటరై పోయారు.